

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

కంగనకు చెంపదెబ్బ



చండీగఢ్ విమానాశ్రయంలో ఎంపీపై చేయి చేసుకున్న మహిళా కానిస్టేబుల్ 2

రైతుల ఉద్యమంపై వ్యాఖ్యల నేపథ్యంలోనే!

కానిస్టేబుల్ సస్పెన్షన్, ఎఫ్ఐఆర్ దాఖలు

శుక్రవారం | 7-6-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 52 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం; తిథి: పాడ్యమి సా. 4.45 తదుపరి విదియ; నక్షత్రం: మృగశిర రా. 7.43 తదుపరి ఆర్ద్ర; వర్జ్యం: తె. 4.06-5.42; దుర్ముహూర్తం: ఉ. 9.19-9.11, మ. 12.40-1.32; అమృతఘడియలు: ఉ. 11.07-12.40; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 5.43; సూర్యాస్తమయం: 6.44 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

పాలనలో ప్రక్షాళన!

ప్రమాణ స్వీకారానికి ముందే కీలక చర్యలు

అడ్డగోలు ఐపీఎస్‌లకు గేట్లు 'క్లోజ్'.. ఐఏఎస్‌ల విషయంలోనూ కీలక నిర్ణయాలు




చంద్రబాబు ఇంటి వద్ద సందర్శకుల కార్ల సందడి

కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు ముందే... యంత్రాంగంలో ప్రక్షాళన మొదలైంది. నిబంధనలు మరిచిపోయి... గీత దాటి మరీ వైసీపీతో అంటకాగిన అధికారులకు 'తగిన' సంకేతాలు వెళ్తున్నాయి. ఈ నెలాఖరుతో పదవీ విరమణ చేస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి సేవలకు దాదాపుగా 'సెలవు' పలికినట్లయింది. 'ఆంధ్రజ్యోతి' ముందే చెప్పినట్లుగానే ఆయన సెలవుపై వెళ్లిపోయారు. కొత్త సీఎస్‌గా నీరబ్ కుమార్ లేదా విజయానంద్‌ను నియమించే అవకాశం కనిపిస్తోంది. శుక్రవారం దీనిపై స్పష్టత రానుంది. ఇక.. సీఎంవోలోకి కొత్త అధికారులను తీసుకునే ప్రక్రియ కూడా మొదలైంది. ఇతర శాఖల నుంచి, కేంద్ర సర్వీసుల నుంచి డిప్యుటేషన్‌పై వచ్చి... వైసీపీ సర్కారు హయాంలో అడ్డగోలు నిర్ణయాలు తీసుకుని, అక్రమాలకు సహకరించిన పలువురు అధికారులు మెల్లగా మాతృ శాఖలకు వెళ్లి పోయేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. కానీ... 'తేల్చాల్సిన లెక్కలు చాలా ఉన్నాయి. కాస్త ఆగండి' అంటూ వారిని రిలీవ్ చేయకుండా ఆపేశారు. 'వైసీపీ ఖాకీ'లుగా పేరు తెచ్చుకుని... విపక్ష నేతలను ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా పని చేసిన సీనియర్ ఐపీఎస్‌లు సీఐడీ చీఫ్ సంజయ్, ఇంటెలిజెన్స్

మిగతా 2వ పేజీలో...

సెలవుపై జవహర్!



సీఎస్‌గా కొనసాగేందుకు చివరిదాకా ప్రయత్నం

సెలవుపై వెళ్లాలని ముందుగానే సంకేతాలు

జగన్ హయాంలో అడ్డగోలుగా అధికార ప్రయోగం

ఆయనను తప్పించాలని ఈసీకి టీడీపీ ఫిర్యాదులు

అయినా, కొత్త సర్కారులో పాగాకు విఫల యత్నం

సీఎస్‌కు సంప్రదాయం కూడా తెలియదా?

ఆయన తీరుపై సీనియర్ల విస్మయం.. సెలవుకు ఓకే

అమ్మ.. జవహరా!

అందుకే రిజిస్ట్రేషన్ శాఖ తీసుకున్నారా? 11

సీఎస్‌గా ఉంటూనే ఆ శాఖ బాధ్యతలూ..

ఆ తర్వాతే అసైన్డ్ భూకొనుగోళ్ల ఆరోపణలు

భోగాపురం భూముల కేసులో కొత్త కోణం

వైసీపీ ఐపీఎస్‌లకు భంగపాటు

పీఎస్ఆర్, సంజయ్‌లకు దొరకని బాబు దర్శనం

గేటు కూడా దాటనీయని సెక్యూరిటీ సిబ్బంది

నిఘా అధిపతిగా విపక్షాలపై పీఎస్ఆర్ వేధింపులు

ప్రభుత్వం మారగానే మొదలైన 'సినిమా'

గేటు వద్దే ఆపేసిన సెక్యూరిటీ, వెనుదిరిగిన పీఎస్ఆర్

సెలవుకు యత్నం.. వీల్లేదనడంతో రెండేళ్ల ముందే సర్వీసు నుంచి తప్పుకొనేందుకు యోచన 2

తప్పుడు కేసులు పెట్టిన సీఐడీ సంజయ్‌కూ నో ఎంట్రీ

అడ్డుపెట్టిన కారును బలవంతంగా తీయించిన పోలీస్

అర్ధరాత్రి బాబును అరెస్టు చేసిన కొల్లి విలవిల

జగన్ హయాంలో మూడు పోస్టులు.. అవన్నీ పీకివేత

మీ సేవలు చాలు.. దయచేయండి!

ఒక్క ఆర్డర్‌తో 40 మంది సలహాదారులకు ఉద్వాసన 11

నీరబ్‌కుమారా? విజయానందా?

కొత్త సీఎస్‌పై సర్వత్రా ఆసక్తి.. సీనియారిటీలో నీరబ్

అయితే, త్వరలోనే ఆయన రిటైర్మెంట్ 2

దీంతో విజయానంద్‌కు అవకాశం?



బీజేపీ అధ్యక్షుడిగా శివరాజ్?

నడ్డా స్థానంలో మధ్యప్రదేశ్ మాజీ సీఎంకు పదవి

పార్టీలో సీనియర్ అయినందునే

తక్షణమే ఢిల్లీకి రావాలంటూ వర్తమానం 2

శివరాజ్ ఇక నాతో.. ప్రచారంలో మోదీ వ్యాఖ్య

ఒడిసా సీఎంగా ధర్మేంద్ర ప్రధాన్?

50 మందితో కొత్త టీం!



నడ్డా ఇంట్లో బీజేపీ, ఆర్ఎస్ఎస్ నేతల భేటీ

పలువురు పాత ముఖాలకు ఉద్వాసన

నిర్మలా సీతారామన్‌కు అనుమానమే

మిత్రపక్షాలకు ఆర్థిక, హోం, రక్షణ, విదేశాంగ, వాణిజ్య మినహా ఇతర శాఖల కేటాయింపు!

మహిళా కోటాలో డీకే అరుణ, పురందేశ్వరి?

ఎల్లుండి ప్రధానిగా మోదీ ప్రమాణం

పలువురు మంత్రులు కూడా..

శ్రీలంక, బంగ్లాదేశ్ అధినేతలకు ఆహ్వానం

న్యూఢిల్లీ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వరుసగా మూడోసారి దేశ ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ ఆదివారం సాయంత్రం ప్రమాణం చేయనున్నారు. ఆయనతోపాటు పలువురు కేంద్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసే అవకాశాలున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమానికి రావాల్సిందిగా మోదీ.. శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే, బంగ్లాదేశ్ ప్రధానమంత్రి షేక్ హసీనాలను ఆహ్వానించారు. వారు అందుకు అంగీకరించారు. ఎన్డీఏ అగ్రనేతలు చంద్రబాబునాయుడు, నితీష్ కుమార్, ఏక్‌నాథ్ షిండే తదితరులు కూడా మోదీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరు కానున్నారు. కాగా, మోదీ మంత్రివర్గంలో పలువురు

మిగతా 2వ పేజీలో...

కేబినెట్‌లోకి టీడీపీ.. బాబు గ్రీన్ సిగ్నల్

నేటి ఎన్డీయే ఎంపీల భేటీ కోసం ఢిల్లీ పయనం

మళ్లీ 9న మోదీ ప్రమాణ స్వీకారానికి హాజరు

12న చంద్రబాబు ప్రమాణానికి మోదీ రాక 11 2

హాజరు కానున్న ఎన్డీయే ముఖ్యమంత్రులూ..

అగ్నిపథ్‌ను సమీక్షించాలి

జేడీయూ తొలి డిమాండ్

'వన్ నేషన్.. వన్ పోల్'కు ఓకే

దేశవ్యాప్త కులగణన..

బిహార్‌కు ప్రత్యేక హోదా కావాలి: త్యాగి



హైదరాబాద్‌లో అన్న చిరంజీవికి పవన్ పాదాభివందనం

హ్యాట్సాఫ్ కల్యాణ్ బాబు

ఎన్నికల్లో గెలిచాక తొలిసారి చిరంజీవి ఇంటికి పవన్

కుటుంబ సభ్యులందరి నుంచి అపూర్వ రీతిలో స్వాగతం

భారీ పూలమాల మెడలో వేసి ముద్దాడిన మెగాస్టార్

తల్లి, అన్నా వదినలకు జన సేనాని పాదాభివందనం 2

మంత్రి పదవుల కోసం టీడీపీలో భారీ పోటీ

కేబినెట్‌లో చేరనున్న లోకేశ్!


పవన్ చేరికపై రాని స్పష్టత

జనసేనకు 3-4 బెర్తులు 11

రేసులో నాదెండ్ల, కొణతాల, కందుల దుర్గేశ్, నానాజీ కూడా

బీజేపీకి రెండు పదవులిచ్చే చాన్సు

జిల్లాలు, సామాజిక సమీకరణల ఆధారంగా చంద్రబాబు కసరత్తు



మారిన చంద్రబాబును చూస్తారు

అధికారుల పాలన కాదు, ప్రజాపాలన.. ప్రజలు, నేతల అభిప్రాయాలు వింటా

వేడుకగా ప్రజలు, కార్యకర్తలకు వేధింపులు.. అన్యాయం జరిగిన వారికి న్యాయం

పాలనలో రాజకీయ కోణం అవిష్కరిస్తా.. ఎంపీలు బాగా పనిచేయాలి: బాబు 12

టీచర్ల అక్రమ బదిలీలకు బ్రేక్

గత ఆదేశాలు నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు

ఎన్నికల ముందు అడ్డగోలుగా 1200 మంది బదిలీ

కోడ్ తర్వాత రిలీవ్ కావాలని అప్పట్లో ఆదేశం

ఒక్కొక్కరి నుంచి 4 - 5 లక్షల ముడుపులు

నాటి మంత్రి బొత్స ఆఫీసు కేంద్రంగానే వసూళ్లు

ఉపాధ్యాయ సంఘాల నేతలకూ పాత్ర

ప్రభుత్వం మారడంతో బదిలీల నిలిపివేత

లబోదిబోమంటున్న ముడుపులిచ్చిన టీచర్లు

అమరావతి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): 'రూల్స్ గీల్స్ మాకు పట్టవు. బదిలీల షెడ్యూలు, కౌన్సెలింగ్‌తో సంబంధం లేదు. ముడుపులిస్తే ఎప్పుడైనా బదిలీ చేస్తాం. ఒకటీ అరా కాదు వందల మందిని అడ్డదారిలో మార్చేస్తాం' అనే తరహాలో నిబంధనలను తుంగలో తొక్కి కమీషన్ల కోసం చేసిన ఉపాధ్యాయ అక్రమ బదిలీలకు బ్రేక్ పడింది. ఎన్నికల ముందు బదిలీ ఉత్తర్వులు జారీచేసి, కోడ్ ముగిసిన తర్వాత వారంతా రిలీవ్ కావాలని

మిగతా 3వ పేజీలో...



ఎన్నికల వేళ.. బిల్లుల గోల

మాజీ సలహాదారు తీవ్ర ప్రయత్నాలు

కాంట్రాక్టర్లకు 102 కోట్లు ఇవ్వాలని ఒత్తిడి

సర్వే కమిషనర్ కూడా తీవ్ర ప్రయత్నాలు

కోడ్‌ను ఉల్లంఘించి మరీ లేఖాస్త్రాలు

మరోవైపు వసూల్‌రాజా పైరవీలు 10



భారీ స్టాక్ మార్కెట్ స్కామ్

ఎన్నికల ఫలితాల రోజు రూ.30 లక్షల కోట్ల సంపద ఆవిరి

ఈ పతనం వెనుక మోదీ, షా కుట్ర

సెబీ దర్యాప్తు జరుగుతున్న కంపెనీ న్యూస్ చానల్‌కే ఇంటర్వ్యూలు

పార్లమెంటరీ కమిటీ విచారణ జరిపించాలి: రాహుల్



2

మోదీ, అమిత్‌షా స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టాలని ఎందుకు సలహా ఇచ్చారు? వారి వృత్తి స్టాక్ ఇన్వెస్ట్‌మెంట్ సలహాలివ్వడమేనా?

- రాహుల్ గాంధీ



కంగనకు చెంపదెబ్బ

» చండీగఢ్ విమానాశ్రయంలో ఘటన

» ఎంపీపై చేయి చేసుకున్న మహిళా కానిస్టేబుల్



న్యూఢిల్లీ, జూన్ 6: చండీగఢ్ విమానాశ్రయంలో సీఐఎస్ఎ్ఫకు చెందిన ఒక మహిళా కానిస్టేబుల్ తనను కొట్టారని బాలీవుడ్ నటి, బీజేపీ తరఫున తాజా ఎన్నికల్లో హిమాచల్‌ప్రదేశ్ నుంచి ఎన్నికైన ఎంపీ కంగనా రనౌత్ ఆరోపించారు. గురువారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ఢిల్లీకి వెళ్లటం కోసం తాను చండీగఢ్ ఎయిర్‌పోర్టుకు చేరుకోగా, భద్రతాపరమైన తనిఖీల అనంతరం సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ కుల్విందర్ కౌర్ తనతో వాగ్వాదానికి దిగి చెంపదెబ్బ కొట్టారని కంగన తెలిపారు. ఈ మేరకు జరిగిన ఘటన గురించి ఆమె ఎక్స్‌లో వెల్లడించారు. ఎందుకు కొట్టావని అడిగితే తాను రైతుల పోరాటాన్ని సమర్థిస్తానని కుల్విందర్ చెప్పారన్నారు. తాను బాగానే ఉన్నానని, అయితే, పంజాబ్‌లో పెరుగుతున్న హింసాకాండ, ఉగ్రవాదం ఆందోళన కలిగిస్తోందని కంగన పేర్కొన్నారు. కాగా, రైతుల ఉద్యమంపై కంగన చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహంతోనే కుల్విందర్ ఆమెపై చేయి చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై కంగన ఢిల్లీలో సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కుల్విందర్ కౌర్‌ను అధికారులు విధుల నుంచి సస్పెండ్ చేశారు. ఆమెపై ఎఫ్ఐఆర్ నమోదైంది. కుల్విందర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని సీఐఎస్ఎఫ్‌ను జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రేఖాశర్మ కోరారు.

లోక్‌సభ ఎన్నికల్లో రికార్డు పోలింగ్

» 64.2 కోట్ల మంది ఓటు హక్కు వినియోగం

» పోస్టల్ బ్యాలట్ మినహా 65.79% పోలింగ్

» త్వరలోనే తుది గణాంకాలు విడుదల: ఈసీ



న్యూఢిల్లీ, జూన్ 6: ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదయింది. 18వ సార్వత్రిక ఎన్నికల్లో 64.2 కోట్ల మంది భారతీయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని కేంద్ర ఎన్నికల సంఘం గురువారం తెలిపింది. పోస్టల్ బ్యాలట్ ఓట్లు మినహా ఈవీఎంల్లో 65.79 శాతం మేర పోలింగ్ జరిగినట్లు వివరించింది. దేశ చరిత్రలోనే భారీ స్థాయిలో పోలింగ్ జరిగిందని, పోస్టల్ ఓట్ల గణాంకాలను కలుపుకుంటే పోలింగ్ శాతం ఇంకా పెరుగుతుందని సీఈసీ రాజీవ్ కుమార్ తెలిపారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో 96.88 కోట్ల మంది ఓటర్లుగా నమోదు చేసుకోగా, 64.2 కోట్ల మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు చెప్పారు. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి పోస్టల్ బ్యాలట్, ఈవీఎంలలో నమోదయిన పూర్తి సమాచారం అందిన తర్వాత తుది గణాంకాలను వెల్లడిస్తామన్నారు. కాగా, 2019 సాధారణ ఎన్నికల్లో 91.20 కోట్ల ఓటర్లకు గానూ 61.5 కోట్ల మంది ఓటు వేశారు.

లోకం తీరు



వీఐపీ కాన్వాయ్ పేరుతో ట్రాఫిక్ ఆపొద్దు

» బారికేడ్లు, పరదాలు, షాపుల మూతకు స్వస్తి

» ప్రధాన భద్రతాధికారికి చంద్రబాబు ఆదేశాలు

» ఆ వెంటనే ఆయన ఆదేశాలు అమల్లోకి..



అమరావతి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో జనం ట్రాఫిక్ నరకం అనుభవించారు. ఆ పరిస్థితిని కొత్త ప్రభుత్వంలో పునరావృతం రానీయరాదని కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబు తన భద్రతా సిబ్బందికి స్పష్టం చేశారు. తన కాన్వాయ్ సమీప ప్రాంతానికి వచ్చినప్పుడు, అదీ అతి తక్కువ సమయం మాత్రమే వాహనాలను ఆపాలని ప్రధాన భద్రతాధికారిని(సీఎస్‌వో) ఆయన ఆదేశించారు. వాహనదారులు ఇబ్బంది పడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గురువారం ఢిల్లీకి బయలుదేరిన ఆయన తన భద్రతా సిబ్బందికి ఈ విధమైన ఆదేశాలు జారీచేశారు. బారికేడ్లు, పరదాలు, రోడ్లు మూసివేత, షాపుల బంద్ వంటి పోకడలకు ఇకపై స్వస్తి చెప్పాలని స్పష్టం చేశారు. వీఐపీ సెక్యూరిటీ పేరుతో కాన్వాయ్ వెళ్లే దారిలో గంటల తరబడి వాహనాలు నిలిపి వేసే విధానాలకు స్వస్తి పలకాలన్నారు. తక్షణమే సంబంధిత అధికారులకు ఈ మేరకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. ఆ వెంటనే ఆయన ఆదేశాలు అమల్లోకి వచ్చాయి. ఉండవల్లి నివాసం నుంచి ఎయిర్‌పోర్టుకు వెళ్లే దారిలో... గుంటూరు ఎస్పీ, విజయవాడ సీపీలను భద్రతా అధికారులను ఈ మేరకు అప్రమత్తం చేశారు.

పిన్నెల్లికి ముందస్తు బెయిల్ పొడిగింపు

» ఈవీఎం, దాడుల కేసుల విచారణ 13కి వాయిదా

» హైకోర్టు ఆదేశాలు.. రోజంతా నరసరావుపేటలో టెన్షన్

అమరావతి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ సందర్భంగా మే 13న పాల్వాయిగేటు పోలింగ్ కేంద్రంలో ఈవీఎం, వీవీప్యాట్ ధ్వంసం, తదనంతరం జరిగిన ఘటనలు, మర్నాడు సీఐ నారాయణస్వామిపై దాడి చేసిన వ్యవహారంలో మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి ఇచ్చిన ముందస్తు బెయిల్‌ను హైకోర్టు గురువారం పొడిగించింది. ఆయనపై నమోదైన కేసులకు సంబంధించిన విచారణను ఈ నెల 13కు వాయిదా వేసింది. అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ గతంలో ఇచ్చిన మధ్యంతర ముందస్తు బెయిల్‌ను అప్పటివరకు పొడిగించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ న్యాపతి విజయ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. శేషగిరిరావు, ఇంకొందరు బాధితుల తరఫున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు, న్యాయవాది ఎన్.అశ్వనీకుమార్ వాదనలు వినిపించారు. మధ్యంతర ఉత్తర్వులనుతో సంబంధం లేకుండా జూన్ 6న వ్యాజ్యాల పై విచారణ జరిపి తగిన నిర్ణయాన్ని వెల్లడించాలని హైకోర్టుకు సుప్రీంకోర్టు సూచించిందని తెలిపారు. పిన్నెల్లి తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. పిన్నెల్లిని వేధించడంతో పాటు ఆయన ప్రతిష్ఠకు భంగం దెబ్బతీసేందుకు వరుస కేసులు నమోదు చేశారన్నారు. సమయాభావం వల్ల వ్యాజ్యాలపై లోతైన విచారణ ఇప్పటికిప్పుడు సాధ్యపడదని.. పోలీసులు వేసిన కౌంటర్ మధ్యాహ్నమే తనకు అందిందన్నారు. 6నే పిటిషన్లను పరిష్కరించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు ఇవ్వలేదని.. వచ్చే గురువారానికి వాయిదా వేయాలని కోరారు. అన్ని పక్షాల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి విచారణను వచ్చే గురువారానికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. కాగా, పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలో జరిగిన ఎన్నికల హింసాత్మక ఘటనల్లో నిందితుడిగా ఉన్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ముందస్తు బెయిల్ గడువు గురువారం ముగిసింది. దీంతో హైకోర్టు ఆదేశాలు రాగానే ఆయన్ను ఏ క్షణంలోనైనా అరెస్టు చేసేందుకు పోలీసులు నరసరావుపేటలో ఆయన ఉన్న నివాసం వద్ద భారీగా మోహరించారు. గురువారం సాయంత్రం ఎస్పీ కార్యాలయంలో సంతకం చేసేందుకు వెళ్లారు. ఆ సందర్భంగా ఆయన్ను అరెస్టు చేస్తారన్న ప్రచారం జరిగింది. రాత్రికి ముందస్తు బెయిల్ పొడిగిస్తూ హైకోర్టు ఆదేశాలివ్వడంతో అరెస్టు యత్నాలను పోలీసులు విరమించుకున్నారు.

50 మందితో కొత్త టీం!

(మొదటి పేజీ తరువాయి)



పాత మంత్రులను పక్కనపెట్టే అవకాశాలు ఉన్నాయని, కొనసాగించే మంత్రుల శాఖలను కూడా మార్చవచ్చని సమాచారం. గత క్యాబినెట్‌లో ఆర్థికమంత్రిగా కీలక బాధ్యతలు నిర్వహించిన నిర్మలా సీతారామన్ సొంత రాష్ట్రం తమిళనాడులో బీజేపీ ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోవడం, ఎన్నికల్లో పోటీ చేయడానికే ఆమె ముందుకు రాకపోవటంతో ఈసారి ఆమెను కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకుంటారా? లేదా? అన్న చర్చ నడుస్తోంది. అలాగే గత క్యాబినెట్‌లో మంత్రులుగా ఉన్న స్మృతీ ఇరానీ, రాజీవ్ చంద్రశేఖర్, వి.మురళీధరన్, అజయ్‌మిశ్రా తేనీ, మహేంద్రనాథ్ పాండే, కౌశల్ కిషోర్, సాధ్వీ నిరంజన్ జ్యోతి, అర్జున్ ముండా, కైలాశ్ చౌదరి, ఆర్కే సింగ్, సంజీవ్ బల్యాన్ సహా 15 మంది ఎన్నికల్లో ఓడిపోవడంతో మోదీ పూర్తిగా కొత్త టీమ్‌ను ఎంచుకునేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. కీలకమైన ఆర్థిక, హోం, రక్షణ, విదేశాంగ, వాణిజ్య శాఖలు మినహా మిగతా మంత్రిత్వ శాఖలను మిత్రపక్షాలకు కేటాయించేందుకు మోదీ సుముఖంగా ఉన్నట్లు బీజేపీ వర్గాలు తెలిపాయి. మరోవైపు, బీజేపీ, ఆర్ఎస్ఎస్ ముఖ్య నేతలు బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా నివాసంలో గురువారం సమావేశమై మంత్రివర్గ కూర్పుపై చర్చించారు. ఈ సమావేశంలో అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, బీఎల్ సంతోష్, సురేశ్ సోనీ, దత్తాత్రేయ హొసబలే, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. మంత్రివర్గంలో స్థానం ఆశిస్తున్న పలువురు ఎంపీలు ఇప్పటికే ఢిల్లీకి చేరుకున్నారు.

రాష్ట్రపతికి ఎంపీల జాబితా

18వ లోక్‌సభకు కొత్తగా ఎన్నికైన ఎంపీల పేర్లతో కూడిన జాబితాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఎన్నికల సంఘం (ఈసీ) అందించింది. గురువారం రాష్ట్రపతిని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు జ్ఞానేష్ కుమార్, సుఖ్బీర్ సింగ్ సంధు కలిశారు. ప్రజాప్రాతినిధ్య చట్టం-1951లోని సెక్షన్ 73 ప్రకారం ఈసీ జారీ చేసిన నోటిఫికేషన్ కాపీని, లోక్‌సభకు ఎన్నికైన సభ్యుల పేర్లతో కూడిన జాబితాను అందజేశారు.

50కిపైగా మంత్రులు

మోదీ మంత్రివర్గంలో 50కి పైగా మంత్రులు ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది. 24-26 మంది క్యాబినెట్ మంత్రులు, దాదాపు 30 మంది సహాయమంత్రులు ఉండవచ్చునని సమాచారం. బీజేపీ నుంచి 10-15 మందికి క్యాబినెట్‌లో అవకాశం కల్పించవచ్చని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. క్యాబినెట్ కూర్పుపై తెలుగుదేశం, బీజేపీ మధ్య ఇప్పటికే చర్చలు జరిగాయని విశ్వసనీయ సమాచారం. శుక్రవారం జరిగే ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశానికి హాజరుకావటం కోసం చంద్రబాబునాయుడు గురువారం రాత్రి ఢిల్లీ చేరుకున్నారు. కేంద్రస్థాయి నేతలతో ఆయన గురువారం రాత్రి కూడా మంతనాలు కొనసాగించినట్లు తెలిసింది. ఎన్డీఏ ఇతర భాగస్వామ్యపక్షాల్లో జేడీయూకి రెండు, ఎల్‌జేపీ, ఆర్ఎల్డీ, శివసేన, ఎన్సీపీ (అజిత్‌పవార్)లకు ఒక్కొక్కటి చొప్పున మంత్రిపదవులు కేటాయించే అవకాశాలున్నాయని తెలుస్తోంది.

బీజేపీ నుంచి ఎవరెవరికి..

కేంద్ర మంత్రివర్గంలో బీజేపీ నుంచి అమిత్ షా, పీయూష్ గోయల్, నితిన్ గడ్కరీ, జయశంకర్, శివరాజ్‌సింగ్ చౌహాన్, జ్యోతిరాదిత్య సింధియా, అర్జున్‌రాం మేఘ్వాల్, ఓం బిర్లా, గజేంద్ర సింగ్ షెఖావత్, సంబిత్‌పాత్ర, జయ పాండా, మనోహర్‌లాల్ ఖట్టర్ తదితరులు ఉండే అవకాశాలున్నాయి. మహిళా మంత్రుల్లో అపరాజితా సారంగి, బాన్సురి స్వరాజ్, దగ్గుబాటి పురందేశ్వరి, డీకే అరుణ పేర్లు పరిగణనలో ఉన్నాయి. తెలంగాణ నుంచి కిషన్‌రెడ్డితోపాటు బీసీ నేతల్లో ఈటల రాజేందర్ లేదా బండి సంజయ్ పేర్లు పరిశీలిస్తున్నట్లు సమాచారం. శుక్రవారం ఎన్డీఏ ఎంపీల సమావేశం తర్వాత మంత్రివర్గంలోని పేర్ల జాబితాపై కసరత్తు ఒక కొలిక్కి వచ్చే అవకాశాలున్నాయి.

పాలనలో ప్రక్షాళన!

(మొదటి పేజీ తరువాయి)

మాజీ చీఫ్ పీఎస్సార్ ఆంజనేయులు, తీసేసిన 'సిట్' అధిపతి కొల్లి రఘురామిరెడ్డికి చంద్రబాబు నివాసంలోకి ప్రవేశం లభించలేదు. ఇక.. పునరావాసంలో భాగంగా 'సలహాదారుల' అవతారమెత్తిన వారికి ఉద్వాసన మొదలైంది. ఇప్పటికే రాజీనామాలు ఇచ్చిన వారితోపాటు... ఇవ్వని వారినీ కలిపి మొత్తం 40 మంది సలహాదారుల శకాన్ని ముగిస్తూ గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. మంత్రుల పేషీల్లోని సిబ్బందిని వారి మాతృశాఖలకు పంపిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆర్థిక శాఖలో అన్ని నిబంధనలను తోసిరాజని... అస్మదీయులకే బిల్లులు చెల్లించారంటూ బిల్డర్స్ అసోసియేషన్ గవర్నర్‌కు ఫిర్యాదు చేసింది. ఆర్థిక శాఖలో ఐదేళ్లు చక్రం తిప్పిన సత్యనారాయణ నిర్వాకంపై విచారణ జరిగే అవకాశముంది.

అగ్నిపథ్‌ను సమీక్షించాలి: కేసీ త్యాగి

న్యూఢిల్లీ, జూన్ 6: కేంద్రంలో వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనున్న బీజేపీకి అగ్నిపథ్ అంశం తలనొప్పిగా మారేలా ఉంది. సొంతంగా మెజార్టీ దక్కకపోవడంతో టీడీపీ, బిహార్‌లోని జేడీయూ మద్దతుతో ప్రభుత్వ ఏర్పాటుకు బీజేపీ సిద్ధమైంది. ఇలాంటి కీలక తరుణంలో జేడీయూ తన తొలి డిమాండ్‌ను తెరపైకి తెచ్చింది. ఆ పార్టీ సీనియర్ నేత కేసీ త్యాగి అగ్నిపథ్ పథకాన్ని పునఃసమీక్షించాలని డిమాండ్ చేస్తామని ప్రకటించారు. అగ్నిపథ్‌ను తాము వ్యతిరేకించడం లేదు కానీ.. దీనిపై చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. అయితే బీజేపీ చెబుతున్న 'వన్ నేషన్.. వన్ పోల్' విధానానికి తమ పార్టీ అనుకూలమేనని ఆయన చెప్పారు. ఉమ్మడి పౌర స్మృతి(యూసీసీ)పై మాత్రం భాగస్వాములందరినీ సంప్రదించి ముందుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. దీంతోపాటు దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించాలని, బిహార్‌కు ప్రత్యేక హోదా కల్పించాలని త్యాగి కోరారు. అగ్నిపథ్‌ను సమీక్షించాలని ఎల్‌జేపీ అధినేత చిరాగ్ పాసవాన్ కూడా కోరారు.

మోదీ ప్రమాణ స్వీకారానికి విదేశీ నేతలు

న్యూఢిల్లీ, జూన్ 6: మోదీ ప్రమాణస్వీకారోత్సవానికి పలువురు విదేశీ నేతలు హాజరుకానున్నారు. శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే, బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా ఈ కార్యక్రమానికి రావడం ఖాయమైంది. ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజు ప్రధాని మోదీకి వేర్వేరుగా ఫోన్లు చేసిన శ్రీలంక అధ్యక్షుడు, బంగ్లా ప్రధాని తమ శుభాకాంక్షలు తెలియజేశారు. తన ప్రమాణస్వీకారోత్సవానికి హాజరు కావాలని ఈ సందర్భంగా మోదీ వారిని ఆహ్వానించగా ఇరువురు నేతలు అంగీకారం తెలిపారు. నేపాల్, భూటాన్, మారిషస్ దేశాల అధినేతలకు కూడా మోదీ ప్రమాణస్వీకారోత్సవానికి అధికారిక ఆహ్వానాలు వెళ్లనున్నాయని సమాచారం.

వైసీపీ ఐపీఎస్‌లకు భంగపాటు

బాబు దర్శనమే దొరకని పీఎస్ఆర్, సంజయ్

గేటు కూడా దాటనివ్వని భద్రతా సిబ్బంది

అమరావతి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిగా 30 ఏళ్లు ఉంటానన్న జగన్ అండ చూసుకుని మిడిసిపడిన ఆ అధికారులకు ఇప్పుడు పగలే చుక్కలు కనిపించడం మొదలైంది. వైసీపీకి వత్తాసు పలికి, తప్పుడు కేసులు పెట్టి, వేధించిన ప్రతిపక్ష నాయకుడే ఇప్పుడు ముఖ్యమంత్రి కాబోతుండటంతో వారు ఇరకాటంలో పడిపోయారు. చంద్రబాబును ఆయన నివాసంలో కలిసేందుకు ప్రయత్నించిన 'ఏకపక్ష ఖాకీ'లకు భంగపాటు ఎదురైంది. నిఘా మాజీ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు, తప్పుడు కేసులు పెట్టడంలో కీలక పాత్ర పోషించి ఢిల్లీ వరకూ చంద్రబాబు పరువు తీసేందుకు యత్నించిన సీఐడీ ఏడీజీ సంజయ్, ఎందుకు అరెస్టు చేస్తున్నారో కనీసం నోటీసు ఇవ్వకుండా అర్ధరాత్రి 74ఏళ్ల వయసులో చంద్రబాబును అరెస్టు చేసిన కొల్లి రఘురామిరెడ్డికి షాక్ తగిలింది. ఆంజనేయులు చంద్రబాబును కలిసేందుకు ముందుగా అపాయింట్మెంట్ కూడా తీసుకోకుండా ఉదయం నేరుగా ఆయన నివాసానికి వచ్చారు. కరకట్టపైన సెక్యూరిటీ ఆయన వాహనాన్ని చూసి సీనియర్ ఐపీఎస్ అనే గౌరవంతో అనుమతించారు. అయితే రెండో గేటు వద్ద అనుమతి లేనిదే పంపలేమంటూ అడ్డుకున్నారు. లోపల కనుక్కోండి అంటూ పీఎస్ఆర్ సూచించడంతో, చంద్రబాబు చీఫ్ సెక్యూరిటీ అధికారిని వారు సంప్రదించారు. ఆ తర్వాత.. 'అపాయింట్మెంట్ ఉంటేనే అనుమతించమన్నారు సర్' అంటూ ఆయనను సిబ్బంది వెనక్కి పంపించివేశారు. కేంద్ర సర్వీసులకు వెళ్లిన ఆయన 2019లో జగన్ అధికారంలోకి రాగానే రాష్ట్రానికి తిరిగొచ్చారు. రవాణా శాఖ కమిషనర్‌గా జేసీ, కోడెల కుటుంబాలను తీవ్ర వేధింపులకు గురిచేశారు. అనంతరం ఏసీబీ డీజీగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, విపక్ష ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రను భయానక పద్ధతుల్లో అరెస్టు చేశారు. ఇంటెలిజెన్స్ చీఫ్‌గా చంద్రబాబు, లోకేశ్ మొదలు ప్రతిపక్షాలను వేధించడమే ధ్యేయంగా పనిచేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత కూడా జగన్ గెలుపుకోసం శక్తివంచన లేకుండా తెరచాటు ప్రయత్నాలు చేశారు. పసిగట్టిన ఎన్నికల కమిషన్ ఈడ్చి అవతల పడేయడంతో ఎలాంటి పోస్టింగ్ లేకుండా పోయింది. రెండేళ్లకు పైగా సర్వీసు ఉన్న ఆయన స్వచ్ఛంద పదవీ విరమణకు సిద్ధమయ్యారని చెబుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో ముందూ వెనుకా చూసుకోకుండా చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించడంలో కీలక పాత్ర పోషించిన సీఐడీ ఏడీజీ సంజయ్ ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే విదేశాలకు వెళ్లిపోయేందుకు సెలవు పెట్టారు. చివరి నిమిషంలో అది రద్దయింది. దీంతో గురువారం చంద్రబాబు నివాసానికి నేరుగా వచ్చేశారు. అయితే మొదటి గేటైన కరకట్ట గేటు వద్దే సెక్యూరిటీ సిబ్బంది ఆయనను ఆపేసింది. అయినా చంద్రబాబు చీఫ్ సెక్యూరిటీ అధికారితో మాట్లాడేందుకు ప్రయత్నిస్తూ అక్కడే అడ్డంగా కారు ఆపారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందంటూ కానిస్టేబుళ్లు సంజయ్ వాహనాన్ని బలవంతంగా పక్కకు తీయించారు.

కొల్లి విలవిల..

కొల్లి రఘురామిరెడ్డికి వైసీపీ ప్రభుత్వం ఏకంగా మూడు పోస్టులు ఇచ్చింది. ఐజీ ర్యాంకులో ఉన్న ఆయనకు డీజీ ర్యాంకు అధికారి పోస్టు అయిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీగా ఇచ్చారు. సీఐడీలో ఆర్థిక నేరాల విభాగం పరిధిలో ఏర్పాటు చేసిన సిట్‌కు అధిపతిని చేశారు. డ్రగ్ కంట్రోల్ విభాగం డీజీగా మరో పోస్టు కట్టబెట్టారు. అన్నీ వదిలి పోలీస్ హెడ్ క్వార్టర్స్‌కు వచ్చేయ్ అంటూ డీజీపీ గుప్తా బుధవారం పిలిపించడంతో విలవిలలాడిపోయారు. చంద్రబాబును కలిసేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. కాగా, గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డికి కూడా చంద్రబాబు అపాయింట్మెంట్ దొరకలేదు.

కదలడానికి వీల్లేదు..

వైసీపీ అధికారులకు స్పష్టీకరణ

అమరావతి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించి... ప్రభుత్వ మారగానే వెనక్కి వెళ్లాలని చూస్తున్న సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ తుమ్మా విజయ్ కుమార్ రెడ్డి వినతిని సీఎస్ తిరస్కరించారు. జగన్ ప్రభుత్వంలో ఆయన వైసీపీ కార్యకర్తలాగే పనిచేశారు. ప్రకటనల జారీలో పూర్తి ఏకపక్షంగా వ్యవహరించారు. వైసీపీ సోషల్ మీడియా సిబ్బందికి తన శాఖ నుంచి జీతాలు చెల్లించారు. భారీ సంఖ్యలో వైసీపీ కార్యకర్తలకు తన శాఖలో కాంట్రాక్టు ఉద్యోగాలు వేయించారు. తిరిగి జగన్ ప్రభుత్వమే వస్తుందన్న అంచనాతో విజయ్‌కుమార్.. తన డిప్యుటేషన్ రెండేళ్ల పొడిగింపు కోరుతూ గత నెలలోనే సీఎస్ ద్వారా కేంద్రానికి విన్నవించారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో వెళ్లిపోతా అంటూ సీఎస్ వద్దకెళ్లి రిలీవ్ అడిగారు. అయితే, అధికారుల విషయంలో ఇప్పటికే సాధారణ పరిపాలన విభాగం ఒక విధానం తీసుకుంది. రిలీవ్, డిప్యుటేషన్‌కు పెట్టుకునే విజ్ఞప్తులను ఆమోదించరాదని నిర్ణయం తీసుకుంది. అందులోనూ విజయ్‌కుమార్ నిర్వహించిన శాఖపై ప్రత్యేకంగా నిఘా పెట్టారు. ఈ నేపథ్యంలో తిరిగి వెనక్కి వెళ్లేందుకు విజయ్ కుమార్ చేసిన విజ్ఞప్తిని సీఎస్ తిరస్కరించారు. 'కొత్త ప్రభుత్వం ఏర్పడేదాకా తిరిగి వెళ్లడం సాధ్యం కాదు.. అంత వరకూ ఆగాల్సిందే..' అని తేల్చిచెప్పారు.

నీరబ్‌కుమారా? విజయానందా?

కొత్త సీఎస్‌పై సర్వత్రా ఆసక్తి

అమరావతి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువు తీరుతున్న వేళ, అధికార యంత్రాంగాన్ని నడిపించే సీఎస్ పదవిలోకి ఎవరు రాబోతున్నారు? కొత్త సీఎస్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారులు నీరబ్‌కుమార్, విజయానంద్‌ల్లో ఎవరిని చంద్రబాబు ఎంచుకోబోతున్నారు?.. ప్రభుత్వ ఉన్నత వర్గాల్లో ఇప్పుడు ఇదే చర్చ! సీఎస్‌గా పనిచేసిన జవహర్‌రెడ్డి గురువారం సెలవుపై వెళ్లిపోయారు. దీంతో కొత్త సీఎస్ ఎంపిక ప్రక్రియ వేగవంతం అయింది. సీనియారిటీ ప్రకారం అటవీ, పర్యావరణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ముందువరసలో ఉంటారు. కాబట్టి, ఆయనకే చాన్స్ ఉంటుందని చెబుతున్నారు. అయితే, ఆయన మరో 23 రోజుల్లో రిటైర్ కాబోతున్నారు. నీరబ్‌ను ఈ కొద్దికాలానికి సీఎస్‌గా నియమించి, నెలాఖరున మళ్లీ మరొకరిని ఆ బాధ్యతల్లోకి తీసుకురావడం ఎందుకని చంద్రబాబు యోచిస్తున్నట్టు సమాచారం. నియమించేదేదో పూర్తికాలానికి తీసుకుంటేనే సరిపోతుందని భావిస్తున్నట్టు తెలిసింది. అలాచూస్తే.. నీరబ్ తర్వాత సీనియారిటీలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్ ముందు ఉన్నారు. ఒకవేళ నీరబ్‌ను కాదనుకుంటే విజయానంద్‌కే చాన్స్ ఉండొచ్చునని ప్రభుత్వవర్గాలు చెబుతున్నాయి.

సీఎంవోలోకి ముద్దాడ..

ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్రకు కొత్త ప్రభుత్వంలో సముచిత స్థానం లభించింది. గురువారం సాయంత్రం చంద్రబాబును ఆయన నివాసంలో రవిచంద్ర కలిశారు. ఈ సందర్భంగా చంద్రబాబు... వెంటనే సీఎంవోలోకి రావాలని సూచించారు. సీఎంవో ముఖ్య కార్యదర్శిగా నియమిస్తున్నట్లు చెప్పారు. మంచి రోజు చూసుకుని జాయిన్ అవుతానని ఆయనకు రవిచంద్ర చెప్పారు. శని లేదా ఆదివారం ఆయన కొత్త బాధ్యతలు తీసుకోనున్నారు.

భారీ స్టాక్ మార్కెట్ స్కామ్

ఫలితాల రోజు 30 లక్షల కోట్ల సంపద ఆవిరి.. ఈ పతనం వెనక మోదీ, షా కుట్ర

» 5 కోట్ల మదుపరులకు నష్టం: రాహుల్

న్యూఢిల్లీ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్‌షా, వారి కోసం పనిచేసే ఎగ్జిట్‌పోల్స్ సంస్థలు కలిసి దేశంలోనే భారీ స్టాక్ మార్కెట్ కుంభకోణానికి పాల్పడ్డారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాల రోజున స్టాక్‌మార్కెట్ పతనమవ్వడంతో 5 కోట్ల మంది మదుపరులు భారీగా నష్టపోయారని, రూ.30 లక్షల కోట్ల మేర ఇన్వెస్టర్ల సంపద ఆవిరైందని చెప్పారు. ఈ కుట్రపై మోదీ, అమిత్‌షా, ఎగ్జిట్‌పోల్ సంస్థలు, విదేశీ ఇన్వెస్టర్లపై విచారణకు జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ)ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గురువారం ఆయన కాంగ్రెస్ కేంద్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నేతలు జైరాం రమేశ్, పవన్ ఖేరా, సుప్రియా శ్రీనాథేతో కలిసి మాట్లాడారు. ఒక క్రమపద్ధతిలో ఈ కుంభకోణం జరిగిందని రాహుల్‌గాంధీ ఆరోపించారు. సెక్యూరిటీ ఎక్స్‌చేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా(సెబీ) దర్యాప్తు జరుగుతున్న ఓ కంపెనీ(అదానీని ఉద్దేశించి)కి చెందిన న్యూస్‌చానల్‌కు మోదీ, అమిత్‌షా ఇంటర్వ్యూలిస్తూ.. జూన్ 4లోపు షేర్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టాలని, ఆ తర్వాత షేర్ల రేట్లను అందుకోలేరన్నట్లుగా మదుపరులకు సలహాలిచ్చారన్నారు. "మే 13న అమిత్ ఆ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో జూన్ 4లోపు షేర్లు కొనాలన్నారు. అదే నెల 19న మోదీ ఇంటర్వ్యూ ఇస్తూ అదే మాట చెప్పారు. జూన్ 4న స్టాక్ మార్కెట్ రికార్డులు బద్ధలవుతాయన్నారు. జూన్ 1న ఎగ్జిట్ పోల్స్ విడుదలయ్యాయి. జూన్ 3న స్టాక్ మార్కెట్ సూచీలు ఆల్‌టైమ్ గరిష్ఠానికి చేరుకున్నాయి. ఎన్నికల ఫలితాల రోజు(జూన్ 4న) స్టాక్ మార్కెట్ కుప్పకూలిపోయింది" అని రాహుల్ గుర్తుచేశారు. స్టాక్ మార్కెట్ల గురించి గతంలో ఏ ప్రధాని కూడా మాట్లాడలేదని, మోదీ, షా మదుపరులకు ఎందుకు పిలుపునిచ్చారని నిలదీశారు. స్టాక్స్‌పై సలహాలివ్వడమే వారి పనా? అని ప్రశ్నించారు. వారిద్దరూ ఇంటర్వ్యూ ఇచ్చిన న్యూస్ చానల్‌కు కూడా ఈ కుంభకోణంతో సంబంధం ఉందా? అని అనుమానం వ్యక్తం చేశారు. స్టాక్ మార్కెట్ పతనానికి, అదానీ కుంభకోణానికి ముడిపడి ఉందా? అని విలేకరులు ప్రశ్నించగా.. "స్టాక్ మార్కెట్ కుంభకోణం అదానీ స్కామ్ కంటే చాలా పెద్దది" అని రాహుల్ సమాధానమిచ్చారు. రాహుల్‌గాంధీ ఆరోపణలపై బీజేపీ నేత పీయూష్ గోయల్ తీవ్రంగా స్పందించారు. రాహుల్‌గాంధీవి నిరాధారమైన ఆరోపణలు అని కొట్టిపారేశారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమిని జీర్ణించుకోలేకే ఇలా ఆరోపణలు చేస్తున్నారన్నారు. ప్రధాని మోదీ భారత్‌ను మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే దిశలో అడుగులు వేస్తున్నారని చెప్పారు.

రేపు సీడబ్ల్యూసీ సమావేశం

న్యూఢిల్లీ, జూన్ 6: సీడబ్ల్యూసీ శనివారం సమావేశం కానుంది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షత జరిగే ఈ భేటీలో లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై చర్చిస్తారని సమాచారం. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ 99 స్థానాలు సాధించి రెండో అతి పెద్ద పార్టీగా ఆవిర్భవించిన సంగతి తెలిసిందే.

బీజేపీ అధ్యక్షుడిగా శివరాజ్ చౌహాన్?

నడ్డా స్థానంలో ఎంపీ మాజీ సీఎంకు పదవి

ఢిల్లీకి రావాలంటూ పిలుపు

న్యూఢిల్లీ, జూన్ 6: రాజకీయ జీవితం దాదాపు ముగిసిందనుకున్న దశలో మధ్యప్రదేశ మాజీ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్ (65)కు అత్యంత కీలక బాధ్యత దక్కనున్నట్లు తెలుస్తోంది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా స్థానంలో చౌహాన్‌ను నియమిస్తారనే ప్రచారం జరుగుతోంది. ఈ మేరకు తక్షణమే ఢిల్లీకి రావాలంటూ ఆయనకు కబురుపెట్టారు. అభిమానులు ముద్దుగా మామ అని పిలుచుకునే శివరాజ్ రికార్డు స్థాయిలో పదహారున్నరేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేశారు. అత్యధిక కాలం సీఎంగా ఉన్న బీజేపీ ముఖ్యమంత్రి కూడా ఈయనే. గత డిసెంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో శివరాజ్ సారథ్యంలోనే పార్టీ అద్వితీయ విజయం సాధించినప్పటికీ, సీఎం బాధ్యతలు ఇవ్వలేదు. ఆయన కేబినెట్‌లో మంత్రిగా పనిచేసిన మోహన్‌యాదవ్‌ను సీఎం చేసింది అధిష్ఠానం. తాజా లోక్‌సభ ఎన్నికల సందర్భంగానూ మొదట శివరాజ్‌ను ఎంపీగా పోటీకి నిలపాలని భావించలేదు. మార్చి 2న విడుదల చేసిన చివరి జాబితాలో విదిశ టికెట్ ఇచ్చారు. 8.20 లక్షలపైగా భారీ మెజార్టీతో గెలుపొందారు. ఎన్నికల ప్రచారం సందర్భంగానే చౌహాన్‌ను ఢిల్లీకి తీసుకెళ్తానని ప్రధాని మోదీ ప్రకటించారు. ప్రస్తుతం బీజేపీలో ఈ స్థాయి అనుభవం ఉన్న నాయకుడు ఎవరూ లేరు. దీంతోనే ఆయనను జాతీయ అధ్యక్షుడిగా నియమించనున్నారనే ఊహాగానాలు వస్తున్నాయి. ప్రధాని మోదీ కంటే దాదాపు 15 ఏళ్లు ముందే ఎంపీ అయిన చౌహాన్‌కు కేంద్ర మంత్రి పదవి చాలా చిన్నదనే వాదన కూడా వినిపిస్తోంది. జాతీయ అధ్యక్ష బాధ్యతలు కట్టబెట్టేందుకే ఆయనను ఢిల్లీకి పిలిచారని చెబుతున్నారు. ఇక, ఒడిశా సీఎంగా కేంద్ర ఉక్కు శాఖ మాజీ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్(55) పేరు బలంగా వినిపిస్తోంది. కాగా, ఒడిశా సీఎం రేసులో సీనియర్ నేతలు సంబిత్ పాత్ర, జ్యుయల్ ఓరమ్ పేర్లూ వినిపిస్తున్నాయి.



కుటుంబ సభ్యులతో కలిసి కేక్ కట్ చేస్తున్న పవన్

హ్యాట్సాఫ్ కల్యాణ్ బాబు

» ఎన్నికల్లో గెలిచాక తొలిసారి చిరంజీవి ఇంటికి పవన్

» కుటుంబ సభ్యులందరి నుంచి అపూర్వ రీతిలో స్వాగతం

హైదరాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): అచ్చమైన ఆప్యాయత పూల వర్షమై కురుస్తుండగా.. స్వచ్ఛమైన ప్రేమానురాగాలు నిండిన గుండెల నడుమ.. గౌరవాభిమానాలు పాదాభివందనాలుగా మారిపోయాయి..! హర్షాతిరేకంతో ఆలింగనాలు వెల్లువెత్తగా.. భావోద్వేగాలతో కళ్లు చెమర్చాయి..! జగమంత కుటుంబం నాది అంటూ ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో కదంతొక్కి ఘన విజయం అందుకున్న జన సేనాని పవన్ కల్యాణ్‌కు సొంత కుటుంబ సభ్యుల నుంచి అపూర్వ స్వాగతం లభించింది. ఢిల్లీలో ప్రధాని మోదీ ఆధ్వర్యంలో సాగిన ఎన్డీఏ సమావేశంలో పాల్గొన్న అనంతరం పవన్ కల్యాణ్ గురువారం తొలి సారిగా హైదరాబాద్‌లోని తన పెద్దన్నయ్య మెగాస్టార్ చిరంజీవి ఇంటికి వచ్చారు. దీంతో యావత్ మెగా కుటుంబం ఆనందంలో మునిగిపోయింది. భార్య అన్నా లెజ్‌నేవా, కుమారుడు అకీరా నందన్‌తో కలిసి వచ్చిన పవన్‌ను కారు దిగిన వెంటనే అన్న కుమారులు, హీరోలు రాంచరణ్, వరుణ్‌తేజ్ కౌగిలించుకుని సాదరంగా ఆహ్వానించారు. వదిన సురేఖ చేయి పట్టుకుని ఇంట్లోకి తీసుకువచ్చి వీరతిలకం దిద్దారు. అమ్మ అంజనాదేవి గుమ్మడికాయతో దిష్టి తీశారు. అక్కచెల్లెలు హారతిచ్చిన అనంతరం.. బయటకు వచ్చిన చిరంజీవికి పవన్ చెప్పులు విడిచి మరీ పాదాభివందనం చేశారు. చిన్న తమ్ముడిని గట్టిగా హత్తుకుని చిరు ముద్దాడి.. భారీ పూలమాలను మెడలో వేశారు. ఈ దృశ్యం చూసి సోదరుడు నాగబాబు భావోద్వేగంతో కంటతడి పెట్టారు. తల్లిదండ్రుల సమక్షంలో బాబాయ్ పవన్‌కు పుష్పగుచ్ఛం అందించిన రాంచరణ్ పాదాభివందనం చేశారు. ఇంతలో ఆయన భార్య ఉపాసన రావడంతో అందరూ కలిసి గ్రూప్ ఫొటోకు పోజిచ్చారు. నాగబాబు, ఆయన భార్య, కుమారుడు వరుణ్‌తేజ్, ఆయన భార్య లావణ్య త్రిపాఠిలూ పవన్ దంపతులకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం "డియర్ కల్యాణ్ బాబు హ్యాట్సాఫ్" అని రాసి ఉన్న కేక్‌ను అమ్మ, వదినలతో కలిసి పవన్ కట్ చేశారు. పవన్-లెజ్‌నేవాలకు చిరంజీవి దంపతులు కొత్త దుస్తులు పెట్టారు. ఈ కార్యక్రమం అనంతరం పవన్ అమ్మ అంజనాదేవి, వదిన సురేఖకు పాదాభివందనం చేశారు. వేడుకలో నిర్మాత అల్లు అరవింద్, ఆయన కుమారుడు, హీరో అల్లు అర్జున్ మాత్రం కనిపించలేదు. మరోవైపు అకీరా నందన్ తండ్రిపై రూపొందించిన ఓ వీడియోను రేణూదేశాయ్ సోషల్ మీడియాలో షేర్ చేశారు. పవన్ నటించిన చిత్రాల్లోని పవర్‌ఫుల్ డైలాగ్‌లు, యాక్షన్ స్టిల్స్‌ను వాడుతూ.. దివంగత మైకేల్ జాక్సన్ పాట 'దే డోంట్ కేర్ అబౌట్ అజ్'ను బ్యాక్ గ్రౌండ్‌లో ఉపయోగించారు. ఈ వీడియోను పవన్ అభిమానులు షేర్ చేస్తున్నారు. ఎన్నికల ఫలితాలకు ముందే దీనిని అకీరా ఎడిట్ చేశారని రేణూదేశాయ్ తెలిపారు.



నంద్యాల జిల్లా సంజామల మండలం పాలేరు వాగులో చిక్కుకున్న ఆర్టీసీ బస్సు

ఉమ్మడి కర్నూలులో వర్ష బీభత్సం

- పలుచోట్ల రాకపోకలకు అంతరాయం
- సంజామల వాగులో చిక్కుకున్న ఆర్టీసీ బస్సు
- ప్రాణాలతో బయటపడ్డ 14మంది ప్రయాణికులు

నంద్యాల టౌన్, జూన్ 6: నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిశాయి. బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించాయి. పలుచోట్ల రహదారులు, కల్వర్టులు ధ్వంసమయ్యాయి. గ్రామాలకు రవాణాసౌకర్యం నిలిచిపోయింది. నంద్యాల జిల్లా సంజామల, బేతంచర్ల, మిడ్తూరు తదితర మండలాల్లో భారీ వర్షం కారణంగా వాగులు, వంకలు పొంగిపొర్లాయి. వరదల కారణంగా సంజామల మండలంలోని పాలేరు వాగులో కోవెలకుంట్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు చిక్కుకుంది. ప్రమాద సూచికలు లేకపోవడంతో వాగులో బస్సు వెళ్తూ ఒరిగిపోయింది. పోలీసులు స్పందించి క్రేన్ సహాయంతో బస్సును బయటకు తీశారు. బస్సు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంలో 14 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు.

తిరుమలలో భారీ వర్షం

తిరుమల: తిరుమలలో గురువారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వాతావరణం చల్లగా ఉండగా 3 గంటలకు చిరుజల్లులు మొదలయ్యాయి. అప్పటి నుంచి సాయంత్రం 6 గంటల వరకు దఫాలవారీగా వర్షం దంచికొట్టింది. శ్రీవారి ఆలయంతో పాటు మాడవీధులు, రోడ్లు, కాటేజీలు, పార్కులు జలమయమయ్యాయి. సాయంత్రం తర్వాత తిరుమలలో చలితీవ్రత పెరిగింది. మరోవైపు వర్షం ఆగిన సమయాల్లో తిరుమల క్షేత్రాన్ని, శేషాచల అడవులను దట్టమైన పొగమంచు కప్పేసింది.

విజయనగరం వరకు 'నైరుతి'

- కోస్తా, సీమల్లో విస్తారంగా వర్షాలు
- నేడు రాయలసీమకు భారీ వర్షసూచన

విశాఖపట్నం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): అరేబియా సముద్రం, బంగాళాఖాతంలో నైరుతి రుతుపవనాల పురోగమనానికి వాతావరణం అనుకూలంగా మారింది. దీంతో గురువారం అరేబియా సముద్రం, కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ, ఉత్తర కోస్తాలోని విజయనగరం, పశ్చిమ మధ్య వాయువ్య బంగాళాఖాతంలో అనేక ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరించాయి. రానున్న మూడు, నాలుగు రోజుల్లో కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ, ఉత్తరాంధ్రలోని మిగిలిన ప్రాంతాలకు, ఛత్తీస్‌గఢ్, ఒడిశాలో పలు ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరించనున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. కాగా, రాయలసీమలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం, బంగాళాఖాతం నుంచి వస్తున్న తేమగాలులు, చురుగ్గా కదులుతున్న రుతుపవనాల ప్రభావంతో గురువారం రాష్ట్రంలో అనేకచోట్ల వర్షాలు, అక్కడక్కడా భారీవర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల, రాయలసీమలో అక్కడక్కడా భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈనెల 8వ తేదీ నుంచి తీరం వెంబడి బలమైన గాలులు వీచే అవకాశం ఉన్నందున సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది.

టీచర్ల అక్రమ బదిలీలకు బ్రేక్

(మొదటి పేజీ తరువాయి)

పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ ఉత్తర్వులు జారీచేశారు. ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఆ బదిలీలను నిలుపుదలచేస్తూ ఆయనే గురువారం తాజాగా మరో ఉత్తర్వులు జారీచేశారు. బదిలీల వెనుక రూ.50 కోట్లకుపైగా స్కాం జరిగింది. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ కార్యాలయం కేంద్రంగానే వసూళ్ల పర్వం కొనసాగింది. అక్రమాలను అడ్డుకోవాల్సిన మంత్రే ముడుపుల వసూలుకు గేట్లు తెరిచారు. దీంతో వందల మంది టీచర్లు కోరుకున్న స్థానాల కోసం అడిగినంత సమర్పించుకుని బదిలీ ఆర్డర్లు తెచ్చుకున్నారు. ఒక్కో టీచర్ రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షలు ఇచ్చారు. ఇప్పుడా బదిలీలు ఆగిపోవడంతో ముడుపులిచ్చిన టీచర్లు లబోదిబోమంటున్నారు. ఈ వ్యవహారంలో పాఠశాల విద్యాశాఖలోని కొందరు అధికారులు, కొన్ని ఉపాధ్యాయ సంఘాల నేతల పాత్ర కూడా ఉండటం చర్చనీయాంశంగా మారింది. బదిలీలు చేయిస్తామంటూ అప్పట్లో వీరూ ముడుపులు వసూలు చేశారు. పాఠశాల విద్యాశాఖలో అన్నీ తానై వ్యవహరించే ఓ కమిషనరేట్ అధికారి, రాయలసీమకు చెందిన సచివాలయంలోని పాఠశాల విద్యాశాఖ అధికారి పాత్ర కూడా ఇందులో ఉంది. వారిద్దరే దాదాపు 30 బదిలీలు చేయించారు. సచివాలయంలో కూర్చునే ఇద్దరూ ఈ అక్రమ బదిలీల ఆర్డర్లను తయారుచేశారు. ఇక ఉపాధ్యాయ సంఘాల్లో ఎక్కువ మంది టీచర్లు ఉండే ఓ పెద్ద సంఘం నాయకులు, తెలంగాణలో తప్ప ఏపీలో టీచర్లే లేని ఓ సంఘం నేతలు కూడా ఇందులో తలదూర్చారు. ఏపీ టీచర్లు లేని సంఘంలో రాయలసీమకు చెందిన నేత ఒక్కరే 20 మంది టీచర్లను బదిలీ చేయించారు. ఇప్పుడు బదిలీలు ఆగిపోవడంతో ఈ వ్యవహారం రచ్చకెక్కే అవకాశం కనిపిస్తోంది. బొత్స వద్దకు వెళ్లి ముడుపులు వెనక్కి ఇవ్వాలనే ధైర్యం చేయలేకపోయినా.. ఆ అధికారులు, సంఘాల నేతలను టీచర్లు నిలదీస్తున్నారు. మా డబ్బులు మాకు ఇవ్వండి అంటూ ఫోన్లు చేసి అడుగుతున్నారు.

చేస్తే తప్పేంటి..?

విద్యాశాఖ మంత్రిగా అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిన బొత్స సత్యనారాయణే బదిలీల విషయంలో బరితెగించారు. అక్రమ బదిలీలు చేస్తాం అని బహిరంగంగా ప్రకటించారు. మొదట సీఎం కార్యాలయం పేరుతో కొన్ని పేర్లు తయారుచేశారు. ఓ మీడియా సమావేశంలో వీటిపై విలేకరులు ప్రశ్నించగా 'సిఫారసు బదిలీలు చేస్తే తప్పేంటి. ఎమ్మెల్యేలు అడిగితే బదిలీలు కూడా చేయకపోతే ఎలా?' అని అడ్డగోలుగా మాట్లాడారు. ఆ తర్వాత కొంతకాలానికి బొత్స ఆఫీసులోనే ముడుపులు వసూలుచేశారు. ఆ కార్యాలయంలో పనిచేసిన కమలాకర్ అనే వ్యక్తి ద్వారా ఈ నగదు చేతులు మారింది. బదిలీ కావాలంటే కచ్చితంగా కమలాకర్‌ను కలవాల్సిందేననే అనధికారిక నిబంధన పెట్టి అమలుచేశారు. డబ్బులివ్వకుండా ఎవరైనా బదిలీ అడిగితే దరఖాస్తు తీసుకుని పక్కన పడేశారు. కేవలం ముడుపులిచ్చిన వారి దరఖాస్తులనే ప్రాసెస్ చేశారు. నేరుగా మంత్రే దుకాణం తెరవడంతో కమిషనరేట్ అధికారి, సచివాలయం అధికారి కలిసి కొన్ని బదిలీలు చేసుకున్నారు. కాగా, ఇప్పటికే వీరిలో కొందరు కొత్త స్థానాల్లో చేరిపోయారు. మొదట చేసిన బదిలీల్లో ఆర్డర్లు పొందిన వారు కొత్త స్థానాల్లో చేరగా, ఎన్నికల కోడ్‌కు ముందు ఆర్డర్లు పొందినవారు ఆగిపోయారు.

ఆ రోజు ఏంచేశావ్ ప్రవీణ్?

అక్రమ బదిలీల వ్యవహారంలో పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ జోక్యం కూడా ఉంది. గతేడాది మొదట్లో కౌన్సెలింగ్ ద్వారా సాధారణ బదిలీలు చేశారు. ఆ తర్వాత సిఫారసు బదిలీల పేరుతో అక్రమ బదిలీలు ప్రారంభించారు. ఆ సమయంలోనూ ముఖ్యకార్యదర్శిగా ప్రవీణ్ ప్రకాశే ఉన్నారు. ఈ అక్రమాల వ్యవహారం దాదాపు ఆరు నెలలు కొనసాగింది. ఎన్నికల ముందు బదిలీ ప్రక్రియ వేగంగా చేసేందుకు పూర్తిగా సహకారం అందించారు. ఆయనతో పాటు పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులంతా ఈ తంతంగానికి వత్తాసు పలికారు. ఇప్పుడు అవి అక్రమ బదిలీలని ఆపేయడంతో 'మాకేం తెలియదు' అన్నట్టు వ్యవహరిస్తున్నారు. అప్పుడు బదిలీ ఆర్డర్ ఇచ్చిన ప్రవీణ్ ప్రకాశ్.. అక్రమాలు కళ్ల ముందు జరుగుతుంటే ఏంచేశారని టీచర్లు ప్రశ్నిస్తున్నారు.

జగన్ ప్యాలెస్‌కు ప్రత్యేక రహదారి!

- ప్రభుత్వ స్థలంలో ఆర్అండ్‌బీ నిధులతో నిర్మాణం
- దానికి సమాంతరంగా కాల్వకట్ట రోడ్డు మూసివేత
- మూడేళ్లుగా విద్యార్థులు, స్థానికులకు ఇబ్బందులు
- కాల్వకట్ట రోడ్డును తిరిగి తెరిపించాలని వినతులు



తాడేపల్లిలో జగన్ ఇంటికి వెళ్లేందుకు ప్రభుత్వ స్థలంలో నిర్మించిన రహదారి



జగన్ ఇంటి కోసం వేసిన రహదారికి సమాంతరంగా ఉన్న బకింగ్‌హామ్ కాల్వ కట్ట రోడ్డును పూర్తిగా మూసివేసిన దృశ్యం

మంగళగిరి, జూన్ 6: వైసీపీ అధినేత జగన్ తమ ఇళ్ల మధ్య నివాసం ఉంటున్నారన్న ఆనందం ఆ కాలనీ వాసులకు మూన్నాళ్ల ముచ్చటే అయింది. 2019 ఎన్నికలకు ముందే తాడేపల్లి అమరారెడ్డి కాలనీ సమీపంలో జగన్ నివసించే ప్యాలెస్ నిర్మాణం పూర్తయింది. తర్వాత ఆయన ముఖ్యమంత్రి హోదాలో అందులోకి గృహప్రవేశం చేశారు. తన ప్యాలెస్ సమీపంలో పేదలెవరూ ఉండరాదని హుకుం జారీచేశారు. దీంతో సుమారు 277 మంది పేదల నివాసాలను కూల్చేశారు. తాడేపల్లి ప్యాలెస్‌కు రాకపోకల కోసం ప్రభుత్వ డొంకలో ఏర్పాటు చేసిన 15అడుగుల రోడ్డుకు కూల్చివేసిన పేదల ఇళ్ల తాలూకు స్థలాలను కలుపుకుంటూ ఏకంగా సెంట్రల్ డివైడర్‌తో కూడిన 40అడుగుల రోడ్డును 1.3కిలోమీటర్ల పొడవున రూ.5కోట్లతో నిర్మించారు. ఈ రహదారిని గత రెండున్నరేళ్లుగా జగన్ ప్యాలెస్‌కు వెళ్లి వచ్చేందుకు మాత్రమే ఉపయోగిస్తున్నారు. ఈ రోడ్డు వేసేందుకు గాను రేవేంద్రపాడు -సీతానగరం మధ్య ఉన్న కాలువ కట్ట రోడ్డును 8.7 కి.మీ నుంచి 7.4 కి.మీ వరకు విస్తరిస్తున్నట్టు, అందుకోసం రూ.5కోట్ల నిధులు విడుదల చేస్తున్నట్టు జీవోలో చూపారు. తొలగించిన 277 నివాసాలకు నష్టపరిహారంగా రూ.7.61 కోట్లు పంపిణీ చేసినట్టు పేర్కొన్నారు. ఈ రోడ్డులో అన్యులెవరూ వెళ్లకుండా రేయింబవళ్లు పోలీసు యంత్రాంగం కాలపా ఉంటుంది. ఎన్నికల ఫలితాల్లో వైసీపీ చిత్తుగా ఓడిపోయినా ఈ రహదారి జగన్ ప్యాలెస్ కోసమే అనే విధంగా పోలీసులు వ్యవహరిస్తున్నారు. అదే రోడ్డుకు సమాంతరంగా బకింగ్‌హామ్ కాల్వ కట్టపై వందల ఏళ్ల నుంచి ఉన్న రోడ్డును కూడ పూర్తిగా మూసివేశారు. దీంతో ప్రజలతోపాటు కేఎల్ వర్సిటీ విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జగన్ నివాసానికి వెనుక అమరారెడ్డి కాలనీ ఉంది. దానిపక్కనే బకింగ్‌హామ్ కాల్వకట్టపై 15అడుగుల రోడ్డు ఉంది. నూతక్కి, రేవేంద్రపాడుతో పాటు దుగ్గిరాల మండలంలోని అనేక గ్రామాల ప్రజలు ప్రకాశం బారేజీ మీదుగా విజయవాడ వెళ్లడానికి ఈ రోడ్డును వినియోగించుకునేవారు. తాజా ఓటమితో జగన్ సీఎం పదవి కోల్పోయిన నేపథ్యంలో కాల్వకట్ట రోడ్డును తెరిపించడంతోపాటు ప్రభు త్వ స్థలంలో నిర్మించిన రహదారిని అందరూ వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ర్యాంకులు సాధించిన విద్యార్థులు, అధ్యాపకులతో గోసలైట్స్ చైర్మన్ నరేంద్ర బాబు

నీట్ ఫలితాల్లో గోసలైట్స్ హవా

విజయవాడ(లబ్బీపేట), జూన్ 6 : నీట్ ఫలితాల్లో విజయవాడ శ్రీ గోసలైట్ మెడికల్ అకాడమీ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని సంస్థ ఛైర్మన్ నరేంద్ర బాబు తెలిపారు. పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డులోని ఇంద్రప్రస్థ హోటల్‌లో గురువారం ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ పరీక్ష ప్రవేశపెట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు తెలుగు రాష్ట్రాలలో లాంగ్ టర్మ్ కోచింగ్ ద్వారా 700పైబడి మార్కులు సాధించిన మొట్టమొదటి విద్యాసంస్థగా గోసలైట్స్ చరిత్ర సృష్టించిందన్నారు. 700 పైన మార్కులు లాంగ్ టర్మ్ నుంచి ముగ్గురు విద్యార్థులు, ఇంటర్ నేరుగా ఐదుగురు విద్యార్థులు సాధించారని తెలిపారు. 600పైన మార్కులు 520 మంది విద్యార్థులు సాధించారని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఒకే ఒక్క బ్రాంచితో 2021లో 724 ఫ్రీ మెడికల్ సీట్లు, 2022లో 1013 ఫ్రీ మెడికల్ సీట్లు, 2023లో 1237 సీట్లు సాధించగా 2024 లో సుమారు 1500 పైగా సీట్లు సాధించే దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులకు నగదు పారితోషకాలు అందించి, అధ్యాపక బృందాలను అభినందించారు.

ఎన్నికల కోడ్ ఎత్తివేత: సీఈవో

అమరావతి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో రాష్ట్రంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలును నిలుపుదల చేసినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్‌కుమార్ మీనా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సార్వత్రిక ఎన్నికలకు ఈ ఏడాది మార్చి 16న కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించినప్పటి నుంచి అమలులోకి వచ్చిన ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) జూన్4న ఓట్ల లెక్కింపు తర్వాత 48 గంటల వరకు అమలులో ఉందని పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాల ప్రకారం రాష్ట్రంలోని 25 పార్లమెంట్, 175 అసెంబ్లీ స్థానాలకు నూతనంగా ఎన్నికైన అభ్యర్థుల జాబితాలను ఖరారు చేయడంతో ఎన్నికల ప్రక్రియ ముగిసిందని తెలిపారు. ఈ మేరకు జారీ చేసిన ఎంసీసీ నిలుపుదల ఉత్తర్వులు తక్షణమే అమలులోకి వచ్చినట్లు సీఈవో వివరించారు.

JAWAHAR NAVODAYA VIDYALAYA
Maddirala (V), Chilakaluripet (M), Palnadu (Guntur) District, (AP)
Pin : 522 616, Phone No: 08647 - 255233

F.No.3-8/JNVM/2024-2025 Date: 06-06-2024

TENDER NOTIFICATION

Jawahar Navodaya Vidyalaya, Maddirala, Palnadu (Guntur) District invites sealed tenders for the year **2024-2025** from the reputed individuals/firms/organizations and co-operative societies for the following items.

01	Rice	02	Provisions	03	Vegetables
04	Chicken & Eggs	05	Fruits	06	Bakery items
07	Stitching of Uniforms	08	Washing & Pressing of Uniform	09	M & R items
10	Medicines	11	Toilet items	12	Hair Cutting

The tender documents/details may be obtained from **07-06-2024 to 21-06-2024** (working days) between **09.30 AM to 4.30 PM** from the Vidyalaya office on payment of ₹ 200/- (Rupees Two Hundred only) by cash / demand draft / NEFT / RTGS / other electronic payment modes to Jawahar Navodaya Vidyalaya, Maddirala A/c No.144210011000279, Union Bank of India, Pandaripuram Branch, IFS Code: UBIN0814423. The required EMD will be accepted in the form of Demand Draft only.

Receipt of filled Tender forms up to **22-06-2024 at 11.00 AM** by the Vidyalaya through Speed /Registered post/ By hand. Vidyalaya is not responsible for late submission of tender by post.

The tender documents will be opened in the presence of the tenderers available on dated **22-06-2024 at 11.30 AM** in the chamber of the Principal, Jawahar Navodaya Vidyalaya Maddirala, (Palnadu) Guntur District.

Tender documents can also be download through the Vidyalaya website: https://www.navodava.gov.in/nvs/nvs-school/_GUNTUR/en/aboutus/ About-JNV/ on payment of ₹ 200/- (Rupees Two Hundred only) through demand draft in favour of **'Jawahar Navodaya Vidyalaya'** payable at Chilakaluripet should be enclosed along with the tender schedule. Otherwise the tender form will not be considered.

Sd/- **PRINCIPAL**

కొత్త ప్రభుత్వం కొలువుదీరేలోగా సర్దేద్దాం!

- ఇంటర్ విద్యాశాఖలో అక్రమ పదోన్నతులు
- సీనియారిటీ జాబితా లేకుండా డీపీసీకి సిద్ధం
- ఓ అధికారి కోసం అడ్డగోలు ప్రక్రియ

అమరావతి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ ముగియడంతో కొత్త ప్రభుత్వం వచ్చేలోపు అక్రమ పదోన్నతులు చేపట్టేందుకు ఇంటర్ విద్యాశాఖ సిద్ధమైంది. సూపరింటెండెంట్ నుంచి అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టులకు పదోన్నతి కల్పించే విషయంలో ఆగమేఘాలపై ఫైలు ముందుకు కదిపింది. నిబంధనల ప్రకారం తుది సీనియారిటీ జాబితా విడుదల చేశాకే డీపీసీ నిర్వహించాలి. కానీ కేవలం తాత్కాలిక సీనియారిటీ జాబితాను ఆధారంగా చేసుకుని నేడు డీపీసీ నిర్వహించేందుకు అధికారులు ఫైలు పెట్టారు. అయితే ఇదంతా ఇంటర్ విద్య కమిషనరేట్‌లో పనిచేస్తున్న ఒక్క సూపరింటెండెంట్ కోసం చేస్తున్నారు. ఆ ఒక్క అధికారికి పదోన్నతి ఇవ్వడం కోసం మొత్తం ఉన్నతాధికారులను ఒప్పించి డీపీసీ నిర్వహిస్తుండటం వివాదాస్పదంగా మారింది. సాధారణ తాత్కాలిక సీనియారిటీ జాబితా విడుదల చేసిన తర్వాత దానిపై సంబంధిత అధికారులు అప్పీళ్లకు వెళ్తారు. ఏవైనా సర్వీసు రెగ్యులరైజేషన్ అంశాలు, ఇతరత్రా అభ్యంతరాలుంటే వాటిని పరిష్కరించి తుది జాబితా విడుదల చేస్తారు. ఎలాంటి వివాదాలూ లేవనుకున్న తర్వాతే డీపీసీ నిర్వహిస్తారు. ఇప్పుడు కేవలం ఒక్క అధికారి కోసం నిబంధనలు తుంగలో తొక్కారు. కొత్త ప్రభుత్వం వచ్చేవరకూ బదిలీలు, పదోన్నతులు నిర్వహించొద్దని అన్ని శాఖలు ఆదేశాలు జారీచేశాయి. కానీ ఇంటర్ విద్యాశాఖ ప్రభుత్వం వచ్చేలోపే పదోన్నతులు ఇచ్చేయాలని ఈ ప్రక్రియను ప్రారంభించింది.

ఒంగోలులో ఈడీ సోదాలు!

- చదలవాడ ఇన్‌ఫ్రాటెక్ డెరెక్టర్ ఇళ్లలో తనిఖీలు

ఒంగోలు (కార్పొరేషన్), జూన్ 6: ఒంగోలుకు చెందిన చదలవాడ ఇన్‌ఫ్రాటెక్ కంపెనీ డైరెక్టర్ చదలవాడ రవీంద్రబాబుకు చెందిన ఆస్తులపై హైదరాబాద్‌తో పాటు ఒంగోలులోనూ ఈడీ (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) అధికారులు దాడులు చేశారు. స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాను మోసం చేసిన విషయంలో ఈడీ నేరుగా ఈ దాడులకు పాల్పడినట్లు సమాచారం. రవీంద్రబాబు స్వగ్రామం ఒంగోలు సమీపంలోని మంగమూరు గ్రామం. స్థానికంగా ఆర్థిక వ్యవహారాలు, ఇతర పలు అంశాల్లో ఆయన కీలకంగా వ్యవహరించినట్లు తెలిసింది. ఆయన సంస్థ పేరుతో స్టేట్‌బ్యాంకులో రూ.166.93 కోట్లు రుణం తీసుకుని ఆ నగదును ఇతరులతో కలిసి దుర్వినియోగం చేసినట్లు తెలుస్తోంది. సీబీఐ, ఏసీబీ కేసు నమోదు కావడంతో దాని ఆధారంగా ఈడీ రంగంలోకి దిగింది. ఉద్యోగులు, డైరెక్టర్ల ఖాతాల్లోకి రుణ మొత్తాన్ని మళ్లించినట్లు ఆయనపై కేసు నమోదైంది. అలాగే వాటితో కుటుంబసభ్యుల పేరిట ఆస్తులు సంపాదించినట్లుగా ఈడీ గుర్తించింది. ఈ నేపథ్యంలో మంగమూరులోని ఇంటితోపాటు ఒంగోలులోని ఆయన నివాసం, హైదరాబాద్‌లో సంస్థ కార్యాలయంలో రెండురోజుల నుంచి సోదాలు జరుగుతున్నాయి. సోదాల్లో భాగంగా రవీంద్రబాబు ఆస్తి పత్రాలు, ఇతర ఆభరణాలు, నేరారోపణ పత్రాలు, డిజిటల్ పరికరాలను ఈడీ స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు.

విద్యాశాఖలో అవకతవకలపై
విచారణ జరిపించాలి: ఏపీటీఎఫ్

గుంటూరు(విద్య), జూలై 6: గత ప్రభుత్వ హయాంలో విద్యా కానుక కిట్ల కొనుగోళ్లు, ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్ వ్యవహారాలపై న్యాయ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల డిమాండ్ చేశారు. గురువారం గుంటూరు జిల్లా కోర్టు రోడ్డులోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులను అనేక అవమానాలకు, హేళనలకు గురిచేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీటీఎఫ్ పూర్వ ప్రధాన కార్యదర్శి పి.పాండురంగ వరప్రసాదరావు మాట్లాడుతూ పాఠశాల విద్యారంగానికి గొడ్డలిపెట్టుగా ఉన్న జీవో 117ను రద్దు చేయాలన్నారు. 3,4,5 తరగతులు విలీన ప్రక్రియను వెనక్కి తీసుకోవాలని కోరారు.

పీహెచ్‌డీ ప్రవేశ ఇంటర్వ్యూలు వాయిదా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 6: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పీహెచ్‌డీలో ప్రవేశానికి ఈ నెల 10 నుంచీ 13 వరకు జరగవలసిన ఇంటర్వ్యూలు వాయిదా పడ్డాయి.



సీఐడీ కార్యాలయంలో ధర్మారెడ్డిపై ఫిర్యాదు చేస్తున్న జనసేన నాయకులు

టీటీడీ ఈవో ధర్మారెడ్డి
పాస్‌పోర్టు సీజ్ చేయండి

- సీఐడీకి జనసేన నేతల ఫిర్యాదు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 6 : టీటీడీ ఈవో ధర్మారెడ్డి విదేశాలకు పారిపోకుండా తక్షణం పాస్‌పోర్టు సీజ్ చేయాలని తిరుపతి జనసేన నాయకులు విజ్ఞప్తి చేశారు. తిరుపతి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి కిరణ్‌రాయల్, నాయకులు రాజారెడ్డి, సుభాషిణి, సుమన్, బాబు మునస్వామి, కిషోర్ గురువారం తిరుపతి సీఐడీ కార్యాలయంలో ఈ మేరకు ఫిర్యాదు చేశారు. ఐఏఎస్ కాకున్నా ఐదు సంవత్సరాలుగా అధికార పార్టీ అండదండలతో సీఎం జగన్ పనులు చక్కబెడుతూ అడ్డూ అదుపూ లేకుండా ఈవోగా కొనసాగారని ఫిర్యాదులో పేర్కొన్నారు. టీటీడీలో అనేక అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని, ఆయన ఈవోగా ఉండగా తిరుమలలో స్వామి వారి బంగారు నగలు, ఆభరణాలు, శ్రీవాణి ట్రస్టుకు సంబంధించిన ఎన్నో కుంభకోణాలు చోటు చేసుకున్నాయన్నారు. శ్రీవారికి సమర్పించిన హుండీ కానుకలపై సరైన లెక్కలు చూపకుండా ప్రభుత్వం మారగానే సెలవు పెట్టి విదేశాలకు వెళ్లిపోవడానికి ప్రయత్నించడం సిగ్గు చేటన్నారు. ధర్మారెడ్డి అవినీతి లెక్కలు చాలా తేల్చాల్సి ఉందన్నారు. ఆయన విదేశాలకు పారి పోకుండా తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్మారెడ్డి పాసుపోర్టు సీజ్ చేసి లుకవుట్ నోటీసులు ఇవ్వాలని, తిరుమల, తిరుపతి టోల్‌గేట్ల వద్ద నిఘా పెట్టి పారిపోకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

హమ్మయ్య, ఇక ఊరు వెళతాం

- కేతిరెడ్డి పెద్దారెడ్డి దౌర్జన్యాలతో కుటుంబాలు వదిలి తిరుగుతున్నాం
- దుర్గమ్మను దర్శించుకున్న తాడిపత్రి టీడీపీ కౌన్సిలర్లు



దుర్గమ్మ ఆలయం వద్ద తాడిపత్రి కౌన్సిలర్లు

విజయవాడ(వన్‌టౌన్), జూన్ 6 : అనంతపురం జిల్లా తాడిపత్రి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి దౌర్జన్యాల కారణంగా 25 రోజులుగా ఊరిని, కుటుంబసభ్యులను విడిచి బయట వేరే ప్రాంతంలో తిరుగుతున్నామని తాడిపత్రికి చెందిన నలుగురు కౌన్సిలర్‌లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ అధికారంలోకి రావడంతో బెజవాడ కనకదుర్గమ్మను దర్శించుకుని సొంతూరు తాడిపత్రి వెళుతున్నట్టు వారు తెలిపారు. తాడిపత్రి 32వ వార్డు కౌన్సిలర్ మంగపట్నం లక్ష్మీనారాయణ, 30వ వార్డు కౌన్సిలర్ విజయకుమార్, 26వ వార్డు కౌన్సిలర్ షేక్ వలీ, 15వ వార్డు కౌన్సిలర్ రామచంద్ గురువారం ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అరాచకాలకు హద్దు అదుపు లేకుండా పోయిందని, అన్యాయంగా టీడీపీ కౌన్సిలర్‌లు, నాయకులపై కేసులు పెట్టించారని వాపోయారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

దిశ మార్చిన యూపీ

దేశాన్ని ఏలాలనుకొనే పార్టీ లక్నోమీదుగా ఢిల్లీ చేరాలని రాజకీయాల్లో అంటూంటారు. 80 లోక్‌సభ స్థానాలున్న ఉత్తర్‌ప్రదేశ్‌ను గెలవనిపక్షంలో కేంద్రంలో అధికారం దక్కదని దీని అర్థం. ఈ ఎన్నికల్లో భారతీయజనతాపార్టీ యూపీలో చతికిలబడిన కారణంగానే లోక్‌సభలో ఇప్పుడు తనకాళ్ళమీద తాను నిలబడలేనిస్థితికి వచ్చింది. సొంతబలంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగల అవకాశాన్ని బీజేపీకి దక్కకుండా చేయడంలో యూపీ కీలకపాత్ర పోషించింది. ఎన్డీయే కూటమిని తీన్‌సౌ పార్ వరకూ కూడా పాకనివ్వకుండా మోకాలడ్డింది. ఈ రాష్ట్రం నుంచి ఇండియా కూటమి 43స్థానాలు సాధిస్తే, 37సీట్లు సమాజ్‌వాదీపార్టీవి, ఆరు కాంగ్రెస్‌వి. ఎన్డీయేకు దక్కిన ముప్పై ఆరులో ముప్పైమూడు బీజేపీవి. హిందూత్వ కంచుకోటకు పడిన ఈ చిల్లు యోగి రాజకీయ భవిష్యత్తును ప్రమాదంలో పడవేసింది, మోదీకి మూడోసారి రాజ్యాధికారం దక్కినా, బాబు, నితీశ్‌ల భరోసాలేనిదే అడుగుముందుకు వేయలేని స్థితిని కల్పించింది.

పదేళ్ళక్రితం డెబ్బయ్‌ఒక్కస్థానాలు, ఐదేళ్ళక్రితం 62స్థానాలు గెలుచుకున్న బీజేపీ ఇప్పుడు 33సీట్లకు పరిమితం కావడం బలమైన ఎదురుగాలికి నిదర్శనం. కేంద్రమంత్రి స్మృతి ఇరానీ సహా అనేకమంది బీజేపీ మహారథులు ఓడిపోయారు, వారణాసినుంచి నరేంద్రమోదీ విజయం సైతం పలుచబడింది. అయోధ్యలో భవ్యమైన రామమందిర నిర్మాణం, మోదీ స్వయంగా ప్రాణప్రతిష్ఠ చేయడం, ఆ ప్రత్యక్షప్రసారాలూ సూర్యతిలకాలూ దేశప్రజల మనసులను తమవైపు మళ్ళిస్తాయని బీజేపీ గట్టిగా నమ్మింది. ప్రతీ ఇంటికీ అక్షింతలు చేరాయి, ప్రతీపల్లెనూ సామాజిక మాధ్యమాల ద్వారా ఆ చిత్రాలు తాకాయి. దేశవ్యాప్త ప్రభావం ఉన్నదా లేదా అన్నది అటుంచితే, అయోధ్య కొలువుదీరి ఉన్న ఫైజాబాద్‌లో బీజేపీ ఓడిపోవడం అనూహ్యం. ఎన్నికలముందువరకూ బీజేపీ నాయకులు ఎంతోవిశ్వాసంగా కనిపించినప్పటికీ, వివిధ దశల్లో పోలింగ్ నిస్తేజంగా సాగడం, తదనుగుణంగా ప్రధాని మాట మారడం తెలిసినవే. రెండేళ్ళనాటి అసెంబ్లీ ఎన్నికల్లోనే అఖిలేశ్ యాదవ్ పునరుత్థానం ఆరంభమైంది. చిన్నచితకా ఓబీసీపార్టీలనూ, దళిత ఆదివాసీలను తనవైపు తిప్పుకొనే ప్రయత్నాలు చేశాడు. గత ఏడాది ఒక ఉప ఎన్నిక సందర్భంలో ఆయన ప్రయోగించిన పీడీఏ (పిచ్డా–దళిత్–అల్పసంఖ్యాక్) అస్త్రం క్రమంగా బలపడి, అబ్‌కీబార్ పీడీఏ సర్కార్ నినాదం ఇప్పుడు విశేషంగా ప్రభావం చూపిందని ఫలితాలు చెబుతున్నాయి. నినాదంతో సరిపెట్టకుండా టిక్కెట్ల పంపకంలోనూ ఆయన ఆ నీతినీ, సూత్రాన్ని పాటించాడు. అన్‌రిజర్వుడు స్థానాలైన మీరట్, ఫైజాబాద్‌లలో దళితులను నిలబెట్టడం సాహసమే కాదు, వ్యూహాత్మకంగానూ అధిక ప్రభావం చూపింది. రాష్ట్రవ్యాప్తంగా దళితులకు సానుకూల సంకేతాలు పంపడానికి, ఇప్పటికే బాగా బలహీనపడిన బహుజన్ సమాజ్‌పార్టీ నుంచి ఓటర్లను లాక్కోవడానికి ఈ చర్య ఉపకరించింది. పొత్తులు సర్దుబాట్లలో భీం ఆర్మీ నాయకుడు చంద్రశేఖర్ ఆజాద్ కు చోటు దక్కకపోయినా నగీనానుంచి ఆయన ఘనవిజయం సాధించడం అక్కడి దళితరాజకీయాల్లోనూ, కుల సమీకరణాల్లోనూ వస్తున్న మార్పునకు నిదర్శనం. ఇక, ఫైజాబాద్‌లో ఎస్పీ అభ్యర్థి యాభైవేల ఓట్లతో ఘనవిజయం సాధించడంతో పాటు, అయోధ్య డివిజన్‌లో అమేధీ సహా ఐదు పార్లమెంటు సీట్లలోనూ బీజేపీ ఓడిపోయింది. రామమందిరంతో పాటు, కొన్ని కులకూటములతో బీజేపీ విజయతీరాలకు చేరడానికి ప్రయత్నించినప్పటికీ, అఖిలేశ్ పీడీఏ ఎక్కువ ఫలితాలు సాధించింది. సరిగ్గా ఎన్నికల ముందు చౌదరీ చరణ్‌సింగ్‌కు భారతరత్న ఇచ్చి, జయంత్ చౌదరిని బీజేపీ తనవైపు లాక్కున్నప్పటికీ అఖిలేశ్ నిలబడగలిగారు.

'దో లడ్కో కీ జోడీ' అంటూ మోదీ పలుమార్లు అవహేళనగా మాట్లాడినా, అఖిలేశ్–రాహుల్ కలసికట్టుగా సాగుతూ దైనందిన సమస్యలు మాత్రమే లేవనెత్తుతూ యూపీ ఓటర్లను బాగానే ప్రభావితం చేయగలిగారు. ఉద్యోగం, ఉపాధి, అవినీతి, అభివృద్ధి వంటివి ప్రస్తావిస్తూ, బుల్‌డోజర్ రాజకీయాల స్థానంలో బువ్వపెట్టే కార్యక్రమాలు కావాలని చెప్పగలిగారు. ములాయం మరణం తరువాత జరిగిన ఈ తొలి ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించి, 18వ లోక్‌సభలో మూడవ అతిపెద్ద పక్షంగా సమాజ్‌వాదీపార్టీని అఖిలేశ్ నిలబెట్టగలిగారు, మోదీ హవా దిశనూ మార్చగలిగారు.

భద్ర భవిష్యత్తుకు పర్యావరణ భోగట్టా

సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ వారి ప్రత్యేక డేటాసెట్ సిరీస్‌లోని 9వ eBook 'State of India's Environment 2024 : In Figures'. దేశ పర్యావరణ వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లను విశ్లేషించేందుకు పర్యావరణ సంబంధిత సమాచారం లేదా ఆధార సామగ్రికి ప్రథమ ప్రాధాన్యమిచ్చిన వార్షిక నివేదిక ఇది. పర్యావరణ వ్యవస్థల నిర్దిష్ట పరిస్థితిని సంఖ్యల ద్వారా తెలియజేస్తుంది. ఇది చాలా ముఖ్యమైన పర్యావరణ భోగట్టా. సమస్యలను నిశితంగా, సమగ్రంగా అర్థం చేసుకునేందుకు ఉపకరించే సమాచారమిది. సమస్య పరిష్కారానికి దోహదం చేసే కార్యాచరణకు ప్రేరణనిస్తుంది. పర్యావరణ విపత్తులను నివారించడంలో సదరు కార్యాచరణ చాలా కీలకమైనది.



■ సునీతా నారాయణ్

మట్టివాసన

నేను నివసిస్తున్న న్యూఢిల్లీ నగరంలో ఉష్ణోగ్రతలు 50 డిగ్రీల సెంటీగ్రేడ్‌ను మించిపోయిన సందర్భంలో నేను ఇది రాస్తున్నాను. 'కంచు వృషభముల అగ్ని శ్వాసం క్రక్కే గ్రీష్మం'ను న్యూఢిల్లీ వాసులు చవిచూస్తున్నారు. ఇదిలా వుంటే నీటి సంక్షోభం కూడా ముంచుకొస్తున్నట్టు అధికార వర్గాలు హెచ్చరిస్తున్నాయి. ఈ చండ్రగాడ్పులలోనే శ్రమించక తప్పని కూలీ, మాలీ, కార్మికుల తిప్పలు మాటల్లో చెప్పగలమా? వారు ఆ వేడిని భరించక తప్పదు. ఆ శ్రమ జీవుల అవస్థలు అర్థం చేసుకోవాలంటే మారుతోన్న వాతావరణం నుంచి ఉత్పన్నమవుతున్న సంక్షోభాలను అర్థం చేసుకోవాలి. ఈ eBookలోని సమాచారం దీన్నే స్పష్టం చేసింది. భూమి అంతకంతకూ వేడెక్కి పోతోందనడానికి స్పష్టమైన నిదర్శనాలు ఉన్నాయి. భూతాపం మాత్రమే కాదు వాతావరణ వైపరీత్యాలు పేదల, నిరుపేదల వెన్ను విరుస్తున్నాయి. భారత్‌లోని 29 రాష్ట్రాలు, 7 కేంద్ర పాలిత ప్రాంతాలలోని 69 వాతావరణ కేంద్రాలలో 23, గత 122 సంవత్సరాలలో ఎన్నడూ లేని రీతిలో గరిష్ఠ వర్షపాతాన్ని రికార్డు చేశాయి.

సరే, భారత ప్రజలు కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారు. ఈ ప్రజాస్వామ్య సంరంభం ఏ వెలుగులనివ్వగలదో మనకు త్వరలోనే అవగతమవుతుంది. కొత్త –(పాత) ప్రభుత్వ ఎజెండా ఎలా ఉండాలని ఈ పర్యావరణ భోగట్టా మనకు సూచిస్తున్నది? కొత్త ప్రభుత్వ ప్రాథమ్యాలు ఏమైనప్పటికీ ఇది వాతావరణ మార్పు తీవ్రమవుతున్న కాలం అనే వాస్తవాన్ని అర్థం చేసుకుని తీరాలి. ఈ నివేదిక స్పష్టం చేస్తున్న మొదటి పాఠమిది. శీతోష్ణస్థితులు ఆయా ఋతువులకు అనుగుణంగా ఉండడం లేదు. చండ్ర గాడ్పులు, చలిగాడ్పులు, కుండపోత వర్షాలు కాలం కాని కాలంలో మన అనుభవానికి వస్తున్నాయి. ఆర్థికాభివృద్ధి లబ్ధి చాల మందికి ముఖ్యంగా పేదలకు దక్కకుండా చేస్తున్నాయి. వాతావరణ చిక్కుల నుంచి ఉపశమనానికి దోహదం చేసే అభివృద్ధి వ్యూహాల రూపకల్పన అనివార్యమవుతోంది.



నగరాలలో నీటి కొరత, నీటి కాలుష్యం, వాయు కాలుష్యం సమస్యల పరిష్కారం ప్రభుత్వ ప్రాథమ్యాలుగా ఉండాలి. వాటితో పాటు ప్రజా రవాణా వ్యవస్థను పతనస్థితి నుంచి ఉద్ధరించడానికీ అగ్ర ప్రాధాన్యమివ్వాలి. అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో ఈ అంశాలకు ప్రాధాన్యమివ్వాలని 'State of India's Environment 2024 : In Figures' స్పష్టం చేసింది.


నిలకడలేని వాతావరణ పరిస్థితులను తట్టుకునేందుకు ప్రభుత్వం నుంచి లభించగల సమస్త సహాయమూ రైతులకు అందితీరవలసిన అవసరముంది. ఇది ఎవరూ కొట్టివేయలేని వాస్తవం. ఈ సహాయంలో అత్యంత ముఖ్యమైనది పంటల బీమా పథకం. రైతులకు ఈ పథకం అవసరం ఎంతైనా ఉన్నది. అయితే అది సరైన రీతిలో అమలవుతుందా? సమాధానం స్పష్టమే. ఆ పథకంలో తగు మార్పులు చేసి పటిష్ఠంగా అమలుపరచాల్సిన అవసరమున్నది. పంట నష్టాలకు కారణమవుతున్న స్థానిక వాతావరణ పరిస్థితులను సైతం పరిగణనలోకి తీసుకుని పంటల బీమా పథకాన్ని రూపకల్పన చేయాలి.

ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకే కాకుండా కాలుష్యకారక వాయు ఉద్గారాలను నియంత్రించేందుకు సైతం మనం మన విద్యుదుత్పాదన పద్ధతులను మార్చుకోవల్సిన అవసరమున్నది. బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్కేంద్రాల నుంచి వెలువడుతున్న ఉద్గారాలు ప్రజల ఆరోగ్యానికి ఎలాంటి హాని చేస్తున్నాయో మరి చెప్పవలసిన అవసరం లేదు. విద్యుదుత్పాదనకు అధునాతన పద్ధతులను పాటిస్తే భూ తాపం పెరుగుదలకు కారణమవుతున్న హరిత గృహ వాయువుల ఉద్గారాన్ని తగ్గించడం సాధ్యమవుతుంది. ఉష్ణోగ్రతల పెరుగుదలతో ఉక్కపోత నుంచి ఉపశమనానికి మనకు మరింత విద్యుత్ అవసరమవుతుంది కదా. మరి విద్యుదుత్పాదనకు బొగ్గు లాంటి కాలుష్య కారక ఇంధన వనరును ఉపయోగించడం మనకూ, మన ధరిత్రికి మరింత విపత్తును కొని తెచ్చుకోవడమే అవుతుంది. భారత ప్రభుత్వం ఈ సమస్యను గుర్తించింది. అందుకే అది పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తోంది. వేల కోట్ల రూపాయలు అందుకు మదుపు చేస్తోంది. మన విద్యుత్ వినియోగం రెట్టింపు అయినప్పటికీ బొగ్గుపై ఆధారపడకుండా ఉండేందుకే ఆ అధునాతన పద్ధతులను అనుసరిస్తోంది. అయితే థర్మల్ విద్యుత్తే ఇప్పటికీ మన విద్యుత్ అవసరాలలో అధిక భాగాన్ని తీరుస్తుందని ఈ వార్షిక నివేదిక స్పష్టం చేసింది. విద్యుత్ వాహనాల విక్రయాలు అత్యధికంగా ఉంటున్న మాట నిజమే అయినా ఈ వార్షిక నివేదికలోని గణాంకాలను పరిశీలిస్తే ద్విచక్ర, త్రిచక్ర వాహనాల శ్రేణిలోనే విద్యుత్ వాహనాల విక్రయాలు అధికంగా ఉంటున్నాయి. విద్యుత్ వాహనాలు డీజిల్ వాహనాలను ముఖ్యంగా ప్రైవేట్ కార్లు లేదా బస్సులను స్థానభ్రంశం చేయలేదు. ఫలితంగా వాయు కాలుష్యాన్ని నిరోధించేందుకు రవాణా పద్ధతులను పునరావిష్కరించుకోవలిసిన అగత్యమేర్పడింది. ప్రజా రవాణా సంస్థలు నష్టాల్లో కూరుకుపోతున్నాయని ఈ నివేదిక పేర్కొంది. ప్రజా రవాణా రంగాన్ని పర్యావరణ హితకరంగా ఉండేలా తీర్చిదిద్దడానికి మనం కొత్త వ్యూహాలను రూపొందించుకోవలిసిన అవసరమున్నది.

నగరాలలో నీటి కొరత, నీటి కాలుష్యం, వాయు కాలుష్యం సమస్యల పరిష్కారం ప్రభుత్వ ప్రాథమ్యాలుగా ఉండాలి. వాటితో పాటు ప్రజా రవాణా వ్యవస్థను పతనస్థితి నుంచి ఉద్ధరించడానికి కూడా అగ్ర ప్రాధాన్యమివ్వాలి. అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో ఈ అంశాలకు ప్రాధాన్యమివ్వాలని ఈ వార్షిక నివేదిక పేర్కొంది. వాతావరణ మార్పుతో ఉత్పన్నమవుతోన్న సంక్షోభాలను నివారించడం మన ప్రణాళికల లక్ష్యంగా ఉండాలి. నిపుణ పరిష్కారాలు అభివృద్ధికి దోహదం చేస్తాయి. జీవనాధారాలకు తోడ్పడుతాయి. అందరికీ శ్రేయస్సును సమకూరుస్తాయి. మరీ ముఖ్యంగా వాతావరణ మార్పు సమస్యలను అధిగమించేందుకు ఆలంబన అవుతాయి. ఈ పర్యావరణ భోగట్టా మనలను ఈ సమస్యలపై దృష్టి కేంద్రీకరించేలా చేస్తుంది. అంతకంటే ముఖ్యంగా తక్షణమే కార్యాచరణకు దిగవలసిన ఆవశ్యకతను నొక్కి చెబుతుంది. వినూత్న ఆలోచనలతో శీఘ్రగతిన, పెద్ద ఎత్తున కార్యోన్ముఖులం కావాలి.

('సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్' డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు)

మోదీ చెప్పిన గాంధీ చరిత్రలో నిజమెంత?





■ రాహుల్ కుమార్

రాజకీయాలకు గతం బలికావటం అన్నిచోట్లా ఉంది. పరస్పర ఆరోపణలే ప్రధాన రాజకీయ అస్త్రాలుగా మారిన పరిస్థితుల్లో దానికి జరిగే హాని అంతా ఇంతా అని చెప్పలేం. నాలుగు ఓట్లు, నాలుగు సీట్లు అదనంగా రావటానికి గతం గురించి ఏదైనా మాట్లాడవచ్చనే ధోరణి విషమిస్తోంది. ప్రధాని మోదీ ఇటీవల ఎన్నికల ప్రచారంలో భాగంగా గాంధీ సినిమా గురించి మాట్లాడిన తీరే ఇందుకు నిదర్శనం. రిచర్డ్ అటెన్‌బ్రొ దర్శకత్వంలో 1982లో ఆ సినిమా విడుదలైంది. ఆ సినిమాతోనే గాంధీ అంటే ప్రపంచానికి తెలిసిందనీ అంతకు ముందు ఆయనకు రావాల్సిన గుర్తింపు రాలేదనీ మోదీ వ్యాఖ్యానించారు. సినిమా మాధ్యమం చాలా శక్తిమంతమైంది. అందులో ఎవరికీ సందేహం లేదు. చరిత్రను కీలక మలుపుతిప్పిన మహామహుల గురించి గొప్పగా సినిమాలు తీస్తే వాటి ప్రభావం ప్రజలపై ఎంతోకొంత ఉంటుంది. దీనిపైనా ఎవరికీ సందేహం లేదు. అటెన్‌బ్రొ తీసిన గాంధీ సినిమాకు ఎనిమిది ఆస్కార్ అవార్డులు వచ్చాయి. పాశ్చాత్య దేశాల్లో 1980ల నాటి తరానికి గాంధీ గొప్పతనాన్ని చెప్పటానికి ఆ సినిమాను తీశారు. అప్పటికి ఇంగ్లిషులో గాంధీపై అంత సమగ్రమైన సినిమా రాలేదు. దాన్ని చూసిన వారిలో కొందరైనా గాంధీ గురించి మరింత తెలుసుకోటానికి ప్రయత్నించి ఉండొచ్చు. ఆయన ఆదర్శాలను ఆచరించటానికి కొంత కృషి చేసి ఉండొచ్చు. వీటినే మోదీ చెబితే ఎవరికీ అభ్యంతరం ఉండేది కాదు. అటెన్‌బ్రొ సినిమాతోనే ప్రపంచానికి గాంధీ గురించి తెలిసిందని చెప్పటం మాత్రం చరిత్ర పరిశీలనకు నిలబడదు.

మోదీ వ్యాఖ్యల లోతుపాతుల్లోకి వెళ్లేముందు గాంధీ గురించి ఏమన్నారో ఆయన మాటల్లోనే చూద్దాం. "మహాత్మా గాంధీ మహోన్నత వ్యక్తి.. ఆయనకు ప్రపంచ స్థాయి గుర్తింపు తెచ్చే బాధ్యత మనకు లేదా? ఆయన గురించి ఎవరికీ తెలియదు! ఇలా చెబుతున్నందుకు నన్ను క్షమించండి!.. గాంధీ సినిమా వచ్చినప్పుడు మాత్రమే గాంధీ ఎవరు? అని మొదటిసారి ప్రపంచం ఆసక్తిగా చూసింది. గాంధీని ప్రపంచానికి పరిచయం చేయటం మన కర్తవ్యం. కానీ దాన్ని చేయలేకపోయాం. ఈ ప్రపంచానికి మార్టిన్‌లూథర్ కింగ్, నెల్సన్ మండేలా.. అంటే ఎవరో తెలుసు. కానీ గాంధీ వారికంటే ఎందులోనూ తక్కువ కాదు... ప్రపంచమంతా తిరిగిన తర్వాతే దీని గురించి నేను చెబుతున్నాను. గాంధీ ద్వారానే భారత దేశానికి గుర్తింపు వచ్చి ఉండాలి".. కానీ అది రాలేదనీ చెప్పటమే మోదీ ఉద్దేశం. 75 సంవత్సరాల్లో ఆ పని మనం చేయలేదనటంలో పరోక్షంగా కాంగ్రెస్‌పై విమర్శ కూడా ఉంది.

మోదీ అన్నట్టుగానే గాంధీ గురించి ప్రపంచానికి ఏమీ తెలియదా? అన్న ప్రశ్న వేసుకుంటే వచ్చే జవాబు మనల్ని నిర్ఘాంతపరుస్తుంది. నిజానికి మోదీ ప్రస్తావించిన అమెరికా పౌరహక్కుల ఉద్యమనేత మార్టిన్ లూథర్ కింగ్, దక్షిణాఫ్రికాలోని జాత్యహంకార ప్రభుత్వానికి వ్యతిరేకంగా దశాబ్దాల పాటు పోరాటం చేసిన నెల్సన్ మండేలాలకు మహాత్మా గాంధీయే స్ఫూర్తి. గాంధీ సినిమా కంటే చాలా ముందుగానే రాజకీయ పోరాటాలను వారిద్దరూ నడిపారు. అవిశ్రాంతంగా హక్కుల ఉద్యమాన్ని నడిపిన మార్టిన్ లూథర్‌కింగ్ 40 ఏళ్లు నిండకుండానే 1968లో హత్యకు గురయ్యారు. అనేక ఆందోళనల్లో పాల్గొన్న మండేలా 1982 నాటికి జైల్లోనే మగ్గుతున్నారు. సహాయ నిరాకరణ, శాసన ఉల్లంఘన, సమాన హక్కుల ఉద్యమాలను వారిద్దరూ గాంధీ మార్గాన్నే ఎంచుకున్నారు. బలమైన సైనిక, పోలీసు వ్యవస్థలతో పటిష్ఠ ప్రభుత్వాలు ఉన్నచోట ఉద్యమాలు హింసామార్గం తొక్కితే అణచివేతలు, అధికార హత్యాకాండలే చివరికి పైచేయి సాధిస్తాయన్న అవగాహన వారిద్దరికీ ఉంది. అందుకే గాంధీ అహింసామార్గాన్ని ఎత్తుగడగానూ, ఆందోళన మార్గంగానూ స్వీకరించారు.

బ్రిటిషు వలసపాలన నుంచి భారతదేశం విముక్తి కావటం 20వ శతాబ్దంలో జరిగిన కీలక ఘటనల్లో ఒకటి. చాలావరకూ అది శాంతియుతంగా జరిగింది. సాయుధ పోరాటాలు, హింసా ప్రయోగాలు అక్కడక్కడా ఉన్నా ప్రధాన రాజకీయ ఉద్యమం స్వాతంత్ర్యం కోసం హింసామార్గాన్ని స్వీకరించలేదు. గాంధీ దక్షిణాఫ్రికా నుంచి 1915లో భారత్‌కు వచ్చేనాటికి ప్రపంచంలో బ్రిటిషు సామ్రాజ్యానికి తిరుగులేదు. సైనికశక్తిలోనూ అగ్రగామే. మొదటి ప్రపంచ యుద్ధంలో చాలా నష్టపోయినా భారత్‌పై బ్రిటన్ పట్టు సడలలేదు. అహింస ప్రధానమైన వైష్ణవ, జైన సంప్రదాయాల ప్రభావంతో పాటు ఎన్నో వైవిధ్యాలు, అసమానతలు, బహుళ సంస్కృతులతో కూడిన భారత సమాజాన్ని నిశితంగా పరిశీలించటం వల్ల యూరోపులోని హింసామార్గం ఇక్కడ సరిపడదని గాంధీ భావించారు. హింసతో సాధించిన దాన్ని హింసతోనే నిలబెట్టుకోవాల్సిన పరిస్థితి ఉంటుందని గాఢంగా నమ్మారు. చివరికి హింసా యంత్రాగంపై (పోలీసు, సైన్యం) ఆధారపడే ప్రభుత్వ వ్యవస్థలను కాదనే వరకూ వెళ్లారు. హింసను.. మనుషుల పట్లే కాదు.. జంతు ప్రపంచానికీ, ప్రకృతికీ తలపెట్టకూడదనే ఉద్దేశంతో స్వయం సమృద్ధ గ్రామీణ జీవితాన్ని స్వీకరించాలని ప్రబోధించారు. దీన్ని క్రాంగెస్ పార్టీయే స్వీకరించలేదు. అభివృద్ధిలో పాశ్చాత్య దేశాలను అనుకరించటమే కాంగ్రెస్ పార్టీకి ప్రధాన అజెండాగా ఉండేది. దాని సాఫల్య వైఫల్యాల గురించి చెప్పుకొంటే అదొక పెద్ద చరిత్రే అవుతుంది. బహుళత్వ భారత సమాజానికి సరిపోతాయన్న అవగాహనతో సహాయ నిరాకరణ, శాసనోల్లంఘన, సత్యాగ్రహం, హర్తాళ్, ఆమరణ నిరాహారదీక్ష ల్లాంటి ఆందోళనలను గాంధీ ఎంచుకున్నారు. వీటితోనే బ్రిటిషు పాలకులు దిగివచ్చారనే అభిప్రాయం 1950ల నాటికి బాగా బలపడినా 1920ల నుంచే వీటిపై పాశ్చాత్యదేశాల్లో ఆసక్తి పెరిగింది.

ప్రపంచ నాగరికతపై 'ద స్టోరీ ఆఫ్ సివిలైజేషన్' పేరుతో 11 వాల్యూముల ఉద్గ్రంథాన్ని ప్రచురించిన విల్‌డ్యురంట్ 'ద కేస్ ఫర్ ఇండియా' అన్న పుస్తకాన్ని 1930లోనే రాశారు. నాగరికతపై డ్యురంట్ సూత్రీకరణలతో ఎంతైనా విభేదించొచ్చు. కానీ ఆయన రచనా శైలి మనల్ని పరుగులెత్తిస్తుంది. అందుకే ఆయన రాసిన 'ద స్టోరీ ఆఫ్ ఫిలాసఫీ' పుస్తకం లక్షోపలక్షల్లో అమ్ముడుపోయింది. డ్యురంట్ భారత్‌కు వచ్చి గాంధీని కలిసి చర్చలు జరిపారు. 'ద కేస్ ఫర్ ఇండియా'లో ఒక అధ్యాయం మొత్తం గాంధీ పైనే ఉంది. గాంధీ ఆందోళనా పద్ధతుల నుంచి ప్రేరణ పొంది అహింసా సిద్ధాంతంపై 1935లోనే 'ద పవర్ ఆఫ్ నాన్‌వయలన్స్' పుస్తకాన్ని అమెరికా న్యాయవాది రిచర్డ్ గ్రెగ్ రాశారు. 1950, 60ల్లో అమెరికాలో జరిగిన ఆందోళనలకు ప్రేరణను ఆ పుస్తకమే అందించింది. నల్ల జాతీయుల హక్కుల కోసం పోరాడిన ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త డబ్ల్యూ.ఇ.బి.డ్యూబ్వా కూడా గాంధీ రచనలను ప్రచురించారు. డ్యూబ్వా సిద్ధాంతాల ప్రభావం ఒకప్పుడు అమెరికాలో బాగా ఉండేది. అమెరికా చరిత్రలో పౌర హక్కుల ఉద్యమం చాలా కీలకమైంది. అక్కడి సమాజాన్ని మానవీకరించిన పోరాటమది. అందులో పాల్గొన్న వారిలో చాలా మంది గాంధీ నుంచి ప్రేరణ పొందారు. ఇక ఆఫ్రికాలోని వలసపాలన వ్యతిరేక పోరాటాల్లో కూడా గాంధీ సిద్ధాంతాలను మార్గదర్శకంగా స్వీకరించినవారు చాలా మంది ఉన్నారు. 1945లో మాంచెస్టర్‌లో జరిగిన అయిదో అఖిల ఆఫ్రికా కాంగ్రెస్ సమావేశం గాంధీ ఆందోళనా పద్ధతులను స్వీకరిస్తున్నట్టు ప్రకటించింది. జర్మనీలో గ్రీన్‌పీస్ పార్టీ ఏర్పాటుకు కూడా గాంధీ సిద్ధాంతాలే చాలా వరకూ ప్రేరణ. ప్రపంచ వ్యాప్తంగా 60, 70ల్లో జరిగిన శాంతిస్థాపన పోరాటాల్లో పాల్గొన్న పలువురికి స్ఫూర్తిని ఇచ్చింది గాంధేయ వాదమే. పర్యావరణ ఉద్యమాల్లో పాల్గొన్న చాలా మంది ఇదే దారిలో నడిచారు. ఇన్ని రకాల ఆందోళనల నేపథ్యంలో అటెన్‌బ్రొ గాంధీ సినిమా తీశారు. 20వ శతాబ్ద చరిత్రను స్థూలంగా చదివినా గాంధీ సినిమా కంటే ముందు ప్రపంచానికి గాంధీ గురించి తెలిసింది చాలా ఎక్కువన్నది అర్థం అవుతుంది. ప్రముఖ చరిత్రకారుడు డేవిడ్ హార్డీమన్.. 'గాంధీ ఇన్ హీజ్ టైమ్ అండ్ అవర్స్' అన్న పుస్తకంలో ప్రపంచ వ్యాప్తంగా గాంధీ ప్రభావం గురించి విపులంగా వివరించారు. 1924లోనే రోమైన్ రోలండ్.. గాంధీ జీవితాన్ని, సిద్ధాంతాలను స్పృశిస్తూ రాసిన పుస్తకం చాలా ప్రాచుర్యం పొందింది. అప్పటికే రోలండ్ నోబెల్ బహుమతిని పొందారు.

ఎవరెవరో గాంధీ గురించి రాయటం మాట అటుంచి గాంధీ సొంత రచనలే చాలా ఎక్కువ. వ్యాసాలు, పుస్తకాలు, జాబులు–జవాబులు వరకూ గాంధీ పుంఖాను పుంఖంగా రాశారు. స్వయంగా పత్రికలు నడిపారు. తన సిద్ధాంతాలపైన విమర్శలనూ విస్తృతంగా అందులో ప్రచురించారు. క్రియాశీల రాజకీయాల్లో పాల్గొంటూ విస్తృతంగా రచనలు చేసినవారు అరుదుగా ఉంటారు. గాంధీ దీనికి భిన్నం. మరణించే నాటికే ఆయన రచనలు చాలా ప్రాచుర్యం పొందాయి. దండి ఉప్పు సత్యాగ్రహం సందర్భంగా ప్రసారమాధ్యమాలను ఆకర్షించటానికి గాంధీ రచించిన ప్రణాళిక అప్పట్లోనే సంచలనం. దానికి లభించిన ప్రచారం అనూహ్యం. ఆ తర్వాతే ప్రఖ్యాత టైం మ్యాగజీన్ 1930 సంవత్సరానికి గాంధీని 'మ్యాన్ ఆఫ్ ద ఇయర్'గా ప్రకటించింది.

గాంధీ హిందూ మతాన్ని వ్యతిరేకించలేదు. కుల వ్యవస్థను ఈసడించుకోలేదు. పాశ్చాత్య రాజకీయ సిద్ధాంతాలను ఉన్నతమైనవిగా భావించలేదు. మతపరమైన పరిభాషను వదల్లేదు. భగవద్గీతను కాంతి దీపంగా పరిగణించటం మానలేదు. మైనారిటీల కోసం గొంతెత్తటం ఆపలేదు. వర్గపోరాటాలను అక్కున చేర్చుకోలేదు. స్త్రీపురుష సంబంధాలపై అందరికీ ఆమోదమయ్యే ప్రతిపాదనలు చేయలేదు. భిన్న సిద్ధాంతాల నుంచి చూస్తే ఇవన్నీ పరిమితులుగానే కనపడతాయి. కానీ సావర్కర్ ప్రబోధించిన హిందూత్వను సమర్థించలేదు. హిందూ ఆధిపత్యాన్ని అంగీకరించలేదు. ముస్లింలను శత్రువులుగా చూడటానికి నిరాకరించారు. ముస్లింపాలకులను సంస్కృతీ విధ్వంసకులుగా వర్ణించలేదు. హిందూ మతంలోని చెడును బహిరంగంగానే వ్యతిరేకించారు. తీవ్ర హిందూత్వ రాజకీయాలతో ప్రభావితమైనవారు చాలా కాలం గాంధీని ద్వేషించారు. ప్రపంచ ప్రజాస్వామ్య ఉద్యమాల్లో, సిద్ధాంతాల్లో గాంధీ ప్రభావాన్ని చూడటానికి సుముఖత చూపించలేదు. గాంధీ గురించి 1980లకు ముందు ప్రపంచానికి తెలియదనటానికి ఇదీ ఒక కారణం కావొచ్చు! అపరిమిత అభివృద్ధి పేరుతో ప్రకృతిని వికృతపరుస్తూ విధ్వంసాన్ని కొనసాగిస్తున్నంత కాలం.. కోర్కెలకు కళ్లెం వేయటాన్ని సర్వోత్కృష్ట విలువగా భావించిన గాంధీ మన భావావరణంలో ఏదో విధంగా మసలుతూనే ఉంటారు!

(ఆంధ్రజ్యోతి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్)

> **తీవ్ర హిందూత్వ రాజకీయాలతో ప్రభావితమైనవారు చాలా కాలం గాంధీని ద్వేషించారు. ప్రపంచ ప్రజాస్వామ్య ఉద్యమాల్లో, సిద్ధాంతాల్లో గాంధీ ప్రభావాన్ని చూడటానికి సుముఖత చూపించలేదు. గాంధీ గురించి 1980లకు ముందు ప్రపంచానికి తెలియదనటానికి ఇదీ ఒక కారణం కావొచ్చు! అపరిమిత అభివృద్ధి పేరుతో ప్రకృతిని వికృతపరుస్తూ విధ్వంసాన్ని కొనసాగిస్తున్నంత కాలం.. కోర్కెలకు కళ్లెం వేయటాన్ని సర్వోత్కృష్ట విలువగా భావించిన గాంధీ మన భావావరణంలో ఏదో విధంగా మసలుతూనే ఉంటారు!**

కులమతాలకు అతీతంగా ఓటు

శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు, రాయలసీమ సమస్తం కూటమికి పెద్ద ఎత్తున విజయాన్ని కట్టబెట్టింది. ఇది కుల మతాలకు, ధనానికి అతీతంగా వరించిన విజయం. సహజంగా రాయలసీమలో రెడ్లు ఉంటారు కాబట్టి అది జగన్మోహన్‌రెడ్డికి కంచుకోట అంటారు. గుంటూరు, కృష్ణా కమ్మవారు ఎక్కువ ఉంటారు కాబట్టి అది బాబు ఆస్థానం అంటారు. అలాగే ఉభయగోదావరి జిల్లాల్లో కాపుల హవా ఎక్కువ అంటారు. అయితే ప్రస్తుత ఎన్నికల్లో ఏకపక్షంగా కూటమికి భారీ మెజారిటీతో ప్రజలు అధికారం కట్టబెట్టారు. చివరికి జగన్‌కి ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా చేశారు. కొందరు రాజకీయ నాయకులలో, కొందరు కుహనా మేధావులలో, టీవీలు –యూట్యూబ్‌లలో రాజకీయ చర్చలు చేసే కొందరిలో కుల మత వర్గ భావజాలం, ధన భావజాలం ఉంది. వారి భావజాలాన్ని ప్రజల మీద రుద్దాలని ప్రయత్నిస్తుంటారు. అందుకే వారి సర్వేలన్నీ తప్పులతడికలవుతుంటాయి.

చంద్రబాబు నాయుడు పోటీ చేసి గెలిచిన కుప్పంలో ఎంతమంది కమ్మవారున్నారని ఆయన గెలిచారు? లోకేష్ పోటీ చేసి గెలిచిన మంగళగిరిలో కమ్మవారు ఎంతమంది ఉన్నారని ఆయన గెలిచారు? ప్రజలు ఓటు వేసే క్షణంలో కుల మతాలను చూడరు. గత పరిపాలకుల వల్ల తాము నష్టపోయిందేమిటి, ఇబ్బంది పడింది ఏమిటన్నది చూస్తారు. రోజుకు రెండు వందలే సంపాదన ఉన్నవారు అన్న క్యాంటీన్‌లో భోజనం చేసి, భార్యకి, బిడ్డకు భోజనం తీసుకువెళ్ళేవారు. అలాంటి వారికి అన్న క్యాంటీన్లు దూరమైనప్పుడు వారు ఎవరికి ఓటు వెయ్యాలి? వ్యక్తిగత కక్షల వల్ల అర్హులైనవారికి కూడా వృద్ధాప్యపు పింఛన్లు, అమ్మ ఒడి వంటివాటిని దూరం చేసినప్పుడు వారు ఎవరికి ఓటు వెయ్యాలి? ఇక్కడ జనం కుల మతాలను చూడరు. కులమతాలను భూతద్దంలో చూపించి, మేం అన్ని కులాల వారికి సహాయం చేస్తున్నామని పదిమందికి సహాయం చేసి, పదివేల లెక్క రాసుకుని, ఇదే ఓట్ల రాజకీయం అంటే నమ్మడానికి సిద్ధంగా లేరు. జనం ఆకలితో ఉన్న ఏ కులస్థుడినైనా ఆదుకోవడానికి, తమకు చేతనైనంత సహాయం చేస్తారు. కొందరు రాజకీయ నాయకులు తన పక్కన వాడు ఆకలితో అల్లాడుతున్నా, వాడు మా కులం వాడు కాదు.. మా పార్టీ వాడు కాదు అంటున్నారు. ఇలాంటి వారి దగ్గరే కుల మత వైషమ్యాలు ఉన్నాయి కానీ ప్రజల దగ్గర లేవు. ఈ సత్యాన్ని గ్రహించకుండా ఓటు కొంటామని అహంకరిస్తే ఎలక్షన్ల ఫలితాలు ఎవరి సర్వేలకు అందకుండానే ఉంటాయి.

– వి.యల్. రాఘవరావు, విశాఖపట్నం

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్ రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

ఆంధ్ర ఎన్నికలలో అమెరికా ఎన్నారైలు

ఊహించని రీతిలో విజయ దుందుభి మోగించిన టీడీపీ కూటమిలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్‌ల పాత్ర గురించి అన్ని చానల్స్, పత్రికలు, పోర్టల్స్ చెబుతూనే ఉన్నాయి. 'ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా ఉంచటమే మన ఎజెండా' అంటూ దాదాపు రోజుకు కోటి రూపాయలపైన వచ్చే ఆదాయం, లక్షలాది అభిమానులను తెచ్చి పెట్టే సినిమా వృత్తిని పక్కన పెట్టి ముందుకు వచ్చిన పవన్ కళ్యాణ్ గురించి; బయట నుంచి, పార్టీ లోపల నుంచి ఎన్ని రకాల ఒత్తిళ్లు వచ్చినా తట్టుకొని, కూటమి ఫార్ములా, మేనిఫెస్టో తయారు చేసి 74 ఏళ్ల వయసులో 45 డిగ్రీల ఎండలో తిరిగిన చంద్రబాబు గురించి; మంగళగిరిలో ఉంటూ ఒక పక్క తన నియోజకవర్గంలో ప్రచారం నిర్వహిస్తూ, ఇంకో పక్క టీడీపీ హెడ్ క్వార్టర్స్ నుంచి రాష్ట్రమంతటా అభ్యర్థులకు కావలసిన సహాయ సహకారాలు, సలహా సూచనలు ఇచ్చిన లోకేష్ గురించి రాష్ట్రంలోని, దేశంలోని మీడియా చెప్పేసింది. ఇప్పుడు చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనుండడమే కాక, కేంద్రంలోని పాలక ఎన్డీయేని సమన్వయపరిచే బాధ్యతలు కూడా తీసుకోబోతున్నారు అన్న విషయం తెలుగు వారికి గర్వకారణం అవుతుంది కదా!

ఇది ప్రజల విజయం అని స్వయంగా చంద్రబాబు ప్రకటించారు. ఆ కాంప్లిమెంట్ రాష్ట్ర ప్రజలందరికి వర్తిస్తుంది. అయితే ఈ సారి ఎన్నికల్లో విదేశాలనుంచి ఎన్ఆర్ఐలు క్రియాశీలక పాత్ర పోషించారని మీడియా ప్రతి రోజు చెప్తూనే వుంది.

అమెరికాలోని ఆంధ్రులలో ఇటీవలి సంవత్సరాలుగా పెరిగిన రాజకీయ చైతన్యం, అమెరికా నుంచి ఎన్నికల్లో అభ్యర్థిగా ముందుకొచ్చిన ఎన్ఆర్ఐల వివరాలు, గత కొద్ది నెలలుగా ఆంధ్ర రాష్ట్రంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వ్యక్తుల వివరాలు పరిశీలిస్తే 'ఇది ఎన్నారైల విజయం' అని చెప్పాలి.

పోటీ చేసి – గెలిచిన ఎన్నారైల అభ్యర్థుల వివరాలను సంగ్రహంగా చూద్దాం.

1) డాక్టర్ పెమ్మసాని చంద్ర శేఖర్ – గుంటూరు జిల్లా బుర్రిపాలెం (హీరో కృష్ణ స్వగ్రామం కూడా) గ్రామస్థుడు. ఒక మధ్య తరగతి కుటుంబం నుంచి అమెరికా వచ్చి స్వశక్తితో తన వ్యాపార సామ్రాజ్యాన్ని పెంచుకొంటూ మిలియనీర్ నుంచి బిలియనీర్‌గాఎదిగిన కృషీవలుడు డా. చంద్ర పెమ్మసాని, రాష్ట్రానికి సేవ చేయాలనే ఆలోచనతో టీడీపీలో చేరి గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. దాదాపు 8,65,000 ఓట్లతో (60 శాతం) 3,45,000 ఓట్ల మెజారిటీతో తిరుగులేని విజయం సాధించారు. కేంద్రంలో కొలువుదీరనున్న కొత్త మంత్రివర్గంలో టీడీపీ తరఫున మంత్రి అయినా కూడా ఆశ్చర్యపోనక్కర లేదు. మన డా. చంద్ర పెమ్మసాని కేంద్ర మంత్రి అవుతారని ఆశిద్దాం.

2. రాము వెనిగళ్ల – గుడివాడలో పుట్టి, అమెరికా వెళ్లి కొన్ని సంవత్సరాలు ఐటీ రంగంలో ఉద్యోగం చేసి, అట్లాంటా పట్టణంలో ఎఫిసెన్స్ అనే ఐటీ కంపెనీ ద్వారా వ్యాపార రంగంలోకి ప్రవేశించి మంచి పేరు తెచ్చుకొన్న రాము వెనిగళ్ల కూడా తాను పుట్టిన గుడివాడకు, స్వరాష్ట్రానికి సేవ చేద్దామనే ఉద్దేశంతో రాజకీయాల్లోకి 2023లో వచ్చారు. ఎన్నికలు రావటానికి దాదాపు రెండేళ్ళు ముందుగానే టీడీపీ నాయకత్వాన్ని కలిసి గుడివాడ నుంచి పోటీ చేస్తానని చెప్పారు. దాదాపు 4 టర్మ్స్ నుంచి ఎమ్మెల్యేగా వున్న కొడాలి నానికి పోటీగా రాము వెనిగళ్ల సరైన వ్యక్తి అని చంద్రబాబు కూడా సరే అనడంతో రాము గుడివాడ నియోజక వర్గంలో తన పని మొదలుపెట్టారు. గుడివాడ గడ్డ – నాని అడ్డా అనే చోట కొడాలి నాని మీద 54,000 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. రాబోయే రోజులలో అమరావతి నిర్మాణంలో రాము వెనిగళ్ల కీలక పాత్ర పోషిస్తారని, గుడివాడను అభివృద్ధి చేస్తారని ఆశిద్దాం.

3) సురేష్ కాకర్ల : అమెరికాలో నార్త్ కరోలినా రాష్ట్రానికి చెందిన సురేష్ కాకర్ల అనేక సంవత్సరాలుగా తానా సంస్థ, కాకర్ల చారిటబుల్ సంస్థ తరఫున అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ అందరికీ సుపరిచితులు. ఇప్పుడు జరిగిన చరిత్రాత్మక ఎన్నికల్లో నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గం నుంచి టీడీపీ తరఫున పోటీ చేసి 1,01,000 పైగా ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు.

1996లోనే అట్లాంటా నుంచి గడ్డం ఆత్మచరణ్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ తరఫున నిజామాబాద్ నుంచి ఎంపీగా పోటీ చేసి గెలవడాన్ని, ఆ తర్వాత న్యూయార్క్ నివాసి మధు యాష్కీ కాంగ్రెస్ పార్టీ తరఫున నిజామాబాద్ నుంచి 2004లో, 2009లో పోటీ చేసి విజయం సాధించిన విషయం ఈ సందర్భంగా గుర్తు చేసుకుందాం. 2009 ఎన్నికల సమయం నుంచి అనేక మంది ఎన్ఆర్ఐలు ఎన్నికల్లో పోటీ చేయడానికి ఉత్సాహపడుతూ ముందుకు రావడం, వారికి ప్రధాన పార్టీల నుంచి సీట్ లేకపోవడం జరుగుతూ వచ్చింది.

> **ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలలోను, రాష్ట్రం నుంచి లోక్‌సభకు పోటీ చేసిన అమెరికా ప్రవాసాంధ్రులు భారీ మెజారిటీతో విజయం సాధించారు. అమెరికా నుంచి దాదాపు 200 మంది ప్రవాసాంధ్రులు స్వరాష్ట్రానికి వెళ్లి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్టు తెలుస్తోంది.**



అమెరికాలో ఎన్ఆర్ఐ టీడీపీ గురించి కూడా చెప్పుకోవాలి. 2007లో చంద్రబాబు అమెరికా వచ్చి 10 నగరాలలో పర్యటించినప్పుడు కాలిఫోర్నియాలోని జయరాం కోమటిని ఎన్ఆర్ఐ టీడీపీకి ఇంచార్జిగా నియమించారు. జయరాం కోమటి ఆధ్వర్యంలో టీడీపీ శ్రేయోభిలాషులు, చంద్రబాబు అభిమానులు దగ్గరవడం జరుగుతూ వస్తోంది. 2014లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా టీడీపీ అధికార పార్టీగా రావడంతో ఎన్ఆర్ఐ టీడీపీ కార్యక్రమాలు కూడా బాగా పెరిగాయి. అదే సమయంలో APNRT సంస్థ ఏర్పడటం, మరో ముఖ్య ఎన్నారై డా. రవి వేమూరి APNRTకి ఇంచార్జిగా రావడంతో అమెరికాలో ఎన్ఆర్ఐ టీడీపీ అనేక కార్యక్రమాలు నిర్వహించడంతో ప్రతి నగరంలో సభ్యులు విస్తృతంగా పెరగడం ఆటోమేటిక్‌గా జరిగాయి.


2019లో వైఎస్సార్సీపీ అధికారంలోకి వచ్చాక కొంతకాలం కొంచెం స్తబ్దత ఏర్పడినా మళ్లీ కోవిడ్ సంక్షోభం తరువాత 2022 నుంచి ఎన్నారై టీడీపీని ఉత్తేజపరిచే బాధ్యతను జయరాం కోమటికి అప్పచెప్పారు. ఆయన అమెరికాలోని టీడీపీ అభిమానుల వివరాలు సేకరించారు. టీడీపీ నాయకత్వం కూడా ఈ సారి ఎన్నికల్లో ఎన్ఆర్ఐ అభ్యర్థులకు వారి సమర్థతను బట్టి, ఎంచుకొన్న నియోజకవర్గాన్ని బట్టి సీట్ ఇస్తాము అని హామీ ఇవ్వడంతో చాలామంది ముందుకు వచ్చారు. ఆంధ్ర రాష్ట్రంలో కడప జిల్లా రాజంపేట నియోజక వర్గం నుంచి అమెరికా వచ్చిన సతీష్ వేమనకి కూడా పోటీ చేయాలనే కోరిక బలంగా వుంది. అయితే చంద్రబాబు ఆయన్ని తెలుగుదేశం కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమించారు. ఈ బాధ్యతల నిర్వహణలో భాగంగా సతీష్ వేమన అనేక నియోజకవర్గాలు తిరిగి పార్టీ అభ్యర్థులను కలిసి వారి గెలుపునకు కృషి చేశారు.

NATS సంస్థ పూర్వ అధ్యక్షులు మన్నవ మోహన కృష్ణ గుంటూర్ తూర్పు నియోజకవర్గం నుంచి, గొంప కృష్ణ శృంగవరపుకోట నుంచి, పైలా ప్రసాదరావు మాడుగుల నుంచి పోటీ చేయడానికి తమ తమ నియోజకవర్గాల్లోకి వెళ్లి పనులు, ప్రచారాలు కూడా చేసుకున్నారు. అయితే అనేక కారణాల వలన, స్థానిక సమీకరణల వలన అందరికీ టికెట్ దక్కలేదు. అయితే పార్టీ అభ్యర్థిత్వాన్ని దక్కించుకున్న ఎన్నారైలు విజయపతాక ఎగురవేశారు. అమెరికా నుంచి దాదాపు 200 మంది ఆంధ్రులు స్వరాష్ట్రానికి వెళ్లి ఈ ఎన్నికలలో ప్రచార బాధ్యతలు నిర్వహించినట్టు తెలుస్తోంది.

■ చెన్నూరి వెంకట సుబ్బారావు

(వ్యాసకర్త అమెరికాలోని 'తెలుగు టైమ్స్' ఎడిటర్)

ఎన్నికలు ముగిశాయి.. ఫలితాలూ వచ్చాయి.. రెండు జిల్లాలనూ టీడీపీ కూటమి క్లీన్‌స్వీప్ చేసేసింది.. ఇక ఇప్పుడు అందరి చర్చ మంత్రివర్గ కూర్పుపైనే. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ఎవరికి మంత్రి పదవి దక్కుతుందనే గుసగుసలు ఇప్పటికే మొదలవ్వగా, ఆశావహుల లిస్ట్ కూడా భారీగానే పెరిగిపోతోంది. ఈనెల 12న చంద్రబాబు సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో ఎవరికి మంత్రి పదవి వరిస్తుందనే సందిగ్ధం ఏర్పడింది.



కూటమి కొలువులో మంత్రులెవరు?

మంత్రివర్గ కూర్పుపై రెండు జిల్లాల్లో చర్చ

- సీనియారిటీ రేసులో గద్దె రామ్మోహన్‌కు అందే అవకాశం
- వైశ్య సామాజికవర్గం నుంచి శ్రీరాం తాతయ్య
- బీసీ కోటాలో కొల్లు రవీంద్ర.. కాపు కోటాలో బొండా ఉమా
- రేసులో గుడివాడ, గన్నవరం గేమ్ చేంజర్స్ రాము, యార్లగడ్డ
- బీజేపీ కోటాలో సుజనా పేరు, జనసేన నుంచి బుద్ధప్రసాద్


పెరుగుతున్న ఆశావహుల సంఖ్య


(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : ఈనెల 12న సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇక చంద్రబాబు కేబినెట్‌లో మంత్రులుగా ఎవరు ఉండబోతున్నారనే చర్చ ప్రస్తుతం రెండు జిల్లాల్లో జోరుగా సాగుతోంది. రెండు జిల్లాలనూ కూటమి అభ్యర్థులు క్లీన్‌స్వీప్ చేయడంతో ఈసారి ఆశావహుల జాబితా చాలా పెద్దగానే ఉంది. ఇక్కడి నుంచి బీజేపీ, జనసేన నుంచి హేమాహేమీలు ఉన్నారు. విజయవాడ పశ్చిమ నుంచి బీజేపీ అభ్యర్థిగా గెలుపొందిన సుజనా చౌదరి ఆ పార్టీ కోటాలో మంత్రి పదవి దక్కించుకోవచ్చని చెబుతున్నారు. అయితే, ఉమ్మడి కృష్ణాను ప్రాతిపదికన తీసుకుంటే ఆయనకు మరో బీజేపీ నేత కామినేని శ్రీనివాస్ నుంచి పోటీ ఎదురయ్యే అవకాశం ఉంది. కృష్ణాజిల్లా నుంచి జనసేన తరఫున గెలుపొందిన మండలి బుద్ధప్రసాద్‌కు ఆ పార్టీ కోటాలో మంత్రి పదవి దక్కవచ్చని ఆయన అనుచరులు అంచనా వేస్తున్నారు.

టీడీపీ జాబితా పెద్దదే..

రెండు జిల్లాల నుంచి టీడీపీ నుంచి మంత్రి పదవులు ఆశిస్తున్న వారి సంఖ్య చాలా పెద్దదే. వైశ్య సామాజికవర్గం నుంచి రాష్ట్రంలో ఇద్దరే గెలుపొందారు. వీరిలో సీనియారిటీపరంగా జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ముందు వరుసలో ఉంటారు. మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆయన పార్టీకి విధేయుడిగా గుర్తింపు పొందారు. ఈ ఎన్నికల్లో వైశ్య సామాజికవర్గాన్ని టీడీపీ వైపు మళ్లించడంలో ఆయన కృషి చాలానే ఉంది. దీంతో ఆయనకు మంత్రి పదవి దక్కవచ్చని ఆయన అనుచరులు భావిస్తున్నారు. బీసీ సామాజికవర్గం నుంచి మాజీ మంత్రి, మచిలీపట్నం నుంచి గెలుపొందిన కొల్లు రవీంద్ర రేసులో ఉన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లాను పరిగణనలోకి తీసుకునే పక్షంలో నూజివీడు నుంచి గెలుపొందిన కొలుసు పార్థసారథి ఆయనకు పోటీగా నిలిచే అవకాశం ఉంది. కాపు సామాజికవర్గం నుంచి విజయవాడ సెంట్రల్ నుంచి గెలుపొందిన బొండా ఉమా రేసులో ఉన్నారు. కమ్మ సామాజికవర్గం నుంచి విజయవాడ తూర్పు ఎమ్మెల్యేగా గెలుపొందిన గద్దె రామ్మోహన్, గుడివాడ, గన్నవరం నుంచి వెనిగండ్ల రాము, యార్లగడ్డ వెంకట్రావు రేసులో ఉన్నారు. సీనియారిటీని పరిగణనలోకి తీసుకుంటే ఒకసారి ఎంపీ, మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన గద్దె రామ్మోహన్‌కు అవకాశాలు ఉన్నాయి. అదే సమయంలో కొడాలి నాని, వల్లభనేని వంశీ వంటి వారికి ఎదురొడ్డి, వారి అరాచకాలను ధైర్యంగా ఎదుర్కొని, టీడీపీ నాయకులు, కార్యకర్తల్లో ధైర్యాన్ని నింపిన వెనిగండ్ల రాము, యార్లగడ్డ వెంకట్రావు పేర్లు సైతం మంత్రి పదవుల రేసులో వినిపిస్తున్నాయి.

అసంపూర్తిగా నిలిచిన బుడమేరుపై వంతెన (ఇన్‌సెట్‌లో) పాడైపోతున్న నిర్మాణ సామగ్రి





వంతెన.. ఇంతేనా..?

- ఉంగుటూరు వద్ద బుడమేరుపై పూర్తికాని బ్రిడ్జి నిర్మాణం
- బిల్లులు చెల్లించకపోవడంతో అసంపూర్తిగానే..

ఉంగుటూరు, జూన్ 6 : తేలప్రోలు-ఉయ్యూరు ప్రధాన రహదారిపై ఉంగుటూరు వద్ద బుడమేరుపై చేపట్టిన నూతన బ్రిడ్జి నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోయింది. పాలకుల నిర్లక్ష్యం, పూర్తిచేసిన పనులకు బిల్లులు చెల్లించడంలో జాప్యం కారణంగా నిర్మాణ పనులను నిలుపుదల చేశారు. పాతవంతెనల స్థానంలో నూతన బ్రిడ్జి నిర్మాణానికి 2018లో అప్పటి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శంకుస్థాపన చేశారు. రూ.24 కోట్ల సీఆర్ఎఫ్ నిధులతో 270 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పు, 9 మీటర్ల ఎత్తులో ఉంగుటూరు-లంకపల్లి గ్రామాల మధ్య ఈ వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అనంతరం ఏర్పడ్డ రాజకీయ పరిణామాలు, నిధుల మంజూరులో జాప్యం, కరోనా విపత్కర పరిస్థితుల కారణంగా పనులు ప్రారంభం కాలేదు. 2022లో సుమారు రూ.6 కోట్లు వెచ్చించి పునాదులు, పిల్లర్ల నిర్మాణం పూర్తిచేశారు. ఆ తర్వాత బిల్లులు రాకపోవడంతో పనులు నిలుపుదల చేశారు.

దుర్గగుడి ధర్మకర్తల మండలి రాజీనామా ఎప్పుడు?

- ఇంకా పాత పాలకమండలే..!
- సభ్యులది ఒక తీరు... చైర్మన్‌ది మరో తీరు..
- రాజీనామాకు చైర్మన్ ససేమిరా..

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : టీడీపీ కూటమి గెలవగానే గత ప్రభుత్వంలో సలహాదారులుగా ఉన్న వారు, కార్పొరేషన్లకు చైర్మన్లుగా ఉన్నవారు వరుసగా రాజీనామాలు చేస్తున్నారు. శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి తీరు మాత్రం భిన్నంగా ఉంది. సాధారణంగా ఈ కార్పొరేషన్ల చైర్మన్లు, ధర్మకర్తల మండలి పాలకవర్గాల పదవులకు నిర్దిష్ట సమయం ఉంటుంది. ప్రభుత్వంలో అధికార మార్పిడి జరగగానే నైతికంగా రాజీనామాలు చేస్తారు. దుర్గగుడి ధర్మకర్తల మండలి మాత్రం రాజీనామా చేయడానికి వెనుకడుగు వేస్తున్నట్టు తెలుస్తోంది. కర్నాటి రాంబాబు చైర్మన్‌గా, మరో 15 మంది సభ్యులతో ధర్మకర్తల మండలి ఏర్పడింది. మాజీమంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు కనుసన్నల్లో ఇది జరిగింది. వైసీపీ నియమించిన నామినేటెడ్ పదవుల్లో ఉన్నవారంతా రాజీనామాలు చేయాలని పార్టీ నుంచి ఇప్పటికే మౌఖిక ఆదేశాలు వచ్చినట్టు తెలుస్తోంది. అయినా దుర్గగుడి ధర్మకర్తల మండలి చైర్మన్‌తో పాటు సభ్యులు రాజీనామా చేసే విషయంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. కొంతమంది వెలంపల్లి శ్రీనివాసరావు చెప్తే రాజీనామాలు చేస్తామని, మరికొంతమంది తమకు ఇంకా పదవీకాలం ఉందంటున్నారు.

అవినీతికి అలవాటు పడే..

ధర్మకర్తల మండలిలో ఉన్న కొంతమందికి ముడుపులు భారీగానే అందుతున్నాయి. ఆలయంలోని పలు విభాగాల నుంచి నెలవారీ మామూళ్లు అందుకుంటున్నారు. దర్శనాల విషయంలోనూ ఆదాయాన్ని రుచిమరిగారు. ఈ కారణంగానే రాజీనామా చేయడానికి వెనుకడుగు వేస్తున్నారని తెలుస్తోంది. అయితే, సభ్యులు కొంతమంది పదవులకు రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నారు. ఇదే విషయాన్ని వారు చైర్మన్‌కు కూడా చెప్పారు. ఆయన మాత్రం తాను మాత్రం రాజీనామా చేయబోనని స్పష్టం చేసినట్టు సమాచారం. తనకు అవకాశం ఇచ్చింది వెలంపల్లి కాబట్టి ఆయన చెప్తేనే రాజీనామా చేస్తానని వ్యాఖ్యానించినట్టు తెలిసింది. మరికొంతమంది మాత్రం తమకు రెండేళ్ల వరకు పదవీకాలం ఉందని, అది పూర్తయ్యే వరకు కొనసాగుదామన్న ఆలోచనలో ఉన్నారు. అవసరమైతే ఈ విషయంలో న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని చూస్తున్నారు.



మీ పార్టీలోకొస్తాం..

- ఐదేళ్లూ గుడివాడలో అరాచకం.. ప్రస్తుతం జంపింగ్‌కు సన్నద్ధం
- టీడీపీలోకి రానీయకపోతే జనసేన లేదా బీజేపీలోకి..
- పార్టీ మారకపోతే కాంట్రాక్టులకు బిల్లులు రావనే భయం
- వైసీపీ సర్పంచులూ పార్టీ మారే యోచన

టీడీపీ నేతల టచ్‌లోకి వైసీపీ ద్వితీయ శ్రేణి నాయకత్వం


వైసీపీ ద్వితీయ శ్రేణి నాయకుల్లో భయం మొదలైంది. గత ఐదేళ్లలో చేసిన అక్రమాలు, అరాచకాల నుంచి తప్పించుకునేందుకు పార్టీ మారే యోచనలో ఉన్నారు. వచ్చే ఎన్నికల వరకూ వైసీపీ ఉంటుందో లేదోనని ఆందోళన కూడా వారిని వెంటాడుతోంది. తాము చేసిన కాంట్రాక్టులకు బిల్లులు రావనే ఆందోళన కూడా పార్టీ మారడానికి కారణమవుతోంది. గుడివాడ పట్టణ, మండల నాయకులు కొందరు తమ ప్రయత్నాలను ఉధృతం చేశారు. అక్కడ కాదంటే బీజేపీ, జనసేనలోకి వెళ్లేందుకు సిద్ధపడుతున్నారు.

- 6లో..

నోటా మాటలేదు


జిల్లాలో ఒక్క శాతం కూడా దాటని నోటా

- విజయవాడ పార్లమెంట్ పరిధిలో 0.67 శాతం
- అసెంబ్లీ నియోజకవర్గాలకైతే 0.56 శాతమే
- వంద ఓట్లు కూడా పొందలేని అభ్యర్థులు 45 మంది



కూటమి సునామీ దెబ్బకు నోటా మాట లేకుండాపోయింది. రెండు జిల్లాల మొత్తం ఓట్లలో ఒక్క శాతం కూడా నోటాకు పడకపోవడమే ఇందుకు నిదర్శనం. మొత్తంగా టీడీపీ కూటమికే పట్టం కట్టిన ఓటర్లు నోటావైపు కన్నెత్తి కూడా చూడలేదు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : టీడీపీ కూటమి గెలుపులో 'నోటా' చిన్నబోయింది. ఎన్టీఆర్ జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో నోటాకు మొత్తంగా 7,719 ఓట్లు వచ్చాయి. జిల్లావ్యాప్తంగా 13,65,284 ఓట్లు పోలయ్యాయి. దీనిప్రకారం నోటాకు వచ్చింది 0.56 శాతమే. మైలవరం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొత్తం 2,40,965 ఓట్లు పడగా, నోటాకు 1,598 ఓట్లు పడ్డాయి. ఇది మొత్తం ఓట్లలో 0.66 శాతమే. ఆ తర్వాత విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో నోటాకు 1,236 ఓట్లు పడ్డాయి. ఇక్కడ మొత్తం 1,70,112 ఓట్లు పోలవగా, అందులో నోటాకు పడ్డవి 0.72 శాతమే. తిరువూరు నియోజకవర్గంలో నోటాకు 1,184 ఓట్లు పడ్డాయి. మొత్తం 1,81,669 ఓట్లు పోలవ్వగా, ఇందులో 0.65 శాతమే నోటాకు పడ్డాయి. తూర్పు నియోజకవర్గంలో మొత్తంగా 1,93,031 ఓట్లు పడగా, నోటాకు 1,049 ఓట్లు వచ్చాయి. మొత్తం ఓట్లలో ఇది 0.54 శాతమే. విజయవాడ పశ్చిమలో నోటాకు 951 ఓట్లు పడ్డాయి. మొత్తం 2,02,662 ఓట్లు పడగా, అందులో నోటాకు పడ్డవి 0.46 శాతం. నందిగామ నియోజకవర్గంలో నోటాకు 928 ఓట్లు పడ్డాయి. ఇక్కడ మొత్తం 1,79,914 ఓట్లు పోలవ్వగా, ఇందులో నోటాకు పడ్డవి 0.51 శాతం. జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలో మొత్తం 1,84,611 ఓట్లు పోలవ్వగా, ఇందులో 773 ఓట్లు అంటే.. 0.40 శాతం నోటాకు పడ్డాయి.



విజయవాడ పార్లమెంట్ పరిధిలో ఇలా..

విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మొత్తంగా 13,65,284 ఓట్లు పోలవ్వగా, నోటాకు 9,193 ఓట్లు పడ్డాయి. మొత్తం ఓట్లలో ఇది 0.67 శాతమే. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా చూస్తే.. తిరువూరులో 1,371, విజయవాడ పశ్చిమలో 1,146, విజయవాడ సెంట్రల్‌లో 1,336, విజయవాడ తూర్పులో 1,261, మైలవరం నియోజకవర్గంలో 1,684, నందిగామ నియోజకవర్గంలో 1,029, జగ్గయ్యపేట నియోజకవవర్గంలో 1,211 ఓట్లు నోటాకు పడ్డాయి. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి పడిన 17,757 ఓట్లలో నోటా ఖాతాలోనివి 155.

అయ్యో.. వంద ఓట్లు కూడా రాలేదు..!

కూటమి సునామీ దెబ్బకు ఉమ్మడి కృష్ణాజిల్లాలో డిపాజిట్ల సంగతి దేవుడెరుగు బరిలో నిలిచిన అభ్యర్థులు వంద ఓట్లను కూడా సాధించలేకపోయారు. ఎన్టీఆర్ జిల్లాలోని విజయవాడ పార్లమెంట్ పరిధిలో 17 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా చూస్తే.. తిరువూరులో 12 మంది, విజయవాడ పశ్చిమలో 15 మంది, విజయవాడ సెంట్రల్‌లో 20 మంది, విజయవాడ తూర్పులో 15 మంది, మైలవరంలో 12 మంది, నందిగామలో 9 మంది, జగ్గయ్యపేటలో 13 మంది అభ్యర్థులు ఉన్నారు. వీరందరిలో 37 మంది అభ్యర్థులు కనీసం 100 ఓట్లు కూడా సాధించలేదు. కృష్ణాజిల్లాలో 8 మంది అభ్యర్థులు 100 ఓట్లు కూడా పొందలేకపోయారు.

ఎన్నికలకో నియోజకవర్గం.. దక్కని ఫలితం!

ఆయన సొంత నియోజకవర్గం మైలవరం. అక్కడ పోటీ చేసి గెలిచేంత సత్తా ఆయనకు లేదు. ఆ విషయం 2014లో నియోజకవర్గ ప్రజలు కూడా తేల్చారు. అప్పటి నుంచి ఆయన ఎన్నికలకో నియోజకవర్గం మారుతూ పబ్బం గడుపుకొనే ప్రయత్నం చేస్తుంటారు. ఆయనే పెనమలూరు నుంచి వైసీపీ అభ్యర్థిగా బరిలోకి దిగి ఘోర పరాజయం పాలైన మంత్రి జోగి రమేశ్. నియోజకవర్గ చరిత్రలోనే అత్యంత ఘోర ఓటమి చవిచూసిన ఘనత జోగి రమేశ్‌దే. టీడీపీ అభ్యర్థి బోడె ప్రసాద్ చేతిలో 59,915 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు.



పెనమలూరులో చెల్లని జోగి జిమ్మిక్కులు

- వచ్చీరాగానే దందాలతో హల్‌చల్
- ఘోరంగా అవమానించిన నియోజకవర్గ ప్రజలు
- కృష్ణాజిల్లాలోనే అత్యధిక ఓట్ల తేడాతో జోగి ఓటమి

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : యువజన కాంగ్రెస్ నాయకుడిగా జోగి రమేశ్ రాజకీయ జీవితం ప్రారంభమైంది. 2009లో సొంత నియోజకవర్గమైన మైలవరం టికెట్ ఆశించారు. అయితే వైఎస్సార్ ఆశీస్సులతో చివరికి పెడన నియోజకవర్గ టికెట్ సాధించగలిగారు. కాంగ్రెస్ హవాలో ఆయన అక్కడి నుంచి గెలుపొందారు. ఆ తర్వాత 2014లో సొంత నియోజకవర్గంలో అదృష్టం పరీక్షించుకుందామనుకుంటే అక్కడి ప్రజలు ఛీ కొట్టారు. దీంతో 2019కి మళ్లీ పెడనకే వెళ్లారు. వైసీపీ గాలిలో గెలిచి మంత్రి కూడా అయ్యారు. పెడనలో 2019 నుంచి 2024 వరకు ఈయన చేసిన అరాచకాలతో అక్కడా గెలవలేడని నిర్ణయించుకున్న వైసీపీ అధిష్ఠానం ఆయనకు పెనమలూరు టికెట్ కేటాయించింది. పెనమలూరుకు రావడం రావడమే ఈయన అరాచకాలు మొదలుపెట్టారు. ఓవైపు పెడన, మరోవైపు మైలవరం నియోజకవర్గాలతో పాటు పెనమలూరు నియోజకవర్గంలోనూ టార్గెట్లు పెట్టి మరీ కలెక్షన్లు మొదలుపెట్టారు. పెనమలూరు చెంతనే కృష్ణానది ప్రవహిస్తుంటుంది. అక్కడి నుంచి ఇసుక తోలకానికి నెలవారీ టార్గెట్లు పెట్టి వసూళ్లు చేశారు. అనధికార కట్టడాలు.. లే అవుట్లు.. ఇలా కాదేదీ కలెక్షన్లకు అనర్హం అన్న రీతిలో ఈయన చేసిన దోపిడీతో పెనమలూరు వాసులు బెంబేలెత్తిపోయారు.

చంద్రబాబు ఇంటిపై దాడి ఘటనా మైనస్ అయింది

మాజీ సీఎం చంద్రబాబు నివసిస్తున్న ఉండవల్లి కరకట్ట ఇంటిపై 2021 సెప్టెంబరు 17న జోగి రమేశ్ ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు దాడికి యత్నించారు. ఈ దాడిలో జోగి రమేశ్, ఆయన అనుచరులే కీలకంగా వ్యవహరించారు. జోగి అనుచరులైన పాలడుగు దుర్గాప్రసాద్, నల్లమోతు జాన్ (జోగి రమేశ్ తమ్ముడు రాము అనుచరుడు), మధుపల్లి ఆనంద్‌కుమార్, మేడపాటి నాగిరెడ్డి, ఆరేపల్లి రాము, నల్లమోతు మధు తదితరులతోపాటు జోగి తమ్ముడు రాము కూడా చంద్రబాబు ఇంటిపై దాడిలో ఉన్నారు. ఈ దాడి తర్వాతే జోగిని మంత్రి పదవి వరించింది. కానీ ఈ ఘటనతో ప్రజల్లో జోగి రమేశ్‌పై తీవ్ర వ్యతిరేకత వచ్చింది. పెనమలూరు నియోజకవర్గం అసలే టీడీపీకి అనుకూల నియోజకవర్గం అలాంటి నియోజకవర్గంలో ఈ ఘటన ఇంకా ఎక్కువ ప్రభావం చూపింది. జోగి ఘోర పరాజయానికీ ప్రధాన కారణంగా నిలిచింది.

ఓటుతో అవమానించి వెళ్లగొట్టారు

పెనమలూరు నియోజకవర్గంలో మొత్తం 22 రౌండ్లలో ఓట్లు లెక్కించారు. తొలి రౌండులో జోగి రమేశ్‌కు 275 ఓట్ల ఆధిక్యం లభించింది. దీంతో టీడీపీ శ్రేణుల్లో కాస్త ఉత్కంఠ నెలకొంది. అయితే రెండో రౌండ్ నుంచి ఏకపక్షంగా సాగిన ఓట్ల లెక్కింపు టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. రెండో రౌండు నుంచి ప్రతి రౌండులోనూ బోడె ప్రసాద్‌కు ఓట్ల వర్షం కురిసింది. కొన్ని రౌండ్లలో టీడీపీ అభ్యర్థికి వచ్చిన ఓట్లలో సగం కూడా జోగి రమేశ్‌కు రాకపోవడం గమనార్హం. ప్రతి రౌండులోనూ జోగి రమేశ్‌పై ఓటర్లలో గూడుకట్టుకున్న కసి కనిపించింది. దాని ఫలితమే 59,915 ఓట్ల మెజారిటీతో బోడె ప్రసాద్ గెలుపు. ఇది పెనమలూరు నియోజకవర్గ చరిత్రలోనే రికార్డు. బోడె ప్రసాద్‌కు నియోజకవర్గ ప్రజల్లో 61.28 శాతం ఓటర్లు మద్దతు పలకగా, జోగి రమేశ్‌కు 35.93 శాతం మందే ఓటు వేశారు.

సొంత పార్టీ కార్యకర్తల్లోనే అపనమ్మకం

జోగి రమేశ్‌ను పెనమలూరు నియోజకవర్గంలో వైసీపీ కార్యకర్తలే విశ్వసించలేదు. కేవలం కొందరు నాయకులు తమ పబ్బం గడుపుకొనేందుకు జోగి పంచన చేరారే తప్ప చాలామంది ఆయనకు దూరంగా ఉండిపోయారు. పెడన నియోజకవర్గంలో సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలకు పదవులు.. పనులు చేయాలన్నా వారి నుంచీ కమీషన్లు గుంజడంతో జోగి రమేశ్‌ను పెనమలూరులో సొంత పార్టీ నాయకులే నమ్మలేదు.

కూటమి ప్రభంజనంతో మొక్కులు చెల్లించుకున్న పార్టీ శ్రేణులు



జమలాపురం ఆలయం వద్ద కూటమి అభిమానులు, నేతలు

పెద్దాపురం టు జమలాపురం పాదయాత్ర

వీరులపాడు, జూన్ 6 : రాష్ట్రంలో కూటమి ప్రభంజనం సృష్టించడంతో పాటు విజయవాడ ఎంపీగా కేశినేని శివనాథ్ (చిన్ని), నందిగామ ఎమ్మెల్యేగా తంగిరాల సౌమ్యలు గెలుపొందడంతో పెద్దాపురం గ్రామం నుంచి సుమారు వెయ్యి మంది నేతలు, కార్యకర్తలు నిమ్మల రాజేంద్ర ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం ఎర్రుపాలెం మండలం జమలాపురం పుణ్య క్షేత్రం వరకు గురువారం పెద్ద ఎత్తున పాదయాత్రగా వెళ్లి స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

శ్రీవారి మొక్కు చెల్లించుకున్న తెలుగుయువత నేత



ఉంగుటూరు, జూన్ 6 : రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి అధికారంలోకి వస్తే నడచి వచ్చి శ్రీవారిని దర్శించుకుంటానని మొక్కుకున్న గన్నవరం నియోజకవర్గ తెలుగు యువత కార్యదర్శి, తేలప్రోలు గ్రామవాసి గులిపల్లి సందీప్ గురువారం తన మొక్కు తీర్చుకున్నాడు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రావాలని, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని, గన్నవరంలో యార్లగడ్డ వెంకట్రావు అఖండ మెజారిటీతో గెలవాలని తిరుమల ఏడుకొండల వెంకన్న స్వామికి సందీప్ మొక్కుకున్నాడు. శ్రీవారి కృపాకటాక్షాలతో టీడీపీ కూటమి భారీ మెజారిటీతో గెలుపొంది రికార్డు సృష్టించిందన్నారు. స్వామికి కృతజ్ఞతగా తాను మెట్లమార్గంలో కుటుంబసమేతంగా నడిచివెళ్లి శ్రీవారి మొక్కు చెల్లించుకున్నట్టు తెలిపారు.



తిరుమలగిరిలో వేంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద మహిళలతో తాతయ్య

తిరుమలగిరికి కాలినడకన..

జగ్గయ్యపేట : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడితే కాలినడకన వచ్చి దర్శనం చేసుకుంటామని జగ్గయ్యపేట టీడీపీ ఎమ్మెల్యేగా ఎన్నికైన శ్రీరాం తాతయ్య సతీమణి శ్రీదేవి తిరుమలగిరి వెంకటేశ్వరస్వామికి చేసుకున్న మొక్కులను గురువారం తీర్చుకున్నారు. పట్టణంలో స్వయంభూ విఘ్నేశ్వరస్వామి దేవస్థానం వద్ద శ్రీదేవి, నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ సభ్యుడు శ్రీరాం చినబాబు సతీమణి శ్రీవల్లీ, తాతయ్య కుమారుడు కిట్టు, రాష్ట్ర తెలుగునాడు అంగన్వావాడీ, డ్వాక్రా సాధికారసమితి అధ్యక్షురాలు ఆచంట సునీత, నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు కన్నెబోయిన రామలక్ష్మీ, మహిళ నేతలు, కౌన్సిలర్లు, కుటుంబసభ్యులు తదితరులతో కలిసి పూజలు నిర్వహించి కాలినడక ప్రారంభించారు. స్వామివారి పాదాల వద్ద పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళలు, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

13న దుర్గగుడికి పాదయాత్ర

- టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేదరమెట్ల నాగేశ్వరరావు

వన్‌టౌన్, జూన్ 6 : కూటమి అభ్యర్థులకు ఏపీ ప్రజలు చరిత్రాత్మక విజయాన్ని చేకూర్చిన సందర్భంగా మొక్కు తీర్చుకునేందుకు తెలంగాణలోని మణుగూరు నుంచి విజయవాడ ఇంద్రకీలాద్రికి పాదయాత్ర చేయనున్నట్టు టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేదరమెట్ల నాగేశ్వరరావు చెప్పారు. గురువారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన చేస్తూ ఈ నెల 13వ తేదీన మణుగూరు పట్టణంలోని హనుమాన్ దేవాలయం నుంచి తన పాదయాత్ర ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడం ఎంతో ఆనందాన్నిచ్చిందని చెప్పారు. మేదరమెట్ల నాగేశ్వరరావు చంద్రబాబునాయుడుకు వీరభిమానిగా తెలుగుదేశం అనుబంధ సంస్థ టీఎన్‌టీయూసీకి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

ఢిల్లీకి కేశినేని శివనాథ్..



విద్యాధరపురం, జూన్ 6 : విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) శుక్రవారం ఢిల్లీలో జరగబోయే ఎన్డీఏ సమావేశంలో పాల్గొనడానికి బయలుదేరి వెళ్లారు. అంతకముందు చంద్రబాబునాయుడు ఉండవల్లిలోని ఆయన నివాసంలో అందుబాటులో ఉన్న ఎంపీలతో సమావేశం కాగా.. చిన్ని పాల్గొన్నారు. మిగిలిన ఎంపీలు జూమ్ కాల్ ద్వారా చంద్రబాబుతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీలుగా గెలిచిన వారందరికీ చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలిచ్చిన తీర్పుతో ఎవరూ ఆకాశంలో విహరించవద్దని విజయాన్ని సమాజ సేవకు వినియోగించాలని హితబోధ చేశారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేశ్‌ను కేశినేని శివనాథ్ ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ తిరువూరు టీడీపీ నేత శావల దేవదత్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. లోకేశ్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

చంద్రబాబును కలిసిన వసంత



జి.కొండూరు : టీడీపీ జాతీయ అధ్యక్షుడు, కాబోయే సీఎం చంద్రబాబు నాయుడ్ని ఉండవల్లిలోని ఆయన నివాసంలో మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ఆయన తనయుడు ధీమంత్ సాయిలు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం, దుశ్శాలువాతో చంద్రబాబును ఘనంగా సత్కరించారు. మంచి మెజార్టీతో మైలవరం సీటును చంద్రబాబుకు కానుకగా ఇచ్చినందుకు వసంతను బాబు అభినందించారు.



పెనమలూరు సెంటర్లో ఏర్పాటు చేసిన లోకేశ్ రెడ్‌బుక్ ఫ్లెక్సీ

లోకేశ్ రెడ్ బుక్ పేరుతో ఫ్లెక్సీ..

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభంజనం సృష్టించిన నారా లోకేశ్ యువగళం సందర్భంగా.. తప్పు చేసిన రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారుల పేర్లను ప్రత్యేకంగా రెడ్ బుక్‌లో నమోదు చేసి టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామంటూ లోకేశ్ పలు బహిరంగ సభల్లో ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పెనమలూరుకు చెందిన టీడీపీ నాయకులు లోకేశ్ రెడ్‌బుక్ పేరుతో పెనమలూరు సెంటర్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ చర్చనీయాంశమైంది.

- పెనమలూరు

16న యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలు

- హాజరుకానున్న 11,112 మంది అభ్యర్థులు
- అధికారుల వీసీలో కలెక్టర్ ఢిల్లీరావు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్ (యూపీఎస్సీ) నేతృత్వంలో సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలు జూన్ 16వ తేదీన విజయవాడ నగరంలో జరగనున్నాయి. రాష్ట్రంలో విశాఖపట్నం, అనంతపురం తిరుపతి, విజయవాడలో ఈ పరీక్షలు జరుగుతున్నాయి. విజయవాడ నగరంలో 25 కేంద్రాలలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. మొత్తం 11,112 మంది అభ్యర్థులు పరీక్షలను రాయనున్నారు. జూన్ 16వ తేదీన ఉదయం 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పేపర్-2 పరీక్షలు జరగనున్నాయి. పరీక్ష నిర్వహణకు సంబంధించి యూపీఎస్సీ అధికారులు గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్టీఆర్ కలెక్టర్ ఢిల్లీరావు పాల్గొని ఇక్కడి ఏర్పాట్లను వివరించారు. పరీక్షలను విజయవంతంగా నిర్వహించనున్నట్టు కలెక్టర్ యూపీఎస్సీ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

చంద్రబాబు, లోకేశ్‌లను కలిసిన బుద్దా వెంకన్న



వన్‌టౌన్ : టీడీపీ జాతీయ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎన్నికైన చంద్రబాబునాయుడు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేశ్‌లను గురువారం పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న మర్యాదపూర్వకంగా కలిశారు. ఇరువురికి దుశ్శాలువాలు కప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

కేశినేని శివనాథ్‌ను కలిసిన వసంత..



విద్యాధరపురం, జూన్ 6 : విజయవాడ ఎంపీగా గెలిచిన కేశినేని శివనాథ్(చిన్ని)ను కలిసేందుకు వచ్చిన జనసందోహంతో గురువారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్ కిట కిట లాడింది. అభిమానులు, కార్యకర్తలు, నాయకులతో సందడి నెలకొంది. ఉదయం నుంచి రాత్రి వరకు ఎక్కడా బ్రేక్ లేకుండా శివనాథ్‌కు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ సందర్భంగా పార్టీ గెలుపుకోసం పని చేసిన ప్రతి ఒక్కరికి శివనాథ్ కృతజ్ఞతలు తెలిపారు. అభిమానులు, కార్యకర్తలు, నాయకులతో ఫొటోలు దిగారు

ఎన్నికల నిర్వహణలో అధికారుల కృషి భేష్

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



కలెక్టర్ ఢిల్లీరావును సత్కరిస్తున్న సర్వోదయ ట్రస్టు ప్రతినిధులు

కృష్ణలంక, జూన్ 6 : ఎన్టీఆర్ జిల్లాలో సాధారణ ఎన్నికలు-2024 ప్రక్రియ సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంలో సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యావాదలు తెలియజేస్తున్నట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు గురువారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, అసిస్టెంట్ కలెక్టర్ శుభం నోఖ్వాల్ తదితరులతో సమావేశమయ్యారు. సీఈఓ కార్యాలయానికి వివిధ ఫారాలతో అందించాల్సిన నివేదికలపై సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ, మే 13న పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియతో పాటు వీటి సన్నద్ధతా కార్యకలాపాల్లో రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్, ఇతర అధికారులు, సిబ్బంది ఎంతో అంకితభావం, నిబద్ధతతో వ్యవహరిస్తూ విధులు నిర్వర్తించారని ఆయన తెలిపారు. అదేవిధంగా ఎన్నికల నిర్వహణలో పాల్గొన్న జిల్లా ఎన్నికల పరిశీలకులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సమర్థవంతంగా విధులు నిర్వర్తించిన జిల్లా పోలీస్ అధికారులను, సిబ్బందిని ఆయన అభినందించారు.

పోలింగ్, ఓట్ల లెక్కింపు కార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో ప్రజాస్వామ్య స్ఫూర్తితో నిర్వహించడంలో సహకరించిన రాజకీయ పక్షాల ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా రూపకల్పన దగ్గరి నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ప్రతి దశలో ఆయా అధికారులు, సిబ్బంది తమ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించారని కలెక్టర్ కొనియాడారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియతో పాటు ఈసీఐ నూతనంగా ప్రవేశపెట్టిన హోం ఓటింగ్ ప్రక్రియలో భాగస్వాములైన బృందాలకు అభినందనలు తెలియజేశారు. ఎన్నికల ప్రక్రియలో అన్ని విధాల సహకరించిన జిల్లా ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు. రెవెన్యూ అధికారులు, సిబ్బంది, జిల్లా అధికారులు, వివిధ విభాగాల నోడల్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు, స్క్వాడ్‌లు, సెక్టార్ అధికారులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, డ్రైవర్లు, పారిశుధ్య సిబ్బంది, జిల్లా స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు అన్ని శాఖల అధికారులు, ఇతర ఎన్నికల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు తదితరులకు జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

కలెక్టర్‌ను సత్కరించిన సర్వోదయ ట్రస్ట్ :

అత్యంత పారదర్శకతతో జవాబుదారీతనంతో ప్రజాస్వామ్య స్ఫూర్తితో విజయవంతంగా ఎన్నికల ప్రక్రియను నిర్వహించిన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.ఢిల్లీరావును సర్వోదయ ట్రస్టు ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఓటర్ల జాబితా రూపకల్పన దగ్గరి నుంచి ఫలితాల వెల్లడి వరకు ప్రతి దశలోను కలెక్టర్ ఢిల్లీరావు ప్రశంసాపూర్వక విధులు నిర్వహించినట్టు ఈ సందర్భంగా సర్వోదయ ట్రస్టు సీనియర్ సిటిజన్స్ ఫోరం ప్రతినిధులు మోత్కూరి వెంకటేశ్వరరావు, వేమూరి బాబురావు పేర్కొన్నారు. సమావేశంలో రిటర్నింగ్ అధికారులు బీహెచ్ భవానీశంకర్, ఎ.రవీంద్రరావు, కె.మాధవి, జి.వెంకటేశ్వర్లు, ఇ.కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

గుడివాడలో మార్పు మొదలైంది

- మున్సిపల్ పార్కుకు నాని పేరు తొలగింపు
- చెత్త సేకరణ పాయింట్ గోడల కూల్చివేత
- ఎత్తిపోతల పథకం పేరు మార్పు.. స్థానికుల ప్రతీకారం..

గుడివాడ, జూన్ 6 : గత వైసీపీ పాలనలో జరిగిన విధ్వంసానికి స్థానిక ప్రజలే తగిన సమాధానం చెబుతున్నారు. ఎక్కడికక్కడ గత పాలకుల నామరూపాలు లేకుండా మార్చేస్తున్నారు. పార్టీలకతీతంగా కొడాలి నానికి రిటర్న్ గిఫ్టులను యిస్తున్నారు.

● గుడివాడ రాజేంద్రనగర్‌లోని పార్కుకు వైసీపీ ప్రజాప్రతినిధి కొడాలి నాని తన పేరు పెట్టుకున్నాడు. 20ఏళ్లుగా గుడివాడ అభివృద్ధి పట్టని వ్యక్తి పేరు అక్కడ ఉండటాన్ని వ్యతిరేకిస్తూ స్థానికులు పార్కు ముఖద్వారానికి ఉన్న నాని పేరును తొలగించారు.



కొడాలి నాని పేరు తొలగించిన పార్కు





ధ్వంసం చేసిన చెత్త సేకరణ పాయింట్ గోడలు

● స్థానిక మెయిన్ రోడ్డులోని తుమ్మల రాంబ్రహ్మం పార్కులో ఆర్యవైశ్య కళ్యాణమండపానికి ఆనుకుని రాజకీయ కక్ష సాధింపులో భాగంగా కొడాలి నాని చెత్త సేకరణ పాయింట్‌ను పెట్టించారు. ఎన్నికల సమయంలో దానిని మూసివేస్తున్నట్టు నటించి అడ్డుగోడ కట్టించారు. పార్టీలకతీతంగా ప్రజలు స్వచ్ఛందంగా సదరు సేకరణ పాయింట్ రెండు వైపుల గోడలను ధ్వంసం చేసి తమ అభిప్రాయాన్ని తెలిపారు.

● నందివాడ మండలం అరిపిరాల వద్ద రూ.9కోట్ల వ్యయంతో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించింది. దానికి ఎన్టీఆర్ ఎత్తిపోతల పథకంగా నామకరణం చేశారు. వైసీపీ అధికారంలోకి రాగానే కొడాలి నాని ఎన్టీఆర్ పేరును తొలగించి వైఎస్సార్ పేరుతో తిరిగి ప్రారంభోత్సవం చేశారు. కూటమి అధికారంలోకి రావడంతో స్థానిక రైతులు మూకుమ్మడిగా వైఎస్సార్ పేరును తొలగించి, నాని వేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు.

నేనే దుర్గగుడి చైర్మన్!

- మాజీ రౌడీషీటర్ హల్‌చల్
- కాంట్రాక్టర్లు, ఉద్యోగులకు బెదిరింపులు

వన్‌టౌన్, జూన్ 6 : దుర్గగుడి ధర్మకర్తల మండలికి కాబోయే చైర్మన్‌ను తానేనంటూ ఓ మాజీ రౌడీషీటర్ హల్‌చల్ చేస్తున్నాడు. ఎన్నికల సమయంలో వైసీపీ నుంచి జనసేనలోకి వచ్చిన ఆయన ఇప్పుడు దుర్గగుడి చైర్మన్ పోస్టుపై కన్నేశాడు. ఇంకా ప్రభుత్వం ప్రమాణస్వీకారం చేయకుండానే పదవులను ప్రకటించేసుకున్నాడు. సూరత్ పట్టుచీరల ముక్కలు విక్రయంలో పలు కేసుల్లోను, ఓ హత్య కేసులో నిందితుడిగా ఉన్నాడు. దుర్గగుడిలో పలువురు కాంట్రాక్టర్లు, ఉద్యోగులను బెదిరిస్తున్నట్టు చెబుతున్నారు. భవానీపురానికి చెందిన ఈ మాజీ రౌడీ షీటర్ ఎన్నికలకు రెండు నెలల ముందు వైసీపీ నుంచి జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నాడు. ఎన్నికల్లో తాను పశ్చిమ నియోజకవర్గం నుంచి జనసేన పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్టు కొన్ని రోజులు హడావుడి చేశాడు. తీరా పశ్చిమ నియోజకవర్గం పొత్తులో బీజేపీకి సీటు రావడంతో కొన్ని రోజులు కనిపించకుండా పోయాడు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ తెరపైకి వచ్చిన ఈ మాజీ రౌడీషీటర్ తానే పశ్చిమ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిని గెలిపించినట్టు బీరాలు పలుకుతూ ప్రచారం చేస్తున్నాడు. మూడురోజుల నుంచి తాను దుర్గగుడికి కాబోయే చైర్మన్‌నంటూ ప్రచారం చేస్తూ తనకు గిట్టని పలువురు దుర్గగుడిలోని కాంట్రాక్టర్‌లను బెదిరిస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాను చైర్మన్ అయిన తరువాత ఆ కాంట్రాక్టర్లందరిని గుడి నుంచి పంపించేస్తానంటూ బెదిరింపులకు గురిచేస్తున్నట్టు పలువురు కాంట్రాక్టర్‌లు, ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. తనకు అనుకూలంగా ఉన్న బీజేపీకి చెందిన వ్యక్తిని దుర్గగుడి ధర్మకర్తగా నియమించినట్టు ప్రచారం చేస్తున్నాడు. ఆ వ్యక్తికి దుర్గగుడిలోని లోటుపాట్లు మొత్తం తెలుసునని, అతడి ద్వారా దుర్గగుడిలో ఏ విభాగాలలో ఎక్కడెక్కడ అవినీతి జరుగుతుందో తెలుసుకుని ఆ ఉద్యోగులందరిపై చర్యలు తీసుకుంటామని చెప్పడం దేవస్థానంలో చర్చనీయాంశమైంది. ఆ జనసేన పార్టీ నాయకుడు చిట్టినగర్ కేఎల్ రావు నగర్‌లో జరిగిన ఓ వ్యక్తి హత్య కేసులో నిందితుడు. ఇతడిపై భవానీపురం, విద్యాధరపురంలో భూ కబ్జా చేసినట్టు కూడా కేసులున్నాయి. రెండు నెలల ముందు పార్టీలోకి వచ్చి తానే పెద్ద నాయకుడినంటూ ప్రచారం చేసుకుంటున్న ఆ మాజీ రౌడీ షీటర్‌పై జనసేనలోనే పలువురు సీనియర్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనప్పటికీ అతగాడు చేస్తున్న హడావుడి అంతా ఇంతా కాదని జనసేన నాయకులు బహిరంగంగా విమర్శిస్తున్నారు.

దారితప్పిన పాలనను గాడిలో పెట్టాలి

కూటమికి హైకోర్టు ఉద్యోగుల సంఘం అభినందన

అమరావతి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి ఏపీ హైకోర్టు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అక్కెన వేణుగోపాలరావు అభినందనలు తెలిపారు. కొత్తగా కొలువుదీరే ప్రభుత్వం రాష్ట్రంలో దారితప్పిన పాలనను గాడిలో పెట్టేందుకు కృషి చేయాలని కోరారు. కొత్త పీఆర్సీని సాధ్యమైనంత త్వరగా అమలు చేయాలని కోరారు.

నేటి నుంచి ఇగ్నో పరీక్షలు

వన్‌టౌన్, జూన్ 6 : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విద్యాలయం(ఇగ్నో)లో ఈ నెల 7వ తేదీ నుంచి 2024 టెర్మ్ ఎండ్ పరీక్షలు జరుగుతాయని విజయవాడ ఇగ్నో ప్రాంతీయ కేంద్రం సీనియర్ రీజనల్ డైరక్టర్ డీఆర్ శర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాంతీయ కేంద్ర పరిధిలో విజయవాడ, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, కర్నూలు, అనంతపురాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. హాల్‌టికెట్లు ఇప్పటికే వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని తెలిపారు. ఇగ్నో వెబ్‌సైట్ ద్వారా అభ్యర్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. ప్రాక్టికల్స్‌కు సంబంధించి అభ్యర్థులు తమ తమ అధ్యయన కేంద్రాల్లో థీయరీ పరీక్షల అనంతరం సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాల కోసం కొత్తపేట హిందూహైస్కూల్‌లోని ఇగ్నో ప్రాంతీయ కేంద్రంను స్వయంగా సందర్శించడం కానీ లేదా 0866-2565253 నెంబర్‌కు ఫోన్ చేసి కానీ తెలుసుకోవచ్చన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న బైక్

- ఇంజనీరింగ్ విద్యార్థి దుర్మరణం



జగ్గయ్యపేట, జూన్ 6 : జగ్గయ్యపేటలో ఇంజనీరింగ్ చదువుతున్న ప్రకాశం జిల్లా విద్యార్థి చిల్లకల్లు వద్ద బైక్‌పై వెళుతూ డివైడర్‌ను ఢీకొని దుర్మరణం చెందిన సంఘటన బుధవారం రాత్రి జరిగింది. ప్రకాశం జిల్లా వెంగాయ పాలేనికి చెందిన రాములపల్లి శ్రీనివాస్ (20) జగ్గయ్యపేటలో మండవ ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఇ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం రాత్రి ఇదే కళాశాలలో చదువుతున్న తెలంగాణా రాష్ట్రం సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన డే స్కాలర్‌గా చదువుతున్న సలీం బైక్ పై టిఫిన్ చేసి వస్తామని వెళ్లారు. రాత్రి భోజనం వేళకు రాకపోవడంతో శ్రీనివాస్ మిత్రులు, హాస్టల్ మేట్స్ అతడికి ఫోన్ చేశారు. జగ్గయ్యపేట నుంచి చిల్లకల్లు రోడ్డులో ఎంపీడీవో కార్యాలయం సమీపంలో డివైడర్‌ను ఢీకొని రక్తపు మడుగులో పడి ఉన్న శ్రీనివాస్ ఫోన్ రింగ్ కావటంతో స్థానికులు ప్రమాద విషయాన్ని చెప్పారు. హుటాహుటిన వారు బైక్ పైనే శ్రీనివాస్‌ను జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్టు వైద్యులు ధృవీకరించారు. సలీంకు కాలు ఫ్రాక్చర్ అయినట్టు తెలిసింది. మృతదేహానికి చిల్లకల్లు ఎస్సై సతీష్ గురువారం పోస్ట్‌మార్టమ్ అనంతరం బంధువులకు అప్పగించారు. వ్యవసాయ కూలీ అయిన వెంకటేశ్వర్లుకు ఒక్కగానొక్క కొడుకు శ్రీనివాస్. ఎంతో ఇబ్బంది పడి కొడుకును చదివిస్తున్నామని, మంచి ఉద్యోగంతో ఆదుకుంటాడనుకున్న కొడుకు దుర్మరణం చెందటంపై కన్నీటి పర్యంతమయ్యారు. కళాశాల హాస్టల్‌లో భద్రత ఉంటుందని చేర్పిస్తే.. నిర్లక్ష్యంగా బయటకు పంపించారని, అదే తమ కొంప ముంచిందన్నారు.

జీవచ్ఛవంలా.. జీవనది!

- గత పాలకుల నిర్లక్ష్యం.. ప్రజలకు శాపం

వైసీపీ పాలనలో కంచికచర్ల మండలం కునికినపాడు, చెవిటికల్లు, గనిఆత్కూరు, మున్నలూరు గ్రామాల పరిధిలో కృష్ణా నదీ గర్భాన్ని భారీ యంత్రాలతో కొల్లగొట్టారు. అడ్డగోలుగా 20 నుంచి 30 అడుగుల లోతు వరకు ఇసుకను తవ్వేశారు.. గతంలో నదిలో ఎప్పుడూ నీటి ప్రవాహం ఉండేది. వేసవిలో ఇసుక బంగారంలా మెరుస్తూండేది. అలాంటిది నేడు నది స్వరూపమే మారిపోయింది. కంప చెట్లతో అడవిని తలపిస్తున్నది. తీర గ్రామాల ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకొంది. **- కంచికచర్ల**



ఎడారిని తలపిస్తున్న కృష్ణానది

మీ పార్టీలోకి వస్తాం!

- టీడీపీ ముఖ్యనేతలతో టచ్‌లోకి వైసీపీ ద్వితీయ శ్రేణి నాయకత్వం
- ఐదేళ్లూ గుడివాడలో అరాచకం
- తప్పించుకునేందుకు జంపింగ్‌కు సన్నద్ధం
- తెలుగుదేశంలోకి రానీయకపోతే జనసేన లేదా బీజేపీలోకి వెళ్లేలా ప్రయత్నాలు
- పార్టీ మారకపోతే కాంట్రాక్టులకు బిల్లులు కూడా రావనే భయం
- వైసీపీ సర్పంచులూ పార్టీ మారే యోచన

గుడివాడ : ఐదేళ్ల జగన్ పాలనలో గుడివాడ మున్సిపాలిటీలో అన్నివిధాలుగా దోచుకున్న వైసీపీ కాంట్రాక్టర్ ఒకరు బీజేపీలో చేరేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. తెలుగుదేశం పార్టీలోకి వస్తే నాయకులతో పాటు కార్యకర్తలు ఒప్పుకోరనే కారణంతో బీజేపీలోకి వెళ్లాలని తండ్రి, కుమారులు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఇందుకోసం కైకలూరు బీజేపీ అభ్యర్థి కామినేని శ్రీనివాస్‌తో ఉన్న సాన్నిహిత్యాన్ని అడ్డుపెట్టుకుని ఆ పార్టీలో చేరాలని ప్రయత్నిస్తున్నారు.

ఐదేళ్లలో అరాచకాలెన్నో..

మున్సిపాలిటీలో కొడాలి నాని ముఖ్య అనుచరుడు శశి అండతో తండ్రీ, కొడుకు పెట్రేగిపోయారు. ఇతర కాంట్రాక్టర్‌లు ఎవ్వరినీ మున్సిపాలిటీ గుమ్మం కూడా తొక్కనివ్వలేదు. ఇతరులకు దక్కిన కాంట్రాక్టు పనులను మున్సిపల్ అధికారులను అడ్డుపెట్టుకుని చేయనివ్వలేదు.

మరో నాయకుడు జనసేన వైపు

ఐదేళ్లలో స్థానిక ఎమ్మెల్యే నాని, అతని ముఖ్య అనుచరుడు దుక్కిపాటి శశిభూషణ్ కార్యాలయాల్లో తన పనులు కాకుండా అడ్డుపడ్డారనే కోపంతో మరో వైసీపీ ముఖ్య నాయకుడు ఉన్నారు. ఐదేళ్ల పాటు తనను పూర్తిగా తొక్కేశారని ఆయన రగిలిపోతున్నారు. అయితే ఈ ఎన్నికల్లో నానీకి తల్లో నాలుకగా వ్యవహరించాడు. ఐదేళ్లలో జనసేన అధినేత పవన్‌ను ఎమ్మెల్యే నాని నోటికి వచ్చినట్టు తిట్టడం నచ్చక సదరు నాయకుని కుటుంబసభ్యులు జనసేనలో చేరాలని ఒత్తిడి చేస్తున్నట్టు సమాచారం. పోలింగ్‌కు ముందే చేరాలని ఒత్తిడి చేసినా కొన్ని అనివార్య కారణాల వల్లే ఆగినా, ఫలితాల అనంతరం చేరాలని చూస్తున్నట్టు తెలిసింది.

మైనార్టీ నాయకుడు పార్టీకిలోకొద్దు..

స్థానిక ఎమ్మెల్యే కొడాలి నాని మాటే వేదంగా వ్యవహరించే మైనార్టీ నాయకుడొకరు తన మాతృ పార్టీ తెలుగుదేశంలోకి రావాలని శతవిధాలుగా కృషి చేస్తున్నాడు. ఎన్నికల పోలింగ్‌కు ముందే పలుమార్లు కబురు పంపినా టీడీపీ నాయకులు పట్టించుకోలేదు. దీంతో టీడీపీ మైనార్టీ నాయకుల ద్వారా పార్టీలో చేరేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నాడు. అసాంఘిక కార్యకలాపాలు, జగనన్న కాలనీలో ఒక మహిళ ద్వారా వడ్డీ వ్యాపారం, లేఅవుట్ చేశాక మిగిలిన చిన్నపాటి స్థలాలను అక్రమంగా అమ్మేసుకున్నాడనే ఆరోపణలున్నాయి. అధికార మార్పిడి జరగడంతో వైసీపీని వీడి టీడీపీలో చేరితే తను చేసిన అక్రమ ప్లాట్‌ల వ్యాపారం, పేకాట శిబిరాలకు ఎటువంటి ఆటంకమూ ఉండదనే ఆలోచనతో టీడీపీవైపు చూస్తున్నాడు. ఈ నాయకుడు మాకొద్దు అని టీడీపీ మైనార్టీ నాయకులు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారు.

బిల్లులు రాకపోవడంతో మరో నాయకుడు సిద్ధం

ఐదేళ్ల కాలంలో పంచాయతీ, మున్సిపాలిటీలో పలు పనులు చేపట్టి ఆర్థికంగా బాగానే స్థిరపడిన గుడివాడ మండలానికి చెందిన వైసీపీ నాయకుడు టీడీపీలో చేరేందుకు ఉత్సాహం చూపుతున్నాడు. తాను చేసిన అక్రమాలు, అరాచకాల నుంచి తప్పించుకోవాలంటే ఆ పార్టీలో చేరడమే సరైన నిర్ణయమని నిర్ధారణకు వచ్చాడు. గతంలో మాజీ ఎమ్మెల్యే రావికి నమ్మిన బంటుగా ఉన్న ఇతను నాని పంచన చేరి బాగానే పోగేసుకున్నాడు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ తరుపున పోటీ చేసేందుకు ఇంటిని సైతం అమ్మేసుకున్నాడు. అయితే ఐదేళ్లలో నాని అండతో ఆర్థికంగా స్థిరపడి మూడు అంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నట్టు సమాచారం. టీడీపీ కార్యకర్తపై పరోక్షంగా కేసులు పెట్టే విషయంలో ఇతను పూర్తిగా సహకరించాడని బాధితుడు పేర్కొంటున్నాడు.

సర్పంచ్‌ల చూపు కూటమి వైపు

సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలోని పలువురు వైసీపీ సర్పంచ్‌లు టీడీపీలో చేరాలని ఉవ్విళ్లూరుతున్నారు. ఈ క్రమంలోనే పలువురు ఈ ఎన్నికల్లో వైసీపీకి పెద్దగా ప్రచారం చేసిందిలేదు. ఐదేళ్లలో గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. ఆర్థిక సంఘం నిధులను సైతం రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ బకాయిల పేరుతో దోచేసుకుంది. కచ్చితంగా కూటమి అధికారంలోకి వస్తుందని, పంచాయతీలకు నిధులొస్తాయని, దీంతో ఎంతోకొంత గ్రామాన్ని అభివృద్ధి చేయవచ్చనని, ఎన్నికల్లో పెట్టిన ఖర్చు అయినా రాబట్టుకోవాలనే ఆలోచనలో ఉన్నారు.

కుప్పలుగా సిద్ధపడ్డారు

టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో గోడలు దూకేందుకు వైసీపీ నాయకులు ఎవరికి వారే సిద్ధపడుతున్నారు. ఏదో ఒక దారిన చేరికకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	154, 163, 174
చికెన్ విత్ స్కిన్	300
చికెన్ స్కిన్‌లెస్	310



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.50

జ్యోతిష్యాన్ని నమ్మి మోసపోవద్దు : నార్నె

ధర్నాచౌక్, జూన్ 6: జ్యోతిష్యం ఒక బూటకం, మోసమని దాన్ని నమ్మి ప్రజలు మోసపోవద్దని ఏపీ హేతువాద సంఘం అధ్యక్షుడు నార్నే వెంకటసుబ్బయ్య తెలిపారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఇటీవల ప్రకటించిన ఎన్నికల ఫలితాలకు జ్యోతిష్యుల ఫలితాలకు సంబంధం లేదని ఎద్దేవా చేశారు. జాతకాలు, జ్యోతిష్యం నుంచి ప్రజలను చైతన్యం చేసేందుకు 175 అసెంబ్లీ స్థానాల్లో ఏపార్టీకి ఎన్ని సీట్లు వస్తాయో కచ్చితంగా చెప్పగలిగే జ్యోతిష్యులకు సన్మానిస్తామని గత నెలలో ప్రకటించడం జరిగిందన్నారు. కేవలం ఇద్దరు మాత్రమే తమకు సమాచారం అందించారని, వారిచ్చిన సంఖ్యలకు పూర్తి విరుద్ధంగా ఫలితాలు వచ్చాయన్నారు. ప్రపంచంలో ఇప్పటి వరకు జ్యోతిష్యం నిజమని రుజువు కాలేదన్నారు.

ఆ ఎనిమిది డివిజన్లలో టీడీపీకే మెజారిటీ

● తూర్పులోని 15 నుంచి 22 డివిజన్లలో వైసీపీకి చుక్కెదురు ● టీడీపీ నేతల్లో ఉత్సాహం

రాణిగారితోట, జూన్ 6: అసెంబ్లీ ఎన్నికల్లో తూర్పు నియోజకవర్గంలో ఒక్క డివిజన్ తప్ప అన్ని డివిజన్లలో టీడీపీకి మెజారిటీ రావడంతో వైసీపీ నాయకులకు మైండ్ బ్లాక్ అయ్యింది. ముఖ్యంగా నియోజకవర్గంలో కృష్ణలంక పరిధిలోని 7 డివిజన్లతో పాటు 19వ డివిజన్‌లో తమదే పై చేయని ఊహించి లెక్కలు వేసుకున్న వైసీపీ నాయకులకు ఓటర్లు ఇచ్చిన తీర్పుతో ప్రజల్లో తమకు ఎంత ఆదరణ ఉందో అర్థమైంది. 15వ డివిజన్ నుంచి 22 వరకు తమదే అనుకున్నారు అందుకు కారణం లేకపోలేదు. గత కార్పొరేషన్ ఎన్నికల్లో అన్ని డివిజన్లు వైసీపీ ఖాతాలోకి చేరడమే. ఆ విజయాలతో అసెంబ్లీ ఎన్నికల్లో కూడా దాదాపు అన్ని డివిజన్లలో మెజారిటీ వస్తుందని అనుకున్నారు. అయితే డివిజన్ల వారీగా ఓట్లు చూస్తే టీడీపీకి 15వ డివిజన్‌లో 2984 ఓట్ల మెజారిటీ, 16లో 2734, 17లో 921, 18లో 294, 19 లో 528, 20లో 3541, 21లో 3332, 22లో 2665 మెజారిటీ ఓట్లు వచ్చాయి. వీటిలో 15, 17, 18, 22 డివిజన్లలో తమకు అత్యధిక మెజారిటీ వస్తుందని, మిగిలిని వాటిలో పోటాపోటీగా ఉన్నా తమకు మొత్తానికి లాభమేనని వైసీపీ అంచనా వేసింది. తీరా ఫలితాలు చూస్తే అందుకు భిన్నంగా ఉండడంతో ఎక్కడ తేడా వచ్చిందా అని లెక్కలు వేసుకుంటున్నారు.

కార్పొరేటర్లే కొంపముంచారు: వైసీపీ కేడర్

ఎన్నికల్లో వైసీపీకి ప్రతి డివిజన్‌లో ఓట్లు శాతం తగ్గడానికి డివిజన్ కార్పొరేటర్లే నూటికి నూరు శాతం కారణమని బహిరంగంగా చెప్పడమే కాకుండా, 15వ డివిజన్ నుంచి 22 వరకు ఉన్న డివిజన్ల కార్పొరేటర్లందరూ బాధ్యత వహించాలని వైసీపీ కేడర్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అన్ని డివిజన్లలో వైసీపీ బలంగా ఉందని తమదే విజయం అని ప్రగాల్భాలు పలికిన కార్పొరేటర్లు కూడా ఫలితాలు వచ్చి మూడురోజుల అవుతున్నా ఎక్కడా కనిపించడంలేదని కూడా అంటున్నారు. ప్రధానంగా 17, 18, 22 డివిజన్లు తమదే అని పక్కాగా అనుకున్నారు. కోట్ల రూపాయల నిధులు తెచ్చామని, అభివృద్ధి చేశామని చెప్పుకోవడంతో పాటు కృష్ణానది రిటైనింగ్ వాల్ నిర్మాణం మొత్తాన్ని తమ ఖాతాలో వేసుకుని గెలుపు మనదే నని కార్పొరేటర్లు కలల్లో తేలారు. తీరా ఫలితాలు వచ్చే సరికి దిమ్మతిరిగి బొమ్మ కనిపించింది. ఈ డివిజన్లలో ఒకరిద్దరు కార్పొరేటర్లు అయితే ప్రచారం తూతూ మంత్రంగా జరిపించారని వారిపై పార్టీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

హామీ నెరవేర్చిన సుజనా

● సొంతనిధులతో సోలార్ వీధి దీపాల ఏర్పాటు



చిట్టినగర్, జూన్ 6: ఎన్నికల ప్రచారంలో ప్రజలకు అభ్యర్థులు పలు హామీలు ఇస్తారు. వాటిని అమలు చేయటానికి వీనమేషాలు లెక్కిస్తారు. అటువంటిది. పశ్చిమ నియోజకవర్గ కూటమి అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందిన వెంటనే సుజనా చౌదరి హామీల అమలుకు శ్రీకారం చుట్టారు. 46,47, 49 డివిజన్లలో ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో పలువురు స్థానికులు కొండప్రాంతంలో వీధి దీపాలు లేకపోవడంతో మెట్లపై రాకపోకలు సాగించే సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పలువురు సమస్యను సుజనా చౌదరి దృష్టికి తీసుకురావడంతో ఆయన స్పందించారు. ఎన్నికల కౌంటింగ్ అయిన వెంటనే ఆయా ప్రాంతాల్లో సోలార్ వీధిదీపాలు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. హామీ ఇచ్చిన వీధింగా గురువారం 47వ డివిజన్ జొన్నలగడ్డ మస్తాన్‌వీధి, కాశీపతివీధి, లలితాబార్ పక్క సందు. పెన్నం రాములు వీధి కొండప్రాంతాలతో పాటు 46వ డివిజన్ ఫైర్‌స్టేషన్ ఎదురు సందు, పట్నాయక్ టవర్స్, 49వ డివిజన్ కొండప్రాంతంలో లక్షలాది రూపాయలతో సుమారు 12 ప్రాంతాలలో సోలార్‌వీధిదీపాల ఏర్పాటు చర్యలు తీసుకున్నారు. పలుచోట్ల ఇప్పటికే పూర్తిస్థాయిలో వీధిదీపాలను పూర్తి చేయ్యగా రెండు ప్రాంతాలలో పోల్స్ ఏర్పాటు చేశారు. ప్యానల్స్ ఏర్పాటు చేయాల్సి ఉంది. దీంతో ఆయా ప్రాంతంలో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. హామీ మేరకు సొంత నిధులతో వీధి దీపాలు ఏర్పాటు చేయటంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

రేషన్ దుకాణాలు, ఎండీయూ వాహనాల తనిఖీలు



ఉలవచారు కంపెనీ వద్ద, దేవినగర్‌లలో రేషన్

మధురానగర్, జూన్ 6: జిల్లా సహాయ పౌరసరఫరాల అధికారి మోహన్ బాబు రేషన్ దుకాణాలను, ఎండీయూ వాహనాలను గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సర్కిల్ 2 పరిధిలో మధురానగర్, గుణదల, సర్కిల్ వన్ పరిధిలో దేవినగర్ తదితర ప్రాంతాల్లో ముందుగా రేషన్ డిపోలను తనిఖీ చేశారు. స్టాకు నిల్వలను, స్టాకు బోర్డులను, స్టాకు రిజిస్టర్‌లను పరిశీలించారు. అనంతరం గుణదల లెనిన్‌నగర్, మధురానగర్ పంపిణీలో ఉన్న ఎండీయూ వాహనాల వద్దకు వెళ్లారు. అక్కడ రేషన్ పంపిణీ జరుగుతున్న తీరును ప్రత్యక్షంగా చూశారు. కార్డుదారులతో మాట్లాడారు. ఎండీయూ వాహనాలలో నిల్వలను తనిఖీ చేశారు. కార్డుదారులతో మర్యాదగా ప్రవర్తించాలని, సమయపాలన పాటించాలని ఎండీయూ ఆపరేటర్‌లను హెచ్చరించారు. ఈ తనిఖీలలో సర్కిల్- 2 సహాయ పౌరసరఫరాల అధికారి ఎన్ఎస్ఎస్ ఆచారి, చెకింగ్ ఇన్‌స్పెక్టర్ భగీరథ తదితరులు పాల్గొన్నారు.

జగన్మోహనరెడ్డికి మైనారిటీలే బుద్ధి చెప్పారు

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్



వన్‌టౌన్, జూన్ 6: జగన్మోహనరెడ్డికి మైనారిటీలే గట్టిగా బుద్ధి చెప్పారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్ అన్నారు. గురువారం వించిపేటలోని ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్మోహనరెడ్డి తన పాలనలో మైనారిటీలకు మేలు చేశామని పదేపదే చెప్పేవాడని ఇప్పుడా మైనారిటీలే ఆయనకు గట్టిగా బుద్ధి చెప్పారని వ్యాఖ్యానించారు. ఏడు నియోజకవర్గాల్లో వైసీపీకి మైనారిటీలు తిరోగమన ఓటు వేశారని పేర్కొన్నారు. టీడీపీ మైనారిటీలకు కేటాయించిన మూడు సీట్లలోను గెలిచారన్నారు. ఈ సందర్భంగా అభ్యర్థులను గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. టీడీపీని గెలిపించిన ప్రజలు నిత్యం ప్రభుత్వానికి అండగా ఉంటూ తప్పులుంటే ఎత్తి చూపుతూ తమ ప్రభుత్వంలాగా నడిపించుకోవాలన్నారు. పశ్చిమ ప్రజలు కూటమితోనే అభివృద్ధి ఉంటుందని అభిప్రాయపడ్డారన్నారు. బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన సుజనా చౌదరికి ప్రజలు చరిత్రాత్మక విజయం అందించారన్నారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)ను కూడా భారీ మెజారిటీతో గెలిపించారన్నారు. సారేపల్లి రాధాకృష్ణ, బెవర సాయిసుధాకర్, ఫైలా సతీష్, సందక సురేష్, అబ్దుల్ సత్తార్, రాంబాబు, నాగబాబు, చక్రవర్తి, శేఖర్, భాస్కర్ పాల్గొన్నారు.

లోకేశ్‌ను కలిసిన ఎంఎస్ బేగ్

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేశ్‌ను గురువారం ఉండవల్లిలోని ఆయన నివాసంలో ఎంఎస్ బేగ్ కలిసారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పశ్చిమ నియోజకవర్గంలో ఎన్నికల సరళిని గురించి లోకేష్‌కు వివరించారు.



చంద్రబాబుకు అభినందనలు తెలుపుతున్న గద్దె అనురాధ, ఎమ్మెల్యే గద్దెకు అభినందనలు తెలుపుతున్న అమ్మిశెట్టి వాసు

చంద్రబాబు దంపతులకు గద్దె అనురాధ అభినందనలు

పటమట, జూన్ 6 : జిల్లా పరిషత్ మాజీ ఛైర్‌పర్సన్ గద్దె అనురాధ, ఆమె తనయుడు గద్దె క్రాంతికుమార్‌తో కలిసి గురువారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పదవీ స్వీకారం చేయబోతున్న చంద్రబాబునాయుడు దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ క్రమంలో ఆమె టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబుకు భగవంతుడు ఆశీస్సులను, మంచి ఆరోగ్యాన్ని ఇవ్వాలని భగవంతుడిని ప్రార్థించినట్లు తెలిపారు.

గద్దెను కలిసిన అమ్మిశెట్టి వాసు : సార్వత్రిక ఎన్నికల్లో 48వేల ఓట్ల మెజార్టీతో మూడో సారి తూర్పు ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ నమోదు చేసిన గద్దె రామ్మోహన్‌ను తూర్పు జనసేన పార్టీ ఇన్‌చార్జి అమ్మిశెట్టి వాసు అశోక్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రాణిగారితోటలో యువతి ఆత్మహత్య

వన్‌టౌన్, జూన్ 6: రాణిగారితోట తారక రామానగర్‌లో బుధవారం సాయంత్రం యువతి పులి మల్లిక(22) ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తారక రామానగర్‌లో పులి పిచ్చయ్య భార్య సరోజిని, ముగ్గురు కుమార్తెలతో ఉంటున్నాడు. భార్యాభర్తలిద్దరూ కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పిచ్చయ్య ఇద్దరు కుమార్తెలకు వివాహం చేశాడు. మూడో కుమార్తె మల్లిక ఇంటర్మీడియట్ పూర్తి చేసి బ్యూటీషియన్ కోర్సు నేర్చుకుని ప్రస్తుతం విశాఖపట్నంలో పనిచేస్తుంది. ఆమె 15 రోజులకు ఒకసారి ఇంటికి వస్తూ వెళుతుంటుంది. ఆమె సుమారు వారంరోజుల క్రితం ఇంటికి వచ్చింది. బుధవారం తల్లిదండ్రులు ఇద్దరూ పనులకు వెళ్లారు. తల్లి సరోజిని రాణిగారి తోటలోని ఒక కిరాణా షాపులో పనికి వెళ్లింది. అక్కడ ఆమె తన మనవడితో మల్లిక ఏం చేస్తుందో చూసి రమ్మని పంపించగా ఇంటికి తాళం వేసుందని చెప్పాడు. ఆమె ఇంటికి వెళ్లి చూడగా ఇంట్లో ఫ్యాన్‌కు మల్లిక ఉరేసుకుని వేలాడుతూ కనిపించింది. ఆమె స్థానికుల సహాయంతో మల్లికను కిందకు దించి పరిశీలించగా అప్పటికే ఆమె మరణించినట్లు స్థానికులు నిర్ధారించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది.



నీట్‌లో కేబీఎన్ షైన్ విద్యార్థుల ప్రతిభ

వన్‌టౌన్, జూన్ 6: నీట్ ఫలితాల్లో తమ కళాశాల షైన్ విభాగం విద్యార్థులు ఐదుగురు ఉత్తమ ఫలితాలు సాధించారని ప్రిన్సిపాల్ వి.నారాయణరావు తెలిపారు. గురువారం ర్యాంక్‌లు తెచ్చుకున్న విద్యార్థులను ఆయన అభినందించారు. కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాస్ విద్యార్థులను అభినందించారు. టి.నరేంద్ర కుమార్, మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

గన్నెకు దివ్యాంగుల సంఘం నేతల అభినందనలు



విద్యాధరపురం, జూన్ 6: టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నె వెంకట నారాయణ ప్రసాద్‌ను హనుమాన్‌పేటలోని ఆయన కార్యాలయంలో గురువారం దివ్యాంగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్, పార్టీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా పార్టీ తిరుగులేని ఆధిక్యంతో అధికారంలోకి వచ్చినందుకు శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేశారు.

కూటమి ప్రభుత్వానికి మజ్దూర్ యూనియన్ శుభాకాంక్షలు

వన్‌టౌన్, జూన్6: రాష్ట్రంలో బాధ్యతలు స్వీకరించనున్న కూటమి ప్రభుత్వానికి, ప్రభుత్వంలో భాగస్వాములైన పార్టీల ప్రజాప్రతినిధులకు ఆంధ్రప్రదేశ్ ప్రజారవాణా సంస్థ నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ గురువారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపింది. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి రమణారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసులు ఒక సంయుక్త ప్రకటన చేశారు. ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయబోతున్న చంద్రబాబు నాయుడుకు హార్థిక శుభాకాంక్షలు చేశారు. కూటమిలో ప్రధాన పాత్ర పోషించిన పవన్‌కల్యాణ్‌కు, బీజేపీ నాయకత్వానికి కూడా శుభాకాంక్షలు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పాయకాపురం, జూన్ 6 : పాయకాపురం, వాంబేకాలనీ సబ్ స్టేషన్ ఏరియాలోని డిస్నీలాండ్ ఫీడర్‌లో విద్యుత్ లైన్‌ల మరమ్మతుల నిమిత్తం సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఈఈ బీవీ సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు వాంబేకాలనీ, దేవినేని గాంధీపురం, పైపుల రోడ్డు, వైఎస్ఆర్ పార్క్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ నిలుపుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆ నలుగురి పాస్‌పోర్టులను సీజ్ చేయండి

● టీడీపీ రాష్ట్ర నాయకుడు గురునాథం డిమాండ్

విద్యాధరపురం, జూన్ 6: రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో భారీ ఓటమిని చవి చూసిన జగన్మోహనరెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి, ధనుంజయరెడ్డి, జవహర్‌రెడ్డిలు దేశం వదిలి పారిపోకుండా వారి పాస్‌పోర్టులను సీజ్ చేయాలని టీడీపీ రాష్ట్ర నాయకుడు మాదిగాని గురునాథం డిమాండ్ చేశారు. ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్‌డీఏ కూటమికి అఖండ విజయం చేకూర్చిన ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనారిటీ, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఐదు సంవత్సరాల జగన్‌రెడ్డి పాలనలో ప్రజలు విసుగెత్తి టీడీపీ కూటమికి బ్రహ్మరథం పట్టారన్నారు. న్యాయస్థానాలలో జగన్‌రెడ్డి కొటారీ అవినీతిపై నిగ్గు తేలేంత వరకు పాస్‌పోర్టులను సీజ్ చేయాలన్నారు. అధికార మదంతో రెచ్చిపోయిన వైసీపీ నాయకులను వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. చంద్రబాబు నాయుడు సీఎంగా ప్రమాణ స్వీకారం చేసి ప్రభుత్వ పగ్గాలు చేపట్టిన తరువాత జగన్‌రెడ్డి కొటారీపై న్యాయవిచారణ చేయిస్తారని, దోషులు జైలుకు వెళ్లడం తప్పదని చెప్పారు. మాజీ కార్పొరేటర్ నరసింహ చౌదరి, అబీద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

శివనాథ్‌కు సత్కారం



పాయకాపురం, జూన్ 6 : విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని), సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరావులను గురువారం టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాదు, టీడీపీ సీనియర్ నాయకుడు దాసరి కనకరావు, పరుచూరి రాము కలిసి వారిని సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేశారు.

బొండా ఉమాకు టీడీపీ నేతల సన్మానం



విజయవాడ, జూన్ 6: విజయ వాడ సెంట్రల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన బొండా ఉమామహేశ్వరరావును టీడీపీ నేతలు ఘనంగా సన్మానించారు. గురువారం ఉమ నివాసంలో ఆయనను కలిసిన నేతలు ఘనంగా సన్మానించారు. టీడీపీ సీనియర్ నాయకుడు కళ్లే నాగేశ్వరరావు, వీఎంసీలో మాజీ ఫ్లోర్ లీడర్ గుండారపు హరిబాబు, మాజీ కార్పొరేటర్ చందన సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఊర్మిళానగర్‌లో కేక్ కటింగ్



భవానీపురం, జూన్ 6 : కూటమి విజయం సాధించిన సందర్భంగా టీడీపీ నాయకులు పూలకాంతారావు, సలోమిలు గురువారం ఊర్మిళానగర్‌లో భారీ కేక్ కట్ చేసి డ్వాక్రా మహిళలు, స్థానిక కార్యకర్తలకు పంచిపెట్టారు. జనసేన 43వ డివిజన్ అధ్యక్షుడు కోటి, టీడీపీ నాయకుడు గాలీషా, డివిజన్ అధ్యక్షుడు కొనికి కొండయ్య, తంజావూర్ ప్రసాద్, కూనపరెడ్డి ఆనంద్, శివకుమారి, గౌతమీలు పాల్గొన్నారు.



ఆ విశ్వాసం పవన్ కళ్లలో కనిపించింది

పరుచూరి గోపాలకృష్ణ



ఆంధ్రప్రదేశ్‌కు ఇటీవల జరిగిన ఎన్నికల్లో అసాధారణ విజయం సొంతం చేసుకున్న కూటమికి చిత్ర పరిశ్రమ నుంచి శుభాకాంక్షల వెల్లువ కొనసాగుతోంది. ఈ సందర్భంగా రచయిత పరుచూరి గోపాలకృష్ణ చంద్రబాబుకి, పవన్‌కల్యాణ్‌కు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన పవన్‌కల్యాణ్‌ను ప్రశంసిస్తూ 'పవన్‌కు బిడియం ఎక్కువ. కానీ ఈ ఎన్నికల కోసం ఎంతో ఆత్మవిశ్వాసంతో పని చేశారు. 'నేను సాధిస్తున్నా' అనే విశ్వాసం ఆయన కళ్లల్లో కనిపించింది. పవన్‌కల్యాణ్ అభిమానులు ఎంత ఎమోషనల్‌గా ఉంటారో నాకు తెలుసు. కూటమి ఏర్పాటులో పవన్‌కల్యాణ్ కీలక పాత్ర పోషించి, ఎన్నికల్లో అద్భుత విజయం సాధించిన తర్వాత కూడా ఆయన ఎంతో వినయంగా ఎవరినీ నిందించకుండా ప్రజలకు ఇచ్చిన హామీలను ఎలా నెరవేర్చాలా అనే ఆలోచనతోనే మాట్లాడారు. అది పవన్ గొప్ప వ్యక్తిత్వానికి నిదర్శనం' అన్నారు.

అందరినీ ఆకట్టుకుంటుంది



'గూఢచారి', 'మేజర్' చిత్రాలతో దర్శకుడిగా టాలీవుడ్‌లో తనదైన ముద్రవేశారు శశి కిరణ్‌తిక్క. కాజల్ అగర్వాల్ లీడ్ రోల్‌లో నటించిన 'సత్యభామ' సినిమాకు ఆయన స్ర్కీన్‌ప్లే అందించడమే కాకుండా సమర్పకులుగా వ్యవహరించారు. నేడు సినిమా విడుదలవుతున్న సందర్భంగా శశి కిరణ్‌తిక్క మీడియాతో ముచ్చటించారు "ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రం అందరినీ ఆకట్టుకుంటుంది. థియేటర్స్‌లో సినిమాను చూసేటప్పుడు ఇందులోని ఎమోషన్స్‌తో ప్రేక్షకులు బాగా కనెక్ట్ అవుతారు. దర్శకుడు సుమన్ సినిమాను గ్రిప్పింగ్‌గా తీసిన విధానం, కాజల్ ఎనర్జిటిక్ యాక్టింగ్, శ్రీ చరణ్ సంగీతం ఈ సినిమాకు పెద్ద హైలైట్స్" అని చెప్పారు.

క్లీన్ చిట్ వచ్చే వరకూ..



బెంగళూరు రేవ్ పార్టీ కేసులో అరెస్ట్ అయిన నటి హేమను మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ (మా) గురువారం సస్పెండ్ చేసింది. డ్రగ్స్ కేసుపై వివరణ ఇవ్వాలని హేమకు నోటీసు పంపించినా ఆమె స్పందించకపోవడంతో 'మా' అధ్యక్షుడు విష్ణు మంచు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ కేసులో హేమకు క్లీన్ చిట్ వచ్చేవరకూ సస్పెన్షన్ కొనసాగుతుందని 'మా' కార్యవర్గం తెలిపింది.

బ్లాక్‌బస్టర్ గ్యారంటీ



శర్వానంద్, కృతి శెట్టి హీరోహీరోయన్లుగా నటించిన చిత్రం 'మనమే'. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వం వహించగా, టీ.జీ.విశ్వ ప్రసాద్ నిర్మించారు. నేడు సినిమా విడుదలవుతున్న సందర్భంగా చిత్ర బృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించింది. ఈ సందర్భంగా హీరో శర్వానంద్ మాట్లాడుతూ "ఈ సినిమాలో నా పాత్ర చాలా కొత్తగా ఉంటుంది. ఈ సినిమా బ్లాక్‌బస్టర్ గ్యారంటీ" అని చెప్పారు. "కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా తెరకెక్కిన ఈ సినిమా అందరినీ అలరిస్తుంది" అని నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్ అన్నారు.











సహజయోగ

ఏడు చక్రాల జాగృతితో...
అనంతమైన ఆనందం



'భగవంతుడు అంటే ప్రేమ' అని మనం వింటూ ఉంటాం. ఎందరో దాని గురించి వర్ణించారు. కానీ స్వయంగా అనుభూతి చెందకుండా... భగవత్ స్వరూపమైన ప్రేమలోని ఆనందాన్ని అనుభవించలేం. దాన్ని ఆస్వాదించే యంత్రాంగాన్ని భగవంతుడే మనలో పొందుపరిచాడు. ఆ యంత్రాంగమే అంతర్గత సూక్ష్మవ్యవస్థ. అది మనలో ఏడు పొరలుగా పని చేస్తుంది. అవి మనలోని శక్తి కేంద్రాలు. వాటిని చక్రాలుగా యోగశాస్త్రం అభివర్ణించింది.

మూలాధార చక్రం: మొదటి శక్తి కేంద్రమైన మూలాధారచక్రం మనలోని విసర్జనావయాలమీద ప్రభావం చూపిస్తుంది. విసర్జన క్రియ తరువాత మనకు చాలా ఉపశమనం కలుగుతుంది. ఆ ఉపశమనం మనకు ఆనందాన్ని ఇస్తుంది. ఇది చాలా చిన్న విషయమే. కానీ ప్రధానమైనది. అయితే... మనలోని ఎన్నో లోతైన, సున్నితమైన విషయాలవల్ల కలిగే ఆనందాన్ని ఈ ఆనందం అధిగమించకుండా ఉండాలంటే... మనలో నిర్మలమైన మనస్తత్వం ఉండాలి. అది శ్రీగణేశుని సహజ లక్షణం. సహజయోగ సాధనతో మూలాధార చక్రాన్ని శుద్ధి చేసుకోవడం ద్వారా ఈ గుణాన్ని వృద్ధి చేసుకోవచ్చు.

స్వాధిష్ఠాన చక్రం: ఇది రెండవ పొర. సృజనాత్మకత వల్ల కలిగే ఆనందానికి సంబంధించినది. కొందరు రచన ద్వారా, కళల ద్వారా ఏదైనా సృష్టించడం ముఖ్యమనుకుంటారు. ఈ సృజనాత్మకతకు హేతుబద్ధమైన ఆలోచన తోడైతే... తాము అందరికన్నా గొప్పవారమని గర్వపడతారు. ఇది సరైన ఆలోచన కాదు. ఈ రెండవ పొరను అధిగమించాలంటే నిర్విచార స్థితిలోకి వెళ్ళాలి. మన అవగాహన ప్రకాశవంతమైనప్పుడే ఇది సాధ్యమవుతుంది. అప్పుడు మనం దేన్ని సృష్టించినా... దాన్ని ఆనందిస్తాం. మనలోని శ్రీబ్రహ్మదేవ సరస్వతీతత్త్వాన్ని జాగృతపరచడం వల్లనే ఇది సాధ్యమవుతుంది.



నాభి లేదా మణిపూర చక్రం: ఆకలితో ఉన్నప్పుడు ధ్యానంలో సరిగ్గా కూర్చోలేం. మంచి ఆహారం తిన్నప్పుడు ఆనందం కలుగుతుంది. అయితే ఈ ఆనందం తాత్కాలికమే. ఎందుకంటే దేన్నైనా సంపూర్ణంగా ఆనందించినప్పుడు... మళ్ళీ కావాలని కోరుకోకుండా ఉండాలంటే, ఆ ఆనందం శాశ్వతం కావాలనుకుంటే... సంతృప్తి ఒక్కటే మార్గం. రెండు ముద్దలు తిన్నా సంతృప్తి చెందాలి. మనలో వస్తు సంబంధమైన కోరికలకు అంతులేదు. ఇంకా ఇంకా కావాలనుకుంటాం. ఏదీ సంపూర్ణంగా ఆనందించలేం. దీనివల్ల నాభిచక్రం అలజడికి లోనవుతుంది. దాన్ని అరికట్టే మార్గం సంతృప్తే. అది పొందాలంటే ఆత్మసాక్షాత్కారం పొందాలి. నిత్య ధ్యాన సాధన ద్వారా మనలోని శ్రీలక్ష్మీనారాయణ శక్తిని జాగృతం చేసుకోవడం ద్వారా ఇది సాధ్యపడుతుంది.

అనాహత చక్రం: మనలో ఉండే చక్రాలలో చాలా ముఖ్యమైనది అనాహత లేదా హృదయ చక్రం. దీనిలోని విశిష్టత... భద్రత. మీలో భద్రతా భావాన్ని అనుభూతి చెందడం. అది ఆత్మసాక్షాత్కారం పొందితేనే జరుగుతుంది. మీకు సంబంధించి సంపూర్ణమైన భద్రతతో ఉండేది మీలోని ఆత్మ మాత్రమే. దాన్ని మీరు ఆస్వాదించినప్పుడు కలిగే ఆనందం... మిమ్మల్ని ఆధ్యాత్మికమైన లోతులకు తీసుకువెళ్తుంది. భగవంతుడి మీద విశ్వాసాన్ని మీ హృదయ చక్రంలో పదిలపరచుకోండి. ఆ విశ్వాసమే రక్షణలోని ఆనందాన్నిస్తుంది. అందుకోసం మన హృదయంలో జగదంబ అయిన దుర్గాదేవిని స్థిరపరుచుకోవాలి.

విశుద్ధి చక్రం: విశుద్ధ చక్రాన్ని... విశుద్ధి, హంస చక్రాలు అని రెండుగా విభజించవచ్చు. విశుద్ధి చక్రం అంటే విరాట్ స్వరూపమైన చక్రం. ప్రతివారిలోని ఆత్మను మనం అనుభూతి చెందాలి. అప్పుడే విశ్వవ్యాపితమైన మాధుర్యం, సంబంధ బాంధవ్యాల్లో ఉండే మాధుర్యం మనకు తెలుస్తాయి. ఈ సామూహిక చేతనను, విశ్వజనీతనను అనుభూతి చెందినప్పుడు... ఆ విరాట్ స్వరూపంలో అంతర్భాగం అవుతాం. అన్నిటికీ సాక్షిగా ఉన్నప్పుడే ఇది సాధ్యమవుతుంది. దీన్ని పొందాలంటే... సహజయోగ సాధన ద్వారా... శ్రీకృష్ణుడి గుణగణాలను మనలో స్థిరపరచుకోవాలి. ఇక హంస చక్రం... విశుద్ధ చక్రంలో భాగం. హంస పాలను, నీటిని విడదీయగలిగినట్టు... ఈ చక్రం మనలో విచక్షణాభావాన్ని పెంపొందిస్తుంది.

ఆజ్ఞా చక్రం: కాంతి లేదా ప్రకాశం అనేవి ఈ చక్రం తాలూకు తత్త్వం. ఇది మన చిత్తాన్ని తేజోవంతం చేస్తుంది. ఆత్మసాక్షాత్కారం తరువాత... మనం ప్రతిదాన్నీ ఈ కాంతి ద్వారానే చూస్తాం. మనమే కాంతి అనీ, శాశ్వతమైన ప్రకాశం అనీ తెలుసుకుంటాం. ఈ విషయం అర్థమైనప్పుడు... మనలోని భయాలు, మనల్ని తమ ఆధీనంలో ఉంచుకోవడానికి ప్రయత్నం చేసే శక్తులు క్షణంలో అదృశ్యమవుతాయి. ఆజ్ఞాచక్రం తాలూకు ఆనందాన్ని మనలోకి ఆహ్వానించినప్పుడు... మనలోని కాంతి నిశ్చలమవుతుంది. ఆత్మప్రకాశం కలిగినప్పుడు... ప్రపంచాన్నంతటినీ మనలోనే చూసుకోగలం. ఇది సహజయోగతో సాధ్యమవుతుంది.


సహస్రార చక్రం: మన శరీరంలోని సూక్ష్మనాడీ వ్యవస్థలో ఆఖరి చక్రం సహస్రారం. ఇది చాలా కీలకమైనది. మొత్తం ఏడు చక్రాలూ వాటి పీఠాలను అక్కడే కలిగి ఉన్నాయి. ఈ పీఠాలు ఆనందాన్ని స్వీకరించి, హృదయానికి అందిస్తాయి. మనం ధ్యానం ద్వారా సహస్రార చక్రాన్ని చేరుకోగలగాలి. ఆత్మసాక్షాత్కారం పొందిన తరువాత సహస్రార చక్రం జాగృతం అవుతుంది. శ్రీలలితా

డాక్టర్ పి. రాకేష్
8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ



నక్సలిజం నుంచి ఐఏఎస్ వరకూ... హేతువాదం నుంచి అరుణగిరి వరకూ... **మాడభూషి మదన్ గోపాల్** జీవితంలో ఎన్నో మలుపులు. 'రెయిన్ బో ఇయర్స్' ద్వారా 1960ల్లో యువతపై వామపక్ష భావజాల ప్రభావాన్ని చర్చించినా... 'కాంచన్‌జంగా డైరీస్'లో హిమాలయారోహణ విశేషాలను కళ్ళకు కట్టినట్టు వర్ణించినా... ప్రతిదీ తన జీవితంలోంచే వచ్చిందని చెబుతాయన. ఆధ్యాత్మికత వైపు తన పయనం గురించి 'నివేదన'తో ఆయన పంచుకున్న అనుభవాలివి.

'నువ్వు' లేవనేది తెలుసుకో...



మీరు మార్క్సిస్ట్ నుంచి బ్యూరోక్రాట్ అయ్యారు. నాస్తికత్వం నుంచి అరుణాచల రమణమహర్షి మార్గంలోకి వెళ్ళారు. ఇంత వైరుధ్యం ఎలా వచ్చింది.

నాస్తికత్వం అని చెప్పలేను. అగ్నాస్టిక్ అని చెప్పాలి. ప్రతిదాన్నీ ప్రశ్నించే తత్త్వం మొదటి నుంచీ ఉండేది. మా నాన్నగారు ప్రొఫెసర్ మాడభూషి వెంకటాచారి ఆంధ్రప్రదేశ్‌లో కమ్యూనిస్ట్ పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరు. మా ఇంట్లో మతపరమైన పూజల్లాంటివి మేము ఎప్పుడూ చెయ్యలేదు. ఎప్పుడో దీపావళి వస్తే నలుగురితోపాటు టపాకాయలు కాల్చడం, సంక్రాంతి వస్తే గాలిపటాలు ఎగరెయ్యడం... అంతే. ఇక చిన్నప్పటినుంచి కవితలు, కథలు రాసేవాణ్ణి. అభ్యుదయ రచయితల సంఘం తరఫున రాంభట్ల కృష్ణమూర్తిగారు మాలాంటి వారి రచనలతో పుస్తకాలు కూడా వేశారు. హేతువు పరిశీలించకుండా దేన్నీ నమ్మకపోవడం, మూఢనమ్మకాలను, అనవసరమైన కర్మకాండలను వ్యతిరేకించడం అనేది అప్పటి నుంచీ ఉండేది.

ఆధ్యాత్మికం, నక్సలిజం మిమ్మల్ని ఎలా ఆకర్షించాయి?

నేను సిద్దిపేట నుంచి హైదరాబాద్ వచ్చినప్పుడు ఉస్మానియా యూనివర్సిటీలో చాలామంది నాకు పరిచయం అయ్యారు. అప్పుడే మార్క్సిస్ట్- లెనినిస్ట్ (ఎంఎల్) రాజకీయాలపట్ల ఆకర్షితుణ్ణి అయ్యాను. ఒక పక్క చలం, మరో పక్క ఎంఎల్ మూవ్‌మెంట్... రెండూ సమాంతరంగా సాగాయి.

మరి అరుణాచలం ఎలా పరిచయమయింది?

చలంగారి సాహిత్యం ఎక్కువగా చదివేవాణ్ణి. విగ్రహారాధన, కర్మకాండలు, సమాజంలో ఉన్న వైరుధ్యాలను ఆయన తీవ్రంగా ఖండించేవారు. నేను 9-10 తరగతుల్లో ఉన్నప్పుడే... అరుణాచలంలో ఉన్న ఆయనకు ఉత్తరాలు రాసేవాణ్ణి. నా మనసులో ఉన్న ప్రశ్నలన్నీ ఆయనకు పంపేవాణ్ణి. ఆయన ఎప్పటికప్పుడు జవాబు ఇచ్చేవారు. "ఇన్ని ప్రశ్నలు వేస్తున్నావ్. ఇక్కడికి వస్తే ఇంకా తెలుసుకోవచ్చు" అని ఒకసారి ఆయన రాశారు. మర్నాడే అరుణాచలం వెళ్ళాను. అక్కడి వాతావరణం, కులమతాలకు అతీతంగా అందరినీ ఒకేలా చూసే తీరు... ఆ ఆత్మీయత నన్ను ఆకట్టుకున్నాయి. అప్పటివరకూ అక్కడొక కొండ ఉంది, ఒక గుడి ఉంది అని కూడా నాకు తెలీదు. చలంగారి ఇంటికి వెళ్ళేసరికి నా వయసు పంతొమ్మిది సంవత్సరాలు.

'దేవుడు లేడు' అనే స్థితి నుంచి 'ఉన్నాడ'నే నమ్మకానికి వచ్చారా?

దేవుడు అంటే... ఒక రూపం ఉంటుందని అప్పుడూ అనుకోలేదు. ఇప్పుడూ అనుకోవడం లేదు. ఆధ్యాత్మికత, మతం... ఈ రెండూ ఒకటి కావనే భావన నాలో మొదటినుంచీ స్థిరపడిపోయింది. రమణ మహర్షి రచనలు చదవడం మొదలుపెట్టిన తరువాత... 'నేను అనేది లేదు' అని ఆయన చెప్పిన మాట నన్ను ఆకర్షించింది. 'నేను' అనేది లేకపోతే... ఇక ఉండేది ఏమిటి? అనే ప్రశ్న మొదలయింది. 'నేను లేను' అనే భావనను అనుభూతి చెందిన తరువాత... ఏ రకమైన సిద్ధాంతాన్నీ నమ్మడానికి మనసు ఒప్పుకోదు. మరి నేను లేకపోతే... ఉన్నది ఏమిటి? అస్తిత్వం, ఉనికి... ఇవేవీ ఉండవు కదా! ఆ భావన ఏర్పడిన తరువాత... నిర్వికల్ప భావం వస్తుంది. ఒక పని చేస్తాం. దాని మీద శ్రద్ధ పెడతాం. దానితో అటాచ్‌మెంట్ మాత్రం ఉండదు. అలాగని కర్మ చెయ్యవద్దని రమణ మహర్షి ఎప్పుడూ చెప్పలేదు. నేను సన్యాసిద్దామనుకుంటున్నానని తన దగ్గరకు వచ్చినవాళ్ళు ఎవరినీ ప్రోత్సహించలేదు. "నిన్నటిదాకా నువ్వు సంసారిని అన్నావు. ఇప్పుడు సన్యాసిని అంటున్నావు. ముందు నువ్వెవరివో తెలుసుకో" అని చెప్పేవారు. అది తెలుసుకోవడం కష్టం. మనం ఎవరినైనా మోసం చెయ్యవచ్చు కానీ మన ఆత్మను మోసం చెయ్యడం చాలా కష్టం.

అరుణాచలం వెళ్ళాక... మీకు ఎదురైన అనుభవాలేమిటి?

నేను నక్సల్ ఉద్యమంలో ఉంటూనే... చలంగారి దగ్గరకు వెళ్ళేవాణ్ణి. రమణ మహర్షి రచనలు చదివేవాణ్ణి. జిడ్డు కృష్ణమూర్తి లాంటివారిని కలిసేవాణ్ణి. ఈ క్రమంలోనే "నేను ఏం చేస్తున్నాను? ఎటు వెళ్తున్నాను? మనం చేసే పనికి ఏదైనా అర్థం ఉందా? జీవితానికి ప్రయోజనం ఏమిటి?" అనే ప్రశ్నలు నాలో మొదలయ్యాయి. ఎప్పుడైనా సమాధానాలు చాలానే వస్తాయి. కానీ ప్రశ్న రావడం కష్టం. ఎవరైనా సమాధానాల కోసం వెతుకుతారు కానీ ప్రశ్నల కోసం వెతకరు. నాలో నుంచి ప్రశ్న వచ్చినప్పుడు సమాధానం కూడా నాలోంచే వస్తుంది. రమణ మహర్షి చెప్పింది కూడా అదే... "నిన్ను నువ్వు తెలుసుకో" అని. అంటే "నువ్వు లేవనేది తెలుసుకో" అని. మనం ఎవరు? అనే ప్రశ్నలోంచే మనం ఎవరనే సమాధానం వస్తుంది. ఇక రమణాశ్రమ అనుభవాల విషయానికి వస్తే... అక్కడ ఆయన ఉనికిని మనం అనుభూతి చెందుతాం. ఒకసారి నేను చలంగారి ఇంటి గెస్ట్‌హౌస్‌లో నిద్రపోతున్నాను. అర్థరాత్రి సమయంలో... అరుణాచల శిఖరం మీదనుంచి ఒక అగ్నిగోళాన్ని ఎవరో నామీద విసిరేసినట్టు, అది నా గుండెను తాకినట్టు అనిపించింది. నేను లేచి అరవడం మొదలుపెట్టాను. అది కలో నిజమో తెలియని ఉద్వేగంలో ఉన్నాను. మిగిలినవాళ్ళందరూ లేచి... ఏమైందని అడిగారు. నా ఒళ్ళంతా వేడెక్కిపోయింది. చెమటలు పడుతున్నాయి. అది అనుభవమో, భ్రాంతో నాకూ తెలీదు. ఆ తరువాత నాకు తెలియకుండానే, నా ప్రయత్నం లేకుండానే నా జీవితంలో మార్పులు వచ్చాయి. అవి మంచా, చెడా అనేది పక్కన పెడితే... వెనక్కి తిరిగి చూసుకున్నప్పుడు... ఆ మార్పులు నాకే ఆశ్చర్యం కలిగిస్తున్నాయి. అరుణాచలం అనుభవాల తరువాత నాలో తలెత్తే ప్రశ్నల తీరే మారిపోయింది.

స్వానుభవం

ఆలయాలకు వెళ్తూ ఉంటారా?

ఆ అలవాటు లేదు. హిమాలయాలకు మాత్రం వెళ్తూ ఉంటాను. కైలాస మానస సరోవర్, నేపాల్‌లోని అన్నపూర్ణా శిఖరం... ఇలా చాలా చోట్లకు వెళ్ళాను. ఆ అనుభవాలతో 'కాంచన్‌జంగా డైరీస్' పుస్తకం రాశాను.

ఆ అనుభవాలు చెబుతారా?

2002లో అమర్‌నాథ్ వెళ్ళాను. చాలా చల్లగా ఉంది. పైకి ఎక్కుతున్నప్పుడు... సగం దూరం వెళ్ళేసరికి సొమ్మసిల్లే స్థితికి చేరుకున్నాను. పక్కన కూర్చున్నాను. కాషాయ దుస్తులు వేసుకున్న ఒక పెద్దాయన వచ్చి నా పక్కన కూర్చున్నాడు. "ఏమైంది?" అని అడిగాడు. "తల తిరుగుతోంది. మూర్ఛ వచ్చేలా ఉంది" అని చెప్పాను. జేబులోంచి ఏదో తీసి నాకు ఇచ్చాడు. అది మూలికో, కర్పూరమో... ఏమిటో నాకు తెలీదు. "ఇప్పుడు పడుకోవద్దు. పడుకుంటే చాలా సమస్య అవుతుంది. ఆక్సిజన్ అవసరం ఎక్కువవుతుంది. దీన్ని వాసన చూస్తూ ఉండు" అని చెప్పి వెళ్ళిపోయాడు. ఆయన ఎవరో నాకు తెలీదు. ఇలాంటి అనుభవాలు నాకు చాలా ఉన్నాయి.

ఇప్పటికీ రమణాశ్రమం మీకు స్ఫూర్తిని ఇస్తూనే ఉందా?

తిరువణ్ణామలైలో నాకు ఇల్లు కూడా ఉంది. అయితే... ఎవరైనా వస్తామన్నప్పుడు ఒక్కటే చెబుతాను... "ఏదైనా కావాలని ఇక్కడికి రాకండి. దేన్నైనా పోగొట్టుకోవడానికి రండి" అని. నేను మొదటిసారి వెళ్ళినప్పుడు ఏదీ కోరుకోలేదు. ఆ ఆలోచన కూడా లేదు. చలంగారి కోసం వెళ్ళాను. తరువాత నాకు తెలియకుండానే నా జీవితంలో ఎంతో మార్పు వచ్చింది. నేను ఎలాంటి ప్రయత్నం చెయ్యకుండానే... క్రమంగా నక్సలైట్ ఉద్యమానికి దూరమయ్యాను. అందరూ ఆశ్చర్యపోయారు. ఎప్పుడూ కాలేజీలో స్ట్రైక్‌లు చేయించడం, గ్రూపులు కట్టడం లాంటి వ్యవహారాల్లో ఉండేవాణ్ణి. నాలాంటి బీలో యావరేజ్ స్టూడెంట్ సివిల్ సర్వీసెస్ రాయడం, సెలక్ట్ అవడం... ఇవన్నీ కూడా నాకు తెలియకుండానే జరిగిపోయాయి.


ఒక బ్యూరోక్రాట్‌గా వీటి ప్రభావం మీ వృత్తి మీద ఉందా?

చాలా పవర్ ఉందనుకున్న వాళ్ళతో కూడా 'నేను లేను' అనే ధోరణితోనే వ్యవహరించాను. 'ఎవరికైనా భయమైనా ఉంటుంది, ఆశైనా ఉంటుంది. ఇతనికి భయం లేదు, ఆశ లేదు' అనేది వాళ్ళకి అర్థమయింది. ఇక వాళ్ళు చేసేది ఏముంటుంది? ధైర్యంగా, నిష్పక్షపాతంగా పని చెయ్యడానికీ, నాకు సాధ్యమైనంతగా ప్రజలకు సేవ చెయ్యడానికీ ఇది దోహదపడింది.

సంభాషణ: కృష్ణశర్మ

సుభాషితం

అది అసాధ్యం



ప్రసహ్యమణి ముద్ధరే న్మకరవక్త్ర దంష్ట్రాన్తరాత్
సముద్ర మపి సంతరే త్ప్రచలదూర్మి మాలాకులమ్
భుజంగమపి కోపితం శిరసి పుష్పవద్ధారయేత్
న తు ప్రతినివిష్ట మూర్ఖ జన చిత్తమారాధయేత్


మూర్ఖమైన ఆలోచనలు ఉన్నవారిలో పరివర్తన తేవడం ఎంత కష్టమో తన నీతి శతకంలోని ఈ శ్లోకంలో భర్తృహరి వర్ణించాడు.

దాని అంతరార్థాన్ని... మకర ముఖాంతరస్థమగు మాణికమున్ బెకిలింపవచ్చు బా/యక చలదూర్మికా నికరమైన మహోదధి దాటవచ్చు మ/స్తకమున బూవుదండవలె సర్పమునైన భరింపవచ్చు మ/చ్చిక ఘటియించి మూర్ఖజన చిత్తము దెల్పనసాధ్య మేరికిన్... అనే పద్యంతో ఏనుగు లక్ష్మణకవి తెలుగువారికి సమర్పించాడు.

భావం: నేర్పు, ఓర్పు ఉంటే మొసలి నోట్లో ఉన్న మాణిక్యాన్ని సులభంగా తీయవచ్చు. ఎప్పుడూ భయంకరమైన అలలతో ఉధృతంగా ఉండే సముద్రాన్ని దాటవచ్చు. బుసలు కొడుతున్న విషసర్పాన్ని చాకచక్యంగా పట్టుకొని... మెడలో పూల దండలా ధరించవచ్చు. కానీ మూర్ఖుడి మనసు రంజింపజెయ్యడం కుదరని పని. అది ఎంతటి వారికైనా అసాధ్యం.

నవ్య నివేదన

శుక్రవారం • 7 జూన్ 2024



గీతాసారం

చైతన్య సాధన మార్గాలు

కర్ణుడు, అర్జునుడు... ఇద్దరూ కుంతికి జన్మించారు. కానీ వ్యతిరేక పక్షాల్లో నిలిచి పోరాడారు. కర్ణుడు శాపగ్రస్తుడు. ఆ కారణంగా... అర్జునుడితో సాగించిన కీలకమైన పోరాటంలో... కర్ణుడి జ్ఞానం, యుద్ధ అనుభవం అతనికి ఉపయోగపడలేదు. యుద్ధంలో ఓడిపోయాడు, హతుడయ్యాడు. ఈ పరిస్థితి మనకందరికీ వర్తిస్తుంది. మనమూ తరచుగా కర్ణుడిలాగానే ఉంటాం. జీవితంలో మనం చాలా నేర్చుకుంటాం. జ్ఞానాన్నీ, అనుభవాన్నీ పొందుతాం. కానీ కీలకమైన సమయాల్లో మనం అవగాహనకు బదులు మన ప్రవృత్తులను బట్టి ఆలోచిస్తాం. పని చేస్తాం. ఎందుకంటే మన అవగాహన అవసరమైన స్థాయికన్నా తక్కువగా ఉంటుంది.

శ్రీకృష్ణుడికి దీని గురించి పూర్తిగా తెలుసు. కాబట్టే వివిధ కోణాల నుంచి వాస్తవికతను, సత్యాన్నీ 'భగవద్గీత'లో పదేపదే వివరించాడు. తద్వారా లోతైన అవగాహనలో అవసరమైన స్థాయికి చేరుకోవాలన్నాడు. ఒక నదికి ఉండే రెండు తీరాల్లా... మనలో అంతరాత్మ, భౌతిక శరీరం అనే రెండు భాగాలున్నాయని 'భగవద్గీత' చెబుతుంది. సాధారణంగా మనం మన భౌతిక శరీరం, మన భావోద్వేగాలు, ఆలోచనలు మన చుట్టూ ఉన్న ప్రపంచంతో కూడిన బాహ్య భాగం ద్వారా గుర్తింపు పొందుతూ ఉంటాం. అలాకాకుండా అన్ని జీవుల్లో ఉన్నది, శాశ్వతమైనది, మార్పు లేనిది అయిన మన అంతరాత్మను గుర్తించమన్నాడు శ్రీకృష్ణుడు. ఆత్మజ్ఞాని అంతరాత్మ అనే ఒక ఒడ్డు చేరుకొని... ఇక్కడ ఉన్నది కేవలం ఒక్క ఒడ్డు మాత్రమేననీ, అవతలి ఒడ్డు అనేది తాడును పాముగా భ్రమించడం... అంటే 'రజ్జు సర్ప భ్రాంతి' అనీ తెలుసుకుంటాడు.

ద్వంద్వాలను అధిగమించడం (ద్వంద్వాతీత), గుణాలను అధిగమించడం (గుణాతీత), సమానత్వం, 'మనం కర్తలం కాదు, సాక్షులం' అని గ్రహించడం, కర్మ నుంచి కర్మ ఫలాలు స్వతంత్రమైనవనే అవగాహన అనేవి చైతన్య సాధన మార్గాలు. వంద పుస్తకాలు చదవడం కన్నా భగవద్గీతను (ముఖ్యంగా రెండవ అధ్యాయాన్ని) చాలాసార్లు చదవడం మంచిది. ఎందుకంటే ప్రతిసారీ గీతాపఠనం మనలో విభిన్నమైన రుచిని, భావనను, మెరుగైన సాక్షాత్కారాన్నీ కలిగిస్తుంది. ఆనందాన్ని ప్రవహింపజేస్తుంది.



కె. శివప్రసాద్
ఐఎఎస్

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/vV3GMJHలో చదవండి.

బిజినెస్

విజయవాడ ● శుక్రవారం 7 జూన్ 2024

డబ్ల్యూఈఎఫ్ టెక్ పయనీర్ జాబితాలో నెక్స్ట్‌వేవ్

మరో 10 స్టార్టప్‌లకు చోటు

న్యూఢిల్లీ: భారత్‌కు చెందిన 10 స్టార్టప్‌లకు వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (డబ్ల్యూఈఎఫ్) టెక్నాలజీ పయనీర్ 2024 జాబితాలో చోటు లభించింది. ఇందులో టెక్నాలజీ, ఎడ్యుకేషన్ రంగాల్లో కృషి చేస్తున్న హైదరాబాద్‌కు చెందిన నెక్స్ట్‌వేవ్ కూడా ఉంది. తెలుగు రాష్ట్రాల నుంచి ఈ అరుదైన గౌరవం పొందిన తొలి ఎడ్‌టెక్ స్టార్టప్ ఇదే. కృత్రిమ మేధ (ఏఐ) నుంచి స్వచ్ఛ ఇంధన సొల్యూషన్లు, హెల్త్‌కేర్ ఇన్నోవేషన్, అంతరిక్షం, బయో టెక్నాలజీ, న్యూరో టెక్నాలజీ వరకు విభిన్న టెక్ రంగాల్లో పని చేస్తున్న 100 అగ్రగామి స్టార్టప్‌లతో డబ్ల్యూఈఎఫ్ ఈ జాబితా ప్రకటించింది. ఈ జాబితాలో ఉన్న ఇతర భారతీయ స్టార్టప్‌లలో పిక్సెల్, నిరామయ్, సర్వం ఏఐ, యాంపియెర్‌అవర్, క్రాపిన్, ఎంట్రీ, హెల్త్‌పిక్స్, ఇంటర్నేషనల్ బ్యాటరీ కంపెనీ, స్ట్రింగ్ బయో ఉన్నాయి.

వడ్డీ రేట్లు తగ్గించిన ఈసీబీ

ఫ్రాంక్‌ఫర్ట్ (జర్మనీ): యూరోపియన్ కేంద్ర బ్యాంక్ (ఈసీబీ) కీలక నిర్ణయం తీసుకుంది. కీలక వడ్డీ రేటును 4 శాతం నుంచి 3.75 శాతానికి తగ్గించింది. 2019 తర్వాత ఈసీబీ వడ్డీ రేట్లు తగ్గించడం ఇదే మొదటిసారి. వడ్డీ రేట్లు తగ్గించాలా? వద్దా? అని అమెరికా కేంద్ర బ్యాంక్ ఫెడ్ రిజర్వ్‌తో సహా అనేక దేశాల కేంద్ర బ్యాంకులు తర్జనభర్జనలు పడుతున్న సమయంలో ఈసీబీ ఈ నిర్ణయం తీసుకోవడం విశేషం. కాగా శుక్రవారం నాడు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) తన ద్రవ్య పరపతి విధాన సమీక్ష వివరాలను వెల్లడించనుంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,420 ▲	67,300 ▲	98,000 ▲
ముంబై	72,757 ▲	66,645 ▲	90,407 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



7వ తేదీ			
హైదరాబాద్	430	విజయవాడ	450
వరంగల్	432	గోదావరి	445
చిత్తూరు	513	విశాఖపట్నం	450
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	147	విజయవాడ	149
వరంగల్	147	గుంటూరు	149
కరీంనగర్	147	ఒంగోలు	149
మహబూబ్‌నగర్	147	చిత్తూరు	149
కర్నూలు	147	నెల్లూరు	149
విశాఖపట్నం	135	అనంతపురం	149
గోదావరి	149		

2 రోజుల్లో రూ.21 లక్షల కోట్లు

భారీగా పెరిగిన మార్కెట్ సంపద .. ● మరో 692 పాయింట్ల లాభంతో 75,000 ఎగువకు సెన్సెక్స్

- 201 పాయింట్లు పెరిగిన నిఫ్టీ
- అదానీ షేర్లలో కొనసాగిన ర్యాలీ

హెరిటేజ్ షేరు మరో 10% అప్



ముంబై: కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటుపై రాజకీయ అనిశ్చితి తొలగిపోవడంతో పాటు నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో స్టాక్ మార్కెట్లో వరుసగా రెండో రోజూ ర్యాలీ కొనసాగింది. గురువారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఒక దశలో 915.49 పాయింట్ల వరకు పెరిగి 75,297.73 వద్దకు చేరుకున్నప్పటికీ, చివర్లో 692.27 పాయింట్ల లాభంతో 75,074.51 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 290 పాయింట్ల మేర బలపడినప్పటికీ, 201.05 పాయింట్ల లాభంతో 22,821.40 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్ల కొనుగోళ్ల జోరుతో స్టాక్ మార్కెట్ సంపదగా పరిగణించే బీఎస్‌ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రెండు రోజుల్లో రూ.21.05 లక్షల కోట్లు పెరిగి రూ.415.89 లక్షల కోట్లకు చేరుకుంది. ఎన్‌డీఏలోనే కొనసాగడంతో పాటు కేంద్రంలో సుస్థిర ప్రభుత్వం ఏర్పాటుకు మద్దతిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటించడంతో బుధవారం సెన్సెక్స్ 2,303.19 పాయింట్లు, నిఫ్టీ 735.85 పాయింట్లు లాభపడిన విషయం తెలిసిందే. మరిన్ని ముఖ్యాంశాలు..

- సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 23 లాభపడ్డాయి. టెక్ మహీంద్రా షేరు 4.07 శాతం, హెచ్‌సీఎల్ టెక్ 4.04 శాతం వృద్ధితో సూచీ టాప్ గెయినర్లుగా నిలిచాయి. కాగా, హిందుస్థాన్ యూనిలీవర్ 2.04 శాతం క్షీణించింది.
- బ్లూచిప్‌లతో పోలిస్తే చిన్న, మధ్య స్థాయి కంపెనీల్లో జోరుగా కొనుగోళ్లు జరిగాయి. దాంతో బీఎస్‌ఈ స్మాల్‌క్యాప్ సూచీ 3.06 శాతం ఎగబాకగా.. మిడ్‌క్యాప్ ఇండెక్స్ 2.28 శాతం పెరిగింది. బీఎస్‌ఈలోని అన్ని రంగాల సూచీలూ పాజిటివ్‌గా ముగిశాయి. రియల్టీ 4.85 శాతం ఎగబాకగా.. ఇండస్ట్రియల్స్ సూచీ 3.69 శాతం పుంజుకుంది. పవర్, ఐటీ, యుటిలిటీస్, ఎనర్జీ ఇండెక్స్‌లు 2 శాతానికి పైగా వృద్ధి చెందాయి.
- వరుసగా రెండో రోజూ అదానీ గ్రూప్‌లోని 10 కంపెనీల్లో 9 లాభపడ్డాయి. అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ షేరు 5.10 శాతం వృద్ధి చెందగా.. అదానీ టోటల్ గ్యాస్ 3.97 శాతం, ఎన్‌డీటీవీ 3.70 శాతం, అదానీ పవర్ 3.17 శాతం, అదానీ విల్మర్ 3.05 శాతం, ఏసీసీ 2.56 శాతం, అదానీ ఎంటర్‌ప్రైజెస్ 2.13 శాతం, అదానీ గ్రీన్ ఎనర్జీ 1.99 శాతం, అంబుజా సిమెంట్స్ 1.77 శాతం పెరిగాయి. అదానీ పోర్ట్స్ మాత్రం 0.18 శాతం నష్టపోయింది. దాంతో అదానీ గ్రూప్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.14.08 లక్షల కోట్లుగా నమోదైంది.
- రాయ్‌పూర్‌లో థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించి అదానీ పవర్ నుంచి రూ.3,500 కోట్ల విలువైన ఆర్డర్ దక్కించుకున్న నేపథ్యంలో బీహెచ్‌ఈఎల్ షేరు ఒక దశలో 15 శాతం వరకు ఎగబాకినప్పటికీ, చివరికి 8.97 శాతం లాభంతో రూ.278.15 వద్ద ముగిసింది.
- ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 5 పైసలు క్షీణించి 83.49 వద్ద ముగియగా.. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ ముడి చమురు పీపా ధర ఒక దశలో 0.09 శాతం పెరిగి 78.43 డాలర్ల వద్ద ట్రేడైంది.
- దేశీయంగా విలువైన లోహాల ధరలు మళ్లీ పెరిగాయి. ఢిల్లీ బులియన్ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్లు) బంగారం రూ.680 పెరుగుదలతో రూ.73,500కు చేరుకుంది. కిలో వెండి రూ.1,400 పెరిగి రూ.93,300 ధర పలికింది. అంతర్జాతీయంగా వీటి ధరలు పెరగడమే ఇందుకు కారణం. ఇంటర్నేషనల్ కమోడిటీ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ రేటు 28 డాలర్లు పెరిగి 2,360 డాలర్లకు చేరుకోగా.. సిల్వర్ 30.30 డాలర్ల వద్ద ట్రేడైంది.

మోదీ మూడో టర్మ్‌లో సెన్సెక్స్ @1,00,000

భారత స్టాక్ మార్కెట్లో ప్రస్తుతం కొనసాగుతున్న బుల్ ర్యాలీకి ఢోకా లేదని ప్రముఖ అంతర్జాతీయ ఈక్విటీ ఇన్వెస్టర్ మార్క్ మొబియస్ అన్నారు. ఎన్‌డీఏకు భారీ మెజారిటీ లభించకపోయినప్పటికీ, మోదీ మూడో టర్మ్ ముగియక ముందే సెన్సెక్స్ 1,00,000 పాయింట్ల మైలురాయికి చేరుకోవచ్చని ఆయన అంచనా వేశారు. వచ్చే పదేళ్లపాటు సెన్సెక్స్ 14-15 శాతం చొప్పున వృద్ధి చెందవచ్చని మొబియస్ అభిప్రాయపడ్డారు.

ఆంధ్రా షేర్లు జిగేల్

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో హెరిటేజ్ ఫుడ్స్ షేరు వరుసగా నాలుగో రోజూ లాభపడింది. బీఎస్‌ఈలో కంపెనీ షేరు మరో 10 శాతం పెరిగి సరికొత్త ఏడాది గరిష్ఠ స్థాయి రూ.601.60 వద్ద ముగిసింది. అలాగే, టీడీపీ మాజీ ఎంపీ జయదేవ్ గల్లాకు చెందిన అమరరాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్ షేరు ఇంట్రాడేలో మరో 10 శాతం ఎగబాకి సరికొత్త ఆల్‌టైం రికార్డు స్థాయి రూ.1,332.75 వద్దకు చేరుకుంది. చివరికి 4.91 శాతం లాభంతో రూ.1,275.65 వద్ద క్లోజైంది. ఏపీలో సిమెంట్ ప్లాంట్ కలిగిన కేసీపీ లిమిటెడ్ షేరు ఇంట్రాడేలో 19 శాతం వరకు పెరిగి రూ.238.70 వద్ద సరికొత్త ఏడాది గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి 8.82 శాతం లాభంతో రూ.219.60 వద్ద స్థిరపడింది. వీటితో పాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పలు లిస్టెడ్ కంపెనీల షేర్లు భారీగా లాభపడ్డాయి. అవంతీ ఫీడ్స్ 7.99 శాతం, ఆంధ్రా సిమెంట్స్ 3.23 శాతం, ఆంధ్రా పెట్రోకెమికల్స్ 6.89 శాతం, ఆంధ్రా షుగర్స్ 2.72 శాతం, అపెక్స్ ఫ్రోజెన్ ఫుడ్స్ 3.89 శాతం పెరిగాయి.

వచ్చే జూన్ నాటికి 82,000కు సెన్సెక్స్!

భారత స్టాక్ మార్కెట్లో అత్యంత సుదీర్ఘ, బలమైన బుల్ ర్యాలీ కొనసాగుతోందని అంతర్జాతీయ ఆర్థిక సేవల దిగ్గజం మోర్గాన్ స్టాన్లీ తాజా నివేదికలో పేర్కొంది. 2025 జూన్ నాటికి సెన్సెక్స్ 82,000 మైలురాయికి చేరుకోవచ్చని అంచనా వేసింది. భారత స్థూల ఆర్థికాంశాలు అత్యంత సానుకూలంగా ఉన్న నేపథ్యంలో చాలా కంపెనీల షేర్లు ఇప్పటికీ ఆకర్షణీయ ధరల్లో లభిస్తున్నాయంది. బీజేపీ నేతృత్వ ఎన్‌డీఏ మెజారిటీ దక్కించుకోవడంతో పాటు మూడోసారి అధికారంలోకి రానుండటం విధానపరమైన స్థిరత్వానికి భరోసా కల్పించనుందని, ఇది ఈక్విటీ మార్కెట్లకు సానుకులంగా పరిణమించనుందని అభిప్రాయపడింది. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు మరిన్ని నిర్మాణాత్మక సంస్కరణలకు బాటలు వేయనున్నాయని, వచ్చే ఐదేళ్ల పాటు 20 శాతం చొప్పున ఆదాయ వృద్ధి నమోదు కావచ్చన్న మా అంచనాలకు మద్దతివ్వనున్నాయని మోర్గాన్ స్టాన్లీ పేర్కొంది.

ప్రత్యేక కంపెనీగా ఐటీసీ హోటల్స్

న్యూఢిల్లీ: ఐటీసీ హోటల్స్‌ను ప్రత్యేక లిస్టెడ్ కంపెనీగా వేరు చేసేందుకు ఐటీసీ వాటాదారులు ఆమోదం తెలిపారు. ఇందుకు సంబంధించిన తీర్మానానికి 99.6 శాతం మంది వాటాదారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ తీర్మానంతో ఐటీసీ హోటల్స్ ఈక్విటీలో 40 శాతం ఐటీసీ వద్ద, 60 శాతం వాటా మదుపరుల వద్ద ఉంటుంది.

6 లిస్టెడ్ కంపెనీలుగా వేదాంత

అనిల్ అగర్వాల్ నాయకత్వంలోని వేదాంత లిమిటెడ్ ఆరు లిస్టెడ్ కంపెనీలుగా మారనుంది. ఎస్‌బీఐతో సహా 52 శాతానికి పైగా రుణదాతలు ఇందుకు ఆమోదం తెలిపినట్టు కంపెనీ తెలిపింది. మరో వారం పది రోజుల్లో మిగిలిన రుణదాతలూ ఇందుకు ఆమోదం తెలుపుతారని కంపెనీ భావిస్తోంది.

టాప్ 20లో విశాఖ కంటైనర్ టెర్మినల్

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం కంటైనర్ టెర్మినల్ ప్రపంచంలోని టాప్ 20లో ఒకటిగా నిలిచింది. ప్రపంచ బ్యాంక్ రూపొందించిన జాబితాలో విశాఖ కంటైనర్ టెర్మినల్ 18వ స్థానాన్ని దక్కించుకుంది. నౌకల బెర్తింగ్, కంటైనర్ల నిర్వహణ వంటి వాటిని పరిగణనలోకి తీసుకొని టెర్మినల్స్ పనితీరు అంచనా వేస్తారు. విశాఖ కంటైనర్ టెర్మినల్‌లో క్రేన్లు గంటకు 27.5 మూవ్‌మెంట్లు, పోర్టులో టర్న్ అరౌండ్ టైమ్ 21.4 గంటలు, బెర్త్‌లో నౌకను నిలిపి ఉంచే తక్కువ సమయం, వినియోగదారులకు అందుతున్న నాణ్యమైన సేవలను లెక్కలేసి 18వ స్థానాన్ని ఇచ్చారు.

ఎన్నికల వేళ.. బిల్లుల గోల

- మాజీ సలహాదారు తీవ్ర ప్రయత్నాలు
- కాంట్రాక్టర్లకు 102 కోట్లు ఇవ్వాలని ఒత్తిడి
- సర్వే కమిషనర్ కూడా గట్టిగా కృషి
- కోడ్‌ను ఉల్లంఘించి మరీ లేఖాస్త్రాలు
- మరోవైపు వసూల్‌రాజా పైరవీలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా.. ఈసీ అనుమతి లేకుండా.. అస్మదీయ కాంట్రాక్టర్లకు బిల్లులు ఇప్పించేందుకు ఓ మాజీ సలహాదారు, ముఖ్యనేత వద్ద పనిచేసిన ఓ ఐఏఎస్ సకల ప్రయత్నాలు చేశారు. బినామీ కంపెనీలతో పనులు చేయించి, వాటికి రూ.102 కోట్ల బిల్లులు ఇప్పించేందుకు ప్రయత్నించారు. సర్వే కమిషనర్‌తో ప్రభుత్వానికి లేఖలు పెట్టించి ఆగమేఘాల మీద బిల్లుల విడుదలకు గట్టి ప్రయత్నాలే చేశారని తెలిసింది. అయితే రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కోడ్‌ను దృష్టిలో పెట్టుకొని ఈ ప్రయత్నాలకు సహకరించలేదని సమాచారం. దీంతో ఆయనపై సీఎంఓ స్థాయిలో ఒత్తిళ్లు తీసుకొచ్చే ప్రయత్నం జరిగినట్లు తెలిసింది. రాష్ట్రంలో భూముల రీసర్వే కోసం భారీగా రోవర్‌లు, డిజిటల్ ఎక్విప్‌మెంట్, ఇతర పరికరాలను కొన్నారు. వాటిలో సింహభాగం మాజీ సలహాదారు బినామీలు, అస్మదీయ కంపెనీలున్నాయి. రీసర్వే పేరిట సర్వే విభాగంతో దాదాపు 700 కోట్ల విలువైన కొనుగోళ్లు జరిగేలా ఆయన చక్రం తిప్పారు. ఇందుకు రెవెన్యూ, సర్వే, ఐటీవిభాగం అధికారులు కొందరు రూల్స్, చట్టాలను ఉల్లంఘించి మరీ సహ కరించారు. కాంట్రాక్టర్లకు దాదాపు 370కోట్ల బకాయిలున్నాయి. ఎన్నికలు సమీపించే సమయంలో బిల్లులను ఇప్పించేందుకు ఆ మాజీ సలహాదారు అన్ని ప్రయత్నాలు చేశారు. మార్చిలోనే బిల్లులు ఇప్పిద్దామనుకున్నా ఖజానా ఖాళీగా ఉండటంతో వెనక్కి తగ్గారు. ఏప్రిల్‌లో సర్కారు తెచ్చిన అప్పుల్లోంచి ఎలాగైనా బిల్లులు ఇప్పించాలని ప్రయత్నాలు చేశారు. కానీ అప్పటికే కోడ్ అమల్లోకి వచ్చింది. ఏప్రిల్ 25న సర్వే కమిషనర్ సిద్ధార్థ్ జైన్ రెవెన్యూ, ఆర్థిక శాఖలకు లేఖలు రాశారు. తమకు బడ్జెట్‌లో ప్రతిపాదించిన నిధులు 227 కోట్లు ఇవ్వలేదని, ఇప్పుడు కనీసం 102 కోట్లు విడుదల చేయాలని కోరారు. అప్పటికే ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. నామినేషన్ల పర్వం కొనసాగుతోంది. సరిగ్గా అదే సమయంలో ప్రభుత్వం నుంచి 102కోట్లు రాబట్టుకొని, కాంట్రాక్టర్లకు బిల్లుల రూపంలో చెల్లించేందుకు తాజా మాజీ సలహాదారు పెద్ద పన్నాగమే పన్నారు. ఇందుకు సర్వే అధికారులు శక్తివంచన లేకుండా సహకరించారు. కోడ్ అమల్లో ఉండగా వంద కోట్ల బిల్లులు చెల్లించేందుకు లేఖలు రాయడం ఆ ఐఏఎస్ అధికారికే చెల్లింది. ఈ విషయంలో వసూల్‌రాజా కూడా రంగంలోకి దిగారు. సర్వే కమిషనర్ కోరినట్లుగా వెంటనే 102 కోట్లు విడుదల చేయాలని, ఇది ముఖ్యనేత ఆదేశమంటూ ఆయన ఒత్తిడి చేశారు. అయితే సర్వే కమిషనర్ లేఖపై రెవెన్యూ శాఖ స్పందించలేదని తెలిసింది. ఎన్నికల కోడ్ దృష్ట్యా ఈ లేఖ ఆధారంగా బిల్లుల విడుదలకు ఫైల్ ప్రాసెస్ చేయలేదని తెలిసింది.

బిల్లుల్లో 25 శాతం కమిషన్?

భూముల సర్వే పేరిట సర్వే శాఖతో అడ్డగోలుగా పరికరాలు కొనుగోలు చేయించారు. ఇప్పటి వరకు 700 కోట్ల విలువైన పరికరాలు కొన్నారు. ఇంకా కాంట్రాక్టర్లు, ఏజెన్సీలకు 370 కోట్ల మేర బిల్లులు చెల్లించాల్సి ఉంది. బిల్లుల చెల్లింపులో ఓ సర్వే అధికారికి 25 శాతం మేర కమిషన్ ముట్టచెప్పేలా మౌఖిక ఒప్పందాలున్నట్లు కాంట్రాక్టు వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఆయన ముందుగానే కమిషన్ తీసుకోవడంతో ఎన్నికల కోడ్ సమయంలో కూడా బిల్లుల విడుదల కోసం తీవ్రప్రయత్నాలు చేసినట్లుగా ఆ వర్గాలు చెబుతున్నాయి.

మెరుపు వీరుడి వీడ్కోలు



ఆఖరాట ఆడేసిన ఛెత్రి

భారత ఫుట్‌బాల్ కెప్టెన్ సునీల్ ఛెత్రి (39) తన 19 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. 2005లో పాకిస్థాన్‌తో మ్యాచ్‌లో బైచుంగ్ భూటియాకు గాయం కావడంతో ఆడే అవకాశం దక్కించుకొన్న ఛెత్రి మళ్లీ వెనుదిరిగి చూడలేదు. ఆకట్టుకొనే విన్యాసాలు చేయకపోయినా.. మెరుపు వేగం, కచ్చితమైన ఫినిషింగ్‌తో గోల్స్ చేయడం ఛెత్రి స్టైల్. సుదీర్ఘ కెరీర్‌లో 151 మ్యాచ్‌లకు ప్రాతినిధ్యం వహించాడు. అంతర్జాతీయ ఫుట్‌బాల్ చరిత్రలో అత్యధిక గోల్స్ చేసిన క్రిస్టియానో రొనాల్డో (128), ఇరాన్ ప్లేయర్ అలీ దై (108), లియోనెల్ మెస్సీ (106) తర్వాత సునీల్ (94) నాలుగో స్థానంలో నిలిచాడు.

క్రీడాకారుల కుటుంబం నుంచి..

1984, ఆగస్టు 3న సికింద్రాబాద్‌లో క్రీడాకారుల కుటుంబంలో ఛెత్రి జన్మించాడు. ఆర్మీలో పని చేసిన సునీల్ తండ్రి కేబీ ఛెత్రి కూడా ఫుట్‌బాలర్ కాగా.. తల్లి సుశీల నేపాల్ మహిళల జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. సునీల్ బాల్యం మొత్తం డార్జిలింగ్‌లో గడిచింది. చిన్ననాటి నుంచి అనేక టోర్నీల్లో పాల్గొంటూ అందరి దృష్టినీ ఆకర్షించాడు. ఇంగ్లిష్, హిందీ, నేపాలీ, బెంగాలీ, కన్నడ భాషలను అనర్గళంగా మాట్లాడగలడు. తెలుగు, కొంకణీ, మరాఠీ భాషలను అర్థం చేసుకోగలడు. ప్రముఖ ఫుట్‌బాలర్ సుబ్రతో భట్టాచార్య కుమార్తె సోనమ్‌ను 2017లో వివాహం చేసుకొన్నాడు.

వేగంగా ఎదిగి..

2004లో భారత అండర్-20 జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఛెత్రి.. వేగంగా సీనియర్ జట్టులో చోటు దక్కించుకున్నాడు. 2007, 2009, 2012లో భారత్ నెహ్రూ కప్ నెగ్గడంలో సునీల్‌ది కీలకపాత్ర. అంతేకాకుండా 2011, 2015, 2021, 2023ల్లో శాఫ్ చాంపిన్‌షిప్స్ అందుకొన్నాడు. 2008 ఏఎఫ్‌సీ చాలెంజర్స్ కప్‌లో ఛెత్రి మ్యాజిక్‌తో నెగ్గిన భారత్.. 27 ఏళ్ల తర్వాత ఏఎఫ్‌సీ ఆసియాకప్‌నకు అర్హత సాధించింది. కానీ, ఫిఫా వరల్డ్‌కప్‌నకు అర్హత సాధించాలనుకొన్న అతడి కల మాత్రం నెరవేరలేదు. ఈస్ట్ బెంగాల్, మోహన్ బగాన్ తదితర క్లబ్‌లతోపాటు ఐఎస్ఎల్‌లో ముంబై సిటీ, బెంగళూరుకు ప్రాతినిధ్యం వహించాడు. స్పెయిన్ మాజీ ఆటగాడు డేవిడ్ విల్లాతో కలసి ఆడాలనే కోరిక ఉందని ఒక సమయంలో సునీల్ తెలిపాడు. కాగా, ఇంగ్లండ్‌లోని క్లబ్ తరపున ఆడే అవకాశం దక్కినా.. వర్క్ పర్మిట్ రాకపోవడంతో వెళ్లలేకపోయాడు. 2011లో అర్జున అవార్డుకు ఎంపికైన సునీల్‌ను 2019లో ప్రభుత్వం 'పద్మ శ్రీ'తో సత్కరించింది. 2021లో ఖేల్ రత్న అవార్డు దక్కించుకొన్నాడు.



భారత్, కువైట్ మ్యాచ్ డ్రా

కోల్‌కతా: విజయంతో కెప్టెన్ సునీల్ ఛెత్రికి గ్రాండ్‌గా వీడ్కోలు పలకాలనుకొన్న భారత జట్టుకు నిరాశే ఎదురైంది. ఫిఫా వరల్డ్ కప్-2026 క్వాలిఫయర్స్‌లో భాగంగా గురువారం గ్రూప్-ఎ రెండో రౌండ్‌లో భారత్-కువైట్ మధ్య జరిగిన మ్యాచ్ 0-0తో డ్రాగా ముగిసింది. దీంతో మూడో రౌండ్‌కు చేరుకోవడం టీమిండియాకు మరింత సంక్లిష్టంగా మారింది. ఈ డ్రాతో 5 పాయింట్లు సాధించిన భారత్.. ఈనెల 11న జరిగే చివరి మ్యాచ్‌లో ఖతార్‌తో తలపడనుంది. కాగా ఛెత్రి కువైట్‌తో మ్యాచే తన చివరి అంతర్జాతీయ మ్యాచ్ అని కొద్ది రోజుల ముందే ప్రకటించడంతో.. 68 వేల మంది కెపాసిటీ కలిగిన సాల్ట్ లేక్ స్టేడియం అభిమానులతో కిటకిటలాడిపోయింది. మ్యాచ్ ముగిసిన అనంతరం సునీల్ అభివాదం చేస్తూ వెళ్తుంటే.. ఫ్యాన్స్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు.

నేటి మ్యాచ్

కెనడా x ఐర్లాండ్ (రా.8. గం.)

ఉగాండా థ్రిల్లింగ్ విన్

- 3 వికెట్లతో పపువాపై గెలుపు
- ఎన్‌సుబుగా రికార్డు ఫీట్

ప్రొవిడెన్స్ (గయానా): టీ20 వరల్డ్‌కప్‌లో ఉగాండా తొలి విజయాన్ని నమోదు చేసింది. గ్రూప్-సిలో గురువారం జరిగిన థ్రిల్లింగ్ ఫైట్‌లో ఉగాండా 3 వికెట్ల తేడాతో పపువా న్యూ గినీ (పీఎన్‌జీ)పై గెలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన పీఎన్‌జీ 19.1 ఓవర్లలో 77 పరుగులకే కుప్పకూలింది. హిరి హిరి (15), లెగా స్లకా (12), కిప్లిన్ డోంగా (12) మాత్రమే రెండంకెల స్కోరును అందుకొన్నారు. రంజాని, కీవుటా, మియాగి తలో రెండు వికెట్లు పడగొట్టారు. కానీ, 43 ఏళ్ల స్పిన్నర్ ఫ్రాంక్ ఎన్‌సుబుగా (4-2-4-2) పొట్టి కప్ చరిత్రలోనే అత్యుత్తమ గణాంకాలు నమోదు చేశాడు. అనంతరం ఛేదనలో ఉగాండా 18.2 ఓవర్లలో 78/7 స్కోరు చేసి గెలిచింది. రియాజత్ అలీ (33) జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. అలీ నవో, నార్మన్ చెరో 2 వికెట్లు దక్కించుకొన్నారు.


పాకిస్థాన్ 159/7

యూఎస్‌ఏతో మ్యాచ్

డాలస్: యూఎస్‌ఏ బౌలర్లు కట్టడి చేయడంతో టీ20 ప్రపంచకప్‌లో పాకిస్థాన్ ఓ మాదిరి స్కోరుకే పరిమితమైంది. గురువారం గ్రూప్ 'ఎ'లో భాగంగా జరిగిన ఈ మ్యాచ్‌లో కెప్టెన్ బాబర్ ఆజమ్ (44), షాదాబ్ ఖాన్ (40) రాణించడంతో పాక్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 159 పరుగులు చేసింది. చివర్లో షహీన్ (23 నాటౌట్) వేగంగా ఆడాడు. ఆరంభంలో యూఎస్ బౌలర్ల ధాటికి పాక్ 26 పరుగులకే రిజ్వాన్ (9), ఉస్మాన్ ఖాన్ (3), ఫఖర్ (11) వికెట్లను కోల్పోయింది. ఈ దశలో బాబర్-షాదాబ్ జోడీ నాలుగో వికెట్‌కు 72 పరుగులు జత చేశారు. చివర్లో షహీన్ కాస్త బ్యాట్ ఝుళిపించడంతో స్కోరు 150 దాటగలిగింది. అనంతరం ఛేదనలో కడపటివార్తలందేసరికి యూఎస్‌ఏ 12 ఓవర్లలో వికెట్ నష్టానికి 94 పరుగులు చేసింది. క్రీజులో మోనంక్ పటేల్ (40 బ్యాటింగ్), గౌస్ (35 బ్యాటింగ్) ఉన్నారు.

స్పోర్ట్స్

సరబ్‌జోత్‌కు స్వర్ణం



మ్యూనిచ్: వరల్డ్ చాంపియన్ బోవెన్ ఝాంగ్ (చైనా), నాలుగుసార్లు ఒలింపియన్ యూసుఫ్ డికెక్ (టర్కీ) వంటి అగ్రశ్రేణి షూటర్లను వెనక్కునెట్టిన సరబ్‌జోత్ సింగ్ ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్‌లో స్వర్ణ పతకం కొల్లగొట్టాడు. గురువారం జరిగిన పురుషుల 10 మీ. ఎయిర్ పిస్టల్ ఫైనల్లో 22 ఏళ్ల సరబ్‌జోత్ 242.7 పాయింట్లు స్కోరు చేసి టైటిల్ దక్కించుకున్నాడు. షూయ్‌హాంగ్ (చైనా) రజతం, రాబిన్ వాల్టర్ (జర్మనీ) కాంస్యం నెగ్గారు. సరబ్‌జోత్ స్వర్ణంతో ఈ పోటీల్లో భారత్ పతక ఖాతా తెరిచింది.



స్టొయినిస్ ఆల్‌రౌండ్‌షో

ఒమన్‌పై ఆసీస్ విక్టరీ ● టీ20 వరల్డ్‌కప్

బ్రిడ్జిటౌన్: మార్కస్ స్టొయినిస్ (36 బంతుల్లో 2 ఫోర్లు, 6 సిక్స్‌లతో 67 నాటౌట్, 3/19) ఆల్‌రౌండ్ ప్రతిభను ప్రదర్శించడంతో టీ20 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా ఘనంగా బోణీ చేసింది. గురువారం ఒమన్‌తో జరిగిన గ్రూప్ 'బి' మ్యాచ్‌లో 39 పరుగుల తేడాతో కంగారూలు ఘనవిజయం సాధించారు. ముందుగా టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 164 పరుగులు చేసింది. డేవిడ్ వార్నర్ (56) అర్ధసెంచరీ సాధించాడు. అయితే ఒమన్ బౌలర్ల ధాటికి ఆరంభంలో హెడ్ (12), మార్ష్ (14), మ్యాక్స్‌వెల్ (0) నిరాశపర్చగా, ఆసీస్ 50/3 స్కోరుతో ఇబ్బంది పడింది. ఈ దశలో స్టొయినిస్ స్వేచ్ఛగా ఆడేస్తూ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. 15వ ఓవర్‌లోనైతే నాలుగు సిక్సర్లతో 26 రన్స్ రాబట్టాడు. అలాగే వార్నర్‌తో కలిసి నాలుగో వికెట్‌కు 102 పరుగుల భాగస్వామ్యాన్ని జత చేయడం విశేషం. ఆ తర్వాత ఛేదనలో ఒమన్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 125 పరుగులే చేయగలిగింది. అయాన్ ఖాన్ (36) టాప్ స్కోరర్. స్టార్క్, జంపా, ఎల్లిస్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి.

1 టీ20 క్రికెట్‌లో ఎక్కువ (111) 50+ స్కోర్లను సాధించిన వార్నర్. గేల్ (110)ను దాటేశాడు.

సంక్షిప్త స్కోర్లు: ఆస్ట్రేలియా : 20 ఓవర్లలో 164/5 (స్టొయినిస్ 67 నాటౌట్, వార్నర్ 56; మెహ్రాన్ 2/38); ఒమన్: 20 ఓవర్లలో 125/9 (అయాన్ 36, మెహ్రాన్ 27; స్టొయినిస్ 3/19, స్టార్క్ 2/20, జంపా 2/24, ఎల్లిస్ 2/28).

క్వార్టర్‌ఫైనల్లో లక్ష్యసేన్

జకార్తా: స్టార్ షట్లర్ లక్ష్యసేన్ ఇండోనేసియా ఓపెన్ సూపర్ 1000 బ్యాడ్మింటన్ టోర్నీ క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించాడు. లక్ష్యసేన్ తప్ప గురువారం బరిలో దిగిన ఇతర భారత ఆటగాళ్లంతా పరాజయంతో టోర్నీ నుంచి వైదొలిగారు. పురుషుల సింగిల్స్ ప్రీక్వార్టర్స్ పోరులో లక్ష్యసేన్ 21-9, 21-15తో కెంటా నిషిమోటో (జపాన్)ను చిత్తు చేశాడు. ఇక ప్రియాన్షు రజావత్ 10-21, 17-21తో వితిద్‌శర్న్ చేతిలో పోరాడి ఓడాడు. మహిళల డబుల్స్ రౌండ్-16 పోరులో గాయత్రి/ట్రీసా ద్వయం 21-19, 19-21, 19-21తో మట్సుమోటో/నగహారా (జపాన్) జంట చేతిలో ఓటమి చవిచూసింది. అశ్వినీ పొన్నప్ప/తనీషా క్రాస్టో 13-21, 19-21తో హ నా బేక్/సొ హీ లీ (దక్షిణ కొరియా) చేతిలో పరాజయం పాలైంది. ఇక మిక్స్‌డ్ డబుల్స్ క్వార్టర్స్‌లో సుమిత్/సిక్కిరెడ్డి 9-21, 11-21తో సిమీ జెంగ్/యోంగ్ (చైనా) చేతిలో ఓటమి పాలైంది.



స్వియటెక్ x పౌలిని



సెమీస్‌లో గాఫ్ ఓటమి ఫ్రెంచ్ ఓపెన్

పారిస్: డిఫెండింగ్ చాంపియన్ ఇగా స్వియటెక్ ఫ్రెంచ్ ఓపెన్‌లో హ్యాట్రిక్ కొట్టేందుకు మరో మ్యాచ్ దూరంలో నిలిచింది. శనివారం జరిగే మహిళ సింగిల్స్ ఫైనల్లో 12వ సీడ్ జాస్మిన్ పౌలినితో స్వియటెక్ అమీతుమీ తేల్చుకోనుంది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి సెమీఫైనల్లో పోలెండ్‌కు చెందిన టాప్ సీడ్ స్వియటెక్ 6-2, 6-4తో మూడో సీడ్ కొకా గాఫ్ (అమెరికా)ను చిత్తు చేసింది. మరో సెమీస్‌లో 12వ సీడ్ జాస్మిన్ పౌలిని (ఇటలీ) 6-3, 6-1తో అన్‌సీడెడ్ రష్యన్ టీనేజ్ సంచలనం మిరా ఆండ్రీవాపై సునాయాసంగా విజయం సాధించింది. 28 ఏళ్ల పౌలినికిది మొదటి గ్రాండ్‌స్లామ్ ఫైనల్. 2022, 2023లో చాంపియన్‌గా నిలిచిన ఇగా..ఈసారీ టైటిల్ సాధిస్తే హ్యాట్రిక్‌తో రికార్డు సృష్టిస్తుంది. ఈ విజయం రొలాండ్ గారోస్‌లో పోలెండ్ భామకు వరుసగా 20వది కావడం విశేషం. మరోవైపు గాఫ్‌పై తన రికార్డును 11-1కి స్వియటెక్ మెరుగుపరుచుకుంది. పురుషుల సింగిల్స్ రెండో సెమీఫైనల్లో ఏడో సీడ్ రూడ్ (నార్వే)తో జ్వెరెవ్ (రష్యా)తలపడతాడు. చివరి క్వార్టర్‌ఫైనల్లో జ్వెరెవ్ 6-4, 7-6 (5), 6-4తో అలెక్స్ డిమినార్ (ఆస్ట్రేలియా)ని ఓడించాడు.

బోపన్న జోరుకు తెర..: భారత స్టార్ రోహన్ బోపన్న/మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) ద్వయం జోరుకు తెరపడింది. గురువారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీఫైనల్లో ఇటలీకి చెందిన 11వ సీడ్ సిమోన్/ఆండ్రియా ద్వయం 7-5, 2-6, 6-2తో రెండో సీడ్ బోపన్న జోడీపై గెలుపొందింది.



చంద్రబాబును కలిసి అభినందనలు చెబుతున్న సచివాలయ ఉద్యోగులు

కూటమి విజయం చారిత్రాత్మకం

- చంద్రబాబు, లోకేశ్‌కు సచివాలయ ఉద్యోగుల శుభాకాంక్షలు

అమరావతి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్‌ను ఆంధ్రప్రదేశ్ సచివాలయ ఉద్యోగుల సంఘం మాజీ కార్యదర్శి జి.రామకృష్ణ, ఇతర సచివాలయ ఉద్యోగులు గురువారం వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల్లో విజయం సాధించినందుకు అభినందిస్తూ పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఇది చారిత్రాత్మక విజయమని, ఇందులో ఉద్యోగులు ప్రముఖ పాత్ర పోషించిన అంశాన్ని ఈ సందర్భంగా రామకృష్ణ గుర్తుచేశారు. వైసీపీ హయాంలో ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారని, అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, దీంతో ఉప్పెనలా కదిలొచ్చి ఓట్లు వేశారని చెప్పారు. ఐదేళ్ల వైసీపీ హయాంలో నిబంధనలకు విరుద్ధంగా, ఇష్టారీతిన అక్రమంగా బదిలీలు చేశారని, దీంతో అర్హత ఉన్న ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారన్నారు.

ఢిల్లీ మద్యం కుంభకోణంలో భారతిరెడ్డి

- భారత రాజ్యాంగాన్ని పక్కన పెట్టారు
- భారతి రాజ్యాంగాన్ని అమలు చేశారు: ఆదినారాయణరెడ్డి
- అరాచకాల ఫలితమే ప్రజా తీర్పు: సత్యకుమార్

అమరావతి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): 'ఢిల్లీ మద్యం కుంభకోణంలో భారతిరెడ్డి పాత్ర ఉంది. త్వరలోనే ఆమె ప్రమేయం కూడా బయటకు వస్తుంది. రాష్ట్రంలో భారత రాజ్యాంగాన్ని పక్కన పెట్టి భారతి రాజ్యాంగాన్ని అమలులోకి తెచ్చారు' అని జమ్మలమడుగు బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అన్నారు. ఎన్నికల్లో విజయం సాధించిన తరువాత మొదటిసారి విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి ఎమ్మెల్యేలు సత్యకుమార్ (ధర్మవరం), పార్థసారథి(ఆదోని)తో కలసి ఆదినారాయణరెడ్డి వచ్చారు. వారికి కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భగా జమ్మలమడుగు ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ అన్ని వ్యవస్థల్నీ నాశనం చేసిందని.. వైసీపీ నాయకులందరూ బీజేపీకి క్యూ కడుతున్నారని అన్నారు. సత్యకుమార్ మాట్లాడుతూ, 'అభివృద్ధిని వదిలేసి ఉత్తుత్తి బటన్ నొక్కిన జగన్‌రెడ్డికి అదే బటన్‌తో ప్రజలు బుద్ధి చెప్పారు. అరాచకాలపై వచ్చిన తీర్పును విశ్లేషించుకోకుండా ఈవీఎంలపై నిందలేయడం దొంగలు పోలీసుల్ని నిందించినట్లుంది' అన్నారు.

'దాడుల'పై జగన్ బాధ!

- జోక్యం చేసుకోవాలని గవర్నర్‌కు వినతి

అమరావతి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ శ్రేణులు అరాచకాలు, దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నా నోరు మెదపని 'మాజీ ముఖ్యమంత్రి' జగన్‌కు... అధికారం కోల్పోయిన రెండోరోజునే శాంతి భద్రతలు గుర్తుకొచ్చాయి. 'మా వాళ్లపై దాడులు జరుగుతున్నాయి' అని వాపోతూ గురువారం ఆయన ట్వీట్ చేశారు. తాము ఐదేళ్లపాటు కాపాడిన శాంతి భద్రతలు ఇప్పుడు చెల్లాచెదురయ్యాయని ఆక్రోశించారు. "రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ దాడులతో అత్యంత భయానక వాతావరణం నెలకొంది. ప్రభుత్వం ఏర్పాటు కాకముందే టీడీపీ మూకలు స్వైరవిహారం చేస్తున్నాయి. గ్రామ సచివాలయాలు, ఆర్బీకేల్లాంటి ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. వైసీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలకు రక్షణ లేకుండా పోయింది. అధికార పార్టీ ఒత్తిళ్లతో పోలీసు వ్యవస్థ నిస్తేజంగా మారిపోయింది. ఐదేళ్లుగా పటిష్ఠంగా ఉన్న శాంతి భద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయి. గవర్నర్ వెంటనే జోక్యం చేసుకుని పచ్చమూకల అరాచకాలను అడ్డుకోవాలి" అని పేర్కొన్నారు.

సోషల్ మీడియాలో 'ఫేక్' దాడులు

"గుంటూరు జిల్లా నుంచి అనంతపురం వెళ్లి.. అక్కడి క్లాక్ టవర్ సెంటర్‌లో పరిటాల శ్రీరామ్‌కు సవాల్ విసిరి తొడగొట్టిన యువకుడి చెయ్యిని నరికేశారు" అంటూ గురువారం సోషల్ మీడియాలో ఫేక్ ప్రచారం జరిగింది.

జనాలు జగన్‌ను నమ్మలేదు..: బొత్స

విజయనగరం (ఆంధ్రజ్యోతి), మండపేట, జూన్ 6: జనాలు జగన్‌ను నమ్మలేదని, చంద్రబాబునే నమ్మారని, అందుకే తాము ఓడిపోయామని తాజా మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ గురువారం అంగీకరించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించినా.. ప్రజలు మాత్రం అల్టిమేట్‌గా చంద్రబాబునే నమ్మారని, ప్రజాతీర్పును అందరూ గౌరవించాలన్నారు. కాగా, వైసీపీ గెలుపు, ఓటములకు బాధ్యత పార్టీ అధ్యక్షుడు జగన్‌దేనని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. ఇందులో ఎవరినీ తప్పుపట్టాల్సిన అవసరం లేదన్నారు. తన 30ఏళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి ఫలితాలు ఎన్నడూ చూడలేదని తెలిపారు.

వలంటీర్లే ముంచేశారు

వారిపై ఆధారపడటం వల్లే ఘోర పరాజయం

- పింఛన్లు పంచడానికి తప్పితే వారిలో చాలామంది పార్టీకి ఏ రకంగానూ ఉపయోగపడలేదు
- వలంటీర్ వ్యవస్థతో కార్యకర్తల మనోభావాలు దెబ్బతిన్నాయి
- ఫలితాలు వచ్చిన తర్వాత వైసీపీ నాయకుల మండిపాటు

విశాఖపట్నం(ఆంధ్రజ్యోతి)/చోడవరం, జూన్ 6: వలంటీర్లే మా సైన్యం అన్నారు. వలంటీర్ల వ్యవస్థ భేష్ అంటూ ప్రశంసలు కురిపించారు. చివరకు ఎన్నికల ప్రచారానికి సైతం వారిని అడ్డగోలుగా వాడేసుకున్నారు. తీరా ఫలితాలు తారుమారు కావడంతో వైసీపీ నేతలు ఇప్పుడు వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వలంటీర్లే తమను నిలువునా ముంచేశారని, వారివల్లే ఓటమి పాలయ్యామని ఆరోపిస్తున్నారు. వలంటీర్ల వ్యవస్థ ఏదో బ్రహ్మాస్త్రం అన్నట్టుగా ఇచ్చిన కలరింగ్‌తోనే పార్టీకి తీరని నష్టం జరిగిందని వైసీపీ తాజా మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ వ్యాఖ్యానించారు. వలంటీర్లపై అతిగా ఆధారపడి 2019 ఎన్నికల్లో పార్టీ విజయానికి కారణమైన కార్యకర్తలను నిర్లక్ష్యం చేయడం వల్లే ఘోరమైన ఓటమి చవిచూడాల్సి వచ్చిందని వాపోయారు. పింఛన్లు పంచడానికి తప్పితే వలంటీర్లలో చాలామంది పార్టీకి ఏ రకంగానూ ఉపయోగపడలేదని ఆరోపించారు. కాగా, వైసీపీ ఆవిర్భావం నుంచి కార్యకర్తలే పునాదిగా నిలిచారని, వలంటీర్ వ్యవస్థ కారణంగా గుర్తింపు లేకపోవడంతో వారి మనోభావాలు దెబ్బతిన్నాయని మాజీ మంత్రి అమర్‌నాథ్ పేర్కొన్నారు.

ఐప్యాక్ టీమ్‌తోనే మునిగిపోయాం: కరణం ధర్మశ్రీ

కార్యకర్తలను పట్టించుకోకుండా ప్రైవేటు కంపెనీ మాదిరిగా 'ఐప్యాక్ టీమ్‌తో పార్టీని నడిపించడం వల్లే వైసీపీ ఘోరంగా ఓడిపోయిందని కరణం ధర్మశ్రీ అన్నారు. ప్రభుత్వం తీసుకున్న కొన్ని నిర్ణయాలతో పార్టీ కేడర్ పూర్తిగా నిర్వీర్యం అయిపోయిందని చెప్పారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను వివరిద్దామంటే సీఎంను కలిసేందుకు అవకాశం ఇవ్వకుండా కోటరీ అడ్డుకుందని ధర్మశ్రీ ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీని నమ్మి కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు న్యాయం చేయలేకపోయామని పేర్కొన్నారు. ఏం మాట్లాడితే ఏ విధంగా టార్గెట్ అయిపోతామోనన్న భయంతోనే పార్టీలో కొనసాగామని వివరించారు. తనకు గెలుపు, ఓటములు కొత్తకాదని, ఫలితం ఏదైనా ప్రజాక్షేత్రంలోనే కొనసాగుతానని, నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషిస్తామని చెప్పారు.

జగన్ సంస్కరణలు ప్రజలకు నచ్చలేదేమో: అమర్‌నాథ్

సీఎం జగన్ అమలుచేసిన సంస్కరణలు ప్రజలకు నచ్చలేదేమోనని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. పార్టీలు, కులాలకు అతీతంగా, అవినీతికి ఆస్కారం లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేశామని, కానీ ఊహించని విధంగా ఎన్నికలు ఫలితాలు రావడం ఆశ్చర్యం కలిగించిందని అన్నారు. ప్రజలు అడగకుండానే అన్నీ చేయడంతో పాటు 99శాతం హామీలు అమలుచేసినా తమకు మద్దతు ఇవ్వలేదంటే వారు ఇంకా ఏదో కోరుకుంటున్నారనే భావన కలుగుతోందని పేర్కొన్నారు. కేంద్రంలో ఎన్డీఏకి రాష్ట్ర ఎంపీల మద్దతు అవసరమైనందున, దీన్ని అవకాశంగా తీసుకుని స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ ఉపసంహరణ, రైల్వేజోన్, ప్రత్యేక హోదా వంటి డిమాండ్లను సాధించుకుంటారని ఆశిస్తున్నామన్నారు. ప్రజల తీర్పును స్వాగతిస్తున్నామని, సమస్యల పరిష్కారం కోసం వారి తరఫున పోరాటం సాగిస్తామన్నారు. ఎన్నికల హామీల అమలుకు ఏడాది సమయం ఇస్తామని, అప్పటికీ నెరవేర్చకపోతే ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తామని తెలిపారు. ఈవీఎంల ట్యాంపరింగ్ అని ఆరోపించడం పిచ్చితనమే అవుతుందని అమర్‌నాథ్ ఖండించారు.

సెలవుపై జవహర్!

సీఎస్‌గా కొనసాగేందుకు చివరిదాకా ప్రయత్నం
సెలవుపై వెళ్లాలని ముందుగానే సంకేతాలు

- జగన్ హయాంలో అడ్డగోలుగా అధికార ప్రయోగం
- ఆయనను తప్పించాలని ఈసీకి టీడీపీ ఫిర్యాదులు
- అయినా, కొత్త సర్కారులో పాగాకు విఫల యత్నం
- తాను మాట్లాడుకుంటానన్న ధోరణిలో సీఎస్
- సీఎస్‌కు సంప్రదాయం కూడా తెలియదా?
- ఆయన తీరుపై సీనియర్ ఐఏఎస్‌ల విస్మయం
- జవహర్ సెలవుకు ఆమోదం..

అమరావతి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : సీఎస్ జవహర్ రెడ్డి ఎట్టకేలకు సెలవుపై వెళ్లారు. సెలవుపై వెళ్లాలని ముందే సంకేతాలు వెళ్లినా, కలవడానికి వెళ్లినప్పుడు చంద్రబాబు పట్టించుకోకపోయినా 'కొత్త ప్రభుత్వంలోనూ నేనే కొనసాగుతాను' అనే ధోరణిని జవహర్‌రెడ్డి ప్రదర్శించారు. చివరకు తత్వం బోధపడినట్టుంది. తనకు తానుగానే గురువారం సచివాలయం నుంచి నిష్క్రమించారు. ఆ వెంటనే....ఆయన పెట్టుకున్న సెలవుకు ఆమోదం లభించింది. జవహర్ రెడ్డిని వైసీపీ ప్రభుత్వం 2022 డిసెంబరు 1న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమించింది. అప్పటి నుంచి వైసీపీ ప్రభుత్వానికి కొమ్ముకాస్తూ, ఇష్టారాజ్యంగా అధికార యంత్రాంగాన్ని నడిపించారు. ఇందుకోసమే ఏరికోరి జవహర్‌రెడ్డిని జగన్ అప్పట్లో ఎంచుకున్నారు. ఆయన కంటే సీనియర్లు అరడజను మంది ఉన్నప్పటికీ సీఎస్‌గా ఆయనకు అవకాశమిచ్చారు. 18 నెలలుగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఆయన కొనసాగుతున్నారు. ఎన్నికల ప్రక్రియ మొత్తం ఆయన నేతృత్వంలోనే జరిగింది. ఎన్నికల సమయంలో ప్రతిపక్ష టీడీపీ ఆయనను తొలగించాలని కేంద్ర ఎన్నికల సంఘానికి అనేక ఫిర్యాదులు చేసింది. కానీ ఈసీ ఆయననే కొనసాగించింది. ఇంత వరకూ ఒకే కానీ... ప్రస్తుతం ఎన్నికలు పూర్తి అయ్యాయి. జగన్‌ను దించేసి, కొత్త ప్రభుత్వానికి ప్రజలు జై కొట్టారు. సాధారణంగా ఎన్నికల ఫలితాలు రాగానే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ ఇద్దరూ.. గెలిచిన పార్టీ అధినేతను కలవాల్సి ఉంటుంది. "మీరు అనుమతిస్తే కొనసాగుతాం. మీకు కొత్త ప్రయార్టీస్ ఉంటాయి కాదా" అని మర్యాదపూర్వకంగా అడగాలి. ఇదీ పాలనా సంప్రదాయం. కౌంటింగ్ తర్వాత సీఎస్, డీజీపీ ఇద్దరూ చంద్రబాబును కలిశారు. కానీ, సీఎస్ జవహర్ రెడ్డి ఈ ఆఫర్ చేయలేదు. చంద్రబాబు కూడా ఏమీ మాట్లాడలేదు. ప్రభుత్వం తననే సీఎస్‌గా కొనసాగిస్తుందన్న భావనలో ఆయన ఉన్నట్లు తెలుస్తోంది. కానీ, చంద్రబాబు ఆయనతో మాట్లాడేందుకు కూడా సుముఖత చూపలేదు. అప్పుడైనా జవహర్ రెడ్డికి అర్థమై ఉండాలి. కానీ, కానీ సీఎస్ తీరు వేరుగా ఉండటం సీనియర్ ఐఏఎస్ అధికారుల్లో చర్చనీయాంశంగా మారింది. చంద్రబాబు ఇంటి దగ్గర నుంచి సచివాలయానికి జవహర్‌రెడ్డి వెళ్లారు. చంద్రబాబు కొత్త టీమ్‌లో ఉంటారని చెబుతున్న కొందరు అధికారులు... సీఎస్‌గా తప్పుకోవాలని జవహర్‌రెడ్డికి అప్పుడే సంకేతాలు ఇచ్చారు. సెలవుపై వెళ్లాలని స్పష్టంగా చెప్పినట్లు తెలుస్తోంది. ఆయన మాత్రం తాను కుర్చీని వదిలేదే లేదన్నట్లు ప్రవర్తించారు. పైగా 'నేను మాట్లాడుకుంటాను' అని వారితో చెప్పినట్లు సమాచారం. కానీ చివరికి చంద్రబాబు ఉద్దేశాన్ని అర్థం చేసుకుని ఆయనే సెలవు పెట్టి వెళ్లిపోయారు. ఇప్పుడు కొత్త సీఎస్ ఎవరు అన్న దానిపై తీవ్ర చర్చ జరుగుతోంది. ఐఏఎస్‌ల సీనియారిటీ జాబితాను చంద్రబాబు ముందు పెట్టిన తర్వాత, ఆయన తుది నిర్ణయం తీసుకోనున్నారు.

మీ సేవలు చాలు.. దయచేయండి!

- ఒక్క ఆర్డర్‌తో 40 మంది ప్రభుత్వ సలహాదారులకు ఉద్వాసన
- రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ రాఘవరెడ్డి రాజీనామా

అమరావతి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): 'ఇక మీ సేవలు చాలు. దయ చేయండి. ప్రభుత్వానికి మీ సలహాలు అవసరం లేదు' అంటూ వైసీపీ ప్రభుత్వం నియమించిన సలహాదారులందరిని సాధారణ పరిపాలన శాఖ తొలగించింది. కేవలం ఒక్క ఆర్డర్‌తో 40 మంది ప్రభుత్వ సలహాదారులకు ఉద్వాసన పలికింది. ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు అజయ్ కల్లాం, సీఎం నవరత్నాల సలహాదారు ఎం.శామ్యూల్, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణరెడ్డి తదితరులు ఆ జాబితాలో ఉన్నారు. సజ్జల, జాతీయ మీడియా సలహాదారులు దేవులపల్లి అమర్, కమ్యూనికేషన్స్ సలహాదారు జీవీడీ కృష్ణ మోహన్ ఇప్పటికే తమ పదవులకు రాజీనామా చేశారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులు, మంత్రుల పేషీలో పని చేస్తున్న సిబ్బందిని వారివారి మాతృశాఖల్లో రిపోర్టు చేయాలని జీఏడీ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్ సురేశ్ కుమార్ ఆదేశాలు జారీ చేశారు. మంత్రుల వద్ద ఉన్న ఫైళ్లు, కంప్యూటర్లు, ఫర్నీచర్, స్టేషనరీలను ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అప్పచెప్పాలని సూచించారు. కాగా, రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. గురువారం ఆయన తన రాజీనామాను కమిషనర్, రిజిస్ట్రార్ ఆఫ్ కో-ఆపరేటివ్ సొసైటీస్‌కు పంపారు.

సాధారణ పరిపాలన శాఖ తొలగించిన సలహాదారులు...

అజేయ కల్లం (సీఎం ప్రధాన సలహాదారు), ఎం.శామ్యూల్ (నవరత్నాలు), సజ్జల రామకృష్ణా రెడ్డి (ప్రభుత్వ ప్రధాన సలహాదారు), దేవులపల్లి అమర్ (జాతీయ మీడియా), జీవీడీ కృష్ణ మోహన్ (కమ్యూనికేషన్), ఎంజీ రెడ్డి (ఎన్ఆర్ఐ అఫైర్స్), ఆదిత్యనాథ్ దాస్ (ప్రభుత్వ ప్రధాన సలహాదారు), నోరి దత్తాత్రేయుడు (క్యాన్సర్ కేర్), మహ్మద్ అలీ (ఎలక్ట్రానిక్ మీడియా), ఎన్ చంద్రశేఖర్‌రెడ్డి (ఎంప్లాయిస్ వెల్ఫేర్), వెంకట ఎస్ మేడపాటి (ఎన్ఆర్‌టి ఆఫైర్స్), నేమాని భాస్కర్ (పబ్లిక్ పాలసీ), సింహాద్రి చంద్రశేఖరరావు (క్యాన్సర్ కేర్), చల్లా మధుసూదన్‌రెడ్డి (నైపుణ్య శిక్షణ), గాది శ్రీధర్‌రెడ్డి (నైపుణ్య శిక్షణ), జూపూడి ప్రభాకర్ రావు (సామాజిక న్యాయం), ఎన్ గోవింద రెడ్డి (జల వనరులు), శ్రీధర్ లంక (పెట్టుబడులు), ఎస్ రాజీవ్‌కృష్ణ (ఇండస్ట్రీస్ ప్రమోషన్స్), కృష్ణా జీవీ గిరి (ఇండస్ట్రీస్ ప్రమోషన్స్), పీటర్ టీ హసన్ (ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్), వీఎస్ భరత్ రెడ్డి (ఏవియేషన్), ఆర్ గోవింద హరి (ఆరోగ్యశ్రీ ట్రస్ట్), జే విద్యాసాగర్ రెడ్డి (ఐటీ), పాతూరి శేషిరెడ్డి (ఐటీ), పెద్దమల్లు చంద్రహాస్ (ఐటీ), బీటీఆర్ మోహన్‌రెడ్డి (సీఎం ప్రత్యేక సలహాదారు, ఐటీ), జ్వాలాపు శ్రీకాంత్ (దేవదాయ శాఖ), బత్తుల బ్రహ్మానందరెడ్డి (మార్కెటింగ్), ఆర్ చంద్రశేఖర్ (ఐటీ ప్రత్యేక సలహాదారు), ఐ తిరుపాల్ రెడ్డి (వ్యవసాయం), పుట్టా శివప్రసాద్‌రెడ్డి (హార్టికల్చర్), ఆలూరి సాంబశివారెడ్డి (విద్య), పోశిరెడ్డి నాగార్జున రెడ్డి (పీఆర్ అండ్ ఆర్డీ), నారమల్లి పద్మజ (ప్రభుత్వ సలహాదారు), డీఎస్ హబీబుల్లా (మైనార్టీ వెల్ఫేర్), ఎస్‌కె మహ్మద్ జియావుద్దీన్ (ప్రభుత్వ సలహాదారు), గంగుల ప్రభాకర్‌రెడ్డి (ప్రభుత్వ సలహాదారు), ఆర్ ధనుంజయరెడ్డి (ముఖ్యమంత్రి సలహాదారు), చెన్నూరు చంద్రశేఖర్‌రెడ్డి (ఐటీ శాఖ).

అమ్మ.. జవహరా!

అందుకే రిజిస్ట్రేషన్ శాఖ తీసుకున్నారా?
సీఎస్‌గా ఉంటూనే ఆ శాఖ బాధ్యతలూ..
ఆ తర్వాతే ఆయనపై అసైన్డ్ భూకొనుగోళ్ల ఆరోపణలు
భోగాపురం భూముల కేసులో కొత్తకోణం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అంటే మొత్తం అధికార యంత్రాంగానికి సూపర్‌బాస్. ఆ పోస్టులో ఉన్నవారికి పని ఒత్తిడితోపాటు ఎక్కడా లేని బరువు బాధ్యతలు ఉంటాయి. అందుకే సీఎస్‌గా ఉన్న అధికారులు అదనంగా మరే ఇతర ప్రభుత్వ శాఖలు తమ వద్ద ఉంచుకోరు. ఇది ఆనవాయితీ. జగన్ హయాంలో సీఎస్‌గా పనిచేసిన జవహర్‌రెడ్డి దీనికి బ్రేక్‌వేశారు. సీఎస్‌గా ఉంటూనే రెవెన్యూలో అతి కీలకమైన స్టాంప్స్ రిజిస్ట్రేషన్ విభాగాన్ని తనకు కావాలని తీసుకున్నారు. అది కూడా సీఎస్ అయిన వెంటనే కాదు. ఎన్నికలకు సరిగ్గా నాలుగైదు నెలల క్రితమే ఆయన ముచ్చటపడి ఆ శాఖను తన ఆధీనంలోకి తీసుకున్నారు. ఈ పరిణామంపై ఐఏఎస్ వర్గాల్లోనే భిన్నమైన చర్చ జరిగింది. జవహర్‌రెడ్డి ఎందుకు ఈ డిపార్ట్‌మెంట్‌ను తీసుకున్నారు? ఏం చేయాలనుకుంటున్నారు? అని అప్పట్లో చర్చోపచర్చలు సాగాయి. అంతకు ముందు ఈ విభాగం స్పెషల్ సీఎస్ రజత్‌భార్గవ వద్ద ఉండేది. ఆయనకు కూడా అనేకనేక శాఖలు ఉన్నాయి. వాటికి తోడు పూర్తిస్థాయి అదనపు ఇన్‌చార్జి బాధ్యతలు కూడా ఉన్నాయి. దీంతో ఆయనకు భారం తగ్గించేందుకు సీఎస్ ఆ విభాగాన్ని తీసుకున్నారా అన్న చర్చ జరిగింది.

ఇదీ సంగతి!.. ఐదు నెలల తర్వాత సీన్ కట్‌చేస్తే....విశాఖతోపాటు భోగాపురం ఏరియాలో జవహర్ రెడ్డి భూములు కొన్నారని, అందులో భారీగా అసైన్డ్ భూములున్నాయని జనసేన నేత మూర్తియాదవ్ తీవ్ర ఆరోపణలు చేశారు. తనవద్ద ఆధారాలున్నాయని, నిరూపించడానికి సిద్ధంగా ఉన్నానని మీడియా ముందే సవాల్ చేశారు. జీవో 596 ఆధారంగా అసైన్డ్ భూములకు శాశ్వత హక్కులు కల్పించిన తర్వాత తన బినామీలతో జవహర్‌రెడ్డి భూములు కొనిపించారని ఆయన తీవ్ర ఆరోపణలు గుప్పించారు. మూర్తియాదవ్‌పై లీగల్ చర్యలు తీసుకుంటానని సీఎస్ హెచ్చరించినా ఆ దిశగా ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదు. పైగా, మూర్తి యాదవ్ మరో ముందడుగువేసి ముగ్గురు వ్యక్తుల పేర్లు ప్రకటించారు. అందులో సీఎస్ కుటుంబ సభ్యుడి పేరు కూడా ఉండటం గమనార్హం. అసైన్డ్ భూములు కొట్టేసేందుకే జీఓ 596 తీసుకొచ్చారని, ఇందులో జవహర్‌రెడ్డి పాత్ర ఉందని మూర్తియాదవ్ బలమైన ఆరోపణలు గుప్పించారు. భూములు కొన్న తర్వాత రిజిస్ట్రేషన్ శాఖ నుంచి ఎలాంటి డాక్యుమెంట్లు, వివరాలు బయటకు రాకుండా సీఎస్ కుట్రలు చేశారని కూడా ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణల్లో నిజం ఎంతో నిర్ధారణ కాలేదు గానీ, రిజిస్ట్రేషన్ శాఖ అయితే సీఎస్ వద్దే ఉంది. ఇప్పటికే భోగాపురం మండలంలో 'పెద్దసారు బంధువు' అంటూ ఓ వ్యక్తి వందల ఎకరాల అసైన్డ్ భూములు కొన్నారు. తమకు చిల్లరపడేసి కోట్ల రూపాయల భూములు తీసుకున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే ఆ వ్యక్తి పేరును ప్రజలు బహిరంగంగా చెబుతున్నారు. ఈ పరిణామంపై సీఎస్ ఇప్పటిదాకా పెదవివిప్పలేదు. దీంతో అధికారవర్గాల్లో కొత్త చర్చ మొదలైంది. ఒక వేళ నిజంగా భూములు కొని ఉంటే, ఈ ప్రయోజనం కోసమే సీఎస్ రిజిస్ట్రేషన్ శాఖను తన వద్ద ఉంచుకున్నారా? ఈ కారణంతోనే రజత్ భార్గవ నుంచి ఆ విభాగాన్ని తీశారా? అన్న అనుమానాలు అధికారవర్గాల్లో వ్యక్తం అవుతున్నాయి. రిజిస్ట్రేషన్ శాఖ తన వద్దే ఉంటే, భూములు కొన్నా బయటకు రాకుండా జాగ్రత్త పడొచ్చన్న కారణంతోనే జవహర్ ఆశాఖను తీసుకొని ఉంటారా? అని పలువురు సీనియర్ అధికారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. "ప్రభుత్వం మారింది. త్వరలో విశాఖ, భోగాపురం భూముల గోల్‌మాల్‌పై 'సిట్'తో ప్రత్యేక దర్యాప్తు చేయించనున్నారు. దీంతో అసలు నిజాలు వెలుగుచూస్తాయి. కానీ, సీఎస్ రిజిస్ట్రేషన్ల శాఖను తీసుకోవడం, ఆ వెంటనే ఆయనపై ఆరోపణలు రావడం యాదృశ్చికంగా కనిపించడం లేదు. దీనిపై జవహర్‌రెడ్డి మాట్లాడితేనే అసలు విషయాలు తెలుస్తాయి. " అని ఓ సీనియర్ ఐఏఎస్ 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు. అయితే, ఇదే విషయమై జవహర్‌రెడ్డి మాట్లాడేందుకు 'ఆంధ్రజ్యోతి' ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

టీడీపీ కార్యకర్తలపై వైసీపీ కార్పొరేటర్ భర్త దాడి

నెల్లూరు(క్రైం), జూన్ 6: టీడీపీ కార్యకర్తలపై వైసీపీ కార్పొరేటర్ భర్త కత్తితో దాడి చేశాడు. దర్గామిట్ట పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని వైఎస్ఆర్ నగర్‌కు చెందిన ఎస్‌కే అఖిల్, అతడి స్నేహితుడు ఎస్‌కే సులేమాన్ బుధవారం రాత్రి బైక్‌పై వెళుతుండగా ప్రగతినగర్ ప్రాంతంలో మస్తాన్ అనే వ్యక్తిపై కొందరు దాడి చేస్తున్నారు. దగ్గరకు వెళ్లి చూడగా 34వ డివిజన్ కార్పొరేటర్ భర్త ఎస్‌కే రియాజ్, మరో నలుగురు ఆ దాడికి పాల్పడుతున్నారు. మస్తాన్ వారి నుంచి తప్పించుకుని పారిపోయాడు. దీంతో అఖిల్, సులేమాన్‌ను చూసిన రియాజ్.. మీరిద్దరూ మస్తాన్ మనుషులేగా అంటూ అతడి వద్ద ఉన్న కత్తితో పొట్టలో, చేతిపై దాడి చేశాడు. దీంతో వారిద్దరికీ రక్తపుగాయాలయ్యాయి. రియాజ్ పరారయ్యాడు. బాధితులు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. రియాజ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

టీడీపీకి మద్దతిచ్చారంటూ దాడి

ముసునూరు, జూన్ 6: 'తెలుగుదేశం పార్టీకి మద్దతిస్తారా? మేమంటే భయం లేదా?' అంటూ సర్పంచ్ భర్త, ఎంపీటీసీ కలసి తమ ఇంటిపై దాడికి దిగారంటూ ఏలూరు జిల్లా ముసునూరు మండలం బలివే గ్రామానికి చెందిన మహిళ పోలీసులను ఆశ్రయించారు. పోలీసుల కథనం ప్రకారం.. బలివే గ్రామానికి చెందిన తోట ఆంజనేయులు కారు డ్రైవర్. ఇతడి భార్య వెంకట లక్ష్మి ఇటీవల జరిగిన ఎన్నికల్లో టీడీపీ పక్షాన ప్రచారం చేశారు. టీడీపీ గెలుపు జీర్ణించుకోలేక సర్పంచ్ భర్త రావు సుధాకర్, ఎంపీటీసీ దాసరి సుమన్‌తోపాటు నాయుడు స్వర్ణకుమార్, మట్టా రమేష్, నాయుడు దుర్గాప్రసాద్, ఈడా నాగయ్య యార్లగడ్డ దుర్గాప్రసాద్ కత్తులు, కర్రలతో వారి ఇంటిపై దాడిచేసి, చంపుతామంటూ భయభ్రాంతులకు గురిచేశారు. దీంతో తనకు, తన భర్తకు ప్రాణరక్షణ కల్పించాలని, దాడిచేసిన వారిపై చర్యలు చేపట్టాలని బాధితురాలు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వాసు తెలిపారు.

సచివాలయ ఉద్యోగిపై వైసీపీ కార్యకర్త దాడి

వీరులపాడు, జూన్ 6: జగన్ ఓటమికి ఉద్యోగులే కారణం అని వైసీపీ కార్యకర్త విజయరావు గొడ్డలితో సచివాలయ ఉద్యోగులపై దాడికి పాల్పడ్డాడు. ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలం పంచాయతీ సెక్రటరీగా పనిచేస్తున్న షేక్ జుబేదా తోటి సిబ్బందితో కలిసి మధ్యాహ్నం భోజనం చేస్తుండగా విజయరావు అనే వ్యక్తి గొడ్డలితో పెద్దగా కేకలు వేస్తూ ఒక్కసారిగా లోనికి ప్రవేశించి జుబేదా అనే మహిళా ఉద్యోగిపై దాడికి తెగబడ్డాడు. గొడలి తిరగబడటంతో ఆమెకు గాయమైంది. బాధితురాలితో పాటు మిగిలిన ఉద్యోగులు పరుగు పెట్టారు. గ్రామస్థులు ప్రాణాలు కాపాడారు. గ్రామ కార్యదర్శి, బాధితురాలి ఫిర్యాదు మేరకు విజయరావును అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు ఎస్ఐ మహాలక్ష్ముడు తెలిపారు.

నూజివీడులో పట్టపగలు కత్తిపోట్లు

నూజివీడు టౌన్, జూన్ 6: ఇరువర్గాల మధ్య కత్తిపోట్ల ఘటనలో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు ఏలూరు జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి తెలిపారు. పాతకక్షల నేపథ్యంలో నూజివీడు మున్సిపల్ కౌన్సిలర్ నడికుదురు గిరీష్, నూజివీడుకు చెందిన నూకల సాయికిరణ్ మధ్య వివాదం నెలకొందన్నారు. సాయికిరణ్‌ను వెంబడించిన గిరీష్ అతడిపై కత్తితో దాడికి దిగాడన్నారు. సాయికిరణ్ సోదరుడు అరుణ్‌కుమార్, అతడి స్నేహితుడు సుధీర్.. దాడిచేయడంతో గిరీష్ కూడా గాయాలపాలయ్యారన్నారు. అరుణ్‌కుమార్, సుధీర్‌ను అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. కాగా, నిందితులను అదుపులోకి తీసుకోవడంలో ధైర్యసాహసాలు ప్రదర్శించిన హోమ్‌గార్డ్ చంద్రశేఖర్‌ను ఎస్పీ అభినందించి రివార్డు అందించారు.

కేంద్ర కేబినెట్‌లోకి టీడీపీ

- చంద్రబాబు గ్రీన్ సిగ్నల్
- నేటి ఎన్డీయే ఎంపీల భేటీ కోసం ఢిల్లీ పయనం

అమరావతి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి వర్గంలో టీడీపీ చేరనుంది. నరేంద్ర మోదీ ఈ నెల 9వ తేదీన మూడోసారి ప్రధానమంత్రిగా పదవీప్రమాణం చేయనున్నారు. ఆయనతో పాటు ఎన్డీయేలోని వివిధ భాగస్వామ్య పక్షాలకు చెందిన కొందరు నేతలు మంత్రులుగా ప్రమాణం చేస్తారు. లోక్‌సభలో విశ్వాస పరీక్ష నెగ్గాక కేబినెట్ విస్తరణ జరుగుతుందని.. ఆ సందర్భంగా ఇంకొందరికి మంత్రి పదవులు ఇస్తారని తెలుస్తోంది. కేబినెట్‌లో టీడీపీ చేరుతుందని ఆ పార్టీ అధినేత చంద్రబాబు బుధవారమే ఢిల్లీలో వెల్లడించారు. లోక్‌సభ స్పీకర్ పదవి ఆ పార్టీకి దక్కే అవకాశం ఉందని కొన్ని వర్గాలు అభిప్రాయపడుతున్నా.. ఆ పదవిని తామే ఉంచుకోవాలని బీజేపీ నాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం. లోక్‌సభలో ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో స్పీకర్ పదవిని మరొకరికి ఇవ్వరాదని ఆ పార్టీ అనుకుంటున్నట్లు చెబుతున్నారు. అయితే బెర్తులు, శాఖలపై ఇంకా పై స్థాయిలో చర్చలేవీ జరుగలేదని టీడీపీ వర్గాలు తెలిపాయి. ఎన్డీయే ఎంపీల సమావేశం శుక్రవారం ఢిల్లీలో జరుగనుంది. ఆ సందర్భంగా వారు మోదీని తమ కూటమి పార్లమెంటరీ నేతగా ఎన్నుకుంటారు. తర్వాత ఎన్డీయే అగ్ర నేతలు, ఎంపీలంతా కలిసి రాష్ట్రపతి భవన్‌కు వెళ్లి రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో సమావేశమవుతారు. ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాల్సిందిగా అభ్యర్థిస్తారు. ఆమె పిలుపు అందగానే ఆదివారం సాయంత్రం మోదీ, కొందరు కేబినెట్ మంత్రులు ప్రమాణం చేస్తారు. కాగా.. ఎన్డీయే ఎంపీల సమావేశంలో పాల్గొనేందుకు చంద్రబాబు గురువారం రాత్రి ఢిల్లీ బయల్దేరి వెళ్లారు. రాష్ట్రపతిని కలిసిన తర్వాత రాత్రికి అమరావతికి తిరిగి వస్తారు. శనివారం ఇక్కడే ఉండి పాలనా వ్యవహారాల్లో పాల్గొంటారు. ఆదివారం మళ్లీ ఢిల్లీ వెళ్లి రాష్ట్రపతి భవన్‌లో జరిగే ప్రధాని మోదీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరవుతారు. అదే రోజు రాత్రికి అమరావతి వచ్చేస్తారు. శుక్రవారం ఢిల్లీలో ఉన్న సమయంలో మంత్రివర్గ కూర్పుపై ఆయన బీజేపీ నాయకత్వంతో చర్చలు జరిపే అవకాశం ఉంది. ఫోన్లలో కొంత చర్చ జరుగుతున్నా ముఖాముఖి చర్చల్లో దీనిపై స్పష్టత రావచ్చని అంటున్నారు. వాస్తవానికి శుక్రవారం ఉదయం ఢిల్లీ వెళ్లాలని ఆయన మొదట అనుకున్నారు. తర్వాత మనసు మార్చుకుని గురువారం రాత్రే బయల్దేరారు. అక్కడ ఏవైనా మాట్లాడాలంటే సమయం చాలినంత ఉంటుందన్న ఉద్దేశంతో ముందే వెళ్లారు. ఢిల్లీ అశోకా రోడ్డులో రామ్మోహన్‌నాయుడికి కేటాయించిన క్వార్టర్‌లో ఆయన బస చేస్తున్నారు.



చంద్రబాబు నివాసం వద్ద ఏర్పాటు చేసిన కటౌట్‌కు పాలతో అభిషేకం చేస్తున్న టీడీపీ కార్యకర్తలు

బాబు ప్రమాణ స్వీకారానికి మోదీ

ఏపీ సీఎంగా 12న చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధాని మోదీ హాజరు కానున్నారు. టీడీపీ వర్గాలు దీనిని ధ్రువీకరించాయి. తన ప్రమాణ స్వీకారోత్సవానికి రావాలని ప్రధానికి చంద్రబాబు విజ్ఞప్తి చేయగా.. ఆయన అంగీకరించారు. ప్రధాని రాకను దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు చేయాలని గురువారమిక్కడ తనను కలిసిన డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాకు చంద్రబాబు సూచించారు. ఈ కార్యక్రమానికి ఎన్డీయే పాలిత రాష్ట్రాల సీఎంలు కూడా హాజరు కానున్నారు. వారికి చంద్రబాబు స్వయంగా ఫోన్లు చేసి ఆహ్వానిస్తున్నారు. 12న ఉదయం 11 గంటలకు అటూఇటూగా ప్రమాణ స్వీకారం నిర్వహించాలని టీడీపీ వర్గాలు నిర్ణయించాయి. ఈ కార్యక్రమానికి స్థలాన్వేషణ జరుగుతోంది. ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. ఒక ట్రెండు రోజుల్లో ఖరారయ్యే అవకాశం ఉంది.

మంత్రి పదవుల కోసం టీడీపీలో భారీ పోటీ!

- కేబినెట్‌లో చేరనున్న లోకేశ్!
- పవన్ చేరికపై రాని స్పష్టత

అమరావతి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి వర్గంలో చోటు కోసం భారీ పోటీ నెలకొంది. ఈసారి పెద్దసంఖ్యలో ఎమ్మెల్యేలు గెలుపొందడంతో మంత్రి పదవులు ఆశిస్తున్న వారి సంఖ్య కూడా విపరీతంగా పెరిగింది. మెరుగైన జట్టును ఎంపిక చేసుకోవడానికి టీడీపీ అధినేత చంద్రబాబు గట్టి కసరత్తు చేస్తున్నారు. తొలివిడతలో 9 లేదా 18మందితో మంత్రివర్గాన్ని ఏర్పరచి తర్వాత విస్తరించే సూచనలు కనిపిస్తున్నాయి. బాబు మంత్రివర్గంలో జనసేనకు 3 లేక 4 బెర్తులు, బీజేపీకి 1 లేదా 2మంత్రి పదవులు ఇవ్వనున్నారు. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ మంత్రివర్గంలో చేరతారా లేదా అన్నదానిపై స్పష్టత రాలేదు. ఆయన చేరితే ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. పవన్ చేరని పక్షంలో ఆ పార్టీ నుంచి నాదెండ్ల మనోహర్, కొణతాల రామకృష్ణ, కందుల దుర్గేశ్, పంతం నానాజీల్లో ఇద్దరు ముగ్గురికి అవకాశం రావచ్చని ఆ పార్టీ వర్గాలు అంటున్నాయి. బీజేపీ నుంచి సుజనా చౌదరి, డాక్టర్ పార్థసారథి, సత్యకుమార్‌లలో ఇద్దరికి అవకాశం ఉండవచ్చని సమాచారం. టీడీపీ యువనేత లోకేశ్ మంత్రివర్గంలో చేరడం ఖరారైంది. లోకేశ్, మనోహర్ ఇద్దరూ మంత్రివర్గంలోకి వస్తే ఉమ్మడి గుంటూరు జిల్లాలో కొందరు సీనియర్లకు అవకాశం ఉండదని అంటున్నారు. లోకేశ్ మంత్రివర్గంలోకి రానిపక్షంలో ధూళిపాళ్ల నరేంద్ర, యరపతినేని శ్రీనివాసరావు, జీవీ ఆంజనేయులులో ఒకరికి చాన్స్ దక్కవచ్చు. కన్నా లక్ష్మీనారాయణ, నక్కా ఆనంద్‌బాబు, అనగాని సత్యప్రసాద్, తెనాలి శ్రావణ్ కుమార్ కూడా బెర్తులు ఆశిస్తున్నారు.

గోదావరిలో ఇద్దరు ముగ్గురికి..

ఉభయ గోదావరి జిల్లాల నుంచి టీడీపీ కోటా కింద యనమల రామకృష్ణుడు, పితాని సత్యనారాయణ, నిమ్మల రామానాయుడు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, జ్యోతుల నెహ్రూ పేర్లు పరిశీలనకు రావచ్చని, వీరిలో ఇద్దరు ముగ్గురికే అవకాశం దక్కుతుందంటున్నారు. రఘురామకృష్ణరాజు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ పేర్లు కూడా పరిశీలనకు తీసుకునే అవకాశం ఉంది.

- ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అచ్చెన్నాయుడు, కళావెంకట్రావు, అయ్యన్నపాత్రుడు, వంగలపూడి అనిత, గుమ్మడి సంధ్యారాణి, పల్లా శ్రీనివాసరావు, గంటా శ్రీనివాసరావు, కూన రవికుమార్ పేర్లు ప్రచారంలోకి వచ్చాయి.
- ఉమ్మడి నెల్లూరు జిల్లాలో పి. నారాయణ మంత్రివర్గంలో చేరడం ఖాయమైంది. మరో బెర్తు కోసం ఆనం రామనారాయణరెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతి మధ్య పోటీ నెలకొంది.
- ఉమ్మడి కృష్ణా జిల్లాలో బీజేపీ కోటా నుంచి సుజనా చౌదరికి అవకాశం లభిస్తే కొందరు టీడీపీ సీనియర్లకు చాన్సులు తగ్గిపోతాయి. ఈ జిల్లా నుంచి కొల్లు రవీంద్ర, శ్రీరాం తాతయ్య, బొండా ఉమా, వెనిగండ్ల రాము పేర్లు పరిశీలనకు రావచ్చంటున్నారు.
- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కిశోర్‌కుమార్‌రెడ్డి, అమరనాథ్‌రెడ్డిల్లో ఒకరికి చాన్స్ రావచ్చని అంటున్నారు.
- అనంతపురం జిల్లాలో పయ్యావుల కేశవ్, కాల్వ శ్రీనివాసులు, గుమ్మనూరు జయరాం, సబితమ్మ, కందికుంట వెంకటప్రసాద్ పేర్లు, ఉమ్మడి ప్రకాశం జిల్లాలో గొట్టిపాటి రవికుమార్, డోలా బాలవీరాంజనేయ స్వామి పేర్లు పరిశీలించే అవకాశం ఉంది.
- కర్నూలు జిల్లాలో బీసీ జనార్దనరెడ్డి, కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, భరత్, ఫరూక్ పేర్లు వినిపిస్తున్నాయి. కడప జిల్లాలో రెడ్డప్పగారి మాధవి, వరదరాజుల రెడ్డి, రాంభూపాల్‌రెడ్డి పేర్లు పరిశీలనలో ఉన్నాయి.



కొత్తగా ఎన్నికైన ఎంపీల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ అధినేత చంద్రబాబు



తాడేపల్లిలోని తన నివాసంలో ఓడిపోయిన నేతలతో మాట్లాడుతున్న మాజీ సీఎం జగన్

మారిన చంద్రబాబును చూస్తారు

- అధికారుల పాలన కాదు ప్రజాపాలన
- ప్రజలు, నేతల అభిప్రాయాలు వింటా: చంద్రబాబు

అమరావతి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఈ సారి అధికారుల పాలన కాదని, ప్రజా పాలన ఉంటుందని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. 'మారిన చంద్రబాబును చూస్తారు' అని పార్టీ ఎంపీలతో వ్యాఖ్యానించారు. గురువారం ఉండవల్లిలోని తన నివాసంలో పార్టీ ఎంపీలతో జరిగిన సమావేశంలో ఆయన కొన్ని ఆసక్తికర వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం. 'నేను ఎక్కువగా అధికారుల మాట వింటానని.. బ్యూరోక్రాట్ల పాలన నడుస్తుంటుందని పార్టీలో కొందరు నా గురించి అభిప్రాయపడుతుంటారు. ఈసారి మారిన చంద్రబాబును చూస్తారు. అధికారులు తమ అభిప్రాయం చెబుతారు. ప్రజలు, పార్టీ నుంచి వచ్చిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని నేను నిర్ణయం తీసుకొంటాను. చంద్రబాబు మారరు అని కూడా మీరు వింటుంటారు. ఇక ముందు అలా ఉండదు. మార్పు మీరే చూస్తారు. ప్రజలు, టీడీపీ కార్యకర్తలు, పార్టీ నేతలు ఈ ఐదేళ్లలో ఎన్నో ఒత్తిళ్లు ఎదుర్కొన్నారు. వేధింపులకు గురయ్యారు. గొంతు మీద కత్తి పెట్టినా జై టీడీపీ అని మాట్లాడి ప్రాణాలు కోల్పోయిన కార్యకర్తలు ఉన్నారు. అధికార పార్టీ ఎంత బల ప్రయోగం చేసినా పార్టీ మారకుండా నిలబడ్డారు. ఇవన్నీ నా మనసులో నిలిచిపోయాయి. వారందరి పోరాటం, కృషి వల్లే ఇప్పుడు పార్టీ అధికారంలోకి వచ్చింది. అన్యాయం జరిగిన వారికి న్యాయం జరిగేలా చూస్తాను. బాధితుల గోడు, పార్టీ నేతల అభిప్రాయాలు ఇకపై నేనే వింటాను. ఏం చేయాలో నేనే చూస్తాను. పాలనలో రాజకీయ కోణం ఆవిష్కరిస్తాను' అని చంద్రబాబు అన్నారు. పార్టీ తరఫున గెలిచిన ఎంపీలు, ఎమ్మెల్యేలు గీతలు గీసుకోకుండా కలిసి పనిచేయాలని కోరారు. ఎమ్మెల్యేలు, ఎంపీలకు కార్యాలయాలు ఏర్పాటు చేయిస్తానని, అందులో ఉండి పనిచేయాలని చెప్పారు. ఈసారి ఎంపీల బృందం ఢిల్లీలో బాగా పనిచేయాలని, ప్రభావవంతంగా పనిచేసి ఫలితాలు సాధించాలని చంద్రబాబు కోరారు. 'ఈసారి గెలిచిన ఎంపీల పనితీరుపై నాకు బాగా నమ్మకం ఉంది. గతంలో ఎర్రన్నాయుడు టీమ్ ఢిల్లీలో బాగా పనిచేసింది. ఇప్పుడు ఎన్నికైన టీమ్ కూడా అదే స్థాయిలో పనిచేసి చూపించాలి. రాష్ట్రానికి న్యాయం చేయాలి' అని ఎంపీలకు చంద్రబాబు సూచించారు.

ఢిల్లీకి విమానంలో రావాలి

కొత్తగా గెలిచిన కొందరు ఎంపీల గురించి సమావేశంలో చంద్రబాబు ప్రస్తావించారు. విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని తనకు టికెటు వస్తుందా లేదా అనేది పట్టించుకోకుండా మనసు పెట్టి పనిచేశాడని, మంచి ఫలితం సాధించాడని ప్రశంసించారు. పార్టీలో సామాన్య కార్యకర్తలకు కూడా అవకాశాలు వస్తాయని నిరూపించడానికే విజయనగరం ఎంపీ సీటు కింది స్థాయి నాయకుడైన కలిశెట్టి అప్పలనాయుడుకు ఇచ్చానన్నారు. ఆర్థికంగా ఆయన ఎంపీకి పోటీ చేసే పరిస్థితిలో లేకపోయినా నిలబెట్టి గెలిపించామని చెప్పారు. 'ఏం కలిశెట్టి.. రాత్రికి ఢిల్లీకి విమానంలో రావాలి. టికెట్ కొనగలవా? నీకు ఇబ్బంది ఉంటే పార్టీ నుంచి టికెట్ తెప్పిస్తా. నువ్వు పార్టీవాడివి. నీకు ఏ ఇబ్బంది ఉన్నా నీకు అండగా పార్టీ ఉంటుంది' అని చంద్రబాబు అన్నారు. ఎంపీలు బయటకు వచ్చిన తర్వాత కూడా కలిశెట్టి పట్ల చంద్రబాబు చూపించిన ఆప్యాయత గురించి మాట్లాడుకొన్నారు.



ఫైబర్‌నెట్ కార్యాలయంలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

ఫైళ్లు మాయం చేస్తే కఠిన చర్యలు

- ఫైబర్‌నెట్ కార్యాలయంలో పోలీసుల తనిఖీలు

అమరావతి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఏపీ స్టేట్ ఫైబర్‌నెట్ లిమిటెడ్ (ఏపీఎస్ఎఫ్ఎల్) కార్యాలయంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరనున్న నేపథ్యంలో ఫైబర్‌నెట్ కార్యాలయంలో కీలక ఫైళ్లను మాయం చేస్తున్నారన్న సమాచారంతో విజయవాడ సౌత్‌జోన్ ఏసీపీ రతన్‌రాజు, సైబర్ క్రైం ఏసీపీ తేజేశ్వరరావు తమ సిబ్బందితో కలిసి గురువారం ఉదయం విజయవాడ ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని ఫైబర్‌నెట్ కార్యాలయానికి వచ్చారు. ఫైబర్‌నెట్ ఎండీ ఎం.మధుసూదనరెడ్డితోపాటు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, జనరల్ మేనేజర్(ఫైనాన్స్) తదితర అధికారులతో చాలాసేపు మాట్లాడి ఫైళ్లన్నీ భద్రంగా ఉంచాలని చెప్పారు. గతంలో ఫైబర్‌నెట్‌లో స్కాం జరిగిందంటూ జగన్ సర్కారు పలువురు మాజీ అధికారులపై తప్పుడు కేసులు పెట్టడంతోపాటు టీడీపీ అధినేత చంద్రబాబుపై కూడా అక్రమంగా చార్జిషీట్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే.

బెదిరించి దోచేశారు.. కక్కాల్సిందే!

- వైసీపీ నేతలకు బార్ల నిర్వాహకుల హెచ్చరిక

నరసరావుపేట, జూన్ 6: ఐదేళ్ల అధికారంలో ఉన్న సమయంలో వైసీపీ నేతలు, అధికారులు చేసిన అవినీతి ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తోంది. గురువారం బార్ అండ్ రెస్టారెంట్ నిర్వాహకులు గళమెత్తారు. తమను బెదిరించి వైసీపీ నేతలు కొట్టేసిన డబ్బు కక్కించేందుకు టీడీపీ, జనసేనకు చెందిన బార్ల నిర్వాహకులు ఉద్యమిస్తున్నారు. పల్నాడు జిల్లాలో దాదాపు రూ.125 కోట్లు వైసీపీ నేతలు వసూలు చేశారని, ఎవరైతే తమ వద్ద డబ్బు తీసుకువెళ్లారో సదరు నేతలు ఆ సొమ్మును వెనక్కి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. దీంతో వైసీపీ నేతలు కంగుతింటున్నారు. తనను బెదిరించి రూ.20 లక్షలు తీసుకున్న ఓ వైసీపీ నేతకు ఓ బార్ నిర్వాహకుడు ఫోన్ చేసి ఆ మొత్తాన్ని వడ్డీతో సహా తెచ్చి ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఇతర బార్ల నిర్వాహకులు కూడా వారి వద్ద అక్రమంగా డబ్బు కాజేసిన వారిని తిరిగి ఇవ్వాలని హెచ్చరిస్తున్నారు. ఓ బార్ నిర్వాహకుడి వద్ద రూ.40 లక్షలు, మరో వ్యాపారి వద్ద రూ.25 లక్షలు, మరో వ్యక్తి వద్ద రూ.15 లక్షలు వైసీపీ నేతలు వసూలు చేసినట్లు బాధితులు తెలిపారు.

వైసీపీ కాంట్రాక్టర్లకే బిల్లులిచ్చారు

- కేంద్ర నిధులు దారి మళ్లింపు... గవర్నరుకు సబ్కా ఫిర్యాదు

విజయవాడ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో జరిగిన బకాయి బిల్లుల చెల్లింపులు, నిధుల మళ్లింపుపై సమగ్ర విచారణ చేయాలని స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ గవర్నరుకు వినతిపత్రం అందజేసింది. సంఘం ప్రతినిధులు గవర్నరును గురువారం రాజ్‌భవన్‌లో కలిశారు. ఈ రెండు అంశాల విషయంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి రావత్, ముఖ్యకార్యదర్శి సత్యనారాయణపై విచారణ చేయడానికి ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఐదేళ్లుగా బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు తీవ్ర ఆర్థికంగా నష్టాలకు లోనయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న వారికే బిల్లులు చెల్లించారన్నారు. కేంద్రం నుంచి వచ్చిన నిధులను దారి మళ్లించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల మళ్లింపులపైనా విచారణ చేయాలని కోరారు.

బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఫిర్యాదు

కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులో అవకతవకలు జరిగాయని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సీఎస్, ఆర్థికశాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి, ఏసీబీ, విజిలెన్స్ డీపీలకు ఫిర్యాదు చేసింది. బిల్లుల చెల్లింపులో ఫిఫో పద్ధతిని పాటించకుండా ఇష్టం వచ్చిన వారికి చెల్లించారని ఆరోపించింది. 2019 నుంచి 2024 వరకు జరిగిన చెల్లింపులపై దర్యాప్తు చేయాలని విజ్ఞప్తి చేసింది. ఆర్అండ్‌బీ, కేంద్రం నుంచి వచ్చిన ఇతర గ్రాంట్లలో అవకతవకలు జరిగాయని ఆరోపించింది.

పెత్తందారు ఎవరు?

- వైసీపీ నేతలను నిలబెట్టే మాట్లాడిన జగన్
- రాజకీయ వర్గాల విమర్శలు

అమరావతి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఈ ఎన్నికలు పెత్తందారుకు, పేదవాడికి మధ్య జరుగుతున్న యుద్ధమని ప్రచారంలో ఊదరగొట్టిన జగన్.. తమకు మాత్రం గౌరవ మర్యాదలు ఇవ్వడం లేదని వైసీపీ నేతలు వాపోతున్నారు. గురువారమిక్కడి తాడేపల్లి ప్యాలెస్‌లో తన పార్టీ ప్రస్తుత, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులతో ఆయన సమావేశమయ్యారు. తాను మాత్రం కుర్చీలో కూర్చుని టేబుల్ ముందు నాలుగు కుర్చీలు వేయించారు. దాదాపు 35 మంది నేతలు రాగా.. ఆ నాలుగు కుర్చీల్లో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ, కౌన్సిల్ చైర్మన్ మోషేన్‌రాజు, కౌన్సిల్ డిప్యూటీ చైర్మన్ జకియాఖాన్ కూర్చున్నారు. ఇక తిరుపతి, అరకు ఎంపీలు గురుమూర్తి, తనూజారాణి, అరకు, పాడేరు ఎమ్మెల్యేలు రేగం మత్స్యలింగం, మత్స్యరాస విశ్వేశ్వరరాజు, మాజీ మంత్రులు విడదల రజిని, జోగి రమేశ్, ఉషశ్రీ చరణ్, కారుమూరి నాగేశ్వరరావు, కొడాలి నాని, పేర్ని నాని, వెలంపల్లి శ్రీనివాస్, మాజీ ఎంపీ కేశినేని నాని, మాజీ ఎమ్మెల్యేలు కైలే అనిల్‌కుమార్, ప్రసాదరాజు, ఓడిన నేతలు కారుమూరి సునీల్, దేవినేని అవినాశ్ తదితరులంతా ఆయన ఎదుట నిలబడ్డారు. ఎవరు పెత్తందారో ఆయన ప్రవర్తనే తెలియజేస్తోందని రాజకీయ వర్గాలు విమర్శిస్తున్నాయి.

ఓదార్పు రివర్స్!

- జగన్‌కు వైసీపీ నేతల అనునయింపు


ఓదార్పు యాత్రలు చేయడంలో తనదైన ముద్ర వేసుకున్న వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని గురువారం తన పార్టీ ప్రస్తుత, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు రివర్స్‌లో ఓదార్చారు. తాడేపల్లి నివాసంలో ఆయన వారందరితో సమావేశమయ్యారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. ఈ స్థాయి ఓటమి ని ఊహించలేదని, ఓట్లన్నీ ఏమయ్యాయో తెలియడం లేదని.. ఇంత ఘోర పరాజయానికి కారణాలు తెలియడం లేదని జగన్ వాపోయారు. ఓటమిపై ఆలోచించొద్దని వైసీపీ నేతలు ఆయన్ను బుజ్జగించే ప్రయత్నం చేశారు. కాగా.. ఘోర పరాజయం నేపథ్యంలో తాడేపల్లిలో ఉన్న వైసీపీ కేంద్ర కార్యాలయాన్ని త్వరలోనే ప్యాలెస్‌లోకి మార్చేయాలని నిర్ణయించారు.

భలే చెప్పారు!

- నిజమైన 'ఆంధ్రజ్యోతి' పాఠకుల పోల్స్
- కూటమికి 164... వైసీపీకి 11
- కచ్చితమైన అంచనా వేసిన 13 మంది
- 'ఎవరు గెలిచినా మీదే గెలుపు' పోటీకి భారీ స్పందన
- త్వరలో 'డ్రా' తీసి విజేతల ప్రకటన

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

వాళ్లేం సెఫాలజిస్టులు కాదు! తలపండిన రాజకీయ విశ్లేషకులూ కాదు! సర్వేలు చేయలేదు! జ్యోతిష్యులు అసలే కాదు. అయినా, జనం నాడి ఇదే అని తేల్చి చెప్పారు. ఈ ఎన్నికల్లో కూటమి గెలిచే, వైసీపీకి దక్కే సీట్లను వందశాతం కచ్చితత్వంతో అంచనా వేశారు. ఒకరూ ఇద్దరూ కాదు.. ఏకంగా 13 మంది 'ఆంధ్రజ్యోతి' పాఠకులు ఈ ఘనత సాధించారు. కూటమికి 164 సీట్లు వస్తాయని, వైసీపీ 11 స్థానాలతో సరిపెట్టుకుంటుందని ఎగ్జిట్ పోల్స్‌కంటే ముందే అంచనా వేశారు. ఈ ఎన్నికల్లో జనం నాడిని తెలుసుకునేందుకు 'ఆంధ్రజ్యోతి' ఒక వినూత్నమైన ప్రయోగం చేసింది. 'ఎవరు గెలిచినా మీదే గెలుపు' అంటూ రాష్ట్ర స్థాయిలో, జిల్లా స్థాయిలో ఎవరికి ఎన్ని సీట్లు వస్తాయో అంచనా వేసి చెప్పాలంటూ పాఠకులను కోరింది. వారానికి రెండు చొప్పున మొత్తం 8 కూపన్లు ప్రచురించింది. దీనికి పాఠకుల నుంచి భారీ స్పందన లభించింది. రాష్ట్రస్థాయిలో వేలాది కూపన్లు అందాయి. ఇందులో దాదాపు 80 శాతం మంది కూటమే గెలుస్తుందని, వైసీపీకి పరాభవం తప్పదని అంచనా వేశారు. అందులోనూ... 13 మంది పాఠకులు కూటమికి 164, వైసీపీకి 11 స్థానాలు వస్తాయని కచ్చితత్వంతో అంచనా వేశారు. ప్రకాశం, కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాల నుంచి ఇద్దరేసి పాఠకులు, శ్రీకాకుళం, విజయవాడ, గుంటూరు జిల్లాల నుంచి ఒక్కొరు చొప్పున ఈ ఘనత సాధించారు. ఎగ్జిట్ పోల్స్‌కంటే ముందే వెలువడిన 'పాఠకుల పోల్స్' ఇది! మొత్తం 13 మంది 'విజేత'లుగా నిలిచిన నేపథ్యంలో.. 'డ్రా' తీసి బహుమతులను అందించడం జరుగుతుంది. మొదటి బహుమతిగా రూ.లక్ష బంపర్ ప్రైజ్ లభిస్తుంది. రెండో స్థానంలో నిలిచిన వారికి రూ.50 వేలు, ఆ తర్వాతి ఐదు స్థానాల్లో ఉన్న వారికి రూ.10వేల చొప్పున నగదు బహుమతి అందిస్తాం.



చంద్రబాబుకు రేవంత్ ఫోన్!

- కాబోయే ఏపీ ముఖ్యమంత్రికి అభినందనలు

హైదరాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో విజయం సాధించి, ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టబోతున్న టీడీపీ అధినేత చంద్రబాబుకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. రెండు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు కొనసాగాలని ఆకాంక్షించారు. విభజన చట్టానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న అంశాలను పరస్పర సహకారంతో పరిష్కరించుకుందామని పిలుపునిచ్చారు. గురువారం మధ్యాహ్నం జూబ్లీహిల్స్‌లోని తన నివాసం నుంచే చంద్రబాబుకు ఫోన్ చేసి రేవంత్ మాట్లాడారు. కాగా, తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల్లో గెలుపొందిన గడ్డం వంశీకృష్ణ(పెద్దపల్లి), బలరాం నాయక్(మహబూబాబాద్)లు గురువారం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. వారిని ఆయన అభినందించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

పోలవరాన్ని పరిశీలించిన అథారిటీ డైరెక్టర్

పోలవరం, జూన్ 6: పోలవరం ప్రాజెక్టు అథారిటీ డైరెక్టర్ మన్నూజి ఉపాధ్యాయ గురువారం ప్రాజెక్టును పరిశీలించారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఆయనకు ఇంజనీరింగ్ అధికారులు సంబంధిత వివరాలు తెలియజేశారు. తొలుత పోలవరం ప్రాజెక్టు హిల్‌వ్యూ నుంచి అధికారులు ప్రాజెక్టు పరిశీలించారు. అనంతరం స్పిల్‌వే, స్పిల్ చానల్, గ్యాలరీ, అప్రోచ్ చానల్, ఎగువ దిగువ కాపర్ డ్యామ్‌లు, డయాఫ్రమ్ వాల్, ఎర్త్‌కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ ప్రాంతం, కుడి ఎడమ కాలువల కనెక్టివిటీ పనులు, పవర్ హౌస్ ప్రాంతాలను పరిశీలించారు. ప్రాజెక్టు ఇంజనీర్లు మల్లికార్జునరావు, ప్రేమ్‌చంద్, పి.వెంకటరమణ, కె.బాలకృష్ణ, పాండురంగయ్య, కనకేష్ పాల్గొన్నారు.

ఉద్యోగులపై సస్పెన్షన్లు ఎత్తేయాలి

» సీఈవోకు ఎస్సీ,ఎస్టీ ఉద్యోగ సంఘ నేత లేఖ

అమరావతి, జూన్6 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిబంధనల పేరుతో ఉద్యోగులపై విధించిన సస్పెన్షన్లను వెంటనే ఎత్తివేయాలని రాష్ట్ర ఎస్సీఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవరపల్లి సురేష్‌బాబు ఎన్నికల సంఘాన్ని కోరారు. ఈ మేరకు గురువారం ఏపీ సీఈవోకు ఆయన లేఖ రాశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ పల్నాడు, అనంతపురం జిల్లాల్లో హింసాత్మక సంఘటనను అడ్డుకోవడంలో విఫలమయ్యారనే కారణంగా ఐపీఎస్ అధికారులు బిందుమాధవ్, అమిత్‌బర్దార్‌లపై విధించిన సస్పెన్షన్లను ఎన్నికల సంఘం ఎత్తివేసిందని గుర్తు చేశారు. ఎన్నికల కోడ్ ముగిసినందున ఉద్యోగులపై ఉన్న సస్పెన్షన్లను ఎత్తివేసేలా కలెక్టర్లకు తగు ఆదేశాలు జారీ చేయాలని సీఈవోను కోరారు.

నిద్రిస్తున్న బాలిక గొంతుకోసి దారుణహత్య

కంభం, జూన్ 6: ఇంట్లో నిద్రిస్తున్న బాలికను పట్టపగలు గుర్తుతెలియని వ్యక్తులు కత్తితో గొంతుకోసి దారుణంగా హత్య చేశారు. ప్రకాశం జిల్లా అర్ధవీడుకు చెందిన ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు వుచ్చుకాయల రమణరెడ్డి, పద్మావతి దంపతులకు సంతానం లేదు. రమణారెడ్డి తమ్ముడు రంగారెడ్డి కుమార్తె శాన్విరెడ్డి(9)ని 8 సంవత్సరాల క్రితం దత్తత తీసుకున్నారు. బాలిక అర్ధవీడులోనే 3వ తరగతి చదువుతోంది. గురువారం ఉదయం 10 గంటల సమయంలో రమణారెడ్డి పనులపై పొలం వెళ్లాడు. మధ్యాహ్నం తల్లి పద్మావతి ఒక గదిలో, శాన్వి మరో గదిలో నిద్రిస్తున్నారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో పొలం నుంచి వచ్చిన రమణారెడ్డి లోపలికి వెళ్లిచూడగా శాన్విరెడ్డి ముఖంపై దిండు ఉంది. దానిని తీయగా బాలిక రక్తం మడుగులో ఉంది. రంగారెడ్డి పెద్దగా రోదిస్తూ కుమార్తెను వైద్యశాలకు తీసుకెళ్లాడు. అప్పటికే బాలిక మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. అభంశుభం తెలియని చిన్నారిని ఎందుకు కిరాతకంగా చంపారు? దీని వలన ఎవరికి ఏమి ఉపయోగం అన్న కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కంభం వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రామకోటయ్య తెలిపారు.

ఇండియా కూటమిలోనే ఉంటాం: ఉద్ధవ్ శివసేన

న్యూఢిల్లీ, జూన్ 6: ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన త్వరలో ఎన్డీయే కూటమిలో చేరేందుకు సిద్ధమవుతోందని వస్తున్న వదంతులపై ఆ పార్టీ ఖండించింది. తాము ఇండియా కూటమిలోనే కొనసాగనున్నామని స్పష్టం చేసింది. శివసేన (యూబీటీ) రాజ్యసభ సభ్యురాలు, ఎంపీ ప్రియాంకా చతుర్వేదీ గురువారం ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. బీజేపీ భారీ మెజారిటీతో తిరిగి అధికారంలోకి రాబోతోందని ఫలితాలకు ముందు ఊదరగొట్టిన కొంద రు విలేకరులు.. వారి అంచనాలు తలకిందులయ్యేసరికి ఇప్పుడు ఇలాంటి వదంతులు పుట్టిస్తున్నారని పేర్కొన్నారు. తాము ఇండియా కూటమిలోనే ఉండనున్నామని ఆమె స్పష్టం చేశారు.

'మహా' రాజకీయాల విలన్ ఫడణవీస్: సంజయ్‌రౌత్

ముంబై, జూన్ 6: మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నేత దేవేంద్ర ఫడణవీస్‌పై శివసేన(ఉద్ధవ్ వర్గం) నేత సంజయ్ రౌత్ విమర్శలు గుప్పించారు. ఫడణవీస్‌ను మహారాష్ట్ర రాజకీయాల విలన్‌గా అభివర్ణించారు. ఆయన ఎన్నో కుటుంబాలను నాశనం చేశారని, రాజకీయ ప్రతీకారాలకు పాల్పడ్డారని సంజయ్ ఆరోపించారు. ఈ మేరకు గురువారం సంజయ్ రౌత్ ఢిల్లీలో విలేకరులతో మాట్లాడారు. నరేంద్రమోదీ బలవంతంగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినా అది నిలవబోదన్నారు.

పోలవరం పాపం జగన్‌దే!



» 'రివర్స్' నిర్ణయాలతో అంతా అస్తవ్యస్తం
» కేంద్రం అభ్యంతరం చెప్పినా బేఖాతర్
» 19,451 కోట్లకు పెరిగిన అంచనా వ్యయం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ సర్కారు ఐదేళ్లలో పలుమార్లు గడువులు మార్చినా పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయలేకపోయింది. నిర్మాణ పనులు ఆపేసి అతీగతీ లేకుండా చేసింది. డయాఫ్రమ్ వాల్ దెబ్బతిన్నది. గైడ్ బండ్ కుంగిపోయింది. కాఫర్ డ్యామ్‌లు సీపేజీకి గురయ్యాయి. 'రివర్స్' నిర్ణయాలతో నాశనం చేశారు. 2019 మే నెలాఖరులో సీఎంగా జగన్ పగ్గాలు చేపట్టేనాటికి రూ.11,537కోట్ల వ్యయంతో ప్రాజెక్టు పనులు 72శాతం మేర పూర్తయ్యాయి. స్పిల్‌వే, స్పిల్ చానల్ పనులు పూర్తయ్యాయి. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు 14మీ. ఎత్తులో నిర్మించారు. డయాఫ్రమ్ వాల్ పూర్తయి, దానిపై ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ నిర్మించడం మాత్రమే మిగిలి ఉంది. పోలవరం రేడియల్ గేట్లు 48 బిగించేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఈ పనులన్నీ పూర్తి చేసేందుకు కేవలం రూ.1,771 కోట్ల వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేశారు. జగన్ ప్రభుత్వం వచ్చాక పనులు కొనసాగించి ఉంటే 2021 నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యేది. కానీ 2019 జూన్ 6న కాంట్రాక్టు సంస్థ నవయుగను ప్రభుత్వం తప్పించింది. 2019 ఆగస్టులో రివర్స్ టెండరింగ్ పేరిట పోలవరం ప్రాజెక్టు హెడ్‌వర్క్స్‌లో మిగిలిన పనులకు రూ.1,771 కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వం బిడ్లు పిలిచింది. రివర్స్ టెండరింగ్ మార్గదర్శకాల మేరకు రెండు లేదా అంతకంటే ఎక్కువ సంస్థలు బిడ్లు దాఖలు చేసి పోటీ పడాలి. అయితే మేఘా ఇంజనీరింగ్ సంస్థ మాత్రమే స్పందించింది. ఒక్క సంస్థ మాత్రమే బిడ్ దాఖలు చేసినందున నిబంధనల ప్రకారం టెండర్ ప్రక్రియను రద్దు చేసి కొత్తగా పిలవాలి. అయితే రివర్స్ టెండరింగ్ నిబంధనలను తుంగలో తొక్కి హెడ్‌వర్క్స్‌లో మిగిలిన పనులను రూ.1,548.13 కోట్లకు మేఘా ఇంజనీరింగ్‌కు ప్రభుత్వం అప్పగించింది. ఈ పనులను 2021 డిసెంబరు నాటికి పూర్తి చేస్తామని రాష్ట్ర ప్రభుత్వంతో మేఘా ఇంజనీరింగ్ సంస్థ ఒప్పందం చేసుకుంది.

కేంద్రం అభ్యంతరం చెప్పినా..

పోలవరం ప్రాజెక్టుకు రివర్స్ టెండర్లు పిలవడంపై జలశక్తి శాఖ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు స్థాయిలో జోరుగా సాగుతున్న పోలవరం హెడ్‌వర్క్స్ పనులను ఆపేయడాన్ని తప్పుపట్టింది. నిర్మాణం పూర్తి చేసేందుకు ఆలస్యమవుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఉన్నపళంగా నిర్మాణ సంస్థను తప్పించడం వల్ల పాత సంస్థ చేపట్టిన పనుల్లోని లోపాలకు బాధ్యులను చేసే అవకాశం ఉండదని కేంద్రం స్పష్టం చేసింది. వీటన్నింటికి తోడు జాప్యం కారణంగా నిర్మాణ వ్యయం భారీగా పెరుగుతుందని హెచ్చరించింది. అయితే జగన్ సర్కారు ఈ హెచ్చరికలను పట్టించుకోలేదు. రివర్స్ టెండరింగ్ ద్వారా 223 కోట్లు ఆదా చేశామని గొప్పలు చెప్పింది. జాతీయ మీడియాలోనూ ఇదే ప్రచారం చేసుకుంది. ఇంత చేసి పనులన్నా సకాలంలో పూర్తి చేయించిందా అంటే.. అదీ లేదు. అప్పట్లో అంచనా వేసిన రూ.1,548.13 కోట్ల పనులు వ్యయం కాస్తా ఇప్పుడు రూ.21,000 కోట్లకు చేరుకుంది. అంటే.. 19,451.87 కోట్ల మేర సర్కారుపై భారం పడింది. రివర్స్ టెండరింగ్ విధానానికి వెళ్లినందున రాష్ట్రానికి ఏర్పడ్డ ఈ నష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారని సాగునీటి రంగ నిపుణులు ప్రశ్నిస్తున్నారు. రివర్స్ టెండరింగ్ విధానానికి వెళ్లకుండా ప్రాజెక్టు పనులు పూర్తి చేసి ఉన్నట్టయితే.. 1,771 కోట్లతో 2021 నాటికి పోలవరం పూర్తయ్యేది. గత మూడేళ్లుగా పోలవరం కుడి కాలువ ద్వారా కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలకు... ఎడమ కాలువ ద్వారా ఉభయగోదావరి, విశాఖ నగరం, స్టీల్ ప్లాంట్, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు గోదావరి జలాలు దక్కేవి. ఏటా రెండు పంటల చొప్పున వేల కోట్ల రూపాయల వ్యవసాయ దిగుబడులు వచ్చేవి. కానీ జగన్ తీసుకున్న రివర్స్ టెండరింగ్ నిర్ణయంతో పనులు ఆగిపోయాయి. అంతేగాక అప్పటికే నిర్మించిన డయాఫ్రమ్ వాల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు, గైడ్‌బండ్ ఛిద్రమైపోయాయి. ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ నిర్మించలేదు. పోలవరం ప్రాజెక్టు విధ్వంసానికి జగన్ బాధ్యత వహిస్తారా? అంచనా వ్యయం పెరగడానికి ఆయనే కారణం కాదా? కాగా, జగన్ అధికారంలోకి వచ్చాక పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై దృష్టి సారించకుండా చంద్రబాబును విమర్శించడానికే పరిమితమయ్యారు. పోలవరాన్ని చంద్రబాబు ఏటీఎంలా వాడుకున్నారంటూ విమర్శలు చేస్తూ వచ్చారు. 2013-14లో రూ.20,398 కోట్లుగా ఉన్న పోలవరం ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని కమీషన్ల కోసం 2017-18 నాటికి 55,548.74 కోట్లకు పెంచేశారంటూ జగన్ ఆరోపించారు. పెరిగిన అంచనా వ్యయంపై జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే విజిలెన్స్ దర్యాప్తు జరిపించారు. పోలవరం నిర్మాణంలో తప్పు జరిగిందని విజిలెన్స్ విభాగం తేల్చలేకపోయింది. పీటర్ కమిటీ ఆరోపించినట్లుగా రూ.3,128.31 కోట్ల మేర అక్రమాలు జరిగాయనడంలో వాస్తవం లేదని తేల్చింది. కేంద్రం నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టుపై విజిలెన్స్ దర్యాప్తు చేయడంపై కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. అయినా అంతర్గతంగా విజిలెన్స్ దర్యాప్తు చేపట్టినా పోలవరం ప్రాజెక్టులో తప్పులు జరిగినట్లుగా నిరూపించలేకపోయింది.

తుంగభద్రలో 172 టీఎంసీల నీటి లభ్యత!

» అంచనా వేసిన టీబీ ప్రాజెక్టు బోర్డు
» మూడు రాష్ట్రాల ఎస్ఈలతో సమావేశం
» అంచనా మేరకు వాటాల కేటాయింపు

రాయదుర్గం, జూన్ 6: తుంగభద్ర జలాశయంలో ఈ ఏడాది 172 టీఎంసీల నీటి లభ్యత ఉండవచ్చని బోర్డు అంచనా వేసింది. కర్ణాటక రాష్ట్రం.. హొస్పేట్‌లోని టీబీ బోర్డు కార్యాలయంలో బోర్డు ఎస్ఈ శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం సమావేశాన్ని నిర్వహించారు. అనంతపురం ఎస్ఈ రాజశేఖర్, కర్నూలు ఎల్లెల్సీ ఎస్ఈ రెడ్డిశేఖర్‌రెడ్డి, కర్ణాటక ఎల్‌బీఎంసీ ఎస్ఈ బసవరాజ్‌నాయక్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. నీటి లభ్యత అంచనాల ఆధారంగా ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల వాటాను నిర్ణయించారు. 2024-25లో ముందస్తు రుతుపవనాల కారణంగా జలాశయానికి 172 టీఎంసీల నీరు చేరుతుందని అంచనా వేశారు. ఏపీ వాటాగా 53.953 టీఎంసీలను కేటాయించారు. అందులో ఫ్లోరేటా ప్రకారం హెచ్చెల్సీకి 26.368 టీఎంసీలు, ఎల్లెల్సీకి 19.472 టీఎంసీలు, కేసీ కెనాల్‌కు 8.113 టీఎంసీల నీరు అందుతాయని అంచనా వేశారు. తెలంగాణ వాటా కింద 5.282 టీఎంసీల నీటిని ఆర్‌డీఎస్ కాలువ ద్వారా అందించాలని నిర్ణయించారు. కర్ణాటకకు 112.765 టీఎంసీల నీటిని కేటాయించారు. ఫ్లోరేటా ప్రకారం హెచ్చెల్సీకి 13.440 టీఎంసీలు, రాయ బసవ కెనాల్‌కు 5.376 టీఎంసీలు, ఆర్డీఎస్ కెనాల్‌కు 1.912 టీఎంసీలు, ఎల్‌బీఎంసీకి 71.423 టీఎంసీలు అందించాలని నిర్ణయించారు. తుంగభద్ర జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 105 టీఎంసీలు. 200 టీఎంసీలకుపైగా నీటి లభ్యత ఉంటే బచావత్ అవార్డు ప్రకారం కాలువలకు కేటాయించిన నీటిని అందించే అవకాశం ఉంటుందని బోర్డు అధికారులు తెలిపారు. హెచ్చెల్సీకి బచావత్ ట్రిబ్యునల్ 32.5 టీఎంసీల నీరు కేటాయించారు. కానీ ఈ ఏడాది నీటి లభ్యతను బట్టి 26.368 టీఎంసీలివ్వాలని నిర్ణయించారు. జూలై 20న హెచ్చెల్సీకి ఏపీ వాటా విడుదల చేసే అవకాశాలున్నట్లు తీర్మానం చేశారు. జలాశయంలోకి ముందుగానే నీరు చేరితే నిర్ణయించిన తేదీకంటే ముందే నీటిని విడుదల చేసే అంశాన్ని కూడా చర్చించారు.

46% మంది నేరచరితులే

» కొత్త లోక్‌సభ ఎంపీలలో 251 మందిపై క్రిమినల్ కేసులు
» 504 మంది ఎంపీలు కోటీశ్వరులు
» 1వ స్థానంలో పెమ్మసాని : ఏడీఆర్

న్యూఢిల్లీ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కొత్తగా కొలువు దీరనున్న 18వ లోక్‌సభకు ఎన్నికైన 543 మంది ఎంపీలలో 251 మంది(46%) పై క్రిమినల్ కేసులున్నాయి. గత లోక్‌సభలో క్రిమినల్ కేసులున్న ఎంపీల సంఖ్య 233కాగా ఈసారి మరింత పెరిగింది. నూతన ఎంపీలలో 170 మందిపై తీవ్రమైన క్రిమినల్ కేసులున్నాయి. ఈ వివరాలను అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్(ఏడీఆర్) సంస్థ గురువారం వెల్లడించింది. 27 మంది ఎంపీలు వివిధ కేసుల్లో దోషులుగా తేలారు. నలుగురు ఎంపీలపై హత్య, 27మందిపై హత్యాయత్నం కేసులు నమోదయ్యాయి. 15మంది ఎంపీలు మహిళలపై దాడులకు పాల్పడ్డారు. వీరిలో ఇద్దరిపై అత్యాచారం కేసులున్నాయి. నలుగురిపై కిడ్నాపింగ్, 43 మందిపై విద్వేష ప్రసంగాలకు సంబంధించిన కేసులు నమోదయ్యాయి. ఈసారి ఎన్నికల్లో క్రిమినల్ కేసులున్న అభ్యర్థికి లభించిన విజయావకాశాలు 15.3 శాతం కాగా, క్లీన్ ఇమేజీ అభ్యర్థికి 4.4శాతమే అవకాశాలు దక్కినట్లు వెల్లడైంది. పార్టీల వారీగా చూస్తే, బీజేపీ-94, కాంగ్రెస్-49, ఎస్పీ-21, టీఎంసీ-13, డీఎంకే-13, టీడీపీ-8 మంది ఎంపీలపై క్రిమినల్ కేసులున్నాయి. బీజేపీ-60, కాంగ్రెస్-32, ఎస్పీ-17, తృణమూల్-7, డీఎంకే-6, టీడీపీ-5, శివసేన-4 మందిపై తీవ్రమైన క్రిమినల్ అభియోగాలు నమోదయ్యాయి.

సంపన్నుల సభ

504 మంది కోటీశ్వరులు ఈసారి ఎంపీలుగా ఎన్నికయ్యారు. మొత్తం లోక్‌సభలో వీరు 93 శాతం. 2009లో 315 మంది, వీరిలో బీజేపీ-227, కాంగ్రెస్-92, డీఎంకే-21, తృణమూల్-27, ఎస్పీ-34, జేడీయూ-12, టీడీపీ-16 మంది ఎంపీలున్నారు. రూ.10 కోట్లకు పైగా ఆస్తులున్న ఎంపీలు 227 మంది (42%) ఉన్నారు. గుంటూరు నుంచి గెలిచిన పెమ్మసాని చంద్రశేఖర్ (టీడీపీ) రూ.5,705 కోట్ల ఆస్తులతో ప్రథమ స్థానంలో, చేవెళ్ల నుంచి గెలిచిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డి (బీజేపీ) రూ.4,568 కోట్లతో రెండో స్థానంలో, హరియాణాలోని కురుక్షేత్ర నుంచి గెలిచిన నవీన్ జిందాల్(బీజేపీ) రూ.1,241కోట్లతో మూడోస్థానంలో ఉన్నారు. విద్యార్హతల విషయానికొస్తే.. ఎంపీలలో 420 మంది డిగ్రీ, ఆపై విద్యాభ్యాసం చేసిన వారున్నారు. 105 మంది ఎంపీలు ఐదు నుంచి 12వ తరగతి వరకు చదువుకున్నారు. 17 మంది డిప్లొమా పూర్తి చేశారు. ఒక ఎంపీకి కేవలం చదవడం, రాయడం మాత్రమే వచ్చు. వయస్సుల వారీగా చూస్తే, ఎంపీలలో 58 మంది 25-40 ఏళ్లు, 280 మంది 41-60 ఏళ్లు, 204 మంది 61-80 ఏళ్ల మధ్య వయస్సు వాళ్లున్నారు. 82 ఏళ్ల అత్యధిక వయస్సు ఉన్న ఎంపీ ఒకరున్నారు. మొత్తం ఎంపీలలో 74 మంది మహిళలున్నారు. గత లోక్‌సభలో మహిళా ఎంపీలు 77 మంది కాగా ఈసారి వారి సంఖ్య తగ్గింది. మరోవైపు, గత లోక్‌సభలో ఎంపీలుగా ఉన్నవారిలో 214 మంది తిరిగి ఎన్నికయ్యారు. 280మంది తొలిసారిగా ఎన్నికయ్యారు. గత లోక్‌సభలో 36 పార్టీల నుంచి ప్రాతినిధ్యం ఉండగా, ఈసారి 41 పార్టీలకు ప్రాతినిధ్యం లభించింది. 240 సీట్లతో బీజేపీ ప్రథమస్థానంలో, 99 సీట్లతో కాంగ్రెస్ ద్వితీయస్థానంలో, 37 సీట్లలో ఎస్పీ మూడో స్థానంలో ఉన్నాయి.

దుర్గమ్మను దర్శించుకున్న ప్రజాప్రతినిధులు



శ్రీకాకుళం ఎంపీ యలిశెట్టి అప్పలనాయుడు



అరకు ఎమ్మెల్యే మత్స్య లింగం



పత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ



ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్



చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్

వన్‌టౌన్, జూన్ 6: ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ వారిని గురువారం ఇటీవల ఎన్నికల్లో గెలిచిన పలువురు ప్రజా ప్రతినిధులు దర్శించు కున్నారు. అమ్మవారిని దర్శించుకుని అర్చకుల ఆశీస్సులను పొందారు. ప్రసాదాలు స్వీకరించారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో శ్రీకాకుళం ఎంపీ అప్పలనాయుడు, అరకు ఎమ్మెల్యే మత్స్య లింగం, పత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, చిత్తూరు ఎమ్మెల్యే గుర జాల జగన్, బీరా రవిచంద్ర యాదవ్, రామ్‌గోపాల్ రెడ్డి తదితర నాయకులు ఉన్నారు.

29 ఏళ్ల తరువాత రాణిగారితోటలో టీడీపీకి మెజారిటీ

●18వ డివిజన్ అధ్యక్షుడు వేముల దుర్గారావు

రాణిగారితోట, జూన్ 6: 29 సంవత్సరాల తర్వాత రాణిగారితోటలో టీడీపీకి మెజారిటీ వచ్చిందని 18వ డివిజన్ అధ్యక్షుడు వేముల దుర్గారావు ఒక ప్రకటనలో తెలిపారు. 1995 తరువాత నుంచి గత కార్పొరేషన్ ఎన్నికల వరకు టీడీపీకి విజయం లేదు. దీంతో రాణిగారితోట ప్రాంత టీడీపీ నాయకులు ప్రతిసారి ఎంతో కసిగా పనిచేసినా ఫలితం మాత్రం వారికి వ్యతిరేకంగానే ఉండేదన్నారు. ఈ నేపథ్యంలో 2014 నుంచి పోటీ చేస్తున్న గద్దె రామ్మోహన్ ఇక్కడి నాయకులను ప్రతిసారి ప్రోత్సహిస్తూ వచ్చారని, ఎవరికి ఏ కష్టం వచ్చినా వారికి సాయం చేస్తూ ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తూ వస్తున్నారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో రాణిగారితోట ప్రాంత టీడీపీ శ్రేణులు కసిగా, వైసీపీ ఆగడాలను అడ్డుకుంటూ ఓటు బ్యాంక్ ను రాబట్టే కార్యక్రమాలు నిర్వహించారన్నారు. ఇన్నేళ్లకు ఈ ప్రాంతంలో తెలుగుదేశానికి మెజారిటీ రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. తమ నాయకులు గద్దె రామ్మోహన్ చేస్తున్న ప్రజాసేవకు ప్రజలు చూపిన ప్రేమకు వారిక ధన్యవాదాలు చెబుతున్నానన్నారు. ఇదే ఉత్సాహంతో పార్టీ కోసం, ప్రజాసమస్యల పరిష్కారం కోసం పనిచేస్తామని దుర్గారావు స్పష్టం చేశారు.

రైలు ప్రమాదంలో రైల్వే ఉద్యోగి మృతి



తరుణ్‌కృష్ణ (ఫైల్)

నెక్కొండ, జూన్ 6 : వరంగల్ జిల్లా నెక్కొండ-ఇంటికన్నె రైల్వేస్టేషన్‌ల మధ్య రైలు ప్రమాదానికి గురై విజయవాడకు చెందిన రైల్వే ఉద్యోగి దండబోయిన తరుణ్ కృష్ణ (30) మృతి చెందినట్లు ఆర్పీఎఫ్ ఎస్ఐ ఎం.ఐలయ్య గురువారం తెలిపారు. జూనియర్ ఇంజనీరింగ్ ట్రాక్ మిషన్ డిపార్టుమెంట్ కాజీపేట సెంక్షన్‌లో విధులను నిర్వహిస్తున్న తరుణ్‌కృష్ణ 407/31-29-ఆఫ్ లైన్ వద్ద గుర్తుతెలియని రైలు బండి నుంచి ప్రమాదవశాత్తు పడడంతో తీవ్ర గాయాలకు గురై మృతి చెందాడు. మృతుడి వద్ద లభించిన సెల్ ఫోన్ ద్వార తరుణ్‌కృష్ణ విధులను నిర్వహిస్తున్న శాఖ అధికారులకు, బంధువులకు సమాచారం అందించామన్నారు. వివరాలు తెలియాల్సి ఉందని, మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం మార్చురీలో భద్రపర్చినట్లు చెప్పారు.

బీఎస్ఎన్ఎల్ స్థలం వేలాన్ని తక్షణం ఆపాలి

ఇబ్రహీంపట్నం, జూన్ 6: కొండపల్లిలోని బీఎస్ఎన్ఎల్ స్థలం బహిరంగ వేలాన్ని తక్షణం ఆపాలని సీపీఎం నేత ఎం.మహేష్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కొత్త ప్రభుత్వం బీఎస్ఎన్ఎల్ యాజమాన్యంతో మాట్లాడి పోస్టల్ కార్యాలయం ఏర్పాటు చేయాలన్నారు.

రాష్ట్రానికి పట్టిన పీడ విరగడైంది: వైవీబీ



నారా లోకేశ్‌ను కలిసిన వైవీబీ, ఆళ్ల గోపాలకృష్ణ, బోడె ప్రసాద్

ఉయ్యూరు, జూన్ 6: రాష్ట్రానికి పట్టిన పీడ ఈనెల నాలుగో తేదీతోనే వదిలిపోయిందని, ప్రజలందరూ ఏకతాటిపై నిలిచి కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించి రాష్ట్ర భవిష్యత్తుకు నాంది పలికారని ముఖ్యమంత్రిగా చంద్రబాబు రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. కూటమి అధికారంలోకి రావడం, మంగళగిరిలో నారా లోకేశ్ భారీ మెజారిటీతో ఘన విజయం సాధించడం పట్ల టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ గురువారం లోకేశ్‌ను ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. లోకేశ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

సకాలంలో సాగు నీరందించేలా కార్యాచరణ

లోకేశ్ హామీ ఇచ్చారన్న ఆళ్ల గోపాలకృష్ణ

హనుమాన్‌జంక్షన్‌రూరల్: సాగునీటి రంగంలో విప్లవాత్మక మార్పుల తెచ్చి రైతులకు సకాలంలో సాగునీరందించేలా కార్యాచరణ రూపొందిస్తామని నారా లోకేశ్ హామీ ఇచ్చారని సాగునీటి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణ తెలిపారు. మంగళగిరి నియోజకవర్గం నుంచి భారీ మెజారిటీతో విజయం సాధించినందుకు మర్యాదపూర్వకంగా ఉండవల్లిలో లోకేశ్‌ను ఆయన కలిసి అభినందనలు తెలిపారు. హనుమాన్‌జంక్షన్ అభయాంజనేయస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన స్వామి ప్రసాదం, శేష వస్త్రాన్ని లోకేశ్‌కు అందజేశారు. రంగన్నగూడెంలో యువగళం పాదయాత్ర సందర్భంగా జరిగిన కవ్వింపుచర్యల్లో టీడీపీ నాయకులను వేధించిన వైసీపీకి ప్రజలు బుద్ధి చెప్పారని, టీడీపీకి పంచాయితీలో మెజారిటీ ఇచ్చారని లోకేశ్‌కు ఆళ్ల వివరించారు. ఎన్నికల సమయంలో కొత్త మల్లవల్లిలో జరిగిన దాడుల గురించి లోకేశ్ అడిగి తెలుసుకున్నట్లు ఆళ్ల తెలిపారు. తుమ్మల ఉదయ్, శేఖర్ పాల్గొన్నారు.

లోకేశ్‌ను కలిసిన బోడె ప్రసాద్

పెనమలూరు: నారా లోకేశ్‌ను పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ సాధించిన అఖండ విజయం పట్ల ఇరువురూ చర్చించారు. బోడె వెంట కోయ ఆనంద్ ప్రసాద్, బోడె మనోజ్, ఆచంట వెంకటచంద్ర, బోడె సురేంద్ర, డీవీ సుబ్బారావు తదితరులు ఉన్నారు.

మోదీ చారిత్రాత్మక నిర్ణయాలతోనే మూడోసారి విజయం

ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్



గొల్లపూడిలో మాట్లాడుతున్న ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్

గొల్లపూడి / ఇబ్రహీంపట్నం, జూన్ 6: దేశంలో నరేంద్ర మోదీ చారిత్రాత్మక నిర్ణయాల వల్లే ఎన్డీఏ మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిందని ధర్మవరం బీజేపీ ఎమ్మెల్యే వై.సత్యకుమార్ అన్నారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వస్తున్న ఆయనకు ఇబ్రహీంపట్నం రింగ్‌లో బీజేపీ నాయకులు రేగళ్ల రఘునాథరెడ్డి, కుక్కపల్లి నాగేశ్వరరావు, వల్లూరి శ్రీమన్నారాయణ ఘనంగా స్వాగతం పలికారు. గొల్లపూడిలో బీజేపీ నాయకుడు నూతులపాటి బాలకోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా సత్యకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో గతి తప్పిన ఆర్థిక వ్యవస్థ చంద్రబాబు సారథ్యంలో ఎన్డీఏ కూటమితోనే సాధ్యమతుందని నమ్మిన ప్రజలు ఐదేళ్ల అసమర్థ, అవినీతి, అస్తవ్యస్త, అరాచక వైసీపీ పాలనకు చెంప పెట్టులా ఓట్లు వేసి తీర్పు ఇచ్చారన్నారు. భవిష్యత్‌లో జగన్ తలెత్తుకోలేని విధంగా రాష్ట్ర ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. అనంతరం ఆయన మైలవరం ఎమ్మెల్యే వసంతను మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు చంద్ర



రాజేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న సీపీఐ నాయకులు

చల్లపల్లి, జూన్ 6 : దున్నేవాడికే భూమి నినాదంతో అనేకమంది పేద ప్రజలకు భూములు సాధించటంలో ముఖ్యభూమిక పోషించిన చండ్ర రాజేశ్వరరావు చిరస్మరణీయుడని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర నాయకులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ అన్నారు. కామ్రేడ్ రాజేశ్వరరావు 110వ జయంతి చండ్ర రాజేశ్వరరావు వికాసకేంద్రంలో గురువారం జరిగింది. బెనర్జీ మాట్లాడుతూ, సంపన్న రైతు కుటుంబంలో పుట్టి సాదాసీదా జీవితం గడిపిన రాజేశ్వరరావు రైతాంగానికి, పేద ప్రజలకు ఆపద్బాంధవుడిలా సేవలందించారన్నారు. అంతటి మహోన్నత వ్యక్తి చల్లపల్లి మండలం మంగళాపురం వాసి కావటం ఈ ప్రాంత ప్రజల అదృష్టమన్నారు. పరుచూరి కోటేశ్వరరావు (రాము), రైతుసంఘం జిల్లా కార్యదర్శి గుత్తికొండ రాము, సీపీఐ నాయకులు మల్లుపెద్ది బోసు, కొర్రపాటి ముఖర్జీ, కోడాటి నాగయ్య, సిద్ధాబత్తుల వాసు, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మల్లుపెద్ది రత్నకుమారి, కంఠంనేని జ్యోత్స్నాదేవి తదితరులు పాల్గొన్నారు. తొలుత సీఆర్ చిత్రపటానికి మనుమడు (మేనల్లుని కొడుకు) రాము పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నవరత్నాల శిలాఫలకాల ధ్వంసం



పెనమలూరు, జూన్ 6 : రాష్ట్రంలో వైసీపీ హయాంలో ఏర్పాటు చేసిన జగన్ శిలాఫలకాల ధ్వంసంలో భాగంగా గురువారం పెనమలూరు మండలంలోని పెదపులిపాకలోని సచివాలయంలో జగన్‌రెడ్డి నవరత్నాల శిలాఫలకాలను గ్రామ టీడీపీ నాయకుడు ముసునూరి నిర్మల్ ధ్వంసం చేశారు. శిలాఫలకాలను సుత్తి, బాడిశెలతో ధ్వంసం చేసి మాట్లాడుతూ నవరత్నాల పేరుతో జగన్‌రెడ్డి నవమోసాలకు పాల్పడ్డాడని విమర్శించారు.



గంగూరులో వైసీపీ బోర్డు మాయం

పెనమలూరు, జూన్ 6: బందరు జాతీయ రహదారిపై గంగూరు వద్ద ఉన్న పెనమలూరు నియోజకవర్గ వైసీపీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన పార్టీ పేరున ఉన్న బోర్డు గురువారం మాయమయింది. రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ దారుణంగా ఓడిపోవడం, పెనమలూరు నియోజకవర్గంలో మంత్రి జోగి రమేష్ బోడె ప్రసాద్‌పై అత్యధిక మెజారిటీతో ఓడిపోవడంతో కార్యాలయం బోర్డు తొలిగించారని, ఇక జోగి రమేష్ కార్యాలయానికి రాకపోవచ్చని స్థానికులు చర్చించుకున్నారు.

ఎస్సై దాడి చేశారని.. దివ్యాంగుడి ఆరోపణ

వత్సవాయి, జూన్ 6: బైక్‌పై టీడీపీ జెండాతో వెళుతున్న కుటుంబంపై ఎస్సై అభిమన్య దాడి చేసి తీవ్రంగా గాయపరచారని దివ్యాంగుడు ఆరోపించారు. వత్సవాయి గ్రామానికి చెందిన కనతాల కొండ తన అభిమాన టీడీపీ అధికారంలోకి రావడంతో సంతోషంగా బుధవారం రాత్రి తన బైక్‌పై టీడీపీ జెండా కట్టి.. మైక్ పెట్టుకొని వత్సవాయమ్మ గుడివైపు వెళుతుండగా ఎస్సై అడ్డగించి అసభ్య పదజాలంతో దూషించి దాడి చేశాడన్నాడు. అదేంటి అని అడిగిన నా కుమార్తెలు శ్రావణి, వరలక్ష్మిలపై కూడా దాడి చేశాడని ఆవేదన వ్యక్తంచేశాడు. ఎస్సై కొట్టిన దెబ్బలకు తాను స్పృహ కోల్పోయి కింద పడిపోవడంతో సమీంపలోని కొందరు వ్యక్తులు తనను జగ్గయ్యపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు తెలిపాడు. తనపై తన పిల్లలపై దాడి చేసి గాయపర్చిన ఎస్సై పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాడు. ఈ విషయంపై ఎస్సై వివరణ ఇస్తూ టీడీపీ విజయం సందర్భంగా కొందరు ఆకతాయిలతో కలిసి కొండ, ఎంపీపీ తిరుపతిరావు ఇంటిపై రాళ్లు రువ్వుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో అక్కడకు వెళ్లి ఆకతాయిలను చెదరగొట్టామన్నారు. ఆ క్రమంలోనే దివ్యాంగుడైన కొండ కింద పడ్డాడని, తమ సిబ్బంది లేపి పంపారన్నారు. కొండపై పోలీస్‌స్టేషన్‌లో ఇప్పటికే రౌడీషీట్ ఉందని ఎస్సై తెలిపారు.

అమరావతి పనులపై నివేదిక

» నిర్మాణ పనుల పరిస్థితిపై సమగ్ర నివేదిక రూపకల్పన

» సీఎం సమీక్ష కోసం సిద్ధం చేసుకుంటున్న సీఆర్‌డీఏ

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వం వెళ్లిపోయింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీర నుంది. ఈ నేపథ్యంలో అమరావతి రాజధాని తాజా స్థితిగతులపై సీఆర్‌డీఏ అధికారులు సమగ్ర నివేదికను సిద్ధం చేస్తున్నారు. పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల విధులు ముగించుకుని ఏపీకి తిరుగు ప్రయాణమైన సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్ యాదవ్ అధికారులకు ఈ మేరకు ఆదేశాలిచ్చారు. కూటమి ప్రభుత్వం కొలువు తీరగానే, ముందుగా రాజధాని సంబంధిత అంశాలపై సమీక్ష జరిపే అవకాశం ఉన్నందున అన్ని వివరాలతో నివేదికను తయారు చేయాల్సిందిగా ఆదేశించారు. దీంతో సీఆర్‌డీఏ అధికారులు నివేదికను తయార చేసే పనిలో నిమగ్నమయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సీఆర్‌డీఏలో పనిచేస్తున్న కొందరు అధికారులు, ఉద్యోగులు సంతోషంగా ఉన్నారు. నిత్యం అనుమానాలు ఎదుర్కొంటూ వేధింపులకు గురైన వీరు ఇప్పుడు ఊపిరి పీల్చుకుంటున్నారు. ఎంఏయూడీ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీదేవి ఆదేశాల మేరకు నడుచుకున్న అధికారులు మాత్రం భయపడుతున్నారు.

వారిని వదిలిపెట్టేదే లేదు: బుద్దా వెంకన్న



విజయవాడ, జూన్ 6: చంద్రబాబు కుటుంబంపై తప్పుడు విమర్శలు చేసిన ఏ ఒక్కరినీ వదలి పెట్టేది లేదని మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న అన్నారు. గురువారం విజయవాడలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'చంద్రబాబు కుటుంబాన్ని విమర్శించిన కృష్ణా జిల్లాలోని పిచ్చికుక్కలు కొడాలి నాని, పేర్ని నాని తదితరులను వదలి పెట్టే ప్రసక్తి లేదు. జగన్మోహనరెడ్డి ఇక తన రాజకీయాలకు స్వస్తి చెప్పి జైలు జీవితం చేస్తారు. మరో మూడు జన్మలెత్తినా తరగని శిక్షలు ఆయనకు పడతాయి. త్వరలోనే సజ్జల రామకృష్ణారెడ్డి కూడా జైలుకు వెళతారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై పెళ్లిళ్ల పేరుతో జగన్ అనుచిత వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు కుటుంబం రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎప్పుడూ పోరాడుతునే ఉంటుంది. ఇప్పుడు కూడా చంద్రబాబు కేంద్రంలో ముఖ్యపాత్ర పోషిస్తున్నారంటే అంతకంటే టీడీపీ శ్రేణులకు మరో ఆనందం ఏముంటుంది?' అని వెంకన్న అన్నారు.

మోదీజీ.. ఇప్పుడైనా 'హోదా' ఇస్తారా?: కాంగ్రెస్

న్యూఢిల్లీ, జూన్ 6: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని ప్రధాని నరేంద్ర మోదీ పదేళ్ల క్రితం హామీ ఇచ్చారని, ఇప్పుడైనా ఆ హామీని నెరవేరుస్తారా? అని కాంగ్రెస్ పార్టీ ప్రశ్నించింది. ఏపీతో పాటు బిహార్‌కు సంబంధించి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్.. మోదీని ఉద్దేశిస్తూ నాలుగు ప్రశ్నలు సంధించారు. '2014 ఏప్రిల్ 30న ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని తిరుపతిలో మోదీ హామీ ఇచ్చారు. పదేళ్లయినా ఆ హామీ నెరవేర్చలేదు. ఇప్పుడైనా ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తారా' అని ప్రశ్నించారు. అలాగే విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపేస్తారా? 2014లోనే బిహార్‌కు కూడా ప్రత్యేక హోదా ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పటికీ దానిపై నోరు మెదపడం లేదు. బిహార్‌లో మాదిరిగా దేశమంతా కులగణన చేయిస్తామని హామీ ఇస్తారా? అని ప్రశ్నించారు. 'మోదీ 3.0' ప్రభుత్వం ఏర్పడుతుందని పదేపదే చెబుతున్నారని, వాస్తవంగా ఈసారి ఏర్పడేది 'మోదీ 1/3 ప్రభుత్వం' అని జైరాం రమేశ్ ఎద్దేవా చేశారు.

ఉద్యోగుల పక్షపాతి చంద్రబాబు

» ఏపీ పెన్షనర్స్ పార్టీ నేత సుబ్బరాయన్

అమరావతి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు కీలక పాత్ర పోషించారని ఏపీ పెన్షనర్స్ పార్టీ అధ్యక్షుడు మాలంకి సుబ్బరాయన్ చెప్పారు. గురువారం అమరావతిలోని సచివాలయంలో ఏపీ పెన్షనర్స్ పార్టీ తరఫున ఉద్యోగులకు స్వీట్లు పంచి, ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా సుబ్బరాయన్ మాట్లాడుతూ... 'ఉద్యోగులు, పెన్షనర్లకు మంచి రోజులు వచ్చాయి. జగన్ వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు చాలా ఇబ్బందులు పడ్డారు. అందుకే చంద్రబాబు నాయకత్వం కావాలని రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు కోరుకున్నారు. ఉద్యోగుల పక్షపాతి అయిన చంద్రబాబు మా కష్టాలు తీరుస్తారని భావిస్తున్నాం' అని అన్నారు. ఏపీ రిటైర్డ్ ఎంప్లాయిస్ ప్రెసిడెంట్ టీజీ ప్రసాదరావు మాట్లాడుతూ... 'మా కష్టాలు, సమస్యలు తీరే రోజు కోసం ఐదేళ్లు నిరీక్షించాం. చంద్రబాబు ప్రభుత్వం రావటానికి మా వంతు కృషి చేశాం' అని అన్నారు.

పిన్నెల్లిని గురజాల జైలుకే పంపండి

» ఉన్నతాధికారులకు ఎస్సీ సిబ్బంది వినతి

అమరావతి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): 'దళిత అధికారిని పొట్టన బెట్టుకున్న పిన్నెల్లి రామక్రిష్ణా రెడ్డిని గురజాల ప్రత్యేక సబ్ జైలుకు పంపండి' అని జైళ్ల శాఖలో పనిచేసే ఎస్సీ వార్డర్లు విజ్ఞప్తి చేశారు. ఆ శాఖ ఉన్నతాధికారులను కలిసిన వారు ఆయన పెట్టిన ఇబ్బందులను ఏకరువు పెట్టారు. '2021 ఏప్రిల్‌లో పిన్నెల్లి, టీడీపీ నేతలపై అక్రమ కేసులు పెట్టించారు. వారిని గురజాల సబ్ జైలుకు తరలించారు. టీడీపీకి చెందిన రిమాండ్ ఖైదీలతో బాత్రూమ్‌లు కడిగిస్తూ ఆ వీడియోలు తీసి పంపాలంటూ పిన్నెల్లి అప్పట్లో జైలర్‌పై ఒత్తిడి తెచ్చారు. అందుకు నిబంధనలు అంగీకరించబోవంటూ ఎంత చెప్పినా వినిపించుకోకుండా హోం మంత్రి ద్వారా ఒత్తిడి పెంచారు. జ్యుడిషియలర్ రిమాండ్‌లో ఉన్న ఖైదీల పరువుకు భంగం కలిగేలా వీడియోలు, ఫొటోలు తీసి బయటికి పంపితే భవిష్యత్తులో చట్టపరమైన ఇబ్బందులు తప్పవంటూ సహచరులు, ఇతర అధికారులు జైలర్‌ను హెచ్చరించారు. దీంతో జైలర్ ససేమిరా అన్నారు. ఆయనపై పిన్నెల్లి తీవ్రమైన ఒత్తిడి తీసుకు రావడంతో గుండెపోటుకు గురయ్యారు' అంటూ ఉద్యోగులు నాటి బాధాకరమైన ఘటనను గుర్తు చేసుకొన్నారు. ఆరు వరకూ మధ్యంతర బెయిలుపై ఉన్న పిన్నెల్లిని గురువారం అరెస్టు చేసే అవకాశం ఉందన్న సమాచారంతో ఇప్పుడు అదే జైలుకు పిన్నెల్లిని పంపాలంటూ ఎస్సీ సిబ్బంది విన్నవించారు. స్పందించిన ఉన్నతాధికారులు నిబంధనల ప్రకారమే ఏదైనా జరుగుతుందని చెప్పి సిబ్బందిని పంపేశారు.

కూటమి విజయంపై ఏయూలో సంబరాలు

» అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం

» వీసీని తొలగించి, అరెస్టు చేయాలని డిమాండ్

వెంకోజీపాలెం(విశాఖపట్నం), జూన్6: రాష్ట్రంలో కూటమి గెలుపును స్వాగతిస్తూ ఆంధ్ర విశ్వవిద్యాలయంలో గురువారం పలువురు కేక్ కట్ చేసి, స్వీట్లు పంచుకున్నారు. తొలుత క్యాంపస్‌లో గల డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా మాజీ ప్రొఫెసర్ ఆచార్య కె.జాన్ మాట్లాడుతూ ఓటు అనే ఆయుధం ద్వారా వైసీపీని రాష్ట్ర ప్రజలు బంగాళాఖాతంలో కలిపారని, కూటమి ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వం రాబోతోందని అన్నారు. ఏయూను వీసీ ప్రసాదరెడ్డి అవినీతి, అవకతవకలతో భ్రష్టు పట్టించారని మండిపడ్డారు. నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న ఆయన్ను తొలగించి, అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్, పలువురు ఆచార్యులు, ఏపీ నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు సమయం హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరులో విశాఖ సీపీ భార్య పంచాయితీ

» అర్ధరాత్రి వరకూ పసిబిడ్డతో సహా వైద్య దంపతుల నిర్బంధం

» తీవ్ర బెదిరింపులకు పాల్పడ్డ సీఐ వెంకటేశ్వరరెడ్డి

» పోలీస్ ఉన్నతాధికారులు సీరియస్... శాఖాపరమైన విచారణ

గుంటూరు, జూన్ 6: విశాఖపట్నం పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యన్నార్ సతీమణి సుమితా శంకర్ తన అధికార దర్పంతో వైద్య దంపతులపై బెదిరింపులకు పాల్పడిన ఘటన కలకలం రేపింది. హెల్త్ యూనివర్శిటీలో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న సుమిత శంకర్ నగరంలోని అరండల్ పేట 8వ లైన్ లో అమేజ్ మెడికల్ స్పా అనే క్లినిక్ నిర్వహిస్తున్నారు. ఆసుపత్రిలో భాగస్వాములుగా వరంగల్‌కు చెందిన డాక్టర్ నిశాంత్ దంపతులను ఏడాదిన్నర క్రితం చేర్చుకున్నారు. కొంతకాలంగా వారి మధ్య విభేదాలు నడుస్తున్నాయి. ఆసుపత్రికి వచ్చే పేషెంట్లను డాక్టర్ నిషాంత్ తను విడిగా పెట్టుకున్న ఆసుపత్రికి డైవర్ట్ చేస్తున్నారంటూ సుమిత శంకర్ ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో వారు విడిపోవాలని నిర్ణయించుకున్నారు. తమ డబ్బు తమకు ఇస్తే వెళ్లిపోతామని డాక్టర్ నిషాంత్ చెప్పారు. ఈ క్రమంలో పెట్టుబడిగా పెట్టిన రూ.25 లక్షలు ఇవ్వాలని కోరారు. అయితే అందుకు సుమితా శంకర్ ఒప్పుకోలేదు. మూడు రోజుల క్రితం ఈ విషయంపై చర్చించేందుకు నిషాంత్ దంపతులు తమ ఎనిమిది నెలల చంటి బిడ్డను తీసుకొని ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ తమపై డాక్టర్ సుమిత శంకర్ దౌర్జన్యం చేసి బెదిరించారని, పేపర్లపై సంతకాలు చేసి తాను ఇచ్చిన రూ.12.50 లక్షలు తీసుకొని వెళ్లిపోవాలని బెదిరించారని బాధితులు ఆరోపించారు. అందుకు తాము ఒప్పుకోకపోవడంతో అరండల్ పేట సీఐ వెంకటేశ్వర్‌రెడ్డిని పిలిపించి బెదిరించారని చెప్పారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ప్రభుత్వం మారడం, అదే సమయంలో గుట్టుగా సాగిన వ్యవహారం వెలుగులోకి రావడంతో పోలీస్ ఉన్నతాధికారులు సీరియస్ అయినట్లు తెలిసింది. దీంతో సీఐ వెంకటేశ్వర్‌రెడ్డి రెండు రోజుల క్రితం సెలవు పెట్టి వెళ్లిపోయారు. మొత్తం ఘటనపై శాఖా పరమైన విచారణకు ఆదేశించినట్లు తెలిసింది.

అమరావతి అజరామరం

» ముక్కచెక్కలైన మూడు ముక్కలు

» నాడు యజ్ఞంలా రాజధాని నిర్మాణం

» భూములిచ్చి భాగస్వాములైన రైతులు

» యంత్రధ్వనుల్లో వినిపించిన అభివృద్ధి నినాదం

» కానీ, విధ్వంసమే ఎజెండాగా జగన్ పాలన

» అమరావతి ఉనికికే ముప్పుతెచ్చేలా మూడు రాజధానుల తీర్మానం

» దగా, మోసం, విధ్వంసంపై తిరగబడ్డ రైతులు

» చరిత్రకెక్కిన మహిళా ఉద్యమం.. మహా పాదయాత్ర

» ఫలించిన త్యాగమూర్తుల ఆశయం

(గుంటూరు - ఆంధ్రజ్యోతి)



ఆంధ్రుల కలల రాజధాని అమరావతికి ఇక మంచి రోజులే! ఐదేళ్ల చీకటిని చీల్చుకుంటూ చంద్రబాబు వచ్చేశారు. ఐదేళ్ల క్రితం పట్టిన గ్రహణం వీడిపోయి, ప్రజా రాజధాని తిరిగి ప్రాణం పోసుకోనుంది. అమరావతిని కమ్మేసిన కారుమబ్బులు వీడిపోయి, రాజధాని గ్రామాలు మళ్లీ కళకళలాడనున్నాయి. ఇక నవ రాజధాని నిర్మాణం తిరిగి ప్రారంభమవుతుంది. ఎక్కడికక్కడ నిలిచిపోయిన పనులు మళ్లీ పరుగులు పెట్టనున్నాయి. నిజానికి, 2023 చివరినాటికే రాజధాని గ్రామాల్లో ఊహించని మార్పు వచ్చింది. ప్రభుత్వం మారబోతోందన్న వాతావరణం మొదట అమరావతిలోనే కనిపించడం మొదలైంది. దాన్ని బలపరిచేలా రాజధానిలో కార్యకలాపాలు తిరిగి మొదలయ్యాయి. వైసీపీ ఐదేళ్ల పాలనలో పడిపోయిన భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. గత టీడీపీ హయాంలో గజం రూ.25 నుంచి 35 వేల వరకూ ఉన్న రైతుల రిటర్నబుల్ ప్లాట్ల ధరలు వైసీపీ పాలనలో రూ. ఎనిమిది వేలకు పడి పోయాయి. అవి ఆరు నెలల క్రితం తిరిగి రూ.20 వేలు నుంచి 25 వేలకు చేరాయి. జరుగుతున్న ఈ మార్పులను టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్ కల్యాణ్ స్వయంగా గుర్తించారు. ఈ ఏడాది జనవరి 13న రాజధానిలోని మందడం గ్రామంలో భోగిపండుగను రైతులతో కలిసి వారు జరుపుకొన్నారు. మరో 86 రోజుల్లో ప్రజా ప్రభుత్వం రాబోతోందని, ప్రజా రాజధాని అమరావతి నుంచే ప్రజాపాలన మొదలు కాబోతోందని ఆనాడే చంద్రబాబు, పవన్ కల్యాణ్ ప్రకటించారు. వచ్చే సంక్రాంతి వేడుకలు అధికారికంగా రాజధానిలో రైతులతో జరుపుకోబోతున్నామని కూడా చెప్పారు. అదే నిజం కావడంతో రాజధాని గ్రామాల్లో మంగళవారం అంతటా ఉత్సాహ వాతావరణం కనిపించింది.

రాజధాని సమరం..

వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానుల ప్రకటన చేసిన 2019 డిసెంబరు 17న మొదలైన అమరావతి పోరాటం నేటి వరకూ నిర్విరామంగా సాగుతోంది. తరతరాలుగా వారసత్వ సంపదగా వచ్చిన 34 వేల ఎకరాల పంట పొలాలను రాష్ట్రం కోసం 29 వేల మంది రైతులు తృణప్రాయంగా త్యాగం చేశారు. కానీ, వారి ఆశలు, ఆకాంక్షలను వైసీపీ ప్రభుత్వం చిదిమేసింది. మూడు ముక్కలాట మొదలుపెట్టింది. రాజధాని తరలింపునకు సన్నాహాలు ప్రారంభించింది. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఒక్క ఉదుటన అమరావతి కేంద్రంగా మహోద్యమం ప్రజ్వరిల్లింది. ప్రపంచాన్ని కుదిపేసిన కరోనా, సమస్త రంగాలను స్తంభింపచేసిన లాక్‌డౌన్ సైతం వారి పోరాటానికి తల వంచాయి. వారిని ఒక్క అడుగు కూడా కదిలించలేకపోయాయి. ఒక్కరోజు కూడా వారి ఉద్యమాన్ని ఆపలేకపోయాయి. ఇలా మొక్కవోని పట్టుదలతో 1,600 రోజులకు పైగా రైతులు, మహిళలు సాగిస్తున్న పోరాటం చరిత్ర పుటల్లో రోజుకొక అధ్యాయాన్ని లిఖించింది. 'దేవస్థానం టూ న్యాయస్థానం' పేరిట సాగించిన మహా పాదయాత్ర, 'అమరావతి టూ అరసవెల్లి' పేరుతో సాగించిన రెండో విడత పాదయాత్ర...రాష్ట్రంలో సంచలనంగా మారాయి. ఈ పాదయాత్రలపై అధికారపార్టీ మూకలు, పోలీసులు సాగించిన దాష్టీకాలు రాష్ట్ర ప్రజలను కదిలించాయి. అమరావతి రైతులపై విరిగిన లాఠీలు, రైతు మహిళల ఒంటిపై బూటుకాలి గాయాలు, అర్ధంతరంగా ఆగిన 260 రైతులు గుండెలు, వారు చేసిన త్యాగాలు ప్రజల మనసు కరిగేలా చేసింది. ప్రజలంతా అమరావతివైపే నిలిచేలా చేసింది.

నిర్విరామంగా నిర్మాణ మహాయజ్ఞం

చంద్రబాబు ప్రభుత్వంలో అమరావతి వెలుగులు విరజిమ్మింది. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత ఆంధ్రప్రదేశ్‌కు రాజధాని లేకపోవడంతో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు కొంతకాలం బస్సులో నుంచి పరిపాలన సాగించారు. విజయవాడ- గుంటూరు మధ్య రాజధాని అమరావతి కోసం 33 వేల ఎకరాలను సమీకరించదలచారు. ఆయన ఇచ్చిన ఒక్క పిలుపుతో ల్యాండ్ పూలింగ్ కింద 33 వేల ఎకరాలను రైతులు రాజధాని కోసం ఇచ్చారు. రైతులను కూడా రాజధాని నిర్మాణంలో భాగస్వామ్యులను చేస్తూ, వారికి చట్టబద్ధంగా రిటర్నబుల్ ప్లాట్లు కేటాయించారు. శరవేగంగా 45 వేల మంది కార్మికులతో రాజధాని 29 గ్రామాల పరిధిలో నిర్మాణ పనులు జరిగాయి. రాత్రిళ్లు కూడా ఫ్లడ్ లైట్ల కాంతులతో పట్టపగలే అన్నట్టుగా నిర్మాణ ప్రాంతాల్లో వాతావరణం కనబడేది. వెలగపూడి రెవెన్యూ పరిధిలో 45 ఎకరాల్లో రాష్ట్ర అసెంబ్లీ, సచివాలయం భవనాలను రూ.1,200 కోట్లతో నిర్మించి చంద్రబాబు రాష్ట్ర పరిపాలన ప్రారంభించారు. నిత్యం ఉద్యోగులు, మంత్రులు, ఎమ్మెల్యేల రాకపోకలతో రాజధాని అమరావతి రద్దీగా ఉండేది. పలు వ్యాపార సంస్థలు వెలిశాయి. ఆటోమొబైల్, బ్యాంకింగ్, హోటళ్లు, రెస్టారెంట్ల వరకు రాజధాని అమరావతిలో వ్యాపారాలు మూడు పువ్వులు, ఆరు కాయలు అన్నట్టుగా కొనసాగాయి. ఇంతలో ప్రభుత్వం మారింది. వైసీపీ అధికారం చేపట్టింది.

అమరావతి రైతులే స్టార్ క్యాంపెయినర్లు

జగన్ అధికారంలో రాగానే అమరావతి పనులను నిలిపివేసి కంపెనీలను పారద్రోలారు. దీంతో అప్పటిదాకా ఉన్న అమరావతి వెలుగులు ఒక్కసారిగా ఆర్పి వేయబడ్డాయి, రాజధాని రోడ్లు ధ్వంసం చేయడం మొదలుపెట్టారు. రాత్రి వేళల్లో రోడ్ల కంకరు, గ్రావెల్ తవ్వి దోచుకెళ్లారు. మరోవైపు ప్రాంతాల మధ్య విద్వేషం రెచ్చగొట్టడం కోసం మూడు రాజధానుల అంశాన్ని జగన్ తెర మీదకు తెచ్చారు. జగన్ అన్యాయం, మోసం, దగా చేయడంతో తమకు ఉద్యమం చేయక తప్పడం లేదని ఎన్నికల సమయంలో తమను కలిసిన జాతీయ మీడియా ప్రతినిధులకు రైతులు, ఉద్యమ మహిళలు స్పష్టం చేశారు. వారే స్టార్ క్యాంపెయినర్లుగా మారి గుంటూరు జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో కూటమి తరఫున ప్రచారం కూడా చేపట్టారు. ఇంటింటికి తిరిగి తమకు జరిగిన అన్యాయాన్ని ప్రజలకు వివరించారు. రాజధానికి సంఘీభావంతో పాటు, కూటమికి మద్దతును కూడగట్టారు. వారి సంఘటిత పోరాట ఫలితమే నేటి ఈ మార్పుకు కారణంగా చెప్పవచ్చు.

పూలూ పండ్లూ తీసుకోండి జగన్

ఓడిపోయి మాకు న్యాయం చేశారు

జగన్ ఇంటికి అమరావతి రైతులు

అమరావతి(ఆంధ్రజ్యోతి), తుళ్లూరు, జూన్ 6: ప్రభుత్వం మారడంతో రాజధానిగా అమరావతి కొనసాగుతుందని రైతాంగం ఆనందం వ్యక్తం చేసింది. ఎన్నికల్లో ఓడిపోయిన జగన్ ఈ విధంగా తమకు న్యాయం చేశాడంటూ అభినందించేందుకు అమరావతి ప్రాంత రైతులు గురువారం తాడేపల్లి ప్యాలెస్‌కు వచ్చారు. వీరిలో పలువురు మహిళా రైతులు కూడా ఉన్నారు. తమ వెంట అరటి, మామిడి పండ్లు, మిఠాయిలు, పూల బొకేలు తీసుకొచ్చారు. ఇదే విషయాన్ని జగన్‌కు భద్రతా సిబ్బంది ద్వారా కబురు పంపారు. అయితే తనను కలిసేందుకు రైతులకు జగన్ అనుమతి ఇవ్వలేదు. అయినా, మహిళా రైతులు చాలా సేపు వేచి చూశారు.

ఒక్కసారి చూడనివ్వండయ్యా..

'అయ్యా ఆయనను ఒక్కసారి చూడనివ్వండి. సీఎంగా ఉన్నప్పుడు ఎటూ ముఖం చూపించలేదు, మాట్లాడలేదు. ఇప్పుడు ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆయన ముఖం చూపించండి' అంటూ మహిళలు పోలీసులను అభ్యర్థించారు. రాజధాని రైతుల బాధలు పట్టించుకోకుండా పరదాల మాటున అసెంబ్లీకి జగన్ వెళ్లే వారని, మీ సమస్య ఏమిటి అని అడిగిన పాపాన పోలేదని వారంతా వాపోయారు. కనీసం ఎమ్మెల్యేగా ఉన్నప్పుడైనా ముఖం చూపించి మాట్లాడతారేమోనని వచ్చామన్నారు. అయినా, పోలీసులు అనుమతించకపోవటంతో వారు నిరాశతో వెనుదిరిగారు.



జగన్‌ను చూసేందుకు అనుమతించాలంటూ పోలీసులను వేడుకుంటున్న అమరావతి రైతులు

'రెడ్ బుక్'.. సిద్ధం

మంగళగిరి సిటీ, జూన్ 6: రెడ్‌బుక్ సిద్ధం పేరిట గుంటూరు జిల్లా మంగళగిరిలో పలుచోట్ల ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు చర్చనీయాంశంగా మారాయి. సార్వత్రిక ఎన్నికల ముందు యువగళం పాదయాత్రలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ వైసీపీ అరాచక పాలనపై రెడ్‌బుక్‌ను తెరమీదికి తీసుకువచ్చారు. తనతోపాటు చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించి, పార్టీ నేతలు, కార్యకర్తలను వేధించిన వారి పేర్లను రెడ్‌బుక్‌లో నమోదు చేస్తున్నానని ప్రకటించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అందరి లెక్కలు తేలుస్తామన్నారు. ఈ నేపథ్యంలో లోకేశ్ చెప్పిన రెడ్‌బుక్ అంశాన్ని గుర్తుచేస్తూ మంగళగిరిలో పలుచోట్ల భారీ ఫ్లెక్సీలు వెలిశాయి. నారా లోకేశ్ ఫొటోతోపాటు రెడ్‌బుక్ సిద్ధం.. సిద్ధం ఫర్ రీసైలెన్స్, ఎంపవర్‌మెంట్, డెవలప్‌మెంట్ అంటూ ముద్రించారు. అడుసుమిల్లి సురేంద్ర పేరుతో ఏర్పాటు చేసిన ఈ ఫ్లెక్సీ గురించి ప్రజలు ఆసక్తికరంగా చర్చించుకుంటున్నారు.



మరో రెండేళ్లు ఇక్కడే ఉంటా!

నా జోలికొస్తే కేసులు పెడతా

ఉన్నత విద్యామండలిలో వైసీపీ అనుకూల అధికారిణి బెదిరింపులు

ఆమెపై గతంలో ఆర్థిక ఆరోపణలు

అమరావతి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): "నా డెప్యుటేషన్ కాలం ఇంకా రెండేళ్లుంది. అప్పటి వరకు నేను మండలిలోనే ఉంటా. ఎవరైనా జోక్యం చేసుకుంటే అట్రాసిటీ కేసులు పెట్టి, జైల్లో పెట్టిస్తా. అవసరమైతే ఎస్సీలతో కలిసి వారి ఇంటి ముందు ధర్నా చేస్తా" అంటూ ఉన్నత విద్యామండలిలో వైసీపీతో అంటకాగిన ఓ మహిళా అధికారి బెదిరింపుల పర్వానికి దిగారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ కె. హేమచంద్రారెడ్డి అధికారులను బెదిరించడమే లక్ష్యంగా ఆమెను జేఎన్‌టీయూ అనంతపురం నుంచి డెప్యుటేషన్‌పై మండలికి తీసుకొచ్చారు. కీలకమైన మండలి ఆర్థిక వ్యవహారాల బాధ్యతను అప్పగించారు. అప్పటి నుంచీ నిధుల దుర్వినియోగం మొదలైంది. అంతా ఆన్‌లైన్ బిల్లులు ఇస్తున్న ఈ కాలంలో మాన్యువల్ బిల్లులు పెడుతూ నిధులు పక్కదారి పట్టించారు. కార్యాలయ నిర్వహణ ఖర్చులు, ఇతరత్రా ఖర్చుల పేరిట ఎడాపెడా బిల్లులు రాసుకున్నారు. అలాగే, వ్యక్తిగత కేసులకు మండలి ఆఫీసును సొంత చిరునామాగా వాడుకోవడం గతంలో వివాదాస్పదమైంది. దీనిపై పత్రికల్లో వార్తలు వచ్చాయనే కోపంతో మండలిలోని జాయింట్ డైరెక్టర్‌పై అనేక రూపాల్లో ఫిర్యాదులు చేసి వేధించారు. తాజాగా మంగళవారం ఉదయం ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న సమయంలోనే మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి కొన్ని కీలకమైన ఫైళ్లను మెషీన్‌తో ముక్కలుగా చేసి ధ్వంసం చేశారు. ఈ వార్త పత్రికల్లో ప్రచురితమైంది. ఈ సమాచారం మండలి జాయింట్ డైరెక్టర్ వల్లే బయటికొచ్చిందని భావించిన హేమచంద్రారెడ్డి.. మహిళా అధికారి ద్వారా జేడీని మరోసారి బెదిరించారు. మళ్లీ పత్రికల్లో ఇలాంటి వార్తలు వస్తే ఆ జేడీపై అట్రాసిటీ కేసులు పెడతానంటూ మహిళా అధికారి జేడీ పీఏకు ఫోన్ చేసి బెదిరించారు. దీంతో తనను వేధింపులకు గురిచేస్తున్నారని జేడీ ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. గతంలోనూ చైర్మన్ అండతోనే ఆ మహిళా అధికారి ప్రభుత్వానికి, ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదులు చేశారు. దీంతో ఇప్పుడు ఉన్నత విద్యాశాఖలో ఆ అధికారిణి అంటే అందరూ భయపడే పరిస్థితి వచ్చింది. చిత్రం ఏంటంటే.. ప్రభుత్వం మారినా వైసీపీతో అంటకాగిన ఆ అధికారిణి ఇలా వ్యవహరించడమే!!.

జగన్, షర్మిల వైఎస్ కడుపున ఎలా పుట్టారు..!

» కేంద్ర పార్టీ ఇచ్చిన నిధులను అట్టిపెట్టుకుంది

» తెలంగాణ వారిని పక్కన పెట్టుకొని టికెట్లు అమ్ముకుంది

» పీసీసీ అధ్యక్షురాలిపై సుంకర పద్మశ్రీ విమర్శలు



విలపిస్తున్న పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ

విజయవాడ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): 'షర్మిల వ్యవహార శైలితో మొదటి నుంచి కష్టపడిన నాయకులు, కార్యకర్తలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. జగన్, షర్మిల వైఎస్ కడుపున ఎలా పుట్టారో తెలియడం లేదు' అని పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ ఘాటుగా విమర్శించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, టికెట్ ఆశించి భంగపడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర, ఉభయగోదావరి జిల్లాలకు చెందిన నేతలు గురువారం విజయవాడ ఆంధ్రరత్న భవనం ఆవరణలో నిరసనకు దిగారు. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నుంచి పీసీసీని కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కన్నీటిపర్యంతమైన సుంకర పద్మశ్రీ మాట్లాడుతూ, 'షర్మిల పార్టీలో సొంత అజెండాను అమలు చేసింది. చివరి వరకు బీ ఫారాలు ఇవ్వకుండా తొక్కిపెట్టింది. కేంద్ర పార్టీ నుంచి వచ్చిన నిధులను షర్మిల తన వద్ద పెట్టుకున్నారు. ఆంధ్రలో ఓటు హక్కు లేని తెలంగాణ వారిని వెంటబెట్టుకుని టికెట్లను షర్మిల అమ్ముకుంది' అని ఆరోపించారు. ఈ నిరసనకు దీటుగా విజయవాడ నగర కమిటీ అధ్యక్షుడు నరహరశెట్టి నరసింహారావు కార్యాలయంలో పీసీసీ ఉపాధ్యక్షుడు కొలనుకొండ శివాజీ, లీగల్ సెల్ నాయకుడు గురునాథం మీడియాతో మాట్లాడారు. పార్టీలో ఏమైనా పొరపాట్లు జరిగినా, సమస్యలు ఉన్నా అంతర్గతంగా కూర్చుని పరిష్కరించుకోవాలని సూచించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఎలాంటి నిధులను సమకూర్చలేమని పీసీసీ ముందుగానే చెప్పిందని స్పష్టం చేశారు.

కేంద్రంపై ఒత్తిడి తెచ్చి రాష్ట్రానికి న్యాయం చేయండి

» చంద్రబాబుకు సీపీఐ నేత రామకృష్ణ లేఖ

అమరావతి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): బీజేపీకి సొంతంగా మెజార్టీ లేనందున ఎన్డీయే కూటమిలో కీలకంగా వ్యవహరించనున్న చంద్రబాబు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రాష్ట్రానికి న్యాయం జరిగేలా చూడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ కోరారు. ఎన్నికల్లో గెలుపుపై అభినందిస్తూ ఆయన గురువారం చంద్రబాబుకు లేఖ రాశారు. 'విభజన చట్టం హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయకుండా గత పదేళ్లుగా మోదీ ప్రభుత్వం ఏపీకి తీరని అన్యాయం చేసింది. ఇప్పుడు రాష్ట్రానికి దక్కాల్సిన ప్రయోజనాలన్నింటినీ సాధించుకోవాలి. ఈ దిశగా చంద్రబాబు కృషికి రాజకీయ పక్షాలు సహకరించాలి' అని పేర్కొన్నారు.

పర్యాటకశాఖ ఫైల్స్ మాయం!

» విజయవాడ శివారు గుంటుపల్లిలో కాల్చివేత?

» ఐదేళ్లలో అడ్డగోలుగా చేసిన అవినీతి ఫైల్స్ అన్నీ ఓట్లలెక్కింపు రోజు ఆఫీసు కారులో మంగళగిరికి తరలింపు

» అక్కడి నుంచి కీలక ఫైల్స్ గుంటుపల్లికి తరలించి దహనం

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర పర్యాటకశాఖలో గుట్టుచప్పుడు కాకుండా ఫైల్స్ తరలించటం, వాటిని కాల్చివేయటం కలకలం సృష్టిస్తోంది. సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు జరిగిన రోజు(ఈనెల 4వ తేదీ) మధ్యాహ్నం మూడు గంటలకు మూడు భారీ బండిల్స్‌తో కూడిన పర్యాటక ఫైల్స్‌ను మంగళగిరిలోని రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయానికి తీసుకెళ్లినట్టు తెలుస్తోంది. వాటిలో ఒక బండిల్ ఫైల్స్ మాత్రమే తిరిగి అక్కడి నుంచి విజయవాడ ఆటోనగర్‌లోని పర్యాటకశాఖ రాష్ట్ర కార్యాలయానికి చేరుకుంది. మరో రెండు బండిల్స్ ఫైల్స్‌ను అత్యంత రహస్యంగా గొల్లపూడి సమీపంలోని గుంటుపల్లికి తరలించినట్టు తెలుస్తోంది. హెడ్డాఫీసులో పనిచేసే ఓ ఉద్యోగిని ఇంటి దగ్గర ఈ ఫైల్స్‌ను కాల్చివేసినట్టు సమాచారం. ఫైల్స్ తరలింపునకు హెడ్డాఫీసులోని ఉద్యోగులు ససేమిరా అన్నట్టు తెలిసింది. చివరికి పర్యాటక ఎండీ కన్నబాబు రంగంలోకి దిగి. 'నేను సీఎంవోలోకి వెళ్లబోతున్నా. భయం లేదు. మిమ్మల్ని నేను చూసుకుంటా' అని హామీ ఇచ్చి ఫైల్స్ తరలింపునకు ఒత్తిళ్లు తెచ్చినట్టు ఏపీటీడీసీ ఉద్యోగుల్లో విస్తృత చర్చ నడుస్తోంది. అధికారిక కారులో తరలించటం వల్ల ఎవరికీ అనుమానం ఉండదన్న ఉద్దేశంతో ముందుగా మంగళగిరికి తరలించినట్టు తెలుస్తోంది. అక్కడ మూడు బండిల్స్ విప్పదీసి.. నిబంధనలను కాలరాసి చేపట్టిన పనులకు సంబంధించిన అతి ముఖ్యమైన ఫైల్స్‌ను వేరు చేసినట్టు సమాచారం. ప్రధానంగా విశాఖలో రుషికొండ తవ్వకాలు, నిర్మాణాలకు సంబంధించిన పలు కీలక ఫైల్స్‌ను మాయం చేసినట్టు, ఏపీటీడీసీలో ఈడీగా పనిచేస్తున్న మల్‌రెడ్డి ఇందులో కీలక పాత్ర పోషించినట్టు చెబుతున్నారు. రుషికొండ తవ్వకాలు, నిర్మాణాలకు సంబంధించిన వ్యవహారాలన్నీ మల్‌రెడ్డి పర్యవేక్షణలోనే జరిగాయి. అలాగే, పర్యాటక యూనిట్లను నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటీకరించేందుకు పిలిచిన టెండర్ల ఫైల్స్‌ను మాయం చేశారు. పర్యాటక యూనిట్ల నిర్వహణను అయినవారికి కారు చౌకగా అప్పగించేందుకు వాటిని తన ఖా పెట్టి మరీ రూ.150 కోట్ల రుణం తీసుకున్నారు. ఆ రుణంతో పర్యాటక యూనిట్ల ఆధునికీకరణ పనులు చేపట్టారు. ఆధునికీకరణ ముసుగులో ఇప్పటికే ప్రైవేటుకు ఇచ్చిన సూర్యలంక బీచ్ రిసార్ట్స్, నాగార్జున సాగర్ రిసార్ట్‌లలో కూడా పనులు చేయించారు. వీటికి సంబంధించిన కీలక ఫైల్స్ మాయం చేసినట్టు సమాచారం. సూర్యలంక బీచ్ రిసార్ట్స్‌లో రేకుల షెడ్డుల మరమ్మతులకు రూ.4 కోట్లు ఖర్చు చేశారని తెలుస్తోంది. అంత ఖర్చు పెడితే పక్కా భవనాలనే నిర్మించవచ్చు. ఆ డబ్బులన్నింటినీ పక్కదారి పట్టించినట్టు సమాచారం. పర్యాటక యూనిట్ల ఆధునికీకరణ పేరుతో టెండర్లు పిలిచిన అనంతరం ఎన్నికల కోడ్ అమల్లో ఉండగానే.. విజయవాడ ఆటోనగర్‌లోని ఏపీటీఏ ఆఫీసులో రహస్యంగా కాంట్రాక్టర్లతో సమావేశాలు నిర్వహించి ముందస్తుగా కమీషన్లు వసూలు చేశారని అప్పట్లో తీవ్ర ఆరోపణలు వచ్చాయి. వీటికి సంబంధించిన ఫైల్స్‌ను కూడా మాయం చేశారని తెలుస్తోంది. తిరుపతిలో ఏపీటీడీసీ రవాణా విభాగాన్ని పక్కన పెట్టి .. కళాధర్ ట్రావెల్స్ సంస్థకు ఎలక్ట్రికల్ బస్సులను సరఫరా చేసేందుకు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారు. కళాధర్ ట్రావెల్స్ సంస్థకే టీటీడీ దర్శనం టికెట్లను విక్రయించుకునే అధికారాన్ని కల్పించిన వ్యవహారంలో భారీ స్కామ్ జరిగిందన్న ఆరోపణలు వచ్చాయి. వీటికి సంబంధించిన కీలక ఫైల్స్‌ను కూడా మాయం చేసినట్టు తెలిసింది. అలాగే, గత ఐదేళ్లలో అడ్డగోలుగా వైసీపీ పెద్దలు సిఫారసు చేసిన వారికి సంస్థలో ఉద్యోగాలు కల్పించారు. ఇందుకోసం నిబంధనలకు విరుద్ధంగా నౌకరీ వెబ్‌సైట్, ప్రైవేటు హోటల్స్ వెబ్‌సైట్‌లలో ప్రకటనలు వేసి అడ్డగోలుగా నియామకాలు జరిపారు. కరోనా సమయంలో మార్కెట్ కంటే అధిక రేటుకు ప్లేట్స్ తదితరాల కొనుగోలు, నాణ్యతలేని బియ్యం కొనుగోలు ఫైల్స్‌ను కూడా మాయం చేసినట్టు తెలుస్తోంది.

ఆంధ్రజ్యోతి దిక్సూచి

diksuchi@andhrajyothy.com

విజయవాడ ● శుక్రవారం 7 జూన్ 2024



కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ముంబైలో నిర్వహిస్తున్న అలీ యావర్ జంగ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పీచ్ అండ్ హియరింగ్ డిజెబిలిటీస్ (ఏవైజే ఎన్ఐఎస్‌హెచ్‌డి)- డిప్లొమా, డిగ్రీ, పీజీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. నిర్దేశించిన మేరకు దేశవ్యాప్తంగా నిర్వహించే ఎంట్రెన్స్ ఎగ్జామ్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. సంస్థ ప్రధాన కేంద్రం ముంబై సహా సికింద్రాబాద్, నోయిడా, కోల్‌కతా, జాన్లా, భోపాల్, అహ్మదాబాద్ ప్రాంతీయ కేంద్రాల్లో అడ్మిషన్స్ ఇస్తారు.

అలీ యావర్ జంగ్ ఇన్‌స్టిట్యూట్‌లో స్పీచ్, హియరింగ్ కోర్సులు

డిగ్రీ ప్రోగ్రామ్‌లు

బ్యాచిలర్ ఆఫ్ ఆడియాలజీ స్పీచ్ లాంగ్వేజ్ పాథాలజీ(బీఏఎస్ఎల్‌పీ): కోర్సు వ్యవధి నాలుగేళ్లు. ముంబై సెంటర్లో 40, కోల్‌కతాలో 31, నోయిడాలో 25, సికింద్రాబాద్‌లో 34 సీట్లు ఉన్నాయి. నోయిడా క్యాంపస్‌లో ప్రవేశానికి గురు గోవింద్ సింగ్ ఇంద్రప్రస్థ యూనివర్సిటీ నిర్వహించే ఎగ్జామ్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్-హియరింగ్ ఇంపెయిర్‌మెంట్(బీఈడీ స్పెషల్ ఈడీ-హెచ్‌ఐ): కోర్సు వ్యవధి రెండేళ్లు. ముంబైలో 30, కోల్‌కతాలో 23, జాన్లాలో 30, సికింద్రాబాద్‌లో 33 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు: మొదటి కోర్సుకు కనీసం 50 శాతం మార్కులతో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ/మేథమెటిక్స్/కంప్యూటర్ సైన్స్/స్టాటిస్టిక్స్/ఎలక్ట్రానిక్స్/సైకాలజీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. బీఈడీ కోర్సుకు కనీసం 50 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

పీజీ డిప్లొమా ప్రోగ్రామ్‌లు

పీజీ డిప్లొమా ఇన్ ఆడిటరీ వెర్బల్ థెరపీ: కోర్సు వ్యవధి ఏడాది. ముంబై సెంటర్లో 20 సీట్లు ఉన్నాయి.

పీజీ డిప్లొమా ఇన్ రీహాబిలిటేషన్ సైకాలజీ: కోర్సు వ్యవధి ఏడాది. భోపాల్‌లో 20 సీట్లు ఉన్నాయి. మధ్యప్రదేశ్ హయ్యర్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ పోర్టల్ ద్వారా ఈ కోర్సులో అడ్మిషన్ ఇస్తారు.

అర్హత వివరాలు: మొదటి కోర్సుకు డిగ్రీ(ఆడియాలజీ/స్పీచ్ లాంగ్వేజ్ పాథాలజీ/స్పీచ్ అండ్ హియరింగ్/స్పెషల్ ఎడ్యుకేషన్) ఉత్తీర్ణులై ఉండాలి. రెండో కోర్సుకు డిగ్రీ(జనరల్ సైకాలజీ)/పీజీ(సైకాలజీ/కౌన్సెలింగ్ సైకాలజీ) పూర్తిచేసి ఉండాలి. డిస్టెన్స్ అభ్యర్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

పీజీ ప్రోగ్రామ్‌లు

ఎమ్మెస్సీ ఆడియాలజీ: ఇది రెండేళ్ల ప్రోగ్రామ్. ముంబై సెంటర్లో 12, సికింద్రాబాద్ సెంటర్లో 13 సీట్లు ఉన్నాయి.

ఎమ్మెస్సీ(స్పీచ్ లాంగ్వేజ్ పాథాలజీ): కోర్సు వ్యవధి రెండేళ్లు. కోల్‌కతా సెంటర్లో 15 సీట్లు ఉన్నాయి. వెస్ట్ బెంగాల్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ నిర్వహించే ఎంట్రెన్స్ ఎగ్జామ్ ద్వారా ఈ కోర్సులో ప్రవేశం కల్పిస్తారు.

ఎంఈడీ(స్పెషల్ ఎడ్యుకేషన్-హియరింగ్ ఇంపెయిర్‌మెంట్): కోర్సు వ్యవధి రెండేళ్లు. ముంబై సెంటర్లో 23 సీట్లు ఉన్నాయి.

అర్హత: మొదటి రెండు కోర్సులకు కనీసం 55 శాతం మార్కులతో బ్యాచిలర్ ఆఫ్ ఆడియాలజీ అండ్ స్పీచ్ లాంగ్వేజ్ పాథాలజీ/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. జూలై 31 నాటికి రొటేటింగ్ ఇంటర్న్‌షిప్ పూర్తికావాలి. ఎంఈడీ కోర్సుకు ద్వితీయ శ్రేణి మార్కులతో బీఈడీ(హెచ్‌ఐ/డెఫ్/హెచ్‌హెచ్/స్పెషల్ ఎడ్యుకేషన్-హెచ్‌ఐ) పూర్తిచేసి ఉండాలి. బీఈడీ (జనరల్ ఎడ్యుకేషన్)తోపాటు డిప్లొమా(స్పెషల్ ఎడ్యుకేషన్-హెచ్‌ఐ) పూర్తిచేసిన అభ్యర్థులు కూడా అర్హులే.

ఏవైజేఎన్ఐఎస్‌హెచ్‌డీ ఎంట్రెన్స్ ఎగ్జామ్

బీఏఎస్ఎల్‌పీ కోర్సుకు నిర్వహించే పరీక్ష ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్ ఆధారంగా ఉంటుంది. బీఈడీ కోర్సులో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో జనరల్ నాలెడ్జ్, జనరల్ ఎబిలిటీ, ఆప్టిట్యూడ్ అండ్ టీచింగ్ ఆప్టిట్యూడ్ విభాగాల నుంచి ప్రశ్నలు ఇస్తారు. ఎంఈడీ కోర్సుకు నిర్వహించే పరీక్షలో మెంటల్ ఆప్టిట్యూడ్, టీచింగ్ ఆప్టిట్యూడ్, జనరల్ నాలెడ్జ్, ఎడ్యుకేషనల్ టెక్నాలజీ/ ఐసీటీ, ఇంగ్లీష్ కాంపిటెన్స్, రీసెర్చ్ ఆప్టిట్యూడ్ అండ్ డిజెబిలిటీస్ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. పీజీడీఏవీటీ ప్రోగ్రామ్‌నకు నిర్వహించే ఎగ్జామ్‌లో బీఏఎస్ఎల్‌పీ, బీఈడీ(హెచ్‌ఐ) సిలబస్‌ల ఆధారంగా ప్రశ్నలు ఇస్తారు. ఎమ్మెస్సీ (ఆడియాలజీ)లో ప్రవేశానికి నిర్వహించే ఎగ్జామ్‌లో బీఏఎస్ఎల్‌పీ సిలబస్‌లోని ఆడియాలజీ పోర్షన్ నుంచి ప్రశ్నలు ఇస్తారు.

డిప్లొమా ప్రోగ్రామ్‌లు

డిప్లొమా ఇన్ ఇండియన్ సైన్ లాంగ్వేజ్ (డీఐఎస్ఎల్ఐసీ): కోర్సు వ్యవధి రెండేళ్లు. ముంబై, కోల్‌కతా కేంద్రాల్లో ఒక్కోదానిలో 15 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు: ఏదేని గ్రూప్‌తో ఇంటర్/పన్నెండో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. ఆర్‌సీఐ(ఏఐఓఏటీ) ఎంట్రెన్స్ ఎగ్జామ్ ద్వారా ఈ ప్రోగ్రాములో ప్రవేశాలు కల్పిస్తారు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 30
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీలు:** బీఏఎస్ఎల్‌పీ ప్రోగ్రామ్‌నకు జూలై 13న; ఎమ్మెస్సీ (ఆడియాలజీ) ప్రోగ్రామ్‌నకు జూలై 20న; బీఈడీ, ఎంఈడీ, పీజీడీఏవీటీ ప్రోగ్రామ్‌లకు జూలై 27న
- **తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు పరీక్ష కేంద్రం:** సికింద్రాబాద్
- **వెబ్‌సైట్:** ayjnihh.nic.in, www.osmania.ac.in

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో పీహెచ్‌డీ

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్(సెంట్రల్ యూనివర్సిటీ)- పీహెచ్‌డీ 2024 జూలై సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. సంస్థ నిర్వహించే ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూ, కౌన్సెలింగ్‌ల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

స్పెషలైజేషన్‌లు-సీట్లు: ట్రాన్స్‌లేషన్ స్టడీస్ 4, ఇంగ్లీష్ లాంగ్వేజ్ స్టడీస్ 8, హెల్త్ సైన్సెస్(ఆప్టోమెట్రీ అండ్ విజన్ సైన్సెస్) 2, మెటీరియల్స్ ఇంజనీరింగ్ 16, నానోసైన్స్ అండ్ టెక్నాలజీ 4 సీట్లు చొప్పున మొత్తం 34 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి సంబంధిత స్పెషలైజేషన్‌తో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. ప్రథమ శ్రేణి మార్కులతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. స్పెషలైజేషన్‌కు నిర్దేశించిన ఇతర/తత్సమాన అర్హతల వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.600; ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.550; ఓబీసీ అభ్యర్థులకు రూ.400; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.275
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 18
- **హాల్‌టికెట్స్ డౌన్‌లోడింగ్:** జూన్ 28
- **పరీక్ష కేంద్రం:** యూఓహెచ్ క్యాంపస్
- **ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ తేదీ:** జూలై 7
- **వెబ్‌సైట్:** www.uohyd.ac.in


ఎఫ్‌సీఆర్ఐలో బీఎస్సీ ఆనర్స్ ఫారెస్ట్రీ

సిద్దిపేట జిల్లా ములుగులోని ఫారెస్ట్ కాలేజ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్‌సీఆర్ఐ) హైదరాబాద్- బీఎస్సీ(ఆనర్స్) ఫారెస్ట్రీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ హార్టికల్చరల్ యూనివర్సిటీకి ఇది అనుబంధ సంస్థ. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. మొత్తం 55 రెగ్యులర్ సీట్లు ఉన్నాయి. టీఎస్ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. మేథమెటిక్స్ స్ట్రీమ్ అభ్యర్థులకు 25 శాతం, బయాలజీ స్ట్రీమ్ అభ్యర్థులకు 75 శాతం సీట్లు ప్రత్యేకించారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ లేదా మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ లేదా మేథమెటిక్స్, బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్ అభ్యర్థులకు 45 శాతం; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు ఉండాలి. టీఎస్ ఈఏపీసెట్ 2024 అర్హత పొంది ఉండాలి. అభ్యర్థుల వయసు డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మూడేళ్లు; దివ్యాంగులకు అయిదేళ్ల సడలింపు వర్తిస్తుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.600; దివ్యాంగులు, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.400
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 27
- **కరెక్షన్ విండో ఓపెన్:** జూన్ 30
- **అభ్యర్థుల మెరిట్ జాబితా విడుదల:** జూలై 2
- **ఫస్ట్ ఫేజ్ కౌన్సెలింగ్:** జూలై 8
- **సీట్ల అలాట్‌మెంట్:** జూలై 9
- **సెల్ఫ్ రిపోర్టింగ్‌కు చివరి తేదీ:** జూలై 16
- **సెకండ్ ఫేజ్ సీట్ల అలాట్‌మెంట్:** జూలై 20
- **థర్డ్ ఫేజ్ సీట్ల అలాట్‌మెంట్:** ఆగస్టు 5
- **ఓరియంటేషన్, రిజిస్ట్రేషన్:** ఆగస్టు 12
- **వెబ్‌సైట్:** www.fcrihyd.in/



హెచ్‌పీసీఎల్‌లో ఇంజనీర్లు

మొత్తం ఖాళీలు: 247

ముంబయిలోని హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(హెచ్‌పీసీఎల్)... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వారీగా ఖాళీలు

1. మెకానికల్ ఇంజనీర్: 93
2. ఎలక్ట్రికల్ ఇంజనీర్: 43
3. ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీర్: 5
4. సివిల్ ఇంజనీర్: 10
5. కెమికల్ ఇంజనీర్: 7
6. సీనియర్ ఆఫీసర్ - సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్: 6
7. సీనియర్ ఆఫీసర్ - సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ ప్రాజెక్ట్స్: 4
8. సీనియర్ ఆఫీసర్/అసిస్టెంట్ మేనేజర్ - నాన్ - ఫ్యూయల్ బిజినెస్: 12
9. సీనియర్ ఆఫీసర్ - నాన్ ఫ్యూయల్ బిజినెస్: 2
10. మేనేజర్ - టెక్నికల్: 2
11. మేనేజర్ - సేల్స్ ఆర్అండ్‌డి ప్రొడక్ట్ కమర్షియలైజేషన్: 2
12. డిప్యూటీ జనరల్ మేనేజర్ క్యాటలిస్ట్ బిజినెస్ డెవలప్‌మెంట్: 1
13. చార్టర్డ్ అకౌంటెంట్స్: 29
14. క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్స్: 9
15. ఐఎస్ ఆఫీసర్: 15
16. ఐఎస్ సెక్యూరిటీ ఆఫీసర్ - సైబర్ సెక్యూరిటీ స్పెషలిస్ట్: 1
17. క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్: 6

అర్హత: పోస్టును అనుసరించి డిగ్రీ, బీఈ, బీటెక్, సీఏ, ఎంసీఏ, ఎంబీఏ, పీజీడీఎం, ఎమ్మెస్సీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

దరఖాస్తు రుసుము: యూఆర్/ఓబీసీ/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1180. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, గ్రూప్ టాస్క్, పర్సనల్ ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: జూన్ 30

వెబ్‌సైట్: https://www.hindustanpetroleum.com/

బీఎస్ఎఫ్‌లో ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టులు

మొత్తం ఖాళీలు: 162

కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, డైరెక్టరేట్ జనరల్ బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్... ఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ గ్రూప్-బి, సి(నాన్ గెజిటెడ్) పోస్టుల భర్తీకి అర్హులైన పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

1. ఎస్ఐ(మాస్టర్): **7 పోస్టులు**
2. ఎస్ఐ(ఇంజన్ డ్రైవర్): **4 పోస్టులు**
3. హెడ్ కానిస్టేబుల్(మాస్టర్): **35 పోస్టులు**
4. హెడ్ కానిస్టేబుల్(ఇంజన్ డ్రైవర్): **57 పోస్టులు**
5. హెడ్ కానిస్టేబుల్(వర్క్‌షాప్)(మెకానిక్)(డీజిల్/పెట్రోల్ ఇంజన్): **3 పోస్టులు**
6. హెడ్ కానిస్టేబుల్(వర్క్‌షాప్)(ఎలక్ట్రీషియన్): **2 పోస్టులు**
7. హెడ్ కానిస్టేబుల్(వర్క్‌షాప్)(ఏసీ టెక్నీషియన్): **1 పోస్టు**
8. హెడ్ కానిస్టేబుల్(వర్క్‌షాప్)(ఎలక్ట్రానిక్స్): **1 పోస్టు**
9. హెడ్ కానిస్టేబుల్(వర్క్‌షాప్)(మెషినిస్ట్): **1 పోస్టు**
10. హెడ్ కానిస్టేబుల్(వర్క్‌షాప్)(కార్పెంటర్): **3 పోస్టులు**
11. హెడ్ కానిస్టేబుల్(వర్క్‌షాప్)(ప్లంబర్): **2 పోస్టులు**
12. కానిస్టేబుల్(క్రూ): **46 పోస్టులు**

అర్హత: పోస్టును అనుసరించి మెట్రిక్యులేషన్, 10+2, సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, ఇంజన్ డ్రైవర్ సర్టిఫికెట్ ఉండాలి.

ఎంపిక విధానం: రాత పరీక్ష, ఫిజికల్ స్టాండర్డ్స్ టెస్ట్, ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, ప్రాక్టికల్/ట్రేడ్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: జూలై 1

వెబ్‌సైట్: https://rectt.bsf.gov.in/

జాబ్ కార్నర్



ఐజీసీఏఆర్‌లో వివిధ ఖాళీలు

కల్పక్కం(తమిళనాడు)లోని ఇందిరాగాంధీ సెంటర్ ఫర్ అటామిక్ రీసెర్చ్... డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన దేశవ్యాప్తంగా ఉన్న డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ పరిధిలోని వివిధ యూనిట్లలో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీల వివరాలు

1. సైంటిఫిక్ ఆఫీసర్- ఇ/డి/సి: **34 పోస్టులు**
2. టెక్నికల్ ఆఫీస్-బి: **1 పోస్టు**
3. సైంటిఫిక్ అసిస్టెంట్-సి/బి: **12 పోస్టులు**
4. నర్స్-ఎ: **27 పోస్టులు**
5. ఫార్మసిస్ట్-బి: **14 పోస్టులు**
6. టెక్నీషియన్-బి: **3 పోస్టులు**

విభాగాలు: జనరల్ సర్జరీ, న్యూక్లియర్ మెడిసిన్, డెంటల్ ప్రొస్టోడోంటిక్స్, అనస్థీషియా, ఆప్తాల్మాలజీ, గైనకాలజీ, రేడియాలజీ, పీడియాట్రిక్స్, ఈఎన్‌టీ, న్యూక్లియర్ మెడిసిన్, జనరల్ సర్జరీ, హ్యూమన్/మెడికల్ జెనెటిక్స్, జనరల్ డ్యూటీ/క్యాజువాలిటీ వర్కర్, ఫిజియోథెరపీ, మెడికల్ సోషల్ వర్కర్, పాథాలజీ, రేడియోగ్రఫీ, న్యూక్లియర్ మెడిసిన్ టెక్నాలజిస్ట్, ఆర్థోపెడిక్ టెక్నీషియన్, ఈసీజీ టెక్నీషియన్, కార్డియో సోనోగ్రఫీ టెక్నీషియన్.

వయసు: సైంటిఫిక్ ఆఫీసర్/ఇ పోస్టుకు 50 ఏళ్లు, సైంటిఫిక్ ఆఫీసర్/డి-40 ఏళ్లు, సైంటిఫిక్ ఆఫీసర్/సి-35 ఏళ్లు, టెక్నికల్ ఆఫీసర్/సైంటిఫిక్ అసిస్టెంట్/నర్స్/సైంటిఫిక్ 30 ఏళ్లు, ఫార్మసిస్ట్/టెక్నీషియన్ 25 ఏళ్లు మించకూడదు.

అర్హత: సంబంధిత విభాగంలో 10+2/డిప్లొమా/డిగ్రీ/పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

ఎంపిక విధానం: పోస్టును అనుసరించి ప్రిలిమినరీ టెస్ట్, అడ్వాన్స్‌డ్ టెస్ట్, ట్రేడ్/స్కిల్స్ టెస్ట్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 30

వెబ్‌సైట్: https://www.igcar.gov.in/

చిట్టీల్




తగిన శాస్తి

ఒక ఊరిలో వీరయ్య అనే వ్యాపారికి ఒక గాడిద ఉండేది. వీరయ్య రోజూ ఆ గాడిద మీద సరుకుల బస్తాలు, సంచులు వేసి అంగడికి తీసుకెళ్లి అమ్మి డబ్బు సంపాదించేవాడు. ఒక రోజు వీరయ్య గాడిద మీద కొన్ని ఉప్పుసంచులు వేసి సంతకు తీసుకుని పోతుంటే, దారిలో ఒక చిన్న నీటి మడుగు అడ్డం వచ్చి , ప్రమాదవశాత్తూ గాడిద అందులో పడిపోయింది. ఉప్పు బస్తాలు కూడా నీటిలో మునగడంతో ఉప్పునీటిలో కరిగిపోయి గాడిద పైకి లేచేసరికి వీపు మీద బరువు తగ్గిపోయి చాలా తేలికగా హాయిగా అనిపించింది గాడిదకు. ఆ మర్నాడు కూడా వీరయ్య గాడిద వీపు మీద ఉప్పు సంచులు వేసి సంతకు తీసుకెళుతూ ఉంటే ఆ రోజు వీపు మీది బరువు తగ్గించుకోవాలని గాడిద ఈసారి కావాలనే నీటి మడుగులో పడిపోయింది. ఉప్పు కరిగి పోవడం వల్ల వీరయ్యకు నష్టం వచ్చింది. గాడిద కావాలనే నీటిలో పడిన విషయం గమనించిన వీరయ్య ఆ మర్నాడు గాడిదకు బుద్ధి చెప్పాలనుకున్నాడు. సంతకు వెళ్లే దారిలో ఉన్న నీటి మడుగులో ఆ రోజు కూడా గాడిద తాను మోస్తున్నది ఉప్పు సంచులే కదా అనుకుని నీళ్లలో పడింది. కానీ సులువుగా పైకి లేవలేక పోయింది. ఎంతో కష్ట పడి పైకి లేచాక చూస్తే దాని వీపు మీద ఉన్నవి దూది సంచులు. అవి నీటిలో తడవగానే ఇంకా బరువెక్కి పోయి. గాడిదకు నడవడం కూడా కష్టంగా మారింది. మనం చేయాల్సిన పనిని , బాధ్యతను తప్పించుకోవాలి అని చూస్తే పర్యవసానం ఇలాగే అవుతుంది కాబోలు నాకు తగిన శాస్తి చేశాడు నా యజమాని అనుకున్న గాడిద మరెప్పుడూ తను చేయాల్సిన పనిని తప్పించుకోలేదు.

సరైన నీడ ఏది?



8 తేడాలు గుర్తించండి







డైలీ సుడోకు - 326

5					4
	8	4		1	7
7					
4		8			
	5	2		3	

సుడోకు - 325 సమాధానం

8	7	1	9	6	4
4	6	5	2	8	3
2	3	9	7	5	1
3	9	2	6	1	7
5	1	6	8	4	2
7	4	8	5	3	9

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.